

'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 18 వెల: ₹ 5.50



ఈసారీ ఇంతేనా?

ఏడాది క్రితం గాజులరామారం డివిజన్‌లోని ఓక్షిత్ ఎన్‌క్లేవ్‌లో భారీ వర్షంతో పారుతున్న వరద

ఈ పరిస్థితిని నివారించడానికి చేపట్టిన నాలా నిర్మాణ పనులు ఇంకా కొనసాగుతున్న దృశ్యం..



ఇప్పుడు..

గ్రేటర్‌లో వానొస్తే వణుకుతున్న కాలనీలు.. కాస్త గట్టివాన పడితే నీట మునిగే పరిస్థితి

ఎస్‌ఎన్‌డీపీ కింద నాలాల నిర్మాణం చేపట్టినా పూర్తికాని పనులు

నాలాలు ఉన్నచోటా చెత్తాచెదారం, పూడికతో రోడ్లపైనే నీళ్లు

కబ్జాలు, ఆక్రమణలతోనూ సమస్యలు.. పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలు ఎన్నో..

సాక్షి, హైదరాబాద్

మళ్లీ వానాకాలం వచ్చేసింది. మెల్లగా వర్షాలు ఊపందుకుంటున్నాయి. ఇప్పుడుగానీ భారీ వర్షం పడితే మళ్లీ ఈ ప్రాంతం నీట మునగడం తప్పని పరిస్థితి. ఈ ఒక్కచోట మాత్రమే కాదు.. గ్రేటర్ హైదరాబాద్ నగరవ్యాప్తంగా చాలా చోట్ల ఇదే పరిస్థితి. అయితే నాలాలు లేకపోవడం, ఉన్నా ఆక్రమణలు, చెత్తాచెదారం, పూడిక చేరి.. వరద అంతా కాలనీలు, రోడ్లపైకి చేరడం పరిపాటిగా మారిపోయింది. గట్టి వాన కురిస్తే.. చాలా కాలనీలు అతలాకుతలం అవుతున్నాయి.

వందల కాలనీలు నీట మునగడంతో..

➤ నగరంలో 2020లో కురిసిన భారీ వర్షాలకు వందల కాలనీలు నీట మునిగాయి. ఇళ్లు కూలి, విద్యుత్ షాక్ తగిలి, నీట మునిగి 17 మంది మృతి చెందారు. కొన్ని కాలనీలు చెరువుల్లా మారిపోవడంతో.. పడవల్లో ప్రజలను బయటికి తీసుకు రావాల్సి వచ్చింది. వరద నీరు సాఫీగా వెళ్లలేకపోవడం, నాలాలు సరిగా లేకపోవడమే సమస్యకు కారణమని గుర్తించారు. వాటితో ఎప్పటికీ ప్రమాదమేనని గుర్తించి పరిష్కార చర్యలకు సిద్ధమయ్యారు. 'వ్యూహాత్మక నాలాల అభివృద్ధి ప్రాజెక్టు (ఎస్‌ఎన్‌డీపీ)'ను చేపట్టారు. నగరంలో ఏడాది సగటు వర్షపాతం, వరద నీరు వెళ్లే నాలాల పరిమాణం, క్షేత్రస్థాయి పరిస్థితు లు.. ఇలా అన్ని అంశాలను పరిశీలించారు. వరద కాలువలను విస్తరించాలని తొలుత నిర్ణయించారు. కానీ అందుకు ఆస్తుల సేకరణ కష్టంతో కూడుకున్నదని, భారీగా నిధులు అవసరమని భావించి.. ప్రత్యామ్నాయంగా ప్రస్తుతమున్న నాలాలకు సమాంతరంగా వరద నీరు పోయేలా ఏర్పాట్లు చేపట్టారు. ఉన్న రోడ్లకు ఎలాంటి ఆటంకం కలగకుండా అందుబాటులో ఉన్న స్థలాల్లో బాక్స్ డ్రెయిన్లు, ఇతర ఏర్పాట్లు చేపట్టారు.



సగం దాకా పనులు కొనసాగుతూనే..

➤ నగరంతో పాటు శివార్లలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలోనూ పనులు చేపట్టాలని అప్పటి ప్రభుత్వం ఆదేశించింది. వర్షాలతో తీవ్రంగా ప్రభావితమయ్యే ప్రాంతాల్లో తొలిదశ కింద రూ.985.45 కోట్లతో పనులు చేపట్టారు. నాలాల ప్రాజెక్టులను విభజించి 58 పనులుగా చేపట్టగా.. 35 పనులు పూర్తయ్యాయి. రెండు పనులు కోర్టు కేసులతో ఆగిపోయాయి. స్థానిక ఇబ్బందులతో ఒక పని పెండింగ్‌లో ఉంది. మిగతావి తుదిదశలో ఉన్నాయి.

తాత్కాలిక చర్యలతో..

ప్రస్తుతం తాత్కాలిక ఉపశమనంగా కాలనీలతోపాటు రోడ్లపై నిలిచిపోయే నీటిని వెంటనే తోడి పోసేందుకు మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్‌ల పేరిట కార్మికులను నియమించారు. నీళ్లు ఎక్కువగా నిలిచిన ప్రాంతాల్లో మోటార్లతో తోడిపోస్తున్నారు.

ఇలా చెత్త వేయడమూ కారణమే!

➤ నాలాలు లేని ప్రాంతాల్లో వరద నీరు వెళ్లే మార్గం లేక సమస్యగా మారుతుంటే.. నాలాలున్న చోట కూడా వివిధ రకాల వ్యర్థాలు, చెత్తా చెదారం వేస్తుండటంతో పూడుకుపోయి సమస్య తలెత్తుతోంది. చాలా ప్రాంతాల్లో వరదనీరు, మురుగునీరు కలిసి వ్యాధులకు కారణమవుతున్నాయి.



ఆ పనులు మొదలయ్యేదెన్నడు?

➤ ఎస్‌ఎన్‌డీపీ తొలిదశ పనులు కొలిక్కి వస్తుండటంతో.. రెండో దశలో వచ్చే రెండేళ్లలో రూ.2,141.22 కోట్లతో 176 కిలోమీటర్ల నాలాల పనులు చేసేందుకు ప్రతిపాదనలు రూపొందించారు. నిధుల సమస్యతో వాటిలో ప్రాధాన్యమున్నవి ఎంపిక చేసి.. అంచనా నిధులను రూ.495 కోట్లకు కుదించారు. ఈ పనులెప్పుడు ప్రారంభం అవుతాయో తెలియదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఈ పథకం పేరును హెచ్-సిటీ (హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫర్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్-నాలా కాంపొనెంట్)గా మార్చింది.

పనులు చేపట్టిన చోట కూడా..

ఎస్‌ఎన్‌డీపీ కింద పనులు చేపట్టిన ప్రాంతాల్లోనూ వరద ముప్పు తప్పని పరిస్థితి కనిపిస్తోందన్న విమర్శలు ఉన్నాయి. బండ్లగూడ చెరువులోకి చేరే వరద నీటితో.. పక్కనే ఉన్న అయ్యప్ప కాలనీ, మల్లికార్జుననగర్ నీట మునిగేవి. పరిష్కారం కోసం అధికారులు ట్రంక్‌లైన్ ఏర్పాటు

మిగతా IIవ పేజీలో ▶

భారీ వర్షాలు వస్తే మునగడమే..

➤ అయ్యప్ప కాలనీలోకి పైకాలనీల నుంచి వరద నీరు రాకుండా ట్రంక్‌లైన్ వేశారు. కానీ భారీ వర్షాలు వచ్చినప్పుడల్లా అయ్యప్ప కాలనీ నీట మునుగుతూనే ఉంది. అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ అంశంపై తగిన శ్రద్ధ చూపి వరద నీరు రాకుండా చర్యలు చేపట్టాలి. శాశ్వత పరిష్కార చర్యలు తీసుకోవాలి. – శ్రీనివాస్, అయ్యప్ప కాలనీ





గతంలో వరదనీటితో మునిగిన అయ్యప్ప కాలనీ

డ్రగ్స్ వాడటం వన్ వే లాంటిది..

'సాక్షి'తో ఎన్సీబీ జోనల్ డైరెక్టర్ సచిన్ గోర్పడే



➤ డ్రగ్స్ వాడటం అనేది వన్‌వే లాంటిది. ఒక్కసారి ఆ దారిలోకి వెళ్లి వాటికి బానిసలుగా మారితే తిరిగి వెనక్కి రావడం అనేది చాలా కష్టం' అని నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్సీబీ) జోనల్ డైరెక్టర్ సచిన్ గోర్పడే అన్నారు. సచిన్ గోర్పడే గురువారం 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. - IIలో

అద్దె+చదువు= సిటీజన్

ఇంటి అద్దెలకే జీతంలో సగం స్వాహా..


దేశంలోనే అత్యధికంగా హైదరాబాదీల ఖర్చు

జీవనశైలి కోసం వేతనంలో రూ.24 వేలు

ఇంటి అద్దె, చదువుకే అధిక మొత్తం

ది గ్రేట్ ఇండియన్ వాలెట్ అధ్యయనంలో వెల్లడి

7లో





ఎంత బుజ్జిగుందో

గురువారం కల్కి 2898ఏడీ చిత్రం విడుదల సందర్భంగా ప్రసాద్ ఐమ్యాక్స్ వద్ద సినిమాలో ప్రాచుర్యం పొందిన 'బుజ్జి' వాహనాన్ని ప్రదర్శనకు పెట్టారు. ఈ సందర్భంగా తమ కెమెరాల్లో 'బుజ్జి'ని బంధిస్తున్న సిటీజనులు



డ్రగ్స్ వాడటం వన్ వే

'సాక్షి'తో ఎన్సీబీ జోనల్ డైరెక్టర్ సచిన్ గోర్పడే

12 నుంచి 25 ఏళ్ల మధ్య వయస్కులతో అప్రమత్తం

వీరి ప్రవర్తనలో తేడాలు వస్తే అనుమానించాల్సిందే

ప్రత్యేక వ్యూహంతో డ్రగ్స్ ముఠాలకు చెక్ చెబుతున్నాం

ఒక్కసారి అలవాటు పడితే వెనక్కి రావడం కష్టం

డ్రగ్స్ వాడటం అనేది వన్‌వే లాంటిది. ఒక్కసారి ఆ దారిలోకి వెళ్లి వాటికి బానిసలుగా మారితే తిరిగి వెనక్కి రావడం అనేది చాలా కష్టం' అని నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్సీబీ) జోనల్ డైరెక్టర్ సచిన్ గోర్పడే అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఈ సమస్యను నిరోధించడానికే 'ఎవిడెన్స్ ఈజ్ క్లియర్.. ఇన్వెస్ట్ ఇన్ ప్రివెన్షన్' (డ్రగ్స్ వాడటంపై ఆధారాలు స్పష్టంగా ఉన్నాయి. నిరోధంపై దృష్టి పెట్టండి) అనే థీమ్‌తో భారీ ఎత్తున ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. సచిన్ గోర్పడే గురువారం 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు.

సాక్షి, హైదరాబాద్

అమెరికా టు అమెరికా వయా హైదరాబాద్

➤ ఇటీవల అమెరికాలో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా చనిపోయారు. దీనిపై దర్యాప్తు చేసిన అక్కడ ఏజెన్సీలు రెండు రకాలైన డ్రగ్స్ ఓవర్ డోస్ వల్ల ఇలా జరిగినట్టు తేల్చాయి. ఆ మాదకద్రవ్యా లను సరఫరా చేసింది హైదరాబాద్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించి సమాచారం ఇచ్చాయి. వెంటనే అప్రమత్తమై దాడి చేసి అతడిని పట్టుకున్నాం. భారీమొత్తం నగదుతో పాటు డ్రగ్స్ సీజ్ చేశాం. ఇతడికి అవి న్యూజిలాండ్ నుంచి వచ్చినట్టు తేలడంతో అక్కడి ఏజెన్సీలకు తెలిపాం. వారు కొన్ని అరెస్టులు చేయగా...అసలు మూలం అమెరికాలోని న్యూయార్క్ అని తేలింది. దీంతో అమెరికా ఏజెన్సీలు కీలక సూత్రధారిని పట్టుకున్నాయి. డ్రగ్స్ నెట్‌వర్క్స్ కార్యకలాపాలకు ఇదో చిన్న ఉదాహరణ మాత్రమే.

ఇతర దేశాల ఏజెన్సీలతోనూ సమన్వయం

➤ ఎన్సీబీ కేవలం డ్రగ్స్ నిరోధం కోసమే కాకుండా వీటి విని యోగానికి వ్యతిరేకంగా అవ గాహన కల్పించడానికి కూడా పనిచేస్తోంది. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా 26 ఎన్సీబీ జోనల్ కార్యాల యాలు ఉన్నా యి. మాదక ద్రవ్యాలు అనేవి మన దగ్గర వరకు వచ్చేశాయి. అనేక మంది విద్యా ర్థులు, కుటుం బాలు, ప్రము ఖులు సైతం వీటి ప్రభావంలో ఉన్నారు. ఈ నేప థ్యం లోనే డ్రగ్ నెట్ వర్క్స్‌పై నిఘా ఉంచు తున్నాం. దీనికోసం ఇతర దేశాలకు చెం దిన ఏజెన్సీల తోనూ సమన్వ యం చేసుకొని పని చేస్తున్నాం. ఆయాదేశాల నుంచి వచ్చే డ్రగ్స్‌కు సంబంధించిన వివ రాలు తెలుసుకొని కట్టడికి చర్యలు తీసుకుంటున్నాం.

సాంకేతిక పరిజ్ఞానమే పెనుసవాల్

➤ డ్రగ్స్ మాఫియాలు ఇంటర్‌నెట్, డార్క్ వెబ్, క్రిప్టో కరెన్సీ వంటివి వినియోగిస్తుండటం పెద్ద సవాల్‌గా మారింది. అయినా హైదరాబాద్ యూనిట్ సమర్థంగా పనిచేస్తూ గడిచిన రెండేళ్లల్లో 24 భారీ డ్రగ్ నెట్‌వర్క్స్‌ను ఛేదించింది. ఈ కేసుల్లో కనీసం 15 నుంచి 20 ఏళ్ల శిక్ష పడుతుంది. ఎన్సీబీకి చిక్కితే బయట పడటం కష్టమనే భావన వినియోగదారులు, విక్రేతలు, సరఫరా దారులకు ఉంది. బయట నుంచి వచ్చే భారీ డ్రగ్ కన్‌సైన్‌మెంట్స్‌తో పాటు ఇక్కడ తయారయ్యే వాటిపై ఎక్కువ దృష్టి పెడతాం. ఫార్మా హబ్‌గా ఉన్న హైదరాబాద్ దానికి అనుబంధమైన కెమికల్ హబ్‌గానూ మారింది. ఇవే కొన్నిసార్లు పక్కదారి పట్టి ఎఫిడ్రిన్, సూడో ఎఫిడ్రిన్, ఎంఫిథిటమీన్ వంటి డ్రగ్స్ తయారవుతున్నాయి. ఇలా తయారు చేసే రెండు ల్యాబ్స్‌పై ఇటీవల దాడులు చేశాం.



మార్పులు కనిపిస్తే జాగ్రత్త..

ప్రధానంగా 12 నుంచి 25 ఏళ్ల మధ్య వయస్కులే డ్రగ్స్‌కు అలవాటుపడుతున్నారు. అలాంటి వారితో మాన్పించడం కూడా పెద్ద సవాలే. వీరి ప్రవర్తనను తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలి. ఎక్కువసేపు ఒంటరిగా గడపటం, బాగా చదివేవారు ఒక్కసారిగా డల్ అయిపోవడం, ముభావంగా ఉండటం, ఐ టు ఐ కాంటాక్ట్ లేకుండా మాట్లాడటం చేస్తుంటే అనుమానించి అప్రమత్తం కావాలి. డ్రగ్స్ వినియోగం వల్ల మానసికంగా, శారీరకంగా, ఆర్థికంగా, సామాజికంగా నష్టపోతారనేది వారికి అర్థమయ్యేలా చెప్పాలి. హైదరాబాద్‌లో డ్రగ్స్ క్రయవిక్రయాలకు సంబంధించి భారీ గ్యాంగ్స్ లేవు. అన్నిరంగాల్లో ఉన్నట్టే అతి తక్కువ శాతమే సినీరంగంలో డ్రగ్స్ ఉన్నాయి. అయితే దీనిపై అందరూ దృష్టి పెట్టడంతోనే ఎక్కువ ఎక్స్‌పోజ్ అవుతోంది.

డమ్మీవి పంపి పెడ్లర్స్‌ను పట్టుకున్నాం

➤ డ్రగ్ పెడ్లర్స్‌ను పట్టుకోవడానికి ఎన్సీబీ అనేక రకరకాల ఆపరేషన్లు చేస్తుంది. ఇటీవల ఓ కొరియర్ పార్శిల్‌పై మాకు సమాచారం అందింది. దానిని అడ్డుకొని విప్పి చూడగా అందులో 110 ఎల్ఎస్డీ బోల్ట్స్ దొరికాయి. వీటిని ఎవరు ఆర్డర్ ఇచ్చారో వారిని పట్టుకోవాలని నిర్ణయించుకున్నాం. దీంతో ఆ పార్శిల్‌లో డమ్మీ బోల్ట్స్ ఉంచి చేరాల్సిన చిరునామాకు పంపి నిఘా ఉంచాం. దాన్ని తీసుకోవడానికి వచ్చిన ఇద్దరు పెడ్లర్స్‌ని గతవారం అరెస్టు చేశాం. రాజకీయ పార్టీల సిద్ధాంతాలు, ఆలోచనలు, ఆశయాలు వేరుగా ఉండవచ్చు. అయితే డ్రగ్స్‌కు మాత్రం అన్ని పార్టీలు వ్యతిరేకంగానే ఉన్నాయి. సమాజంలో ప్రతి ఒక్కరూ 'సే ఎస్ టు లైఫ్... సే నో టు డ్రగ్స్' అనేది గుర్తుంచుకోవాలి. దీనిపై పాఠశాలలు, కళాశాలలు, విద్యా సంస్థల్లో భారీ ప్రచారం చేస్తున్నాం.

ఈసారీ ఇంతేనా?

▶ మొదటి పేజీ తరువాయి

చేశారు. కానీ భారీ వర్షం వస్తే.. దానితో ప్రయోజనం ఉండదని, ముంపు తప్పదని స్థానికులు వాపోతున్నారు. ఉదాహరణకు సరూర్‌నగర్ చెరువు లోతట్టు ప్రాంతాలైన కోదండరాంనగర్, సీసాలబస్తీ, శారదానగర్, కమలానగర్, న్యూగడ్డి అన్నారం కాలనీలు గట్టి వానపడినప్పుడల్లా నీట మునిగేవి. వరద నీరు తగ్గేందుకు మూడు నాలుగు రోజులు పట్టేది. ఈ సమస్య పరిష్కారానికి బాక్స్ డ్రెయిన్, అదనంగా ట్రంక్‌లైన్ ఏర్పాటు చేశారు. కానీ న్యూ గడ్డిఅన్నారం, కమలానగర్ ప్రాంతాల్లో వరద నీటి సమస్య అలాగే ఉందని స్థానికులు చెప్తున్నారు.

గ్రేటర్‌లో చేపట్టిన నాలాల పనులు, పూర్తయినవి, నిధుల వ్యయం వివరాలివీ..

జోన్	నాలాల పొడవు (కి.మీ.)	జరిగిన పనులు (కి.మీ.)	అంచనా వ్యయం (రూ.కోట్లు)	ఖర్చయిన నిధులు (రూ.కోట్లు)
సికింద్రాబాద్	9.33	5.83	261.08	161.15
కూకట్‌పల్లి	7.97	7.97	112.80	112.80
ఎల్‌బీనగర్	13.61	10.78	122.33	97.09
చార్మినార్	5.71	2.76	93.24	45.24
ఖైరతాబాద్	10.81	4.36	137.12	52.33
శేరిలింగంపల్లి	3.11	3.11	20.88	20.88
శివార్లలో	18.35	7.67	238.00	103.19
మొత్తం	69.49	42.48	985.45	592.68

అందరికీ బాధ్యత ఉంది..



ప్రజలు కూడా బాధ్యతగా మెలగాలి. ఎన్నిసార్లు పనులు చేసినా.. కొందరు నాలాల్లో చెత్త వేయడం వల్ల మళ్లీ సమస్య తలెత్తుతోంది. చెత్త కారణంగా వరద నీరు సాఫీగా వెళ్లకుండా అడ్డుపడటమే కాక కాలుష్యం కూడా పెరుగుతుంది. కొన్ని ప్రాంతాల్లో డీసిల్టింగ్ చేసే పరిస్థితి కూడా లేక మరింత ఇబ్బంది ఎదురవుతోంది.

– కోటేశ్వరరావు, చీఫ్ ఇంజనీర్, ఎస్ఎన్‌డీపీ

నాలా కబ్జాలతో సమస్య



గాజుల రామారం డివిజన్‌లోని పెద్ద చెరువు దిగువన ఓక్షిత్ ఎన్‌క్లేవ్ కాలనీని ఆనుకొని 30 అడుగుల వెడల్పైన నాలా ఉంది. ఆ నాలా కబ్జాల పాలవడంతో భారీ వర్షాలు వచ్చినప్పుడు కాలనీ జలదిగ్బంధం అవుతోంది. ఈ సమస్య పరిష్కారం కోసం రూ.18 కోట్ల అంచనా వ్యయంతో కొత్త నాలా నిర్మాణానికి అధికారులు సిద్ధమయ్యారు. కానీ కబ్జాలను ఎందుకు తొలగించలేదో అర్థం కావడం లేదు.

– సుర్వ రాజు, ఓక్షిత్ కాలనీ

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 18 వెల: ₹ 5.50
సంపుటి: 17
సంచిక: 97
శుక్రవారం 28-6-2024
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'ప్రతి రైతూ వాణిజ్యవేత్తగా మారాలి'




ఫైనల్లో భారత్

టి20 ప్రపంచకప్‌లో భారత్ ఫైనల్లోకి ప్రవేశించింది. ఇంగ్లండ్‌తో జరిగిన సెమీస్‌లో భారత్ 68 పరుగుల తేడాతో గెలిచింది. భారత్ 7 వికెట్లకు 171 పరుగులు చేయగా. ఇంగ్లండ్ 103 పరుగులకు ఆలౌటైంది. రేపు జరిగే ఫైనల్లో దక్షిణాఫ్రికాతో భారత్ ఆడుతుంది.

- 14లో

న్యూస్‌రీల్

రుణమాఫీకి ఎన్‌సీడీసీ రుణం?



రుణమాఫీకి అవసరమైన నిధుల కోసం సర్కారు వేట ప్రారంభించింది. రూ.31 వేల కోట్లు సమకూర్చుకునేందుకు పలు జాతీయ బ్యాంకులను సంప్రదించింది. చివరకు జాతీయ సహకార అభివృద్ధి సంస్థ (ఎన్‌సీడీసీ) అవసరమైన రుణం ఇచ్చేందుకు సుముఖత వ్యక్తం చేసిందని వ్యవసాయశాఖ వర్గాలు వెల్లడించాయి.

- వివరాలు 3లో▶

ఆగస్టుకు ముందే రుణమాఫీ



'రైతు రుణమాఫీని ఆగస్టు కంటే ముందే అందిస్తే ఏమైనా ఇబ్బందా?' అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రశ్నించారు. కొత్తగూడెంలో ఆయన మాట్లాడుతూ రైతు భరోసాపై ప్రజాభిప్రాయం మేరకు విధివిధానాలు రూపొందించి, అసెంబ్లీలో చర్చకు పెట్టిన తర్వాతే అందిస్తామని ప్రకటించారు.

- వివరాలు 3లో▶

'ఇంటర్' క్లాసులు చెప్పేదెవరు?



విద్యాసంవత్సరం మొదలైనా ప్రభుత్వ ఇంటర్ కాలేజీల్లో బోధన సాగడం లేదు. అన్నిచోట్లా అధ్యాపకుల కొరత వేధిస్తోంది. ఏటా గెస్ట్ ఫ్యాకల్టీని తీసుకునేవారు. ఈసారి గెస్ట్ ఫ్యాకల్టీపై ప్రభుత్వం నుంచి స్పష్టత లేదు. అసలు తీసుకుంటారా? లేదా? అనేది అధికారులు చెప్పలేకపోతున్నారు.

- వివరాలు 16లో▶

బుల్.. కొత్త రికార్డుల్

- ర్యాలీకి అధిక వెయిటేజీ షేర్ల దన్ను
- ఐటీ, ఇంధన షేర్లకు భారీ డిమాండ్
- జీవితకాల గరిష్టానికి ఇన్వెస్టర్ల సంపద

- వివరాలు 15లో▶

ఇదండీ సంగతి



పడగొడతాం అంటే.. తొడగొట్టలేమా?

మీడియా సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు

- ఎవరెవరు ఎప్పుడు కాంగ్రెస్‌లో చేరతారనేది ఇప్పుడే చెప్పలేం
- అసలు పార్టీ ఫిరాయింపులకు ఆద్యుడు కేసీఆరే
- రాష్ట్రానికి నిధుల కోసమే కేంద్ర మంత్రులతో భేటీలు
- త్వరలో ప్రధాని మోదీ, అమిత్ షాలనూ కలుస్తాం
- పునర్విభజన అంశాలపై మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేస్తాం
- త్వరలో మంత్రివర్గ విస్తరణ.. కొత్త పీసీసీ చీఫ్ నియామకం
- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి విషయంలో సమన్వయ లోపం నెలకొంది
- ఆయనకు సముచిత స్థానం కల్పిస్తామన్న సీఎం


ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతున్న సీఎం రేవంత్. చిత్రంలో మంత్రి శ్రీధర్‌బాబు

సాక్షి, న్యూఢిల్లీ: ''రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడి నెలరోజులైనా కాకముందే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొడతామంటే.. మేం తొడగొట్టలేమా? ఎవరెవరు ఎప్పుడు కాంగ్రెస్‌లో చేరతారనేది ఇప్పుడే చెప్పలేం. అసలు పార్టీ ఫిరాయింపులకు పునాదులు వేసింది కేసీఆరే..'' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. సీనియర్ నేత, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి విషయంలో టీపీసీసీ సమన్వయలోపంతో గందరగోళం ఏర్పడిందని చెప్పారు. త్వరలోనే కొత్త పీసీసీ చీఫ్ నియామకం, మంత్రివర్గ విస్తరణ ఉంటాయని వెల్లడించారు. రేవంత్ గురువారం మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిలతో ఢిల్లీలోని తన నివాసంలో బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్ నిర్వహించారు. తర్వాత మీడియాతో మాట్లాడారు. వివరాలు రేవంత్ మాటల్లోనే..

''రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం 100 రోజుల్లో కూలిపోతుందని కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు అంటే.. దానికి బీజేపీ వంత పాడింది. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని మూడు నెలల్లో పడగొడతామంటూ రోడ్ల మీద పడి రంకెలేస్తున్న బీఆర్‌ఎస్, బీజేపీలను గాలికి వదిలేస్తే ఎలా? బీఆర్‌ఎస్‌కు ఓట్లు వేయకపోవడం ప్రజల తప్పు అన్నట్టుగా కేసీఆర్ వ్యవహారం ఉంది. ఎన్నికల్లో కాంగ్రెస్‌ను దెబ్బతీసేందుకు బీఆర్‌ఎస్, బీజేపీ కుమ్మక్కయ్యాయి. వంద ఎలుకలు తిన్న పిల్లి తీర్థయాత్రలకు పోయిందన్నట్టు.. అసలు పార్టీ ఫిరాయింపులకు పునాదులు వేసింది కేసీఆరే. కాంగ్రెస్

మిగతా 2వ పేజీలో ▶

చివరి దశకు 'పీసీసీ' కసరత్తు!

- ఒకట్రెండు రోజుల్లో రాష్ట్ర అధ్యక్షుడిని ప్రకటించనున్న అధిష్టానం
- సోనియాను కలిసిన మహేశ్‌గౌడ్, మధుయాష్కీ
- మంత్రివర్గ విస్తరణ, నామినేటెడ్ పదవులకు ఆశావహుల పేర్లపైనా చర్చ

2లో



తుంటి ఆపరేషన్ తరువాత కర్రసాయం లేకుండా నడుస్తున్న కేసీఆర్.. గురువారం ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో స్వయంగా తన పాత మినీ వ్యాన్ నడిపారు

స్టీరింగ్ పట్టిన కేసీఆర్ 12లో

ఏక సభ్య కమిషన్ ఏర్పాటు
చట్టవిరుద్ధం

- మీడియా భేటీలో జస్టిస్ నరసింహారెడ్డి పక్షపాతంగా మాట్లాడారు.. గత ప్రభుత్వ నిర్ణయాలతో రూ.కోట్ల నష్టం వాటిల్లిందన్నారు
- అందుకే ఆయనను వ్యక్తిగతంగా ప్రతివాదిగా చేర్చాం
- కోర్టు అనుమతి లేకుండా నివేదిక ఇవ్వకూడదంటూ ఆదేశించాలని విజ్ఞప్తి
- కేసీఆర్ తరఫున సీనియర్ న్యాయవాది సోంధీ వాదనలు
- 'విద్యుత్' పిటిషన్‌కు నంబర్ ఇవ్వాలని హైకోర్టు రిజిస్ట్రీని ఆదేశించిన సీజే ధర్మాసనం

2లో

బీఆర్‌ఎస్ కార్యకర్తలు బుల్లెట్లు

- కొందరు నేతలు పోయినంత మాత్రాన నష్టం లేదు
- ఎర్రవల్లిలోని నివాసంలో పార్టీ నాయకులతో కేసీఆర్ వ్యాఖ్య
- కార్యకర్తలనే నాయకులుగా తీర్చిదిద్దుకుందాం

12లో



- జూలై 4తో ముగియనున్న జిల్లా, మండల పరిషత్ పాలక మండళ్ల పదవీకాలం
- కులగణన, కొత్తగా ఖరారు కాని ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు
- అన్నీ సర్దుకొని స్పష్టత వస్తే.. ఈ ఏడాది చివర్లో ఎన్నికలు!

ఇక జెడ్పీలు, మండలాల్లో 'ప్రత్యేక' పాలన

సాక్షి, హైదరాబాద్: జిల్లా, మండల పరిషత్‌లలో 'ప్రత్యేక' అధికారుల పాలనకు రంగం సిద్ధమైంది. జూలై 4తో 32 జిల్లా పరిషత్‌లు, 538 మండల పరిషత్‌పాలకమండళ్ల పదవీకాలం ముగియనుంది. టర్మ్ ముగిసేలోగా ఎన్నికలు జరిపే అవకాశం లేకపోవడంతో రోజువారీ కార్యక్రమాల కొనసాగింపునకు వీలుగా స్పెషల్ ఆఫీసర్లను నియమించనున్నారు. మెజారిటీ జెడ్పీ చైర్మన్లు, ఎంపీపీలు బీఆర్‌ఎస్‌కు చెందినవారే ఉండటంతో ఎన్నికలు జరిగే దాకా పాత పాలక మండళ్లనే కొనసాగించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా లేనట్టు సమాచారం. ఈ నేపథ్యంలో స్పెషల్ ఆఫీసర్లను నియమించేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ సన్నాహాలు చేస్తోంది. జూలై 5 కల్లా కసరత్తు పూర్తిచేసి, పీఆర్, రెవెన్యూ, మున్సిపల్,

మిగతా 5వ పేజీలో ▶



ఎమర్జెన్సీ.. చీకటి అధ్యాయం: రాష్ట్రపతి

- ఉభయ సభలనుద్దేశించి ప్రసంగం
- మోదీ 3.0 ప్రాథమ్యాల వెల్లడి
- లీకేజీ దోషులపై కఠిన చర్యలన్న ముర్ము

ప్రభుత్వ స్క్రిప్టు.. తప్పుల తడక

రాష్ట్రపతి ప్రసంగంపై విపక్షాల ఫైర్
నిరాకరణ ధోరణిలో మోదీ: ఖర్గే

- వివరాలు 6లో

ఆ ప్రస్తావన ఎందుకు?

- పార్లమెంట్‌లో ఎమర్జెన్సీ అంశాన్ని నివారించి ఉండాల్సింది
- స్పీకర్‌తో మర్యాదపూర్వక భేటీ సందర్భంగా రాహుల్ వ్యాఖ్య



- 6లో

బతుకు చితికి.. గూడు చెదిరి..
వలస బాట

పుట్టిన నేల.. పెరిగిన ఊరు.. ఇవే మనిషి అస్తిత్వం. కానీ యుద్ధం, హింస ప్రజలను నిరాశ్రయులను చేస్తోంది. అధికార దాహం, అహంకార ధోరణి కోట్ల మందిని సొంత నేలకే పరాయివాళ్లుగా మారుస్తోంది. గత పదేళ్లలో ప్రపంచ జనాభాలో ప్రతి 69 మందిలో ఒకరు చొప్పున ఏకంగా 12 కోట్ల మంది నిరాశ్రయులయ్యారు.

- వివరాలు 6లో



ఐఎస్‌ఎస్‌ను కూల్చేయనున్న స్పేస్‌ఎక్స్

- నాసాతో ఎలాన్ మస్క్ భారీ ఒప్పందం.. వచ్చే దశాబ్ది తొలినాళ్లలో పని పూర్తి

- వివరాలు 6లో

మూడు రోజులు వర్షాలే!



- రాష్ట్రంలోని ఉత్తర, తూర్పు జిల్లాల్లో భారీ వర్షాలకు అవకాశం
- ఇప్పటివరకు రాష్ట్రంలో నమోదైన సాధారణ వర్షపాతం 13.07 సెంటీమీటర్లు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రానున్న మూడు రోజులపాటు కొన్ని చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, మరికొన్నిచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు ఉత్తర, తూర్పు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు, ఒకట్రెండు చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వివరించింది. ప్రస్తుతం పశ్చిమ మధ్య బంగాళాఖాతం, అలాగే

మిగతా 3వ పేజీలో ▶



నెరవేరిన టీచర్ల కల

18,942 మందికి ఒకేసారి ప్రమోషన్లు, బదిలీలు

- దశాబ్దం తర్వాత పదోన్నతులు
- న్యాయ వివాదాలన్నీ క్లియర్.. ప్రక్రియను విజయవంతంగా పూర్తిచేసిన ప్రభుత్వం
- టీచర్లలో వ్యక్తమవుతున్న ఆనందం

సాక్షి, హైదరాబాద్: పదోన్నతుల కోసం దాదాపు దశాబ్దకాలంగా ఎదురుచూస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుల కల ఎట్టకేలకు నెరవేరింది. రంగారెడ్డి జిల్లా మినహా రెండు జోన్లలోనూ పదోన్నతులు, బదిలీలకు సంబంధించిన ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారు. చివరిసారిగా 2015లో పదోన్నతులు కల్పించారు. ఆ తర్వాత వివిధ కారణాలతో ప్రమోషన్ల ప్రక్రియ వాయిదా పడుతూ వచ్చింది. టీచర్ల హేతుబద్ధీకరణ చేపట్టాలని కొన్నాళ్లు భావించారు. కోర్టు కేసుల కారణంగా మరికొంత జాప్యం జరిగింది. 2023లో బదిలీలు, ప్రమోషన్లకు సంబంధించిన నోటిఫికేషన్ కూడా ఇచ్చారు. మల్టీజోన్-1లో కొంత వరకూ ప్రమోషన్లు, బదిలీల ప్రక్రియ ముందుకెళ్లింది. అంతలోనే స్పౌజ్ కేసుల కారణంగా ఇది ఆగిపోయింది. పండిట్లు తమ పోస్టులు తమకే ఇవ్వాలన్న డిమాండ్‌తో కోర్టును ఆశ్రయించారు. వీటిని పక్కనబెట్టి ప్రమోషన్లు ఇవ్వాలని భావించారు. ఈ సమయంలో ప్రమోషన్లకు టెట్ ఉండాలన్న కేంద్ర ప్రభుత్వ నిబంధనను కొంతమంది టీచర్లు ముందుకు తెచ్చారు. న్యాయస్థానం స్టే కారణంగా


మిగతా 3వ పేజీలో ▶

ఖాళీలు 22 వేల పైనే...

బదిలీలు, పదోన్నతుల తర్వాత వాస్తవ ఖాళీలను అధికారులు లెక్కగట్టాల్సి ఉంది. ప్రాథమికంగా వచ్చిన సమాచారం మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో 22 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉండే వీలుంది. 18,942 మందికి ప్రమోషన్లు ఇచ్చినా.. వీరిలో 3 వేల మంది ఒకటికి మించి పదోన్నతులకు అర్హత ఉన్నవారున్నారు. ఉదాహరణకు సైన్స్, మేథ్స్ సబ్జెక్టులు రెండింటికీ అర్హత ఉంటుంది. పదోన్నతి రెండింటికీ లభిస్తుంది. అయితే, టీచర్ ఒకే సబ్జెక్టులో పదోన్నతి తీసుకోవాలి. ఈ రకంగా 3 వేల ఖాళీలు ఏర్పడే వీలుంది. జిల్లాల వారీగా ఈ లెక్కలు తేలితే... ఈ స్థానంలో మరికొన్ని పదోన్నతులు లభించే అవకాశముంది. జూలైలో నిర్వహించే ఉపాధ్యాయ నియామక పరీక్ష (డీఎస్సీ)లో ప్రస్తుతం 11 వేల పోస్టులను చేర్చారు. పదోన్నతుల ద్వారా మరో 11 వేల వరకూ ఖాళీ అయ్యే వీలుంది. వీటిని కూడా చేర్చి, పూర్తిస్థాయిలో టీచర్ పోస్టులు భర్తీ చేయాలని నిరుద్యోగులు కోరుతున్నారు.

క్లుప్తంగా...

కేంద్ర మంత్రులకు గవర్నర్ దత్తాత్రేయ విందు



సాక్షి, న్యూఢిల్లీ: ఇటీవల కేంద్ర మంత్రులుగా బాధ్యతలు స్వీకరించిన జి.కిషన్‌రెడ్డి, కింజరాపు రామ్మోహన్ నాయుడు, భూపతిరాజు శ్రీనివాస వర్మలతో రెండు రాష్ట్రాల అభివృద్ధి మరింత ఎక్కువగా జరిగే అవకాశాలు ఉన్నాయని హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ పేర్కొన్నారు. గురువారం ఈ ముగ్గురు మంత్రులకు ఢిల్లీలో దత్తాత్రేయ విందు ఇచ్చారు. ఈ సందర్భంగా వారిని ప్రశంసించి రెండు తెలుగు రాష్ట్రాల అభివృద్ధి కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కేబినెట్‌లో వీరు ముగ్గురూ భాగస్వాములు కావడం ఎంతో సంతోషంగా ఉందని దత్తాత్రేయ పేర్కొన్నారు.

విద్యుత్ విచారణ అంటే ఎందుకు భయం?

ఎమ్మెల్యేలు వీరేశం, అనిల్‌కుమార్ రెడ్డి



సాక్షి, హైదరాబాద్: విద్యుత్ కొనుగోళ్లలో ఎలాంటి అవకతవకలు జరగకపోతే విచారణకు ఎందుకు భయపడుతున్నారని నల్లగొండ జిల్లాకు చెందిన నకిరేకల్, భువనగిరి ఎమ్మెల్యేలు వేముల వీరేశం, కుంభం అనిల్‌కుమార్ రెడ్డి ప్రశ్నించారు. వారు అసెంబ్లీ సీఎల్పీ మీడియా హాల్‌లో విలేకరులతో మాట్లాడుతూ అసెంబ్లీలో జగదీశ్ రెడ్డే విచారణకు సిద్ధమని సవాల్ చేశారని గుర్తు చేశారు. ఇప్పుడు తమ అక్రమాలు బయట పడతాయనే విచారణకు హాజరుకామని చెపుతున్నారన్నారు. రెండు రోజులుగా కేసీఆర్, జగదీశ్ రెడ్డి అసత్యాలే మాట్లాడుతున్నారని, తామే తెలంగాణ తెచ్చామంటున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణ ఇచ్చింది సోనియాగాంధీ అని స్పష్టం చేశారు. నల్లగొండ జిల్లాలో జగదీశ్‌రెడ్డికి అవినీతి, అక్రమాల మీద ఉన్న శ్రద్ధ అభివృద్ధి మీద లేదని ఎద్దేవా చేశారు. విద్యుత్తు అక్రమాల్లో జగదీశ్ రెడ్డికి, కేసీఆర్ వాటా ఎంతని ప్రశ్నించారు. నిజాయితీపరులైతే కమిషన్ ముందు హాజరుకావాలని సవాల్ చేశారు.

సీఎం ఇప్పుడైనా ఎంజీఎంను సందర్శించాలి

బీఆర్‌ఎస్ నేత ఏనుగుల రాకేశ్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: వరంగల్‌కు రావడానికి సీఎం రేవంత్‌రెడ్డికి ఆరు నెలల తర్వాత ఇప్పుడు తీరిక దొరికిందని బీఆర్‌ఎస్ నేత ఏనుగుల రాకేశ్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ఇప్పుడైనా ఎంజీఎంను సందర్శించాలని, కేసీఆర్ శంకుస్థాపన చేసిన మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి పనులను త్వరగా పూర్తి చేసేలా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని ఆయన కోరారు. గురువారం రాకేశ్‌రెడ్డి తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ, ఎయిమ్స్ ఆస్పత్రిలో ఉన్న సమస్యలు పరిష్కరించాలి సూచించారు. కాగా, శుక్రవారం వరంగల్ వస్తున్న సీఎం గొప్ప చరిత్ర ఉన్న ఎంజీఎంను సందర్శించాల్సింది పోయి కార్పొరేట్ ఆస్పత్రిని ప్రారంభించబోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంజీఎం ఆస్పత్రిలో సరిపడా బెడ్లు లేవని, ఒక్కో బెడ్‌పై ఇద్దరు, ముగ్గురు రోగులు ఉంటున్నారని ఆరోపించారు.

జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ కల్పించాలి

విద్యాశాఖ ముఖ్య కార్యదర్శికి టీడబ్ల్యూజేఎఫ్ విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని కోరింది. గురువారం టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి బి. బసవపున్నయ్య, ఉపాధ్యక్షులు పిల్లి రాంచందర్, బి.రాజశేఖర్, కార్యదర్శులు బి. జగదీశ్వర్, గండ్ర నవీన్, రాష్ట్ర కమిటీ సభ్యులు అరుణ్ కుమార్, ఎం.రమేశ్, రామకృష్ణ తదితరులు సచివాలయంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశంను కలిశారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పని చేస్తున్నారని, ప్రభుత్వ కార్యక్రమాలను, పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు క్షేత్రస్థాయిలో సమస్యలను ప్రభుత్వానికి తెలియజేస్తున్నారన్నారు. జర్నలిస్టులకు తక్కువ జీతాలు ఉండటంతో ఆర్థిక సమస్యలతో జీవనం సాగిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజు రాయితీ కల్పించాలని, గురుకులాల్లో ప్రత్యేక కోటా కింద ప్రవేశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ప్రభుత్వం సర్క్యులర్ జారీ చేయాలన్నారు.

స్ఫూర్తిప్రదాత పీవీ

సాక్షి, హైదరాబాద్: మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు ఆర్థిక సంస్కరణలతో దేశ గతిని మలుపు తిప్పారని అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. శుక్రవారం పీవీ నర్సింహారావు 103వ జయంతి సందర్భంగా దేశానికి ఆయన అందించిన సేవలను మంత్రి స్మరించుకున్నారు. పీవీ పరచిన బాటలో నడిచిన భారత్.. ప్రస్తుతం ప్రపంచంలో ఆర్థికంగా శక్తిమంతమైన దేశాల్లో ఒకటిగా నిలిచిందని ఒక ప్రకటనలో తెలిపారు.

చివరి దశకు 'పీసీసీ' కసరత్తు!

ఒకట్రెండు రోజుల్లో రాష్ట్ర అధ్యక్షుడిని ప్రకటించనున్న అధిష్టానం

- సోనియాను వేర్వేరుగా కలసిన మహేశ్‌గౌడ్, మధుయాష్కీ
- అధిష్టానం పెద్దలకు అభిప్రాయాలు చెప్పిన సీఎం, మంత్రులు

సాక్షి, న్యూఢిల్లీ: టీపీసీసీ అధ్యక్షుడి ఎంపిక కసరత్తు చివరి దశకు చేరుకుంది. ఇప్పటికే పార్టీ నేతలతో విస్తృతంగా సంప్రదింపులు జరిపిన ఏఐసీసీ పెద్దలు.. పలువురి పేర్లను షార్ట్ లిస్ట్ చేసింది. అందులో నుంచి ఒకరిని ఎంపిక చేసేందుకు గురువారం రాష్ట్ర నేతల నుంచి అభిప్రాయాలు సేకరించింది.

ఢిల్లీలో విస్తృతంగా చర్చలు..

రాష్ట్ర మంత్రివర్గ విస్తరణతోపాటు టీపీసీసీ అధ్యక్ష నియామకంపై ఢిల్లీలో మూడు రోజులుగా సంప్రదింపులు కొనసాగుతున్నాయి. గురువారం కూడా చర్చలు జరిగాయి. తొలుత రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ పీసీసీ చీఫ్ నియామకానికి సంబంధించి సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు ఉత్తమ్, శ్రీధర్‌బాబుల తోపాటు ఇతర సీనియర్ నేతల అభిప్రాయాలు తీసుకున్నారు. ఇక పీసీసీ పదవులు ఆశిస్తున్న నేతలు మహేశ్‌గౌడ్, బలరాం నాయక్, మధుయాష్కీ గౌడ్, సురేశ్ షెట్కార్, సంపత్‌కుమార్ తదితరులు కూడా మున్షీతో భేటీ అయి తమకు అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ నేతలంతా ఢిల్లీలో రేవంత్‌తో కూడా భేటీ అయ్యారు. పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీని మహేశ్‌గౌడ్, మధుయాష్కీ విడివిడిగా కలసి పీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వాలని కోరారు. ఏఐసీసీ సీనియర్లను కలవాలని ఆమె సూచించడంతో.. ఈ ఇద్దరు నేతలు అక్కడే పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తోనూ చర్చించారు. తెలంగాణ భవన్‌లో భట్టి, ఉత్తమ్, శ్రీధర్‌బాబు సైతం ఏ అభ్యర్థికి మద్దతివ్వాలన్న దానిపై చర్చించారు.



సమావేశం అనంతరం బయటకు వస్తున్న దీపాదాస్ మున్షీ, మధుయాష్కీ తదితరులు

కేబినెట్ విస్తరణ, నామినేటెడ్ పదవులపైనా..

పొద్దంతా జరిగిన వరుస భేటీల అనంతరం మున్షీ, సీఎం, మంత్రులు, ఇతర సీనియర్లు వెళ్లి.. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్‌లతో భేటీ అయ్యారు. ఈ భేటీలో బీసీ సామాజిక వర్గం నుంచి ఒకపేరు, ఎస్టీ సామాజిక వర్గం నుంచి మరో పేరును ఫైనల్ చేసినట్టు తెలిసింది. వారు మహేశ్ గౌడ్, బలరాం నాయక్ అయి ఉంటారని.. వీరిలోంచి ఒకరిని పీసీసీ అధ్యక్షుడిగా ఎంపిక చేస్తారని ఏఐసీసీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఒకట్రెండు రోజుల్లోనే కొత్త అధ్యక్షుడిపై ప్రకటన వెలువడే అవకాశం ఉందని అంటున్నారు. మంత్రివర్గ విస్తరణ, నామినేటెడ్ పదవుల నేపథ్యంలో ఆశావహుల పేర్లపైనా ఈ భేటీలో చర్చించినట్టు సమాచారం.

తొలి నుంచీ ఉన్నవారికి సముచిత స్థానం: భట్టి



ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ నివాసంలో జరిగిన భేటీ అనంతరం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడారు. పార్టీ వ్యవహారాలతోపాటు కేబినెట్ విస్తరణపై కేసీ వేణుగోపాల్‌తో చర్చించామని చెప్పారు. కాంగ్రెస్‌లో చేరికల అంశంపైనా చర్చ జరిగిందని.. అయితే కాంగ్రెస్‌లో మొదటి నుంచీ ఉన్నవారికి సముచిత స్థానం ఇవ్వాలని పార్టీ పెద్దలను కోరామని వివరించారు.

'యశస్విని'లో తెలంగాణకు ప్రాధాన్యత ఇవ్వండి

కేంద్ర మంత్రి మాంఝీకి రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు వినతి

- ఎంఎస్‌ఎంఈల పరిపుష్టికి కేంద్ర సహకారం అవసరం

సాక్షి, హైదరాబాద్/న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా అమలు చేస్తున్న యశస్విని పథకం కింద తెలంగాణకు ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అంతర్జాతీయ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం కేంద్ర మంత్రి జితన్ రామ్ మాంఝీని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. రాష్ట్రంలో ఎంఎస్‌ఎంఈల పరిపుష్టికి కేంద్రం సహకారాన్ని అందించాలని కోరారు. దేశవ్యాప్తంగా ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో లక్ష మంది మహిళలను ఎంపిక చేసి శిక్షణతో పాటు ఉత్పాదన సామర్థ్యాన్ని పెంచేందుకు కేంద్రం ప్రారంభించిన 'యశస్విని'పథకం కింద తెలంగాణకు అధిక ప్రాధాన్యతను ఇవ్వాలని కోరారు. హైదరాబాద్‌లోని జాతీయ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల్లో మహిళా ఔత్సాహికులకు సాంకేతిక శిక్షణ ఇచ్చేందుకు మరిన్ని నిధులు కేటాయించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నమోదైన ఎంఎస్‌ఎంఈల ద్వారా 3.64 లక్షల మంది ప్రత్యక్ష ఉపాధి పొందుతున్నారని కేంద్ర మంత్రికి వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం మహిళా వికాసానికి అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ఎంఎస్‌ఎంఈలో శిక్షణ, ప్రోత్సాహకాలను ఐటీ రంగానికి కూడా విస్తరించాలని సూచించారు. తెలంగాణను సందర్శించి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను స్వయంగా వీక్షించాలని శ్రీధర్‌బాబు చేసిన అభ్యర్థనకు కేంద్ర మంత్రి మాంఝీ స్పందించారు. నెల రోజుల్లో సందర్శిస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమలను నెలకొల్పాలని, అందుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని శ్రీధర్‌బాబు చెప్పారు. పరిశ్రమల నెలకొల్పడానికి తగిన స్థలం రాష్ట్ర ప్రభుత్వం చూపిస్తే సహకరిస్తామని మంఝీ హామీ ఇచ్చారు. ధర్మపురి ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ లక్ష్మణ కుమార్ కూడా కేంద్ర మంత్రిని కలిశారు.



గురువారం కేంద్రమంత్రి జితన్‌రామ్ మాంఝీతో భేటీ అయిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

పడగొడతామంటే.. తొడగొట్టలేమా?

▶ మొదటి పేజీ తరువాయి

ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు మొత్తం 61 మందిని తీసుకున్న కేసీఆర్ తప్పులు క్షమించాలంటూ.. అమర వీరుల స్తూపం వద్ద ముక్కు నేలకు రాయాలి.

మీరు అడిగితేనే కమిషన్ వేశాం..

కేసీఆర్ గత 10 ఏళ్లలో ఒక్కసారైనా రాష్ట్ర అవతరణ దినోత్సవానికి ప్రతిపక్షాలను పిలిచారా? మేం అధికారికంగా ఆహ్వానం పంపాం. విద్యుత్‌పై విచారణ కమిషన్ వేయాలని మేం అడగలేదు. మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి అసెంబ్లీ సాక్షిగా విద్యుత్ కొనుగోళ్లపై సిట్టింగ్ జడ్జితో విచారణ కోరారు. మరి మా ప్రభుత్వం విచారణ కమిషన్ వేయడం తప్పా? వివరణ ఇవ్వాలని కేసీఆర్‌ను అడగటం తప్పా? కమిషన్‌కు జస్టిస్ నరసింహారెడ్డి అధ్యక్షత వహిస్తుండడాన్ని తప్పు పడుతున్నారా?.. దీనిపై కేసీఆర్, జగదీశ్‌రెడ్డి సమాధానం చెప్పాలి.

రాజకీయాలు అయిపోయాయి!

రాష్ట్రంలో అన్ని పరీక్షలు సమర్థవంతంగా నిర్వహించాం. ఏ కార్యాచరణ కూడా వాయిదా పడలేదు. గత ప్రభుత్వంలో విద్యాశాఖ చేసిన పనులను, కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన పనులను పోల్చిచూడాలి. మా ప్రభుత్వం మీద బురదజల్లే ప్రయత్నం జరుగుతోంది. రాజకీయాలు అయిపోయాయి. అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేయడమే లక్ష్యం.

ఏపీ భవన్ సమస్యను పరిష్కరించుకున్నాం

ఏపీ సీఎంగా వైఎస్ జగన్ ఉన్నప్పుడే ఢిల్లీలోని ఏపీ భవన్ సమస్యను పరిష్కరించుకున్నాం. విభజన సమస్యల పరిష్కారంపై ఇప్పటికే కేబినెట్‌లో చర్చించాం. త్వరలో మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేస్తాం. పునర్విభజన చట్టం ప్రకారం కేంద్రం నుంచి రాబట్టుకోవాల్సిన అనుమతులు, నిధులు, పొరుగు రాష్ట్రంతో సమస్యల పరిష్కారం కోసం నిరంతర చర్చలు కొనసాగుతాయి. కేంద్రం ద్వారా విభజన సమస్యలు పరిష్కారం కాకపోతే కోర్టులను ఆశ్రయిస్తాం. ఆస్తుల పంపకం జరిగిపోయింది. ఇక నిర్మాణం, నిర్వహణ ఎలాగన్న దానిపై దృష్టిపెట్టాం. త్వరలో కేంద్రం పూర్తిస్థాయి బడ్జెట్ పెట్టబోతుండటంతో.. రాష్ట్రం తరపున మంత్రులంతా వచ్చి కేంద్ర మంత్రులను కలసి విజ్ఞప్తులు, ప్రతిపాదనలు ఇచ్చాం. త్వరలో ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాలను కూడా కలుస్తాం.

వేరేవారికి పీసీసీ ఇవ్వాలని కోరా..

కాంగ్రెస్ అధిష్టానం నన్ను పీసీసీ అధ్యక్షుడిగా 2021 జూన్ 21న నియమించగా జూలై 7న బాధ్యతలు తీసుకున్నాను. ఈ ఏడాది జూలై 7న నా పదవీ కాలం పూర్తవుతుంది. పీసీసీ బాధ్యతల నుంచి నన్ను తప్పించి సామాజిక న్యాయం పాటిస్తూ, సమర్థుడైన నాయకుడికి పీసీసీ బాధ్యతలు అప్పగించాలని అధిష్టానానికి ఇప్పటికే విజ్ఞప్తి చేశాను. త్వరలో అధిష్టానం దీనిపై నిర్ణయం తీసుకుంటుంది. పీసీసీ అధ్యక్షుడిగా ఎవరిని నియమించినా వారితో కలిసి పనిచేస్తా..'' అని రేవంత్ చెప్పారు.

జీవన్‌రెడ్డి విషయంలో సమన్వయలోపం

ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మనస్తాపం చెందడానికి సమన్వయ లోపం, పీసీసీ తరఫున ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడం కారణం. దీనితో కొంత గందరగోళం ఏర్పడింది. మంత్రి శ్రీధర్‌బాబు చొరవతో అధిష్టానం పార్టీకి ఎలాంటి నష్టం కలగకుండా చూసింది. హైకమాండ్ ఆదేశాలతో.. జీవన్‌రెడ్డి గౌరవాన్ని కాపాడుతూ, ఆ ప్రాంత కార్యకర్తలను ఆదుకోవాలని నిర్ణయించుకున్నాం. జీవన్‌రెడ్డి అనుభవాన్ని, శక్తి సామర్థ్యాలను పార్టీ వినియోగించుకుంటుంది. జీవన్‌రెడ్డి వ్యవహారంలో ఏదైనా జరిగితే బాగుండునని కొన్ని గోతికాడి నక్కలు ఎదురు చూశాయి. కానీ జీవన్‌రెడ్డి ఆ అవకాశం ఇవ్వలేదు.

బీఆర్‌ఎస్ ఖతం కావాలన్నదే హరీశ్ కోరిక

కేసీఆర్ పార్టీని నిలబెట్టుకోవాలనే ఉద్దేశంతో పనిచేస్తే నిలబెట్టుకుంటారు. కానీ ఆయన ఆ మూడ్‌లో లేరు. హరీశ్‌రావు డిస్టర్బ్ చేస్తున్నారు. కేసీఆర్‌ను బయటికి రానివ్వడం లేదు. హరీశ్ ట్రాప్‌లో కేసీఆర్ ఉన్నారు కాబట్టి పార్టీ బతకడం కానీ, కేసీఆర్ రాజకీయంగా నిలదొక్కుకోవడంగానీ జరగవు. కేసీఆర్ ఉన్నంత సేపు హరీశ్ ఏమీ చేయలేడు. చేసినా సమాజం ఒప్పుకోదు. అందుకే బీఆర్‌ఎస్ పార్టీని ఖతం చేయాలని హరీశ్ అనుకుంటున్నారు. పార్టీ ఖతమైతే హరీశ్ ఒక కొత్త లైన్ తీసుకుంటారు. గతంలో ఈటల రాజేందర్‌ను మెడపట్టి బయటకు పంపింది హరీశ్‌రావు కాదా? నరేంద్ర, విజయశాంతిలను బయటికి పంపింది హరీశ్ కాదా? ఎప్పుడూ ఒక సమస్యను సృష్టించి.. తనకంటూ ఒక స్పేస్ క్రియేట్ చేసుకుంటారు. నాకు నచ్చలేదు కాబట్టి కేసీఆర్ చిన్నోడేమీ అయిపోడు. అసెంబ్లీలోకి వచ్చి నిలుచుంటే ఆయనకు ఉండే మర్యాద ఆయనకు ఉంటుంది.

త్వరలో మంత్రి వర్గ విస్తరణ

రాష్ట్రంలో త్వరలో మంత్రి వర్గ విస్తరణ ఉంటుంది. నా జీవితాశయం నెరవేరింది. కేసీఆర్‌ను ఓడిస్తానని, ముఖ్యమంత్రిని అవుతానని చెప్పాను. అయ్యాను. రేవంత్‌రెడ్డి సీఎం అని 30 సెకన్లలో అధిష్టానం డిసైడ్ చేసింది. కేసీఆర్‌ను దింపాలనేది నా మొదటి లక్ష్యం. దానిని గుర్తించి ప్రజలు నాకు అవకాశం ఇచ్చారు. కేసీఆర్ దిగిపోవడం, నేను గద్దెనెక్కడమే ఆయనకు పెద్ద గాయం. అంతకు మించింది ఏముంటుంది?

సీఎం వరంగల్ పర్యటన రేపటికి వాయిదా

సాక్షి ప్రతినిధి, వరంగల్: రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి వరంగల్ పర్యటన శనివారానికి వాయిదా పడింది. రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటన ముగియకపోవడంతో గురువారం రాత్రి పొద్దుపోయాక శుక్రవారం జరగాల్సిన వరంగల్ పర్యటనను రద్దు చేశారు. శనివారం యథావిధిగా వరంగల్, హనుమకొండ జిల్లాల్లో ఆయన పర్యటన కొనసాగనుంది.

జాబ్ కేలండర్ ఏమైంది?



నిరుద్యోగులతో కలసి మీడియాతో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

కాంగ్రెస్ సర్కార్‌ను నిలదీసిన కేటీఆర్


- నోటిఫికేషన్లు అంటూ బూటకపు హామీలు ఇచ్చారు
- మెగా డీఎస్సీ అని దగా చేశారు
- నిరుద్యోగులకు అండగా ఉంటాం
- అన్ని చట్టసభల్లో ప్రభుత్వాన్ని నిలదీస్తాం

సాక్షి, హైదరాబాద్: ఎన్నికలకు ముందు నిరుద్యోగులకు అరచేతిలో వైకుంఠం చూపించి, గెలిచిన తరువాత వారిని కాంగ్రెస్ సర్కార్ పట్టించుకోవడం లేదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కె.తారక రామారావు విమర్శించారు. గురువారం ఆయనను పలువురు నిరుద్యోగులు కలిసి తమ పోరాటానికి అండగా ఉండాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కేటీఆర్ వారి పోరాటానికి బీఆర్‌ఎస్ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నేతలు జాబ్ కేలెండర్ పేరుతో పెద్ద ఎత్తున పత్రికల్లో ప్రకటనలు ఇచ్చారని, దాదాపు 10 పరీక్షలకు సంబంధించి తేదీలతో సహా నోటిఫికేషన్లు అంటూ బూటకపు హామీలు ఇచ్చారని ధ్వజమెత్తారు. అయితే వాటికి సంబంధించి ఒక్క నోటిఫికేషన్ కూడా ఇప్పటి వరకు విడుదల చేయలేదన్నారు. జాబ్ కేలెండర్ ఏమైందని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. ఇచ్చిన హామీ మేరకు వెంటనే ఆ నోటిఫికేషన్లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మొదటి కేబినెట్ భేటీలోనే మెగా డీఎస్సీ అని చెప్పి నిరుద్యోగులను దగా చేశారన్నారు. గ్రూప్–1కు సంబంధించి తమ ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌కు కేవలం 60 ఉద్యోగాలు మాత్రమే కలిపారని పేర్కొన్నారు. ఉద్యోగాలు పెంచమని అడిగితే సాంకేతిక కారణాలు చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ ప్రభుత్వాన్ని బీఆర్‌ఎస్ ఎట్టి పరిస్థితుల్లో వదలదని, అన్ని చట్టసభల్లో ప్రభుత్వాన్ని నిలదీస్తామని స్పష్టం చేశారు. గ్రూప్–1 మెయిన్స్‌కు సంబంధించి 1:100 ప్రాతిపదికన అభ్యర్థులను ఎంపిక చేయాలని ప్రస్తుత డిప్యూటీ సీఎం గతంలో డిమాండ్ చేశారని, కానీ ఇప్పుడు ఎందుకు అలా చేయడంలేదని ప్రశ్నించారు. ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్న హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. జాబ్ కేలెండర్‌ను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. హామీలు అమలు చేయకపోతే ఏ నిరుద్యోగులైతే ఈ ప్రభుత్వాన్ని గద్దెనెక్కించారో.. వారే ప్రభుత్వాన్ని గద్దె దించే పరిస్థితి వస్తుందని కేటీఆర్ హెచ్చరించారు.

ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చట్టవిరుద్ధం

మీడియా భేటీలో జస్టిస్ నరసింహారెడ్డి పక్షపాతంగా మాట్లాడారు

- గత ప్రభుత్వ నిర్ణయాలతో రూ.కోట్ల నష్టం వాటిల్లిందన్నారు
- అందుకే ఆయనను వ్యక్తిగతంగా ప్రతివాదిగా చేర్చాం
- విచారణ నేటికి వాయిదా



సాక్షి, హైదరాబాద్: గత ప్రభుత్వ విద్యుత్ రంగ నిర్ణయాలపై విచారణకు జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి నేతృత్వంలో ఏకసభ్య కమిషన్ ఏర్పాటును సవాల్ చేస్తూ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు దాఖలు చేసిన రిట్ పిటిషన్‌కు నంబర్ చేయాలని రిజిస్ట్రీని హైకోర్టు ఆదేశించింది. పిటిషన్‌కు నంబర్ ఇచ్చేందుకు రిజిస్ట్రీ లేవనెత్తిన అభ్యంతరాలను తోసిపుచ్చింది. జస్టిస్ నరసింహారెడ్డి నిష్పక్షపాతంగా లేరని ప్రెస్‌మీట్ చెబుతోందని ఆరోపణలు చేసిన నేపథ్యంలో వ్యక్తిగత హోదాలో జస్టిస్ నరసింహారెడ్డిని ప్రతివాదిగా చేర్చడం సబబేనని చెప్పింది. పూర్తిస్థాయి మెరిట్స్‌పై శుక్రవారం విచారణ చేస్తామంటూ వాదనలను వాయిదా వేసింది. ఛత్తీస్‌గఢ్–తెలంగాణ విద్యుత్ కొనుగోలు వ్యవహారాలు, యాదాద్రి, భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాల నిర్మాణంపై విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందాలు (పీపీఏ), పరస్పర అవగాహన ఒప్పందం (ఎంఓయూ) చేసుకోవడంలో అక్రమాలు జరిగాయంటూ.. నిజానిజాల విచారణ కోసం ప్రభుత్వం కమిషన్ ఆఫ్ ఎంక్వయిరీస్ యాక్ట్ –1952 ప్రకారం గత మార్చి 14న జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి కమిషన్‌ను నియమించింది. జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి నేతృత్వంలో కమిషన్ ఏర్పాటును సవాల్ చేస్తూ కేసీఆర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. అయితే జస్టిస్ ఎల్.నరసింహారెడ్డిని వ్యక్తిగతంగా ప్రతివాదిగా చేర్చడంపై రిజిస్ట్రీ అభ్యంతరం చెబుతూ పిటిషన్‌కు నంబర్ కేటాయించలేదు. దీంతో పిటిషన్ ప్రధాన న్యాయమూర్తి పరిశీలనకు వచ్చింది. నంబర్ కేటాయింపుపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్ కుమార్ జూకంటి ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. పిటిషనర్ (కేసీఆర్) తరఫున సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది ఆదిత్యా సోంధీ వాదనలు వినిపించారు.

రూ.కోట్ల నష్టం వస్తుందని ముందే చెప్పారు..


'కమిషన్ ఏర్పాటు నోటిఫికేషన్‌లో విచారణ ఎలా సాగాలో మార్గదర్శకాలు జారీ చేయడం చట్టవ్యతిరేకం. విద్యుత్ కొనుగోళ్లు, విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటులో అక్రమాలు జరిగాయంటూ కమిషన్‌కు దిశానిర్దేశం చేశారు. పిటిషనర్ (కేసీఆర్) విచారణకు హాజరుకావాలని సెక్షన్ 8బీ ప్రకారం కమిషన్ నోటీసులు జారీ చేసింది. గతంలో ఇదే హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పులకు ఈ నోటీసులు విరుద్ధమే. లోక్‌సభ ఎన్నికలు ఉన్నందున జూన్ 15 వరకు గడువు ఇవ్వాలని పిటిషనర్ కమిషన్‌కు లేఖ రాశారు. మరోవైపు, విచారణ పూర్తి కాకుండానే.. వివరాలు పరిశీలించకుండానే.. జస్టిస్ నరసింహారెడ్డి ఈ నెల 11న మీడియా భేటీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన వ్యాఖ్యలు అప్పటికే విచారణపై ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలియజేస్తున్నాయి. గత ప్రభుత్వ నిర్ణయాలను తప్పుబడుతూ ఏకపక్షంగా వ్యవహరించారు. ఇది ధార్మియా కేసులో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పునకు విరుద్ధం. కమిషన్ ఏం చేయబోయేదీ ముందే మీడియాకు చెప్పడం చట్టవ్యతిరేకం. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కమిషన్‌కు ఎలాంటి ఆదేశాలు, ఉత్తర్వులు జారీ చేసే అధికారాలు ఉండవు. విచారణ జరిపి నివేదిక మాత్రమే ఇవ్వాల్సి ఉంటుందన్న విషయాన్ని జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి ఉల్లంఘించారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు వినియోగించే సాంకేతికతతో ప్రభుత్వానికి రూ.250 కోట్ల నష్టం వస్తుందని ముందే తేల్చేశారు. దీంతో ఆయన ఇవ్వబోయే నివేదిక ఎలా ఉండనుందో తెలుస్తుంది. ఈ కారణాలతోనే ఆయనను ప్రతివాదిగా చేర్చాల్సి వచ్చింది'అని సోంధీ పేర్కొన్నారు.

సోంధీ వాదనలపై ఏజీ అభ్యంతరం

సోంధీ వాదనలపై అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. రిట్ పిటిషన్‌కు నంబర్ కేటాయింపు, రిజిస్ట్రీ అభ్యంతరాలపై మాత్రమే వాదనలు వినిపించాల్సి ఉండగా, మెరిట్స్‌లోకి వెళ్లడం సరికాదన్నారు. జస్టిస్ ఎల్.నరసింహారెడ్డిని ఎందుకు ప్రతివాదిగా చేర్చామనే అంశంపై మాత్రమే వాదనలు వినిపిస్తున్నామని సోంధీ బదులిచ్చారు. ధర్మాసనం జోక్యం చేసుకుంటూ వాదనలు విని నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేసింది. అనంతరం సోంధీ వాదనలు వినిపిస్తూ.. 'నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ), విద్యుత్ నియంత్రణ మండలి(ఈఆర్‌సీ)తోపాటు కేంద్రం నుంచి అన్ని అనుమతులు తీసుకున్నాకే విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు చేపట్టాం. పీపీఏలపై తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రెండు రాష్ట్రాలు ఒప్పందం చేసుకున్నాయి. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాల మధ్య విద్యుత్ కొనుగోలు ఒప్పందాలను ఈఆర్‌సీ కూడా ఆమోదించింది. సబ్ క్రిటికల్, సూపర్ క్రిటికల్ టెక్నాలజీకి సంబంధించి కూడా కమిషన్ తన వైఖరిని వెల్లడించడం చెల్లదు. ఏది మంచో.. ఏది కాదో తేల్చే అధికారం కమిషన్‌కు లేదు. సిఫార్సులు మాత్రమే చేయాల్సి ఉంటుంది. కమిషన్ చైర్మన్ పక్షపాతంగా వ్యవహరిస్తున్నారు. ఆయన నివేదిక ఎలా ఇవ్వనున్నారో ఇప్పటికే తెలిసిపోయింది. కేసీఆర్ వ్యక్తిగత పరువుకు భంగం వాటిల్లేలా జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి మీడియాలో వ్యాఖ్యలు చేశారు. నివేదిక అందజేయాలని ప్రభుత్వం ఆయనకు ఈ నెల 30 వరకు సమయం ఇచ్చింది. కోర్టు అనుమతి లేకుండా ప్రభుత్వానికి నివేదిక సమర్పించకుండా కమిషన్‌కు ఆదేశాలు జారీ చేయాలి'అని వివరించారు. వాదనలు విన్న ధర్మాసనం.. రిట్ పిటిషన్‌కు నంబర్ కేటాయించాలని రిజిస్ట్రీని ఆదేశించింది. పిటిషన్ మెరిట్స్‌పై నేడు వాదనలు వింటామంది. నేడు అడ్వొకేట్ జనరల్ వాదనలు వినిపించే అవకాశం ఉంది.

సీఎం సొంత గ్రామంలో బీజేపీకి ఎలా మెజారిటీ వచ్చింది

బీఆర్‌ఎస్, బీజేపీ కుమ్మక్కన్న రేవంత్ వ్యాఖ్యలపై హరీశ్‌రావు ఫైర్



సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి సొంత గ్రామమైన కొండారెడ్డిపల్లిలో బీజేపీకి మెజారిటీ వచ్చిందంటే రేవంతే అక్కడ బీజేపీకి కాంగ్రెస్ ఓట్లు మళ్లించారా అని మాజీమంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్‌ఎస్, బీజేపీ కుమ్మక్కు అయ్యాయని రేవంత్‌రెడ్డి ఢిల్లీలో ఆరోపించడం విడ్డూరమని హరీశ్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మెదక్‌లో బీజేపీని బీఆర్‌ఎస్ గెలిపించిందని సీఎంస్థాయి వ్యక్తి గాలి మాటలు మాట్లాడటం సరికాదన్నారు. మెదక్ పార్లమెంటు పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలుంటే అందులో మూడుచోట్ల బీఆర్‌ఎస్ మెజారిటీ సాధించిందని, రఘునందన్‌రావు సొంత నియోజకవర్గమైన దుబ్బాకలో కూడా బీఆర్‌ఎస్ మెజారిటీ సాధించిందని గుర్తు చేశారు. రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గమున్న మహబూబ్‌నగర్‌లో బీజేపీ ఎలా గెలిచిందని అడిగారు. మహబూబ్‌నగర్ పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలున్నా... వారంతా కలిసి బీజేపీని గెలిపించారా అని ప్రశ్నించారు. కొడంగల్‌లో రేవంత్‌రెడ్డి 32 వేల మెజారిటీతో గెలిచారని, పార్లమెంటు ఎన్నికల్లో అక్కడ కాంగ్రెస్ అభ్యర్థికి 21 వేల మెజారిటీ మాత్రమే వచ్చిందంటే...మిగతా ఓట్లు రేవంత్‌రెడ్డి బీజేపీకి వేయించారా అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహించిన మల్కాజిగిరిలో బీజేపీ భారీ మెజారిటీతో ఎలా గెలిచిందో చెప్పాలని, ఈ రెండు చోట్ల కాంగ్రెస్ పార్టీ బీజేపీని గెలిపించిందా అడిగారు.

బీజేపీ పంచన చేరింది.. మోదీ శరణు చొచ్చింది రేవంతే..

బీజేపీ పంచన చేరింది..మోదీ శరణు చొచ్చింది రేవంత్‌రెడ్డి అని హరీశ్‌రావు అన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఉండి బీజేపీ ఎజెండా అమలు చేస్తున్నది రేవంత్‌రెడ్డేనని, నిండుసభలో మోదీని పెద్దన్న అని సంబోధించిందీ రేవంత్‌రెడ్డి అని పేర్కొన్నారు. ప్రధాని మోదీ, సీఎం రేవంత్‌రెడ్డి కుమ్మక్కై సింగరేణిని ప్రైవేటు పరం చేస్తున్నారని, విభజన హామీలపై రేవంత్‌రెడ్డి, మోదీ ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీయడం లేదని ఆరోపించారు. రెండు జాతీయ పార్టీలు కలిసి ప్రాంతీయ శక్తి అయిన బీఆర్‌ఎస్‌ను టార్గెట్ చేస్తూ..బీజేపీ, బీఆర్‌ఎస్ ఒక్కటయ్యాయని రేవంత్‌రెడ్డి చెప్పడం సిగ్గుచేటని హరీశ్‌రావు ధ్వజమెత్తారు.

విచారణ కమిషన్ల గడువు పొడిగింపు!

- జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్‌కు నెల రోజులు..
- జస్టిస్ చంద్రఘోష్ కమిషన్‌కు రెండు నెలలు

సాక్షి, హైదరాబాద్: గత బీఆర్‌ఎస్ సర్కారు హయాంలో తీసుకున్న విద్యుత్, సాగునీటి రంగ నిర్ణయాలపై ఏర్పాటు చేసిన విచారణ కమిషన్ల గడువు ఈ నెల 30తో ముగియనుండగా, మరికొంతకాలం పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఛత్తీస్‌గఢ్ విద్యుత్ కొనుగోలు ఒప్పందం, యాదాద్రి, భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాల నిర్మాణంలో అవకతవకలు, అందుకు బాధ్యులను గుర్తించడానికి జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి విచారణ కమిషన్ గడువును మరో నెల రోజులు పొడిగించాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలిసింది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల వైఫల్యాలకు కారణాలు, అందుకు బాధ్యులను గుర్తించడానికి జస్టిస్ పినాకి చంద్రఘోష్ విచారణ కమిషన్ గడువును మరో రెండు నెలలు పొడిగించాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు సమాచారం. త్వరలో ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు జారీ కానున్నాయి.

దివ్యాంగుల సంక్షేమ బడ్జెట్ 75 రెట్లు పెంచాం

- 5 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని నిర్ణయం
- హెలెన్ కెల్లర్ జయంతి కార్యక్రమంలో మంత్రి సీతక్క


రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో దివ్యాంగురాలికి కృత్రిమ కాలును తొడుగుతున్న మంత్రి సీతక్క

సాక్షి, హైదరాబాద్/చాదర్‌ఘాట్/గన్‌ఫౌండ్రీ: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత వికలాంగుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. గురువారం మలక్‌పేటలోని వికలాంగుల సంక్షేమ శాఖ కార్యాలయ ఆవరణలో హెలెన్ కెల్లర్ విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించారు. అనంతరం హెలెన్ కెల్లర్ జయంతిని పురస్కరించుకుని నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గత ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపుల్లో భాగంగా రూ.కోటి మాత్రమే కేటాయిస్తే... కాంగ్రెస్ ప్రభుత్వం రూ.75 కోట్లు కేటాయించిందన్నారు. గత ప్రభుత్వ కేటాయింపులతో పోలిస్తే ప్రస్తుత ప్రభుత్వం 75రెట్లు అధికంగా కేటాయింపులు జరిపిందన్నారు. అదేవిధంగా ఉన్నత విద్యా సంస్థల్లో దివ్యాంగులకు కనీసం 5శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, వయో పరిమితి కూడా ఐదేళ్లు పెంచిందన్నారు. తమ ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి కట్టుబడి ఉందని, ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్లు, ఉద్యోగాల కల్పనలో 4 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామన్నారు. అనంతరం తెలంగాణ వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య మాట్లాడుతూ, ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన రోజే రజినికి ఉద్యోగం ఇచ్చారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మహిళాభివృద్ధి, శిశు, వికలాంగుల సంక్షేమ శాఖ కార్యదర్శి వాకాటి కరుణ, వికలాంగుల సంక్షేమ శాఖ సంచాలకులు బి.శైలజ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం..

రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి కట్టుబడి ఉందని మంత్రి సీతక్క అన్నారు. గురువారం రవీంద్రభారతిలో దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో హెలెన్ కెల్లర్ 144వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.... వికలాంగులను బాధ్యతగా చూడలేనివారు, వికలాంగులను స్వార్థ ప్రయోజనాలకోసమే వాడుకునేవారు నిజమైన వికలాంగులన్నారు. అనంతరం దివ్యాంగుల కోసం వివిధ సంస్థలు ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించి పరికరాల గురించి అడిగి తెలుసుకున్నారు.

ఆగస్టుకు ముందే రుణమాఫీ

అసెంబ్లీలో చర్చించాకే రైతుభరోసా
- ఖర్చు పెట్టినా ఫలితమివ్వని మిషన్ భగీరథ
- కొత్తగూడెం సభలో డిప్యూటీ సీఎం భట్టి


శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు కోమటిరెడ్డి, పొంగులేటి, తుమ్మల. పక్కన కలెక్టర్ పాటిల్, ఎమ్మెల్యేలు కూనంనేని, రాందాస్ నాయక్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: 'రైతు రుణమాఫీని ఆగస్టు కంటే ముందే అందిస్తే ఏమైనా ఇబ్బందా'అని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అని ప్రశ్నించారు. కొత్తగూడెంలో వివిధ అభివృద్ధి పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ ఎన్ని ఆటంకాలు ఎదురైనా రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ అమలు చేస్తామని తెలిపారు. రైతుభరోసా ఎవరికి ఇవ్వాలి.. ఎలా పంపిణీ చేయాలి అనే అంశాలపై ప్రజాభిప్రాయం సేకరిస్తామని, విధివిధానాలు రూపొందించి, అసెంబ్లీలో చర్చకు పెట్టిన తర్వాతే అందిస్తామని ప్రకటించారు. అంతే కానీ నలుగురం కూర్చుని మాదేం పోయింది..ప్రజల డబ్బే కదా అన్నట్టుగా భావించి గుట్టలు ఉన్న చోట, పంటలు వేయని భూములకు రైతు భరోసా అందించే ఉద్దేశం లేదని చెప్పారు. సీతారామ ప్రాజెక్టు నిర్మాణానికి రూ.9వేల కోట్లు ఖర్చు చేసి ఒక ఎకరాకు కూడా నీరందించలేకపోయారని విమర్శించారు. రూ.42 వేల కోట్లు అప్పు తెచ్చి మిషన్ భగీరథ పేరుతో ఖర్చు చేసినా, ఇప్పటివరకూ ఇంటింటికీ తాగునీరు రాని గ్రామాలు రాష్ట్రంలో అనేకం ఉన్నాయన్నారు. పన్నుల రూపంలో ప్రజలు చెల్లించిన డబ్బులను ఎవరికి పడితే వారికి పంచి, రూ.7లక్షల కోట్ల అప్పు చేసి పారిపోయారని చెప్పారు. కొత్తగూడెం-పాల్వంచ మున్సిపల్ కార్పొరేషన్, సింగరేణి సహకారంతో ఐటీ హబ్, పాల్వంచలో కొత్త థర్మల్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

12 ఆర్వోబీలకు ప్రతిపాదనలు

జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కనెక్టివిటీ పెంచేందుకు 12 ఆర్వోబీలకు సేతుబంధన్ కింద నిధులు మంజూరు చేయాలని కేంద్రానికి ప్రతిపాదనలు పంపామని తెలిపారు. అందులో రూ.148 కోట్లతో నిర్మించే కొత్తగూడెం ఆర్వోబీ కూడా ఉందన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలలో ఇప్పటికే ఐదు అమలు చేశామని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో సుమారు రూ.35 వేల కోట్లతో రైతు రుణమాఫీ చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. సీతారామ ఎత్తిపోతల పథకంలో భాగంగా ట్రయల్‌రన్ ద్వారా బీజీ కొత్తూరు పంప్‌హౌస్ నుంచి గోదావరి జలాలు ఎత్తిపోసేందుకు అంకురార్పణ జరిగిందనిచ, మిగిలిన పనులను ఈ ఏడాదిలో పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం, వైరా ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, మాలోత్ రాందాస్‌నాయక్, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, జెడ్పీచైర్మన్ కంచర్ల చంద్రశేఖరరావు, కలెక్టర్ జితేష్ వి పాటిల్ తదితరులు పాల్గొన్నారు

యాక్షన్ ప్లాన్

గోదావరి వరదలను దృష్టిలో ఉంచుకొని గత ప్రభుత్వం కంటే మెరుగ్గా ప్రజలకు సేవలు అందించేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలని భద్రాద్రి జిల్లా అధికారులకు మంత్రులు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు గోదావరి వరదల సన్నద్ధతపై సమీక్ష నిర్వహించారు.

హైదరాబాద్ గడ్డ.. హత్యలకు అడ్డా

ఎమ్మెల్యే రాజాసింగ్ విమర్శ



అబిడ్స్ (హైదరాబాద్): హైదరాబాద్ గడ్డ హత్యలకు అడ్డాగా మారిందని, ఒక్క జూన్ నెలలోనే ఎన్ని హత్యలు జరిగాయో ఒక్కసారి పరిశీలిస్తే తెలుస్తుందని గోషామహల్ నియోజకవర్గం ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక వీడియోను విడుదల చేశారు. పాతబస్తీలో తెల్లవారుజాము 4 గంటల వరకు దుకాణాలు, హోటళ్లు తెరిచి ఉంచుతున్నారని, అలాంటి వాటిని నియంత్రిస్తే హత్యలకు అడ్డుకట్ట పడుతుందన్న భావనతో పోలీసులు కఠిన చర్యలకు ఉపక్రమించారని, అయితే ఎంఐఎం ఎమ్మెల్యే పోలీసులను దుర్భాషలాడుతున్నట్లు చెప్పారు. పాతబస్తీలో పోలీసు అధికారులపై ఎంఐఎం ఎమ్మెల్యేలు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. 'పనిచేయాలని ఉంటే మేం చెప్పినట్లు చెయ్యండి, లేదంటే వెళ్లిపోండి' అంటూ పోలీసుల్ని హెచ్చరిస్తుండటం శోచనీయమన్నారు. ఒకవైపు ఆ పార్టీ ఎమ్మెల్యేలు, మరోవైపు ఆ పార్టీ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ పరిధిలోనే ఈ హత్యలు ఎక్కువగా జరుగుతున్నాయన్న విషయాన్ని గుర్తించాలని, ఈ హత్యలకు ఎవరు పాల్పడుతున్నారు, ఎవరు హత్యలకు గురవుతున్నారో కూడా వారికి తెలుసన్నారు.

రుణమాఫీకి ఎన్‌సీడీసీ రుణం?

- ఆర్థిక సహకారం కోసం సర్కారు ప్రయత్నం
- పలు జాతీయ బ్యాంకులతో సంప్రదింపులు
- చివరకు రుణం ఇచ్చేందుకు ఎన్‌సీడీసీ సుముఖత
- గొర్రెల పంపిణీకి ఎన్‌సీడీసీ నుంచే రూ. 4 వేల కోట్లు తీసుకున్న గత ప్రభుత్వం... ఇప్పుడు కూడా అదే సంస్థతో ఒప్పందానికి నిర్ణయం



సాక్షి, హైదరాబాద్: రుణమాఫీకి అవసరమైన నిధుల కోసం సర్కారు వేట ప్రారంభించింది. రూ.31 వేల కోట్లు సమకూర్చుకునేందుకు పలు జాతీయ బ్యాంకులను సంప్రదించింది. చివరకు జాతీయ సహకార అభివృద్ధి సంస్థ (ఎన్‌సీడీసీ) అవసరమైన రుణం ఇచ్చేందుకు సుముఖత వ్యక్తం చేసిందని వ్యవసాయశాఖ వర్గాలు వెల్లడించాయి. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం గొర్రెల పంపిణీకి ఎన్‌సీడీసీ నుంచి తొలివిడత రూ.3,955 కోట్ల రుణం తీసుకుంది. రెండో విడతకు రూ.4,563 కోట్ల రుణం ఇవ్వాలని కోరగా.. ఎన్‌సీడీసీ చివరి నిమిషంలో ఆపేసింది. అప్పుడు రాజకీయ కారణాలు అడ్డుగా మారడంతో మిగిలిన సొమ్ము రాష్ట్ర ప్రభుత్వానికి చేరలేదు. ఇలాంటి విషయాల్లో పెద్ద ఎత్తున నిధులు ఇవ్వడంలో ఎన్‌సీడీసీ ముందుంటుంది. దీంతో దాన్నే తనకు అనుకూలంగా మార్చుకునేందుకు సర్కారు చర్యలు చేపట్టింది. ఈ మేరకు ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌సీడీసీ అధికారులతో చర్చలు జరిపింది. అయితే దీనిపై ఇంకా స్పష్టత రావాల్సి ఉందని, కేంద్ర సహకారశాఖ పరిధిలో ఎన్‌సీడీసీ ఉన్నందున రాజకీయకారణాలు ఏమైనా అడ్డుగా ఉంటాయా అన్న చర్చ జరుగుతోంది. అన్నీ అనుకున్నట్టు జరిగితే ఎన్‌సీడీసీతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకునే అవకాశాలున్నాయి.

ముంచుకొస్తున్న గడువు...

వచ్చే ఆగస్టు 15వ తేదీలోపు రైతులకు రూ.2 లక్షల రుణాలను మాఫీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. అందుకోసం రూ. 31వేల కోట్లు అవసరం అవుతాయని ప్రకటించారు. సీఎం చెప్పిన గడువుకు మరో నెలన్నర మాత్రమే ఉంది. ఈ నేపథ్యంలో అంత భారీ మొత్తాన్ని ఏ విధంగా సమకూర్చుతారనే ఉత్కంఠ అందరిలో నెలకొంది. రుణమాఫీ కోసం ప్రభుత్వం మళ్లీ రుణాలపైనే ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది. భారీగా రుణం ఇవ్వాలంటే షరతులు ఉంటాయని ఎన్‌సీడీసీ అధికారులు అంటున్నట్టు తెలిసింది. అంతేగాక కేంద్ర ప్రభుత్వ అనుమతులు కూడా అవసరమన్న అభిప్రాయం నెలకొంది. ఈ నేపథ్యంలో రుణం కోసం సీఎం రేవంత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వ పెద్దలను ప్రసన్నం చేసుకునే పనిలో ఉన్నారు. అందుకే పార్టీ పనులతోపాటు ఈ విషయంపైనా తేల్చుకునేందుకు సీఎం ఢిల్లీలో నాలుగు రోజులుగా మకాం వేసినట్టు వ్యవసాయశాఖవర్గాలు అంటున్నాయి. ఇదిలాఉండగా, రుణం కోసం ముంబై వెళ్లి రిజర్వు బ్యాంకు వద్ద ప్రయత్నాలు చేశారు. కానీ అక్కడి నుంచి సానుకూల స్పందన రాలేదని తెలిసింది. ఢిల్లీలో పలు జాతీయ బ్యాంకుల అధికారులతోనూ చర్చించినా ఫలితం లేకుండా పోయిందని అంటున్నారు. ఈ నేపథ్యంలో ఎన్‌సీడీసీపైనే ప్రభుత్వం ఆధారపడినట్టుగా చెబుతున్నారు. రుణం ఇస్తే ప్రభుత్వం అవసరమైన గ్యారంటీ ఎన్‌సీడీసీకి ఇవ్వాల్సి ఉంటుంది.

రైతు భరోసా ఎప్పుడిస్తారని మాజీ మంత్రులు అడగటం విడ్డూరం

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



సాక్షి, హైదరాబాద్: రైతుభరోసా విధివిధానాలు, రైతు భరోసా ఎప్పుడిస్తారని బీఆర్‌ఎస్ మాజీమంత్రులు అడగటం విడ్డూరంగా ఉందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఏ సమయంలో రైతుబంధు ఇచ్చారో, ఎంతకాలం పాటు ఇచ్చారో, ఎన్ని పర్యాయాలు పూర్తిగా ఇవ్వకుండా ఆపారో అన్ని విషయాలు రైతులకు తెలుసని గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2018 వానాకాలం 128 రోజుల(4 నెలల 5 రోజులు)పాటు, యాసంగిలో 161 రోజులు, 2019 వానాకాలంలో 138 రోజులు, 2020 వానాకాలంలో 169 రోజులు, 2021-22 యాసంగిలో 84 రోజులు, 2022-23 యాసంగిలో 148 రోజులు, 2023 వానాకాలంలో కూడా 108 రోజుల పాటు రైతుబంధు నిధులు విడుదల చేసిన మీరు, ఇప్పటి ప్రభుత్వాన్ని విమర్శిస్తుంటే కోడిగుడ్డు మీద ఈకలు పీకుతున్నట్లుందని ఎద్దేవా చేశారు. అప్పటి రైతుబంధులో గుట్టలకు, రాళ్లురప్పలకు, బంజరు భూములకు ఇచ్చి 12 విడతలలో 26,500 కోట్ల ప్రజాధనాన్ని దుబారా చేశారని ఆరోపించారు. ఈ ప్రభుత్వం 'రైతుభరోసా'ని అలాకాకుండా ఒక ఆదర్శవంతమైన పథకంగా తీసుకొచ్చే ప్రయత్నం చేస్తుందని తెలిపారు. తమ ప్రభుత్వం సద్విమర్శలను స్వీకరిస్తుందని అన్నారు.

మూడు రోజులు వర్షాలే!

▶ మొదటి పేజీ తరువాయి

వాయవ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. ఈ ప్రభావంతోనే రాష్ట్రంలో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా సగటు వర్షపాతం సాధారణ స్థితిలో నమోదైనప్పటికీ.. కొన్ని జిల్లాల్లో మాత్రం లోటు వర్షపాతం ఉంది. ఈ మూడు రోజుల పాటు వర్షాలు ఆశాజనకంగా ఉంటే రాష్ట్రంలో వర్షపాతం సాధారణం కంటే ఎక్కువగా నమోదు కావొచ్చని వాతావరణ నిపుణులు చెబుతున్నారు.

13.07 సెంటీమీటర్ల వర్షపాతం

రాష్ట్రంలో నైరుతి సీజన్‌లో జూన్ నెలలో కురవాల్సిన సగటు వర్షపాతం 12.94 సెంటీమీటర్లు. ఈ నెలలో గురువారం నాటికి నమోదు కావాల్సిన సగటు వర్షపాతం 11.14 సెంటీమీటర్లు కాగా.. 13.07 సెంటీమీటర్ల వర్షం కురిసింది. కాగా, మూడు జిల్లాల్లో సగటు కంటే తక్కువ వర్షపాతం నమోదైంది. కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, కామారెడ్డి జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైంది. 16 జిల్లాల్లో సాధారణ వర్షపాతం, 8 జిల్లాల్లో అధిక వర్షపాతం, 6 జిల్లాల్లో అత్యధిక వర్షపాతం నమోదైంది. రానున్న మూడు రోజులు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనాలు చెపుతున్నాయి. సాగు పనులు ముందుకెళ్లాలంటే ఈ వారం వర్షాలే కీలకం కానున్నాయి. సాగు విస్తీర్ణం పెరుగుదలకు ఈ వర్షాలు ఉపయోగపడతాయని వ్యవసాయ శాఖ అధికారులు అభిప్రాయపడుతున్నారు.

గురువారం అత్యధిక వర్షపాతం నమోదైన ప్రాంతాలు

ప్రాంతం	వర్షపాతం (సెం.మీ)
పోచంపల్లి (మానకొండూరు)	5.13
మన్నెగూడ (పూడూరు)	4.15
రవీంద్రనగర్ (చింతలమానెపల్లి)	4.03
ఆసిఫాబాద్	3.30
తాండూరు	3.25
తాంసీ	3.18
లక్ష్మీసాగర్ (పుల్కల్)	3.18
డిఫెన్స్ కాలనీ (హయత్‌నగర్)	3.03

నర్సింగ్ డైరెక్టరేట్ ఏర్పాటు చేయాలి

- తెలంగాణ ప్రభుత్వ నర్సింగ్ అసోసియేషన్

సాక్షి, హైదరాబాద్: దశాబ్ద కాలంగా ఎదురుచూస్తున్న నర్సింగ్ డైరెక్టరేట్ ఏర్పాటు చేయాలని, 317 జీవోపై ప్రభుత్వం త్వరగా నిర్ణయం తీసుకోవాలని, బాధిత నర్సింగ్ ఆఫీసర్స్‌కు న్యాయం చేయాలని తెలంగాణ ప్రభుత్వ నర్సింగ్ అసోసియేషన్ కోరింది. గురువారం హైదరాబాద్‌లో అడ్-హాక్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు నిర్ణయాలు తీసుకున్నారు. సాధారణ బదిలీలు పారదర్శకంగా జరిగే విధంగా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని, ప్రమోషన్ కోసం సీనియారిటీ లిస్ట్ త్వరగా ప్రకటించి వీలైనంత త్వరగా ప్రమోషన్ కల్పించాలని, సీనియారిటీ లిస్టును ఆన్‌లైన్‌లో పెట్టాలని కోరారు. ప్రతి జిల్లాకు ఒక డిస్ట్రిక్ నర్సింగ్ ఆఫీసర్స్ పోస్టును క్రియేట్ చేయాలన్నారు. బోధన వైద్యశాలలో పెరిగిన పడకల సంఖ్య ఆధారంగా నర్సింగ్ ఆఫీసర్స్ పోస్టులను పెంచాలని, సీనియర్ నర్సింగ్ ఆఫీసర్స్, చీఫ్ నర్సింగ్ ఆఫీసర్స్ పోస్టులను పెంచాలని కోరారు. నర్సింగ్ ఆఫీసర్స్‌కు హెల్త్ కార్డులు జారీ చేయాలన్నారు.

సాక్షి ఉద్యోగ అవకాశాలు

నెరవేరిన టీచర్ల కల

▶ మొదటి పేజీ తరువాయి

2023లో ఇది ఆగిపోయింది. ఈలోగా ఎన్నికల కోడ్ అడ్డంకిగా మారింది. ఈసారి ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రమోషన్లు, బదిలీలు చేయాలని అధికారులు కంకణం కట్టుకున్నారు. ఈ వ్యవహారంలో పాఠశాల విద్య కమిషనర్ దేవసేన ప్రత్యేక దృష్టి పెట్టారు. వ్యూహాత్మకంగా న్యాయపరమైన చిక్కులు తొలగించారు. దీంతో 18,942 మందికి ఒకేసారి పదోన్నతులు దక్కాయి. ఎస్‌జీటీ నుంచి స్కూల్ అసిస్టెంట్లుగా, కొంతమంది, స్కూల్ అసిస్టెంట్ల నుంచి హెచ్‌ఎంలుగా మరికొంతమంది ప్రమోషన్లు పొందారు. వీళ్లందరినీ బదిలీ చేశారు. దీంతో ఉపాధ్యాయుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

ఇదో చరిత్ర: ముఖ్యమంత్రి కార్యాలయం

ఇంత పెద్ద మొత్తంలో టీచర్లకు పదోన్నతులు కల్పించడం రాష్ట్ర చరిత్రలోనే గొప్ప విషయమని ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) ఓ ప్రకటనలో పేర్కొంది. ఎక్కడా ఎలాంటి వివాదానికి తావివ్వకుండా, చట్టపరమైన చిక్కులను అధిగమించడంలో ప్రభుత్వం చూపిన చొరవను ఉపాధ్యాయ సంఘాలు ప్రశంసిస్తున్నాయని తెలిపింది. టీచర్ల కష్టాన్ని, శ్రమను ప్రభుత్వం గుర్తించిందని, సముచిత రీతిలో గౌరవించిందని, ఈ కారణంగా టీచర్లు మరింత కంకణబద్ధులై పనిచేస్తారన్న ఆశాభావాన్ని సీఎంవో వ్యక్తం చేసింది.

మల్టీజోన్-1 పరిధిలో..

కేటగిరీ	మేనేజ్‌మెంట్	పదోన్నతులు
ఎస్‌జీటీ నుంచి స్కూల్ అసిస్టెంట్	ప్రభుత్వ, లోకల్ బాడీ	10,083
స్కూల్ అసిస్టెంట్ నుంచి హెచ్‌ఎం	లోకల్ బాడీ	995
స్కూల్ అసిస్టెంట్ నుంచి హెచ్‌ఎం	ప్రభుత్వ స్కూల్స్	99

మల్టీజోన్-2 పరిధిలో

కేటగిరీ	మేనేజ్‌మెంట్	పదోన్నతులు
ఎస్‌జీటీ నుంచి స్కూల్ అసిస్టెంట్	లోకల్ బాడీ	5,962
ఎస్‌జీటీ నుంచి స్కూల్ అసిస్టెంట్	ప్రభుత్వ స్కూల్స్	1,027
స్కూల్ అసిస్టెంట్ నుంచి హెచ్‌ఎం	లోకల్ బాడీ	776

జిల్లాల వారీగా పదోన్నతులు

జిల్లా	పదోన్నతులు
ఆదిలాబాద్	445
కొమురంభీమ్ ఆసిఫాబాద్	340
మంచిర్యాల	458
నిర్మల్	416
నిజామాబాద్	833
జగిత్యాల	682
పెద్దపల్లి	368
జయశంకర్ భూపాలపల్లి	277
భద్రాద్రి కొత్తగూడెం	694
మహబూబాబాద్	517
వరంగల్	434
హనుమకొండ	475
కరీంనగర్	504
రాజన్న సిరిసిల్ల	394
కామారెడ్డి	787
సంగారెడ్డి	774
మెదక్	597
సిద్దిపేట	679
జనగామ	434
యాదాద్రి భువనగిరి	496
మేడ్చల్ మల్కాజిగిరి	302
హైదరాబాద్	749
వికారాబాద్	581
మహబూబ్‌నగర్	497
జోగుళాంబ గద్వాల	298
వనపర్తి	390
నాగర్‌కర్నూల్	550
నల్లగొండ	897
సూర్యాపేట	614
ఖమ్మం	954
ములుగు	229
నారాయణపేట	407

తండ్రి లేని బిడ్డల సొమ్మును అన్యాయంగా తినేవారు తమ పొట్టల్ని అగ్నితో నింపుకుంటున్నారు. త్వరలోనే వారు మండే అగ్నిలోకి ప్రవేశిస్తారు.

– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 28 జూన్ 2024

'పెండింగ్'కు మంచి దోవ!

న్యాయస్థానాల్లో పెండింగ్ కేసుల గురించి ఎవరికీ తెలియనిది కాదు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తులుగా పనిచేసినవారు గతంలో చాలాసార్లు మాట్లాడారు. రిటైరయ్యే రోజున కూడా ఆ మాట చెప్పి నిష్క్రమించేవారు. తమ పదవీకాలంలో పెండింగ్ బెడదను సాధ్యమైనంత తగ్గించేందుకు పలు విధానాలు అమలు పరిచేవారు. న్యాయమూర్తుల సంఖ్య పెంచాలంటూ ప్రధానికి బహిరంగ వినతులు చేసినవారు కూడా ఉన్నారు. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ మరో అసాధారణ నిర్ణయం తీసుకున్నారు. ఈ శనివారం నుంచి వరసగా ఆరురోజులపాటు ప్రత్యేక లోక్ అదాలత్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. గతంలో సుప్రీంకోర్టులో లోక్ అదాలత్‌లు జరగకపోలేదు. కానీ ఎప్పుడో ఒకసారి జరిగే ఈ అదాలత్‌లకు పెద్దగా స్పందన ఉండేది కాదు. అందువల్లే ఈసారి వరసగా ఆరురోజులపాటు సాగించాలని ఆయన భావించారు. ఈ కార్యక్రమంలో పదివేల కేసుల్ని పరిష్కరించాలన్నది ఆయన లక్ష్యం. పైగా ఈ కేసుల పరిష్కారానికి లిటిగెంట్లకు పైసా ఖర్చుండదు. వీటిల్లో కార్మిక చట్టాలు, అద్దె, సేవలు, పరిహారం, కుటుంబ తగాదాలు, సాధారణ సివిల్ తగాదాలు, వినియోగదారుల కేసులు ఉంటాయి. జస్టిస్ చంద్రచూడ్ చెబుతున్న ప్రకారం సుప్రీంకోర్టులో ప్రస్తుతం 66,059 సివిల్ కేసులూ, 18,049 క్రిమినల్ కేసులూ ఉన్నాయి. రెండూ లెక్కేస్తే 84 వేల పైమాటే. ఇవిగాక వివిధ హైకోర్టుల్లో 44,03,152 సివిల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయని జాతీయ జ్యుడీషియల్ డేటా గ్రిడ్ చెబుతోంది. క్రిమినల్ కేసుల సంఖ్య 17,55,946. మొత్తంగా చూస్తే దాదాపు 62 లక్షలు! హైకోర్టుల్లో ఏడాదిగా పెండింగ్‌లో ఉన్నవి పది లక్షల సివిల్ కేసులు. ఇవిగాక సుప్రీంకోర్టు, హైకోర్టుల్లో రోజూ దాఖలయ్యే కేసులు, అప్పీళ్లు, కింది కోర్టుల్లో పెండింగ్ పడిన కోట్లాది కేసులు అదనం.

న్యాయవ్యవస్థ పుట్టిన నాటినుంచీ అవతలి పక్షాన్ని కోర్టుకీడ్చి ఇరుకున పెట్టాలన్న యావ కక్షిదారులకు సహజంగా ఏర్పడివుంటుంది. రాచరికాల్లో ఇంత చేటు సాహసం ఉండేది కాదు. తప్పనిసరైతే తప్ప, తనవైపే న్యాయం ఉందన్న ధీమా ఉంటే తప్ప ఫిర్యాదు చేయడానికి జంకేవారు. తేడా వస్తే తల తీస్తారన్న భయమే అందుకు కారణం కావొచ్చు. చిత్రమేమంటే వర్తమాన కాలంలో ప్రభుత్వాలే పెద్ద లిటిగెంట్లుగా మారాయి. అసమ్మతి ప్రకటించేవారిపై ఎడాపెడా కుట్ర కేసులు బనాయించటం, ఇతరత్రా కేసుల్లో ఇరికించటం ఇప్పటికీ సాగుతూనే వుంది. ప్రభుత్వాలు అడ్డగోలు నిర్ణయాలు తీసుకోవటం ఒకపక్క, ఉద్దేశపూర్వకంగా ప్రభుత్వాలను కోర్టుకీడ్చటం మరోపక్క సమాంతరంగా సాగుతుంటాయి. వలస పాలకుల నాటి చట్టాలనే ఇప్పటికీ నెత్తిన పెట్టుకోవటం, అవకతవకలు జరగలేదని తెలిసికూడా అధికార మదంతో వ్యతిరేకులను అక్రమ కేసుల్లో ఇరికించటం మితిమీరుతోంది. ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వాల పుణ్యమా అని యూపీ నుంచి ఏపీ దాకా బుల్‌డోజర్లు నడిపించే సంస్కృతి పెరిగింది. ప్రత్యర్థి పక్షాలకు చెందినవారి ఇళ్లపై, కార్యాలయాలపై దాడులు సరేసరి. సహజంగానే ఇలాంటి కేసులన్నీ న్యాయస్థానాలకు ఎక్కక తప్పదు. దానికితోడు పొలాలు, స్థలాలు, ఇళ్లు వగైరా స్థిరాస్తుల వారసత్వ హక్కుల కోసం దాయాదులు, తామే న్యాయమైన హక్కుదారులమంటూ వచ్చే కక్షిదారులు లెక్కలేనంతమంది. ఎన్‌డీఏ సర్కారు ఈమధ్య కాలం చెల్లిన చట్టాల్లో కొన్నిటిని రద్దుచేయటంతోపాటు ఐపీసీ, సీపీసీ, సీఆర్‌పీసీ, ఎవిడెన్స్ చట్టం స్థానాల్లో కొత్త చట్టాలు తీసుకొచ్చింది. అవి ఏమేరకు మార్పు తీసుకురాగలవో ఆచరణ తర్వాతగానీ తెలియదు. నీతి ఆయోగ్ మార్గదర్శకాలకు అనుగుణంగా నిరుడు ఏపీలో జగన్ సర్కారు తీసుకొచ్చిన ల్యాండ్ టైట్లింగ్ చట్టం కూడా వినూత్నమైనది. 130 ఏళ్ల తర్వాత దేశంలో తొలిసారిగా తీసుకొచ్చిన ఈ చట్టం ఉద్దేశం నిజమైన హక్కుదారులను గుర్తించి వారి హక్కులు కాపాడటం, అనవసర వ్యాజ్యాలు నిరోధించటం. అధికార యావతో ప్రత్యర్థులు ఎన్నికల్లో వక్ర భాష్యాలు చెప్పి ప్రజలను పక్కదోవ పట్టించారు. చివరకు ఎన్‌డీఏ సర్కారు దాన్ని రద్దుచేస్తోంది. లోక్ అదాలత్‌ల పనితీరు భిన్నమైనది. ఇందులో సామరస్య పరిష్కారానికి ఇరుపక్షాలనూ ప్రోత్సహిస్తారు. ప్రధాన న్యాయమూర్తి నియమించిన న్యాయనిపుణులు ఆ కేసులో ఉన్న సమస్యను న్యాయమూర్తులకూ, లిటిగెంట్లకూ వివరిస్తారు. పిటిషనర్లు నేరుగా న్యాయమూర్తులతో మాట్లాడే అవకాశం కూడా ఇస్తున్నారు. జస్టిస్ చంద్రచూడ్ తీసుకొచ్చిన మరో మార్పేమిటంటే... పిటిషనర్లు దీనికోసం ఢిల్లీ వరకూ వెళ్లనవసరం లేదు. వారికి హైకోర్టుల్లో వీడియో కాన్ఫరెన్సింగ్ సదుపాయం కల్పిస్తున్నారు.

ఇది పెండింగ్ కేసులకు న్యాయవ్యవస్థ నుంచి వచ్చిన ఒక సృజనాత్మక పరిష్కారం. ఇప్పుడు తమ వంతుగా ఏం చేయవచ్చునో ప్రభుత్వాలు ఆలోచించాలి. ఎప్పటికప్పుడు న్యాయమూర్తుల ఖాళీలు భర్తీచేయటం తక్షణావసరం. వేరే దేశాలతో పోలిస్తే జనాభాకూ, న్యాయమూర్తుల సంఖ్యకూ మధ్య నిష్పత్తి మన దేశంలో చాలా అధికం. అలాగే చట్టాలు చేసేముందు వాటి పర్యవసానంగా ఎన్ని వ్యాజ్యాలు కోర్టు మెట్లెక్కే అవకాశమున్నదో ప్రభుత్వాలు అంచనా వేసుకోవాలి. చెక్ బౌన్స్ కేసులు ఇందుకు ఉదాహరణ. గతంలో సివిల్ తగదాగా ఉన్నదాన్ని శిక్షార్హమైన నేరంగా మార్చారు. దీనివల్ల అసంఖ్యాకంగా కేసులు పెరిగాయి. పెండింగ్ కేసులు తగ్గించటం కోసం సెలవు రోజుల్లోనూ పనిచేయక తప్పడం లేదని ఆ మధ్య ఒక న్యాయమూర్తి వాపోయారు. సుప్రీంకోర్టు తీసుకున్న తాజా చొరవకు ప్రభుత్వాల వివేకం కూడా తోడైతే ఈ సంక్లిష్ట సమస్యకు సులభంగా పరిష్కారం దొరుకుతుంది.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ మాసం, **తిథి:** బ.సప్తమి సా.6.10 వరకు, తదుపరి అష్టమి **నక్షత్రం:** పూర్వాభాద్ర ప.12.29 వరకు, తదుపరి ఉత్తరాభాద్ర **వర్జ్యం:** రా.9.24 నుండి 10.53 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.07 నుండి 9.00 వరకు, తదుపరి ప.12.29 నుండి 1.21 వరకు, **అమృతఘడియలు:** లేవు.

సూర్యోదయం : 5.31
సూర్యాస్తమయం: 6.34
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

పొరుగు స్నేహాల్లో పురోగతి ఎంత?

విశ్లేషణ



జయంత రాయ్ చౌధురీ

ఉగ్రవాద ఎగుమతి ఆరోపణలతో భారత్ సంబంధాలు పాకిస్తాన్‌తో నిలిచిపోయాయి. చైనా ప్రభావ పరిధిలోకి నేపాల్ జారిపోయింది. భారత్‌తో అనేక వ్యూహాత్మక ఒప్పందాలను రద్దు చేసుకోవడంతో సహా అనేక చైనా అనుకూల నిర్ణయాలను మాల్దీవులు తీసుకుంది. చైనా అప్పుల ఊబిలో చిక్కుకున్నప్పటికీ ఆ రుణాలను చైనా పునఃవ్యవస్థీకరిస్తుందని శ్రీలంక ఆశపడుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో కేవలం బంగ్లాదేశ్ మాత్రమే భారత ఏకైక పొరుగు నేస్తంగా మిగిలిపోయింది. దాన్ని బలపరిచేలా, ఎన్డీఏ 3.0 ప్రభుత్వం స్థిరపడేలోపే బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా గత వారం భారత పర్యటనకు వచ్చారు. ఆ స్నేహాన్ని కాపాడుకుంటూనే, బంగ్లాదేశ్‌ను దాటి ఈ స్ఫూర్తిని విస్తరించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో భారత్ ఆలోచించాలి.

బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా, తీవ్రమైన వేడితో ఉడికిపోతున్న ఢిల్లీని ఒక నెలలోనే రెండోసారి సందర్శిస్తూ భారత ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ కోసం గతవారం ఇండియా వచ్చారు. ఆ భేటీ నాటికి ఎన్డీఏ 3.0 ప్రభుత్వం అప్పుడే స్థిరపడుతోంది. తదుపరి 125 రోజుల కోసం అది రచిస్తున్న పథకాలు ఇంకా పురోగతిలోనే ఉన్నాయి.

ప్రభుత్వాధినేతల స్థాయి సమావేశాలను చాలా నెలల ముందుగానే ప్లాన్ చేయడం జరుగుతుంది. ఇరుదేశాల మధ్య కుదిరే ఒప్పందంలోని ప్రతి పదాన్ని భేటీకి వారాల ముందుగానే దౌత్యవేత్తల బృందం నిశిత పరిశీలన చేసిన తర్వాతే సంతకాలు చేయడం జరుగుతుంది. షేక్ హసీనా పర్యటన కూడా... రెండు పొరుగు దేశాల మధ్య సన్నిహిత సంబంధాలను మెరుగ్గా ఉంచడానికి ఢిల్లీలోని సౌత్ బ్లాక్, ఢాకాలోని సెగున్‌బగీచాలో ఉన్న బంగ్లా విదేశాంగ మంత్రిత్వ శాఖ రూపొందించిన ప్రణాళికాబద్ధమైన ప్రయత్నంలో భాగమే.

ఈ పర్యటన నుండి సాధించిన రెండు పెద్ద ప్రయోజనాలు ఏవంటే, తీస్తా నదీ జలాలను మెరుగ్గా సంరక్షించడానికీ, నిర్వహించడానికీ సహాయం చేస్తామనే వాగ్దానం. ఇది పశ్చిమ బెంగాల్ ఆవేశపూరిత ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీసుకున్న అస్థిరమైన వైఖరి కారణంగా రెండు దేశాల చేయి దాటిపోయిన ఒప్పందం. అలాగే చైనాపై కన్నేస్తూనే, ఇరు దేశాల మధ్య మరిన్ని రహదారి, రైలు, విద్యుత్ కనెక్టివిటీలపై స్పష్టంగా సంతకం కుదిరింది.

భూటాన్ నుండి ఉత్తర బెంగాల్ మీదుగా బంగ్లాదేశ్‌లోకి ప్రవహించే నదిలోని పూడికను తొలగించడంతోపాటు జెట్టీలు, ఓడరేవులు, రహదారులను నిర్మించి నౌకాయానానికి అనువుగా ఉండేలా చేయడానికి చైనా ఇంతకుముందు బంగ్లాదేశ్‌కు నిధులు సమకూర్చడానికి ముందుకొచ్చింది. దీంతో భారతదేశ ప్రధాన భూభాగాన్ని ఈశాన్య దిశగా కలిపే చికెన్ నెక్ కారిడార్‌కు సమీపంలో చైనా ఉనికికి అవకాశం ఉండటంతో కేంద్రప్రభుత్వం అప్రమత్తమైంది. భారత్ చేస్తున్న ఎదురు ప్రతిపాదనకు (కౌంటర్ ఆఫర్) అనుకూలంగా వ్యవహరిస్తూ, చైనా ప్రతిపాదనను పునఃపరిశీలించాలని కేంద్ర ప్రభుత్వం బంగ్లాదేశ్‌ను కోరింది.

మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రిగా పని చేసినప్పటినుండి, లాటిన్ అమెరికా కోసం ఫ్రాంక్లిన్ డెలానో రూజ్‌వెల్ట్ ప్రతిపాదించిన 'మంచి పొరుగు' విధానం తరహాలో భారతదేశం ఒక పొరుగు విధానాన్ని రూపొందించడానికి ప్రయత్నిస్తోంది. ఇది దక్షిణాసియాను సన్నిహితం చేయగలదు. అంతేకాకుండా భారత ఉపఖండం వరకు దేశాల మధ్య శాంతి, ఆర్థిక సంబంధాలను ప్రోత్సహిస్తుంది.

ఇస్లామాబాద్‌కు వ్యతిరేకంగా భారత్ చేస్తున్న ఉగ్రవాద ఎగుమతి ఆరోపణల కారణంగా పాకిస్తాన్‌తో భారత్ సంబంధాలు స్తంభించిపోయాయి. అదే సమయంలో చైనా ప్రభావ పరిధి వైపు నేపాల్ మొగ్గు చూపుతోంది. పైగా పూర్వ హిందూ రాజ్యంలో భాగంగా కుమావూ భూభాగాలను చూపిస్తున్న మ్యాప్ విషయమై భారతదేశంతో నేపాల్ గొడవ పడుతోంది. భారత రక్షణ ప్రాంతమైన భూటాన్, ఎదుగుతున్న చైనాతో విరోధించకూడదనే ఆత్రుతలో బీజింగ్‌తో సరిహద్దు చర్చల్లో మునిగిపోయింది.



భారత ప్రధాని నరేంద్ర మోదీతో బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా

ద్వీప దేశమైన మాల్దీవులు గత సంవత్సరం ప్రభుత్వంలో మార్పును చూసినప్పటి నుండి, 'తుంటరి పిల్లాడి'లా వ్యవహరిస్తోంది. మాల్దీవుల అధ్యక్షుడు మహమ్మద్ ముయిజ్జూ ఢిల్లీలో ప్రమాణ స్వీకారోత్సవం సందర్భంగా ప్రధాని మోదీతో కలిసి వేదికపై కనిపించారు; కానీ మాల్దీవులలోని కొన్ని డజన్ల మంది భారత సైనికులను వెనక్కి తీసుకోవాలని కోరడం, భారత్‌తో అనేక వ్యూహాత్మక ఒప్పందాలను రద్దు చేయడంతో సహా అనేక చైనా అనుకూల భారత వ్యతిరేక నిర్ణయాలు తీసుకున్నారు. బీజింగ్‌తో కుదుర్చుకున్న ఖరీదైన ప్రాజెక్టుల కారణంగా చైనా అప్పుల ఊబిలో శ్రీలంక చిక్కుకుంది; అయినప్పటికీ చైనా తన రుణాలను పునఃవ్యవస్థీకరిస్తుందనీ, మరిన్ని మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తుందనీ ప్రకటించింది. కొలంబో చైనా ఆలింగనంలోకి వెళ్తోందనడానికి ఇది గట్టి సంకేతం.

దీంతో భారత్‌కు పొరుగున ఉన్న 'మంచి మిత్రుడు'గా ఢాకా మాత్రమే ఉండే పరిస్థితులు ఏర్పడ్డాయి. బంగ్లాదేశ్ స్థాపకుడు షేక్ ముజీబ్ హత్య తర్వాత, భారత్ పట్ల బంగ్లాదేశ్ విద్వేషపూరితమైన ప్రారంభానికి సంబంధించిన మొదటి సంకేతాలు, 2007–09లో సైనిక మద్దతుగల ఆపద్ధర్మ ప్రభుత్వ పాలనలో వచ్చాయి. ముజీబ్ కుమార్తె షేక్ హసీనా తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇరుదేశాల సంబంధాలు వికసించాయి. అప్పటి నుండి రోడ్లు, రైల్వేలు, ఓడరేవులు, విద్యుత్ గ్రిడ్‌ల గొలుసు ద్వారా ఈ ప్రాంతాన్ని ఏకీకృతం చేసే ప్రయత్నంలో బంగ్లాదేశ్... భారతదేశానికి గొప్ప మిత్రదేశంగా ఉంది.

భారత్‌కు సమస్యాత్మకమైన ఈశాన్య తిరుగుబాటుదారులను, ఇస్లామిస్ట్ టెర్రర్ మాడ్యూల్స్‌ను అప్పగించడంలో సహకారం, పరస్పర భూభాగాల్లోని చిన్న ప్రాంతాల మార్పిడి అనేవి, ఇరుదేశాల మధ్య సంబంధానికి బలమైన పునాదిని ఏర్పర్చాయి. ఈ ఢాకా–న్యూఢిల్లీ సంబంధాలపై చీకటి మేఘాలు లేవని కాదు. గత సంవత్సరం ఎన్నికల సమయంలో మాల్దీవుల్లో వివాదాస్పదమైన 'ఇండియా అవుట్' ప్రచారాన్ని చూసినట్లే, బంగ్లాదేశ్ కూడా ఈ సంవత్సరం ప్రారంభంలో ప్రతిపక్షాలు నిర్వహించిన అదే తరహా ప్రచారాన్ని చూసింది. ఇది భారత స్నేహితులను ఆందోళనకు గురి చేసింది.

1980 నుండి తలసరి ఆదాయం పదిరెట్లు పెరిగి 2,700 అమెరికన్ డాలర్లకు చేరిన నదీతీర దేశం, మరింత వృద్ధి సాధించడం కోసం విదేశీ వాణిజ్యంపై ఆధారపడాల్సి ఉంటుంది. అయితే ఇప్పటినుంచి రెండు సంవత్సరాల్లో బంగ్లాదేశ్ తక్కువ అభివృద్ధి చెందిన దేశం అనే తన స్థితిని మార్చుకుంటుంది. దీంతో ఎదురయ్యే ఒక సవాలు ఏమిటంటే, చాలా మార్కెట్లలో డ్యూటీ–ఫ్రీ ప్రాప్యత అవకాశాన్ని కోల్పోతుంది. సుంక రహిత మార్కెట్ ప్రాప్యత కొనసాగే కొత్త సమగ్ర వాణిజ్య ఒప్పందం విషయంలో భారత్ సహాయం చేయాలి. మరింత వెసులుబాటుతో కూడిన వీసా పాలన; ఆ దేశానికి అవసరమైన ఉల్లిపాయలు, వెల్లుల్లి వంటి ఆహారాన్ని అంతరాయాలు లేకుండా సాఫీగా ఎగుమతి చేయడం వంటివి భారత్ రాబోయే రోజుల్లో అనుసరించే 'మంచి పొరుగు' విధానంలో భాగంగా ఉండాలి.

అదే సమయంలో బంగ్లాదేశ్‌ను దాటి, ఈ స్నేహపూర్వకమైన స్ఫూర్తిని విస్తరించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో భారత్ ఆలోచించాలి. ప్రధాని మోదీ తన దక్షిణాసియా ప్రత్యర్థులకు ఆహ్వానాలు పంపినప్పుడు, పాకిస్తాన్ మాత్రమే దీనికి మినహాయింపు అయింది. బహుశా మన విధానాన్ని మార్చుకుని, దివాళాకు దగ్గరగా ఉన్న పొరుగుదేశానికి ఆర్థిక ప్రయోజనాలు చేకూర్చుతూ బదులుగా శాంతిని పొందడానికి సమయం ఆసన్నమై ఉండవచ్చు. ముఖ్యంగా హిందూ మహాసముద్ర ప్రాంతంలో ఆర్థిక, వ్యూహాత్మక ప్రభావం కోసం బీజింగ్‌తో కొత్త గొప్ప ఆటలో భారత్ నిమగ్నమై ఉన్నప్పుడు... ఇస్లామాబాద్‌ను దాని 'బెస్ట్ ఫ్రెండ్' అయిన చైనా నుండి దూరంగా ఉంచడం భారతదేశానికి ప్రయోజనకరంగా ఉంటుంది,

వాస్తవానికి, తక్కువ వాగాడంబరం, చిన్న పొరుగువారి పట్ల ఎక్కువ సున్నితత్వం, మరింత వాణిజ్యం, కనెక్టివిటీ, చిన్నచిన్న అసౌకర్యాలను విస్మరించి పెద్ద చిత్రాన్ని చూసే తేడాలను క్రమబద్ధీకరించడంలో ఉదారమైన ప్రతిపాదనల వంటివి భారతదేశం చుట్టూ ఉన్న రాజధానులతో కంచెలను చక్కదిద్దడానికి మార్గం కావచ్చు. బీజింగ్‌ను ఈ ప్రాంతంలోకి మరింత ప్రవేశించకుండా నిరోధించాలి.

వ్యాసకర్త 'పీటీఐ' ఈస్టర్న్ రీజియన్ నెట్‌వర్క్ హెడ్
('ద ఫ్రీ ప్రెస్ జర్నల్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



అత్యుత్తమ విధానం



విదేశాంగ విధానానికి సంబంధించి ఈ క్షణంలో ఇండియా రెండు అంశాల్లో తన అత్యుత్తమ దశలో ఉంది: 1. రష్యా–ఉక్రెయిన్ యుద్ధం మీద మన వైఖరి; మన పౌరుల భద్రతకు హామీ ఇస్తూనే రష్యా నుంచి చమురు కొనడాన్ని కొనసాగిస్తున్నాం. 2. ఇజ్రాయెల్–పాలస్తీనా యుద్ధానికి సంబంధించి రెండు–దేశాల పరిష్కారానికి మద్దతు ఇస్తున్నాం.

– ఒమర్ ఘాజీ, రచయిత

ఎందుకంత తొందర?



నూపుర్ శర్మను తిరిగి తన పదవిలో బీజేపీ ఇప్పటికీ నియమించలేదు. కానీ శ్యామ్ పిట్రోడాను ఒక్క నెలలోనే కాంగ్రెస్ తిరిగి నియమించింది. (వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో ఇరువురినీ ఆ యా పార్టీలు పక్కనపెట్టాయి.)

– పూర్ణిమ, వైద్యురాలు

ఎమర్జెన్సీ కాదా?



ఎమర్జెన్సీ పాలన కాలపు చీకటి రోజులు ఒక రాజకీయ మహాపరాధం; అది ప్రజాస్వామ్యపు గొంతు నులమడమే! కానీ 'ప్రజాస్వామ్యం' ముసుగులో అప్రకటిత 'ఎమర్జెన్సీ' అంతకంటే ఘోరమైనది.

– చంద్రకుమార్ బోస్, యాక్టివిస్ట్

మనో రీతి



చాలామంది మహిళలు తమ భర్త వాళ్ల అమ్మకు విధేయుడిగా ఉన్నాడనీ, తమ కొడుకు అతడి భార్యకు విధేయుడిగా ఉన్నాడనీ నమ్ముతుంటారు.

– రుజుతా దివేకర్, పోషణ నిపుణురాలు

ఎందుకా ఎగతాళి?



దక్షిణాఫ్రికా చేతిలో సెమీ ఫైనల్(టీ20 ప్రపంచ కప్) ఓడినందుకు పాకిస్తానీయులు అఫ్గానిస్తాన్‌ను ఎగతాళి చేస్తున్నారు. కానీ మీకు ఇది గుర్తుచేయనీ– మీ జట్టు కనీసం సూపర్ 8లోకి కూడా పోలేదు; అమెరికా లాంటి జట్టు చేతిలో ఓడిపోయింది. నోర్మూసుకోండి!

– హబీబ్ ఖాన్, అఫ్గానిస్తాన్ వ్యాఖ్యాత

జొరబడుతున్నారా?



అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ ఉమ్మడి పౌర స్మృతిని విమర్శించడం అంటే నేరుగా ఇండియా అంతర్గత వ్యవహారాల్లో తలదూర్చడమే! ఉమ్మడి పౌర స్మృతి అనేది దేశ విధానానికి సంబంధించిన ఆదర్శ సూత్రం (ఆర్టికల్ 44). ఇప్పుడు రాజ్యాంగాన్ని తక్కువ చేస్తున్నారా? అంతేనా?

– మోనికా వర్మ, కాలమిస్ట్

దివ్య పరిష్కారం



ఒక మనిషి మానసిక ఆరోగ్యానికి వ్యాయామం ఎంతో ముఖ్యమైనదనే విషయాన్ని నేను గాఢంగా నమ్ముతాను. ఒక సమస్య వచ్చినప్పుడు, మనం దానికి వేగంగా పరీక్షలు నిర్వహిస్తాం; కానీ అప్పటికే ప్రభావశీలమైన ఒక పరిష్కారం ఉందని మరిచిపోతాం. రోజువారీ వ్యాయామం. అది నిరూపితమైన దివ్యౌషధం.

– కరోల్ సైకోరా, ప్రపంచ ఆరోగ్య సంస్థ క్యాన్సర్ ప్రోగ్రామ్ మాజీ అధిపతి

ఇన్ బాక్స్

సభా సంప్రదాయాలు పాటించాలి!

18వ లోక్ సభ కొలువు తీరిన వెంటనే అధికార, ప్రతిపక్షాలు తమ తమ రంగులు బయట పెట్టాయి. మాటలు పార్లమెంటు గోడలు దాటినా... పనులు పాతవే అని నిరూపించాయి. ప్రొటెం స్పీకరు ఎంపిక మొదలుకొని తమ మధ్య ముందు ముందు విభేదాలు తప్ప ఏకాభిప్రాయం ఉండబోదని తెలియజెప్పాయి. సభలో అత్యంత సీనియర్‌ను ప్రోటెం స్పీకరుగా ఎంచుకొని గౌరవిస్తారు. అలా అయితే విపక్షానికి చెందిన సురేష్‌ని నియమించాలి. కానీ అధికార పక్షం తమ పార్టీకి చెందిన సభ్యుణ్ణి నియమించింది. అలా పరిమిత అధికారం, రెండు మూడు రోజుల తాత్కాలిక పదవీ కాలం ఉన్న గౌరవ స్థానం విషయంలోనే అధికార పక్షం సంకుచితంగా ఆలోచించింది. తర్వాత పాటించాల్సిన సంప్రదాయం పట్ల కూడా మౌనం దాల్చింది. అదేమిటంటే డిప్యూటీ స్పీకరు పదవి విపక్షాలకు ఇవ్వడం! అధికార పక్షం మౌనంలో నిరాకరణ అర్థమై, స్పీకరు పదవికి పోటీ నిలబెట్టింది విపక్షం. అది కూడా సంప్రదాయానికి విరుద్ధమే. ఎలాగూ గెలిచే బలం లేదు. పెద్ద మనసుతో స్పీకరు ఎన్నికను ఏకాభిప్రాయంతో జరగనిస్తే హుందాగా ఉండేది. అధికార పక్షపు వైఖరి కన్నా మెరుగైనదిగా భావించబడేది.

ఇక స్పీకరు, తన మొదటి తీర్మానంలోనే తన ఉద్దేశ్యం తెలియబర్చారు. 49 ఏళ్ళ క్రితం కాంగ్రెస్ హయాంలో అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ, దేశంలో పెట్టిన ఎమర్జెన్సీని వ్యతిరేకిస్తూ చేసిన తీర్మానం అది. ఎమర్జెన్సీని వ్యతిరేకించడం వందశాతం ఒప్పే కానీ ఇప్పుడా పని చెయ్యడం అంత ఎమర్జెన్సీయా? నిష్పక్షపాతంగా ఉండాల్సిన స్పీకరు కాంగ్రెస్ పార్టీని రక్షణలో పడేయడానికి అర్జెంటుగా పూనుకున్నట్లు ఉంది తప్పించి ఇదేమంత అత్యవసర కార్యక్రమం అనిపించలేదు.

అధికార, ప్రతిపక్షాలు పార్లమెంటులో ఏకాభిప్రాయంతో మెలగనక్కర లేదు. అలా మెలగడం మంచిది కూడా కాదు. సంప్రదాయాలనూ, ఉన్న చట్టాలనూ, ఎదుటి పక్షాలనూ, వారి వాదనలోని ఔచిత్యాన్నీ గౌరవించాలి. అంతిమంగా ప్రజల పట్ల తమ బాధ్యతను గుర్తించాలి. ఈ సారి ప్రజా తీర్పు ఇరు పక్షాలకూ పాఠాలు నేర్పింది. అధికార పక్షమైనా, ప్రతిపక్షమైనా ఏకపక్ష ధోరణులు విడిచిపెట్టి ప్రజా పక్షం వహించాలని స్పష్టం చేసింది. ఆ స్ఫూర్తి ఇరు పక్షాలూ నిలపాలి. అర్థవంతమైన చర్చలకూ, ఆరోగ్యకరమైన సంప్రదాయాలకూ మరలా పట్టంగట్టాలి.

– డా॥ డి.వి.జి. శంకరరావు; మాజీ ఎంపీ, పార్వతీపురం

నిజంగానే ఆకాశానికి నిచ్చెన!

ఆకాశానికి నిచ్చెన వేయటం అనే మాటను మనం చాలా సార్లు యాథాలాపంగా వాడుతూంటాం. ఇప్పుడు జపాన్ దేశం అదే అంశంపై దృష్టి పెట్టింది. అంతరిక్షానికి ఎలివేటర్ నిర్మించే సన్నాహాల్లో ఉంది. అదీ అక్షరాలా వంద బిలియన్ డాలర్ల అంచనా వ్యయంతో. ఈ ఎలివేటర్ ఎలా నిర్మిస్తారు? అసలు అది ఆచరణ సాధ్యమేనా అన్న అనుమానం మీకక్కరలేదు. ఎయిరో స్పేస్ అన్వేషణలో జపాన్ అగ్రగామిగా ఉంది. అలాగే రోబొటిక్స్, బయోమెడికల్ రీసెర్చి, నేచురల్ సైన్స్ విభాగంలో గ్లోబల్ లీడర్‌గా వ్యవహరిస్తోంది. ఆ దేశానికి చెందిన ఒబాయషీ కార్పొరేషన్ అనే నిర్మాణ సంస్థ ఎలివేటర్ నిర్మాణ బాధ్యతను స్వీకరించింది. దానివల్ల ఒనగూడే ప్రయోజనాలను ఆ సంస్థ ప్రకటించింది.



'భూవాతావరణం నుంచి రికార్డు వేగంతో మనుషులను అంతరిక్షంలోకి పంపవచ్చు. అంగారక గ్రహం మీదకు వెళ్లటానికి ఇప్పటి మాదిరిగా ఆరు నుంచి ఎనిమిది నెలల సమయం అక్కరలేదు. కేవలం 40 రోజుల్లోనే అక్కడకు చేరగలుగుతా'మని సంస్థ చెబుతోంది.

ఇంత పెద్ద భారీ నిర్మాణం చేపట్టటానికి తగినంత స్టీల్ అందుబాటులో లేదు. పైగా వాతావరణంలో ఒత్తిళ్లను తట్టుకోగలిగినంత దృఢత్వం ఉన్న మెటీరియల్ అవసరం అవుతుంది. అందుకే ఒబాయాషీ కార్పొరేషన్ 'కార్బన్ నానో ట్యూబ్' లను ఎంచుకుంది. అవి చుట్టచుట్టిన గ్రాఫైట్ లేయర్లు. స్టీలు కంటే గ్రాఫైట్ లేయర్లు తక్కువ బరువు ఉంటాయి. అవి విరిగిపోయే అవకాశాలు తక్కువ. కార్బన్ నానో ట్యూబ్‌ల వ్యాసం మీటరులో బిలియన్ వంతు ఉంటుంది. ఇంత వరకూ ఎవరూ కూడా రెండడుగుల కంటే పెద్ద నానో ట్యూబ్‌ను రూపొందించలేదు. ఇప్పుడు నానో ట్యూబ్‌ల ఆధారంగానే ఎలివేటర్ నిర్మాణానికి ప్రణాళికలు రూపుదిద్దుకుంటున్నాయి.

ఎలివేటర్‌లో నానో ట్యూబ్ 60 వేల మైళ్ల పొడవున ఉంటుంది. వీల్ లిఫ్ట్‌ల ద్వారా అది మనుషులను, సామగ్రిని రవాణా చేయగలుగుతుంది. వాటిని 'క్లైంబర్స్'గా పిలుస్తారు. భూమి నుంచి 22 వేల మైళ్ల ఎత్తులో స్పేస్ షిప్‌కు కార్బొ నానో ట్యూబ్‌ను అమరుస్తారు. థ్రస్టర్ దాని కొసకు జోడించబడుతుంది. అదే సమయంలో స్పేస్ షిప్ భూమికి దూరంగా జరుగుతుంది. సంస్థ వేస్తున్న అంచనాల ప్రకారం ఎనిమిది నెలల తర్వాత కార్బన్ నానోట్యూబ్ భూమి ఉపరితలానికి చేరుతుంది. అదే సమయంలో స్పేస్ షిప్ తన తుది గమ్యం 60 వేల మైళ్లకు చేరుకుంటుంది. అది ట్యూబ్‌కి కౌంటర్ వైట్‌గా ఉపయోగపడుతుంది. ఈ ట్యూబ్ ద్వారా పైకి వెళ్లి కేబుళ్లతో బలోపేతం చేస్తారు. ఇందుకోసం ముందుగా 'లో ఎర్త్ ఆర్బిట్' (ఎల్‌ఈఓ)లో స్పేస్ షిప్ నిర్మిస్తారు. ఇందుకోసం రాకెట్ల ద్వారా నిర్మాణ సామగ్రి పంపుతారు. అక్కడ నుంచి స్పేస్ షిప్ ఎలక్ట్రికల్ ప్రొపల్షన్లను ఉపయోగించుకుని కదులుతుంది. జియో స్టేషనరీ ఎర్త్ ఆర్బిట్ (జీఈఓ)కు చేరే వరకూ అది కొనసాగుతుంది.

భూమి మీద ఎర్త్ పోర్టును రెండు భాగాలుగా నిర్మించటానికి సన్నాహాలు చేస్తున్నారు. ఒకటి ఈక్వేటర్ దగ్గర, మరొకటి సముద్రం దగ్గర. ఈ రెండూ సముద్రం దిగువన టన్నెల్‌తో అనుసంధానమయి ఉంటాయి. ఎర్త్ పోర్ట్ నుంచి పైకి పాకేవాళ్లు సుమారు గంటకు 93 మైళ్ల వేగంతో కార్బొ నానో ట్యూబ్ అధిరోహిస్తారు. వాళ్లు ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్‌ని రెండున్నర గంటల్లో చేరతారని సంస్థ ప్రకటించింది.

జపాన్ సంస్థ చెబుతున్న దాని ప్రకారం, ఇప్పుడు అంతరిక్షంలో ప్రయోగాలకు పెడుతున్న ఖర్చులతో పోలిస్తే, దీనివల్ల తక్కువ ఖర్చవుతుంది. అలాగే ఇందులో ఇంధన వినియోగం లేదు. ఇదంతా సౌరశక్తి ఆధారంగా సాగుతుంది. భారీగా సోలార్ ప్యానళ్లతో జియో స్టేషన్ నిర్మిస్తారు. మానవుల పరంగా కానీ, వాతావారణ పరంగా కానీ ఎలివేటర్లకు ఉండే ముప్పుల గురించి సంస్థ ఇంకా అధ్యయనం చేపట్టలేదు. ముందుగా అనుకున్న ప్రకారం ఈ ప్రాజెక్టు వచ్చే ఏడాది అంటే 2025లో ప్రారంభం కావాలి. ప్రస్తుతం ఆర్ అండ్ బీ పైనా, పార్ట్‌నర్‌షిప్ బిల్డింగ్, ప్రమోషన్లపైనా దృష్టి పెట్టారు. ఇందుకు మరికొంత జాప్యమయ్యే అవకాశం ఉంది. ఏది ఏమైనా ఒక రోజున మానవాళి ఈ ఎలివేటర్ ద్వారా అంతరిక్షంలోకి అడుగు పెడుతుంది. అందుకు జపాన్‌ను మనం తప్పకుండా అభినందించి తీరాలి.


డా॥ పార్థసారథి చిరువోలు, వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

దొంగల దోపిడి

ఓ లక్ష్మీనృసింహ స్వామీ! నాకు చేయూతనివ్వవయ్యా! మమ దేహి కరావలంబమ్!

నాకు కనిపించడం మానేసింది. అంధత్వం ఏర్పడింది. ఎదురుగా మంచీ, చెడూ కనిపిస్తుంటే కూడా ఏది ఏదో పోల్చుకోలేకుండా ఉన్నాను. ఇది పాపం, ఇది పుణ్యం అని గుర్తించలేకపోతున్నాను. ఎటు పోతున్నానో, ఎటు పోవాలో, ఏమి కాబోతున్నదో ఏమీ పాలు పోవడం లేదు. ఇది నేత్రవ్యాధి కాదు. బుద్ధి వైకల్యం. నేను వివేకాన్ని కోల్పోయాను. నేనేం చేస్తున్నానో నాకే అర్థం కావడం లేదు!

మహాబలవంతులైన చోరులు నా మీద దాడి చేసి, అమూల్యమైన నా వివేక ధనాన్ని దొంగిలించుకెళ్లారు. ఆ దొంగలకు 'ఇంద్రియాలు' అని నామధేయం. నేను ఏమరుపాటుగా ఉండగా, వాళ్ళు నన్ను ఇట్టే లొంగదీసుకుని, భోగలాలసత అనే ఇనుప గొలుసులతో కట్టివేసి, నా వివేకాన్ని ఊచముట్టుగా దోచేశారు. దాంతో నేను అవివేకిగా, మూర్ఖుడిగా, పాప పుణ్యాల గ్రహింపు లేకుండా, నాకు ఏది మేలో నేను తెలుసుకోలేని స్థితిలో ఉన్నాను.



నాకు మిగిలిందల్లా ఇంద్రియ భోగాల మీద మితిలేని, మతిలేని వ్యామోహం. ఆ మోహాంధకారం నా జీవితాన్ని చీకటి కూపం చేసేసింది. అది ఏ గోతిలోకి లాక్కెళితే అందులో పడిపోతున్నానే తప్ప, నాకు క్షేమకరమైన మార్గాన్ని స్వయంగా ఎంచుకోగల శక్తిని, దొంగలు దోచారు. నా బుద్ధి పని చేయడం మానేసింది. విచక్షణా జ్ఞాననేత్రం మూసుకుపోయింది. నాకు చేయూత ఇచ్చి, ఈ అంధకారంలో నుంచి బయటపడే మార్గం చూపు స్వామీ!

అంధస్య, మే, హృత వివేక మహా ధనస్య/ చోరైః మహా బలిభిః ఇంద్రియ నామధేయైః/ మోహాంధకార కుహరే వినిపాతితస్య/ లక్ష్మీనృసింహ, మమ దేహి కరావలంబమ్!

– ఎం. మారుతి శాస్త్రి

క్లుప్తంగా...

30 రోజుల్లో రూ.3.49 కోట్ల ఆదాయం

యాదాద్రిలో హుండీల లెక్కింపు



లెక్కించిన నగదును పరిశీలిస్తున్న ఈఓ భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామికి హుండీల ద్వారా భారీగా ఆదాయం సమకూరింది. శ్రీస్వామి వారి హుండీల్లో భక్తులు సమర్పించుకున్న నగదు, నగలను గురువారం యాదాద్రి కొండకు దిగువన ఉన్న శ్రీసత్యనారాయణస్వామి వ్రత మండపంలో ఈఓ భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహామూర్తి ఆధ్వర్యంలో ఆలయ అధికారులు లెక్కించారు. 30 రోజుల్లో రూ.3,49,47,177 నగదు వచ్చినట్లు ఈఓ భాస్కర్‌రావు తెలిపారు. నగదుతో పాటు 166 గ్రాముల బంగారం, 4 కిలోల 750 గ్రాముల వెండి వచ్చినట్లు వివరించారు. కాగా.. అమెరికా, ఆస్ట్రేలియా, నేపాల్, సౌదీ అరేబియా, సింగపూర్, కువైట్, కతార్, ఒమన్, శ్రీలంక దేశాలకు సంబంధించిన కరెన్సీని సైతం భక్తులు స్వామివారికి సమర్పించారని ఆయన వెల్లడించారు.

ఉపాధ్యాయుడిని బంధించిన బస్తీవాసులు

మద్యం మత్తు..విద్యార్థినులతో అసభ్య ప్రవర్తనపై ఆగ్రహం



నిర్బంధంలో ఉన్న ఉపాధ్యాయుడు సుధాకర్

ఇల్లెందు (భద్రాద్రి కొత్తగూడెం): ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించాడని ఆరోపిస్తూ స్థానికులు ఆయనను గదిలో బంధించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు 2వ వార్డుకు చెందిన మండల పరిషత్ పాఠశాల ఉపాధ్యాయుడు సుధాకర్ గురువారం విధులకు హాజరయ్యారు. పాఠశాలలోని కొంతమంది విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించడంతో సదరు విద్యార్థినులు తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. వెంటనే స్థానికులతో కలసి వారు పాఠశాలకు చేరుకోగా...సుధాకర్ మద్యం మత్తులో ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఆయనను గదిలో బంధించి ఎంఈవోకు సమాచారం ఇచ్చారు. ఎంఈవో ఆదేశాల మేరకు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు యాదమ్మ అక్కడకు చేరుకుని విచారణ చేపట్టారు. పోలీసుల సాయంతో సుధాకర్‌ను ఇంటికి పంపించివేశారు. ఈ ఘటనపై యాదమ్మ నివేదిక ఇవ్వడంతో సుధాకర్‌పై సస్పెన్షన్ వేటు వేస్తూ డీఈవో ఉత్తర్వులు జారీ చేశారు.


సీఎంఆర్ గడువు 90 రోజులు పెంపు

డిఫాల్ట్ అయిన మిల్లర్లకు మరో అవకాశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో గత మూడేళ్లుగా పౌరసరఫరాల సంస్థకు కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) ఇవ్వకుండా ముప్పు తిప్పలు పెడుతున్న డిఫాల్ట్ మిల్లర్లకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. సీఎంఆర్ ఇచ్చేందుకు మరో 90 రోజుల పాటు గడువు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి, పౌరసరఫరాల సంస్థ కమిషనర్ డీఎస్ చౌహాన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ గడువు పొడిగింపు 2019-20, 2020-21 యాసంగి సీజన్‌తో పాటు 2021-22 వానాకాలం, యాసంగి, 2022-23 వానాకాలం సీజన్ సీఎంఆర్‌బకాయిలకు వర్తిస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన 90 రోజుల గడువు ఆఖరని, మరోసారి పొడిగించబోమని ఆయన స్పష్టం చేశారు. తాజాగా ఇచ్చిన గడువులోగా సీఎంఆర్ ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తే డిఫాల్టర్ మిల్లర్లపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. డిఫాల్టర్ మిల్లర్లకు ధాన్యం మిల్లింగ్‌కు అనుమతి ఇవ్వకుండా అనర్హత వేటు వేస్తామని స్పష్టం చేశారు.

కల్యాణలక్ష్మి చెక్కులు రేవంత్‌రెడ్డి ఎలా ఇస్తారు?

ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి



సాక్షి, హైదరాబాద్: తనను ప్రభుత్వం కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేయనివ్వటం లేదని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏ హోదాలో పంపిణీ చేస్తున్నారని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం ఎమ్మెల్యేలను కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేయనివ్వకపోయినందునే తాను కోర్టులో పిటిషన్ వేశానన్నారు. స్థానిక ఎమ్మెల్యే చెక్కులు పంపిణీ చేయవచ్చని కోర్టు కూడా ఆదేశాలు కూడా ఇచ్చిందని తెలిపారు. రేవంత్ రెడ్డి ఆదేశాలతో మంత్రి పొన్నం ప్రభాకర్ తనను అడ్డుకుంటున్నారని ఆరోపించారు.

ఎస్పీలకు మెజిస్టీరియల్ పవర్స్

ఆత్యయిక పరిస్థితుల్లో నిర్ణయాధికారం పోలీసులదే
- దర్యాప్తులో శాస్త్రీయత, నిపుణతకు పెద్దపీట
- పోలీసు కస్టడీ ఇకపై 15 రోజులకు పెంపు
- హిట్ అండ్ రన్ కేసుల్లో పదేళ్ల ఖైదు
- చైన్ స్నాచింగ్, ఉగ్రవాదం, మూకదాడులకు ప్రత్యేక సెక్షన్లు
- పెట్టీ కేసుల్లో నిందితులకు సామాజిక సేవ శిక్ష
- కొత్త చట్టాలపై పోలీసులకు రేపటితో ముగియనున్న శిక్షణ తరగతులు



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ఘటనలు ఉత్పన్నమైనపుడు, పరిస్థితులను తమ ఆధీనంలోకి తెచ్చుకునేందుకు పోలీసులు స్వతంత్రంగా నిర్ణయం తీసుకునే అధికారాలను కొత్త నేర న్యాయ చట్టాలు కల్పించనున్నాయి. గతంలో ఇలాంటి మెజిస్టీరియల్ పవర్స్ కేవలం జిల్లా కలెక్టర్లు, ఆర్డీవోల చేతిలో ఉండేవి. ఉదాహరణకు 144 సెక్షన్ అమలు చేయాలన్నా వారి అనుమతి తప్పనిసరి. కానీ, ఇప్పుడు ఆ అధికారాలను జిల్లాల్లో ఎస్పీలకు, నగరాల్లో డీసీపీ ర్యాంకు అధికారులకు కల్పిస్తూ కొత్త న్యాయ నేర చట్టాలను రూపొందించారు. ఈ చట్టాలు దేశవ్యాప్తంగా జూలై 1 నుంచి పూర్తిస్థాయిలో అమలుకానున్నాయి. ఈ నేపథ్యంలో కరీంనగర్ కమిషనరేట్‌తోపాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని పోలీసు యూనిట్లలో కొత్త చట్టాలపై రేపటితో శిక్షణ కార్యక్రమాలు ముగియనున్నాయి. కానిస్టేబుళ్ల నుంచి ఇన్‌స్పెక్టర్ ర్యాంకు ఆఫీసర్ల వరకు సంబంధిత యూనిట్ పరిధిలో శిక్షణ ఇస్తున్నారు. ఏసీపీ ఆపై ర్యాంకు అధికారులకు మాత్రం తెలంగాణ పోలీసు అకాడమీ (టీజీపీఏ)లో ట్రెనింగ్ ఇచ్చారు.

కొత్తగా ఏ మార్పులు రానున్నాయి?

జూలై 1 నుంచి ఐపీసీ, సీఆర్‌పీసీ, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్‌లన్నీ కాలగర్భంలో కలిసిపోనున్నాయి. ఐపీసీ స్థానంలో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), సీఆర్‌పీసీ స్థానంలో భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్), ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ స్థానంలో భారతీయ సాక్ష్యా అధియాం (బీఎస్ఏ)లు రాబోతున్నాయి. బ్రిటిష్‌కాలంలో రూపొందించిన ఈ చట్టాలను మరింత బలోపేతం చేయడం, శాస్త్రీయ పద్ధతిలో మెరుగైన విధానంలో దర్యాప్తు జరపడం, నేరాలకు కఠిన శిక్షలు విధించడం, సెక్షన్లు లేని కొన్ని రకాల నేరాలకు ప్రత్యేక సెక్షన్లు తీసుకురావడం, దర్యాప్తు కాలానికి నిర్దేశిత కాలపరిమితి విధించడం, వీలైనంత త్వరగా బాధితులకు న్యాయం చేకూర్చడం వంటి లక్ష్యాలతో కొత్త నేర న్యాయ చట్టాలకు అంకురార్పణ జరిగింది.

పెట్టీ నేరాలకు కమ్యూనిటీ సర్వీస్..

కొత్త నేర న్యాయ చట్టాల ప్రకారం.. ఇకపై చిన్నతరహా (పెట్టీ క్రైమ్స్) నేరాలకు సమాజ సేవ చేసేలా శిక్షలు రూపొందించారు. ఉదాహరణకు న్యూసెన్స్, ఈవ్ టీజింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్, కొట్లాటలు తదితర చిన్న నేరాలకు గతంలో జైలు, జరిమానాలు ఉండేవి. కొత్త చట్టాల ప్రకారం .. కమ్యూనిటీ సర్వీస్ (సమాజసేవ) చేసేలా తీర్పులు రానున్నాయి. మనిషి మానసికంగా పరివర్తన చెందేలా ఈ శిక్షలు ఉండనున్నాయి. దీనిపై ఓ పోలీసు అధికారి మాట్లాడుతూ.. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వారికి తాగి నడిపితే జరిగే నష్టాలపై ప్రచారం, ఈవ్ టీజింగ్ చేస్తే మహిళల ఔన్నత్యం తెలియజేసేలా నిందితుల్లో సామాజిక, మానసిక మార్పునకు దారి తీసేలా తీర్పులు వస్తాయని అభిప్రాయపడ్డారు.

కొత్త సెక్షన్లు.. భారీ శిక్షలు

గతంలో అనేక నేరాలను నమోదు చేసేందుకు ప్రత్యేక సెక్షన్లు ఉండేవి కావు. ఉదాహరణకు గొలుసు దొంగతనాలు, మూకదాడులు, హిట్ అండ్ రన్, ఉగ్రవాద కార్యకలాపాల్లో సరిగ్గా సరిపోయే సెక్షన్లు ఉండేవి కావు. కానీ, జూలై 1 నుంచి ఇలాంటి నేరాలకు తగిన సెక్షన్లు రాబోతున్నాయి. వాటి ఆధారంగా గతంలో విధించిన జైలు శిక్ష కంటే రెట్టింపు కూడా ఉండనుంది. ఉదాహరణకు గతంలో హిట్ అండ్ రన్ కేసుల్లో గరిష్టంగా మూడేళ్ల జైలు శిక్ష పడేది. తాజా చట్టాలతో గరిష్టంగా పదేళ్ల జైలు శిక్ష పడనుంది.

- పోలీసు కస్టడీ కూడా మరింత పెరగనుంది. గరిష్టంగా 15 రోజుల వరకు నిందితులను రిమాండ్‌లోకి తీసుకోవచ్చు. రిమాండ్ అయిన 60 రోజుల్లోగా ఎప్పుడైనా తీసుకునే వెసులుబాటు పోలీసులకు కలగనుంది.
- దర్యాప్తులో శాస్త్రీయ, నిపుణులు ఇచ్చే రిపోర్టులకు పెద్దపీట వేయనున్నారు.
- కేసు దర్యాప్తును కూడా నిర్దేశిత కాలంలో పూర్తి చేయనున్నారు. ఉదాహణకు పోక్సో, మహిళలకు సంబంధించిన కేసుల్లో 60 రోజుల్లో దర్యాప్తు పూర్తి చేయాలి. మిగిలిన కేసుల్లో 90 రోజుల్లో దర్యాప్తు పూర్తి చేసి చార్జిషీటు దాఖలు చేయాల్సి ఉంటుంది. ప్రత్యేకపరిస్థితుల్లో మాత్రం ఈ కాలపరిమితికి మినహాయింపు దక్కనుంది.
- ఇక స్టేషన్ పరిధితో సంబంధం లేకుండా ఎక్కడ నుంచైనా జీరో ఎఫ్ఐఆర్ నమోదు, ఆన్‌లైన్‌లో వారంట్ జారీ
- పిల్లలు, వికలాంగులు, వృద్ధులు, అనారోగ్యం ఉన్న వారు స్టేషన్ హాజరు నుంచి మినహాయింపు పొందవచ్చు.

ఆడపిల్ల అని తెలిసి..

అబార్షన్ చేయించిన భర్త... వైద్యం వికటించి భార్య మృతి

సూర్యాపేటటౌన్: పుట్టేది ఆడపిల్ల అని తెలిసి భార్యకు ఆర్ఎంపీతో భర్త అబార్షన్ చేయించగా, వైద్యం వికటించి ఆమె మృతిచెందింది. మృతురాలి కుటుంబసభ్యులు చెప్పిన వివరాల ప్రకారం.. చివ్వెంల మండలం ఎంజీనగర్‌తండాకు చెందిన రత్నావత్ హరిసింగ్‌కు మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం వెన్నారం గ్రామ పంచాయతీ పరిధిలోని రాముతండాకు చెందిన సుహాసిని(26)కి ఐదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కూతుళ్లు. సుహాసిని మూడోసారి గర్భవతి కాగా, స్కానింగ్‌లో ఆడపిల్ల అని తెలియడంతో హరిసింగ్ సుహాసినికి అబార్షన్ చేయించాలనుకున్నాడు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి డాక్టర్ సలహా తీసుకోగా.. ఏడో నెలలో అబార్షన్ చేయిస్తే తల్లీబిడ్డకు ప్రమాదం ఉంటుందని ఆమె చెప్పింది. అయినా, సుహాసినిని రెండురోజుల క్రితం బలవంతంగా హరిసింగ్ హుజూర్‌నగర్ ప్రాంతంలో ఓ ఆర్ఎంపీతో అబార్షన్ చేయించాడు. అయితే వైద్యం వికటించి సుహాసిని పరిస్థితి విషమంగా మారింది. మెరుగైన వైద్యం కోసం కోదాడకు, ఆపై ఖమ్మంకు అక్కడ నుంచి సూర్యాపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకురాగా ఆమె మృతి చెందింది. అయితే సుహాసిని మృతిచెందిన విషయాన్ని హరిసింగ్ కుటుంబసభ్యులకు చెప్పకుండా ఎంజీనగర్ తండాకు తీసుకొచ్చాడని, గ్రామస్తులు గమనించి విషయం తమకు తెలిపారని మృతురాలి బంధువులు ఆరోపించారు. ఈ ఘటనపై చివ్వెంల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా.. సూర్యాపేటటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని పంపించారు. అయితే పోలీసులు ఫిర్యాదు తీసుకోవట్లేదని ఆరోపిస్తూ మృతురాలి కుటుంబ సభ్యులు సూర్యాపేట టౌన్ పోలీస్ స్టేషన్ ఎదుట గురువారం ధర్నా చేపట్టారు. దీంతో పోలీసులు ఫిర్యాదు తీసుకున్నారు.

పీహెచ్‌డీ చేసిన హరిసింగ్..

హరిసింగ్ నెలరోజుల క్రితమే ఉస్మానియా యూనివర్సిటీలో పీహెచ్‌డీ పూర్తి చేసి డాక్టరేట్ అందుకున్నాడని, ఉన్నత చదువులు చదివిన వ్యక్తే బలవంతంగా అబార్షన్ చేయించి సుహాసిని మృతికి కారణమయ్యాడని మృతురాలి కుటుంబసభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలి

రాజ్యసభ సభ్యుడు కృష్ణయ్య



కాచిగూడ (హైదరాబాద్): పంచాయతీరాజ్ సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 20 నుంచి 42 శాతానికి పెంచాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. కృష్ణయ్య ఆధ్వర్యంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యంలతో కూడిన ప్రతినిధి బృందం గురువారం రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి వినతి పత్రాన్ని అందజేసింది. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ వచ్చే జూలై నెలలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించినందున వెంటనే రాష్ట్రంలో కులగణన చేపట్టి రిజర్వేషన్లను పెంచాలని కోరారు.

కూతురితో అసభ్యంగా ప్రవర్తించాడని.. భర్తను చంపిన భార్య

- పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయిన తల్లీకూతురు
- సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండలంలో ఘటన



మాణయ్య ఇంట్లో నమూనాలు సేకరిస్తున్న క్లూస్ టీమ్ ఉద్యోగి

సంగారెడ్డి: కూతురితో అసభ్యంగా ప్రవర్తించిన భర్తను భార్య గొడ్డలితో నరికి చంపింది. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్‌లో బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. సుల్తాన్‌పూర్‌కు చెందిన మన్నే మాణయ్య (45), ఇందిర దంపతులకు కూతురు సుకన్య ఉంది. ఏడాది కిందట సుకన్య భర్త చనిపోవడంతో తల్లిదండ్రుల వద్దే ఉంటోంది. మద్యానికి బానిసైన మాణయ్య ఇంట్లో ఉంటున్న కూతురిపై కన్నేశాడు. ఆమెతో అసభ్యంగా ప్రవర్తించడం మొదలు పెట్టాడు. బుధవారం అర్ధరాత్రి అతిగా మద్యం సేవించి భార్య, కూతురితో గొడవకు దిగాడు. గొడ్డలితో బెదిరిస్తూ కూతురితో అసభ్యంగా ప్రవర్తించాడు. భార్య అడ్డుకున్నా వినలేదు. దీంతో మాణయ్య చేతిలో ఉన్న గొడ్డలిని లాక్కొని ఇందిర భర్తను నరికి చంపింది. ఘటన విషయం తెలుసుకున్న జోగిపేట సీఐ అనిల్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తల్లీకూతురు ఇద్దరూ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయారు.

తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతు ఆత్మహత్యాయత్నం

తన పేర భూమి పట్టా మార్పిడి చేయాలని ఆందోళన



తహసీల్దార్ కార్యాలయం వద్ద చెట్టుపైకి ఎక్కిన రైతు భూక్య బాలు

నర్సింహులపేట: తన పేరున భూమి పట్టా మార్పిడి కావడం లేదని, అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం హజ తండాకు చెందిన భూక్య బాలు అనే రైతు గురువారం పురుగు మందు డబ్బాతో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆత్మహత్యాయత్నం చేశాడు. తండాలోని 498 సర్వేనంబర్‌లో తనకు 6 ఎకరాల భూమి ఉందని, అయితే ఆ భూమి భూక్య బాలు, భూక్య భద్రు పేరిట ఉన్నట్లు రికార్డులో చూపిస్తోందని, దానిని తన పేరిట పట్టాచేయాలని 6 నెలల నుంచి తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని బాలు అవేదన వ్యక్తం చేశాడు. తన కూతురు పెళ్లి కోసం ఆ భూమిని అమ్మానని, అయితే తన పేర పట్టాకాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నానని తెలిపాడు. ఇదిలా ఉండగా బాలుకు సంబంధించిన వ్యక్తులు కార్యాలయంలో మాట్లాడుతుండగానే ఆయన పురుగుమందు డబ్బాతో చెట్టు ఎక్కాడు. సమస్య పరిష్కరిస్తామని తహసీల్దార్ నాగరాజు హామీ ఇవ్వడంతో కిందికి దిగాడు. ఈ అంశంపై తహసీల్దార్ నాగరాజు మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఇక జెడ్పీలు, మండలాల్లో 'ప్రత్యేక' పాలన

▶ మొదటి పేజీ తరువాయి

విద్య, వైద్య, ఆరోగ్య శాఖల నుంచి ఉద్యోగుల హోదాలకు అనుగుణంగా ప్రత్యేక అధికారులుగా అదనపు బాధ్యతలు అప్పగించనున్నారు. గత ఫిబ్రవరి 1తో రాష్ట్రవ్యాప్తంగా 12,751 గ్రామపంచాయతీల కాలపరిమితి ముగిసింది. మరుసటి రోజు నుంచే పంచాయతీల్లో స్పెషల్ ఆఫీసర్ల పాలన మొదలైంది.

ఇవీ సమస్యలు...

పార్లమెంట్ ఎన్నికలు ముగిశాక, మండల, జిల్లాపరిషత్ ఎన్నికలు నిర్వహిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించినా వివిధ కారణాలు, ఆయా అంశాలపై స్పష్టత లేకపోవడంతో ప్రభుత్వపరంగా అటు గ్రామపంచాయతీలు, జిల్లా, మండల పరిషత్ ఎన్నికల నిర్వహణకు అడుగు ముందుకుపడలేదు.

- అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పన, ఉపకులాలవారీగా రిజర్వేషన్లు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టింది. అయితే ఈ వాగ్దానం అమలు చేసేందుకు రాష్ట్ర బీసీ కమిషన్ ద్వారా చర్యలు చేపట్టాల్సి ఉండగా, దీనిపై ఇంకా పూర్తిస్థాయిలో కసరత్తు మొదలు కాలేదు.
- బీసీ కులగణన ఆధారంగా గ్రామీణ స్థానికసంస్థల్లో స్థానికంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు ఖరారు చేయాలి.
- రాష్ట్రవ్యాప్తంగా కులగణనకు ఎక్కువగా సమయం పట్టే అవకాశం ఉండటంతో కొత్త ఓటర్ల జాబితా (లోక్‌సభ ఎన్నికల సందర్భంగా వెలువరించిన లిస్ట్) ప్రాతిపదికన పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖలను నోడల్ ఏజెన్సీలుగా నియమించి..ఓటర్ల జాబితా ఆధారంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల వివరాలు సేకరించాలని బీసీ కమిషన్ భావిస్తున్నట్టు తెలిసింది.
- బీసీ కమిషన్‌పరంగా ఓటర్ల జాబితా ఆధారంగా ఖరారు చేసిన రిజర్వేషన్లకు అనుగుణంగా తొమ్మిది ఉమ్మడి జిల్లాల్లో బహిరంగ విచారణ, రాష్ట్రస్థాయిలో అన్ని రాజకీయపక్షాలతో సమావేశం నిర్వహించి ముందుకు సాగొచ్చనే ఆలోచనతో ఉన్నట్టుగా తెలిసింది. దీనికి సంబంధించి కొన్ని ప్రతిపాదనలు కూడా రాష్ట్ర ప్రభుత్వానికి పంపించినట్టు సమాచారం.
- ప్రస్తుతమున్న పరిస్థితుల్లో ఓటర్ల జాబితా ప్రకారమా లేక క్షేత్రస్థాయిలో చేపట్టే సామాజిక, ఆర్థిక, కుల సర్వే ఆధారంగా ముందుకెళ్లాలా అనే దానిపై ప్రభుత్వపరంగా స్పష్టత కొరవడినట్టు చెబుతున్నారు.
- ఓటర్ల లిస్ట్‌కు అనుగుణంగా అయితే పెద్దగా శ్రమ లేకుండా త్వరగానే క్షేత్రస్థాయిలో ఆయా సామాజికవర్గాల జనాభా వివరాలు తేల్చొచని, సామాజిక, ఆర్థిక కులసర్వే అయితే సమయం ఎక్కువ పడుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.
- మరో రెండునెలల్లో (ఆగస్టు నాటికి) ప్రస్తుత బీసీ కమిషన్ చైర్మన్, సభ్యుల పదవీకాలం కూడా ముగియనుంది. ఈ నేపథ్యంలో ప్రస్తుత కమిషన్‌ద్వారానే రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తిచేస్తారా లేక కొత్త కమిషన్‌ను నియమించేదాకా ఆగుతారా అనేదానిపై స్పష్టత లేదు.

ట్రిపుల్ టెస్ట్.. మరో మెలిక

సుప్రీంకోర్టు గతంలోనే 'ట్రిపుల్ టెస్ట్'పేరిట స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు, ఇతర గ్రూపులకు రిజర్వేషన్లపై మార్గదర్శకాలు నిర్దేశించింది. స్థానిక సంస్థల పరిధిలో ఆయా గ్రూపుల వెనుకబాటుపై బీసీ కమిషన్ ద్వారా విచారణ జరపాలని, ఆయా చోట్ల ఏప నిష్పత్తిలో రిజర్వేషన్లు ఇవ్వాలనే దానిపై తేల్చాలని స్పష్టం చేసింది.

- మొత్తంగా రిజర్వేషన్లు (ఎస్సీ, ఎస్టీ, బీసీ కలిపి) 50 శాతానికి మించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పింది.
- ప్రస్తుత బీసీ కమిషన్ చైర్మన్‌వకుళాభరణం కృష్ణమోహన్‌రావు ఆధ్వర్యంలో ట్రిపుల్ టెస్ట్ మేరకు క్షేత్రస్థాయి పరిశీలనలు ఇప్పటికే పూర్తి చేసినట్టు తెలిసింది.
- ఓటర్ల జాబితా ప్రకారం కసరత్తు పూర్తి చేసి ముందుగా గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని, ఆ తర్వాత మండల, జిల్లా పరిషత్ ఎన్నికలు నిర్వహించాలనే సూచనలు బీసీ కమిషన్ నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి వెళ్లినట్టు తెలిసింది. అయితే దీనిపై ప్రభుత్వపరంగా ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం సందిగ్ధత నెలకొందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.
- రిజర్వేషన్లు ఖరారు చేసి, ఆ వివరాలు, ఎన్నికల నిర్వహణకు తేదీలు తెలియజేస్తే 15, 20 రోజుల అంతరంలో గ్రామపంచాయతీ, జిల్లా, మండల పరిషత్ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం సిద్ధంగా ఉన్నట్టు సమాచారం.



సింగరేణి అంశంపై బీఆర్ఎస్ నేతలతో సమావేశమైన కేటీఆర్

సింగరేణి ప్రైవేటీకరణకే బొగ్గు గనుల వేలం

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- రాష్ట్ర ముఖ్యమంత్రి బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారు
- సింగరేణి ప్రాంత నేతలతో కేటీఆర్ భేటీ

సాక్షి, హైదరాబాద్: సింగరేణిని ప్రైవేటీకరించేందుకే తెలంగాణ బొగ్గు గనులను కేంద్ర ప్రభుత్వం వేలం వేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు ఆరోపించారు. కేంద్రంతో రాష్ట్ర ముఖ్యమంత్రి కుమ్మక్కయి బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. గురువారం ఆయన సింగరేణి ప్రాంత మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ సీనియర్ నాయకులు, బొగ్గు గని కార్మిక సంఘం నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సింగరేణి విస్తరించి ఉన్న ఆరు జిల్లాలకు చెందిన నాయకులతో సుదీర్ఘంగా చర్చించారు. బొగ్గు గనుల వేలంపై కార్మికులు, వారి కుటుంబాల ప్రతిస్పందన ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ లాభసాటిగా ఉన్న సింగరేణికి.. బొగ్గు గనులు కేటాయించకుండా నష్టాల్లోకి నెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఆ తర్వాత సింగరేణి నష్టాల్లో ఉందంటూ పెట్టుబడుల ఉపసంహరణ కోసం రంగం సిద్ధం చేస్తున్నారని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు కలిసి నవ్వుకుంటూ సింగరేణి గనులను అమ్మకానికి పెట్టినట్లు ప్రతి సింగరేణి కార్మికుని అర్థమవుతోందని అన్నారు. సకల జనుల సమ్మె సమయంలో సింగరేణి ప్రాధాన్యాన్ని దేశం గుర్తించిందని, సమ్మె కాలంలో ఐదు దక్షిణాది రాష్ట్రాలు అతలాకుతలమయ్యాయని గుర్తు చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల బలోపేతం అనేది బీఆర్ఎస్ పార్టీ విధానమని చెప్పారు. అందుకే ప్రైవేటు కంపెనీలు ఎంత ఒత్తిడి తెచ్చినా పట్టించుకోకుండా రైతు బీమాను ఎల్ఐసీ ద్వారా ఇప్పించామని గుర్తు చేశారు. అలాగే విద్యుత్ ప్రాజెక్టులను కట్టే బాధ్యతలను బీహెచ్ఈఎల్‌కి అప్పగించామని తెలిపారు. కేసీఆర్ అధికారంలో ఉన్నన్ని రోజులు తెలంగాణ బొగ్గు గనులను వేలం వేయకుండా ఆపగలిగామని వివరించారు. కేంద్ర ప్రభుత్వం బలవంతంగా రెండు బొగ్గు గనులను ప్రైవేట్ సంస్థలకు కేటాయించినప్పటికీ.. తట్టెడు తెలంగాణ బొగ్గును ఎత్తకుండా విజయవంతంగా అడ్డుకున్నట్లు చెప్పారు. కానీ కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు కలిసి తెలంగాణ బొగ్గు గనులను వేలానికి పెట్టాయన్నారు. సింగరేణి కష్టాల్లో ఉంటే కార్మికులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందన్న విషయం మర్చిపోతున్నారని అన్నారు.

సింగరేణి ప్రైవేటీకరణను అడ్డుకుంటాం

- జూలై 1 నుంచి దశలవారీగా ఆందోళనలు
- టీజీబీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజిరెడ్డి

సాక్షి, హైదరాబాద్: సింగరేణిని ప్రైవేటీకరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న ప్రయత్నాలకు నిరసనగా దశలవారీగా పోరాటం చేయాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) నిర్ణయించిందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి తెలిపారు. 135 ఏళ్ల చరిత్ర కలిగి, లాభాల్లో నడుస్తున్న ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణిని ప్రైవేటు వ్యక్తులకు ఇస్తే బొగ్గు ఎలా తీస్తారని ఆయన ప్రశ్నించారు. 40 వేల మంది కార్మికులు ఉన్న సింగరేణి సంస్థ తెలంగాణ ఆస్తి అని అన్నారు. గురువారం ఆయనతో పాటు పలువురు కార్మిక నాయకులు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో తెలంగాణ భవన్‌లో సమావేశమయ్యారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడారు. సింగరేణిని కాపాడుకునేందుకు ఎలాంటి పోరాటానికైనా సిద్ధమని రాజిరెడ్డి అన్నారు. తెలంగాణ వ్యాప్తంగా నిరసనలు తెలియజేస్తూ ప్రైవేటీకరణను అడ్డుకుంటామని, మరోవైపు అసెంబ్లీలో కేసీఆర్ ద్వారా ఒత్తిడి తెస్తామని, కోల్‌బెల్ట్ ఎమ్మెల్యేలను కలిసి వినతిపత్రాలు ఇస్తామని వివరించారు. అవసరమైతే ఢిల్లీలో ధర్నా చేస్తామని చెప్పారు. సింగరేణి ప్రాంతంలోని బొగ్గు బ్లాకులను సింగరేణికి మాత్రమే ఇవ్వాలని, ఇతరులు ఎవరు వచ్చినా బొగ్గుబావుల్లో అడుగు పెట్టనివ్వబోమని హెచ్చరించారు. తెలంగాణ గడ్డపై ఉన్న ప్రతి బొగ్గు పెళ్ల సింగరేణికే దక్కుతుందని స్పష్టం చేశారు. సింగరేణి తెలంగాణ ప్రజల సంస్థ అని, టెక్నికల్‌గా మాత్రమే సంస్థలో కేంద్ర ప్రభుత్వానికి వాటా ఉందని అన్నారు. కోల్ ఇండియాలో వేలం లేకుండానే బొగ్గు బావులను తీసుకుంటున్నారని, సింగరేణికి కూడా వేలం లేకుండా బొగ్గు బ్లాకులను కేటాయించాలని డిమాండ్ చేశారు. సింగరేణి ప్రైవేటీకరణలో భాగంగానే వేలం వేస్తున్నారని, శ్రావణపల్లి బ్లాక్‌ను సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు కాపు కృష్ణ, నూనె కొమురయ్య, మాదాసి రామ్మూర్తి, సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆందోళనలు ఇలా..
- జూలై1న నల్లబ్యాడ్జీలతో నిరసనలు, వినతులు
- 3న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మలు దహనం
- 6న జీఎం కార్యాలయం ఎదుట ధర్నా
- 9న గోదావరి ఖనిలో ధర్నా

బతుకు చితికి.. గూడు చెదిరి... వలస బాట

ప్రపంచవ్యాప్తంగా 12 కోట్ల మంది శరణార్థులు

40 శాతం పొట్ట చేత పట్టుకుని విదేశాలకు	ఉక్రెయిన్, గాజా యుద్ధాలతో పెరిగిన శరణార్థుల సంఖ్య	యుద్ధం, హింసతో చితుకుతున్న బతుకులు

పుట్టిన నేల.. పెరిగిన ఊరు.. ఇవే మనిషి అస్తిత్వం. కానీ యుద్ధం, హింస ప్రజలను నిరాశ్రయులను చేస్తోంది. అధికార దాహం, అహంకార ధోరణి కోట్ల మందిని సొంత నేలకే పరాయివాళ్లుగా మారుస్తోంది. గత పదేళ్లలో ప్రపంచ జనాభాలో ప్రతి 69 మందిలో ఒకరు చొప్పున ఏకంగా 12 కోట్ల మంది నిరాశ్రయులయ్యారు. వీరిలో చాలామంది తలదాచుకునేందుకు కూడా దిక్కులేక శరణార్థులుగా మారాల్సి వస్తోంది. ప్రాణాలను చేతబట్టుకుని విదేశాల బాట పట్టాల్సిన దుస్థితి దాపురిస్తోంది...!

– సాక్షి, నేషనల్ డెస్క్



తుర్కియే వైపుగా భారీగా వలస వెళ్తున్న సిరియా ప్రజలు (ఫైల్)

సంఘర్షణ, హింస, మానవ హక్కుల ఉల్లంఘనల ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా 11.7 కోట్ల మందికి పైగా నిరాశ్రయులైనట్టు ఐక్యరాజ్య సమితి శరణార్థుల హై కమిషన్ (యూఎన్‌హెచ్‌సీఆర్) వెల్లడించింది. వీరిలో 6.83 కోట్ల మంది సంఘర్షణలు, ఇతర సంక్షోభాల కారణంగా సొంత దేశాల్లోనే ఇతర ప్రాంతాలకు చెదిరిపోయారు. దాదాపు 4.5 కోట్ల మంది పొట్ట చేత పట్టుకుని శరణార్థులుగా విదేశాలకు వలస వెళ్లారు. 2024 తొలి నాలుగు నెలల్లో ఇది మరింత పెరిగింది.

పదేళ్లకోసారి రెట్టింపు..

రెండో ప్రపంచ యుద్ధం తర్వాత 1951లో ఐరోపాలోని శరణార్థుల హక్కులను పరిరక్షించేందుకు ఐక్యరాజ్యసమితి శరణార్థుల సమావేశాన్ని ఏర్పాటు చేసింది. 1967లో శరణార్థుల కన్వెన్షన్ ఆవిర్భవించినప్పుడు 20 లక్షల మంది శరణార్థులున్నారు.

- 1980 నాటికి కోటికి చేరిన శరణార్థులు
- 1990 నాటికి రెండు కోట్లకు చేరిన సంఖ్య
- 2021 చివరి నాటికి 3 కోట్లను మించిన శరణార్థులు
- తాజాగా 11 కోట్లు దాటేసిన వైనం

2020 నుంచి వేగంగా...

- 2022లో రష్యా, ఉక్రెయిన్ యుద్ధం మొదలయ్యాక 2023 చివరి నాటికి 60 లక్షల మంది ఉక్రేనియన్లు నిరాశ్రయులయ్యారు. వీరిలో చాలామంది దేశం విడిచి వెళ్లారు.
- 2023లో సుడాన్‌లో సైన్యం, ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్ మధ్య ఘర్షణలు శరణార్థుల సంఖ్యను 10.5 లక్షలు పెంచాయి.
- ఇక ఇజ్రాయెల్ దాడులతో గాజాలో గతేడాది చివరి మూడు నెలల్లో 10.7 లక్షల మంది నిరాశ్రయులై వలస వెళ్లారు.

ఎక్కడి నుంచి వస్తున్నారు?

ప్రపంచవ్యాప్తంగా నమోదైన దాదాపు 4.5 కోట్ల మంది శరణార్థులలో దాదాపు మూడొంతులు (72 శాతం) ఐదు దేశాల నుంచే వచ్చారు.

అఫ్గానిస్తాన్	64 లక్షలు
సిరియా	64 లక్షలు
వెనెజులా	61 లక్షలు
ఉక్రెయిన్	60 లక్షలు
పాలస్తీనా	60 లక్షలు

ఆశ్రయమిస్తున్న దేశాలు?

- ప్రపంచవ్యాప్తంగా దాదాపు 70 శాతం మంది శరణార్థులు తమ సమీప పొరుగు దేశాల్లోనే బతుకీడుస్తున్నారు.
- ఇరాన్, పాకిస్తాన్లోని శరణార్థులందరూ అఫ్గాన్లే.
- టర్కీలో ఎక్కువ మంది శరణార్థులు సిరియన్లు.

దేశం	శరణార్థులు
ఇరాన్	38 లక్షలు
తుర్కియే	33 లక్షలు
కొలంబియా	29 లక్షలు
జర్మనీ	26 లక్షలు
పాకిస్తాన్	20 లక్షలు

ఎమర్జెన్సీ.. చీకటి అధ్యాయం

రాజ్యాంగంపైనే దాడి: రాష్ట్రపతి

ఎమర్జెన్సీ. నిన్నటికి నిన్న లోక్‌సభ స్పీకర్‌గా ఎన్నికవుతూనే ఓం బిర్లా నోట సభలో విన్పించిన మాట. గురువారం పార్లమెంటు ఉభయ సభల సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేసిన ప్రసంగంలోనూ ప్రముఖంగా చోటుచేసుకుంది! ఇందిరాగాంధీ హయాంలో 1975లో విధించిన ఎమర్జెన్సీని దేశ చరిత్రలోనే అత్యంత చీకటి అధ్యాయంగా, రాజ్యాంగంపై దాడిగా రాష్ట్రపతి అభివర్ణించారు. "స్వతంత్ర భారత చరిత్రలో రాజ్యాంగంపై ఇలాంటి దాడులు జరుగుతూ వచ్చాయి. 1975 జూన్ 25న విధించిన ఎమర్జెన్సీపై దేశమంతా భగ్గుమంది. అంతిమంగా రాజ్యాంగ వ్యతిరేక శక్తులపై దేశం విజయం సాధించి ప్రగతి పథాన సాగుతోంది" అన్నారు. "మోదీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని కేవలం పాలనా మాధ్యమంగా మాత్రమే చూడటం లేదు. దాన్ని ప్రజల చేతనలో అవిభాజ్య భాగంగా మార్చేందుకు చర్యలు చేపడుతోంది. నవంబర్ 26ను రాజ్యాంగ దినోత్సవంగా జరుపుకోవడం వంటి చర్యలు అందులో భాగమే" అని ఆమె పేర్కొన్నారు. రాష్ట్రపతి ప్రసంగంలో ఎమర్జెన్సీ అంశాన్ని చొప్పించడాన్ని కాంగ్రెస్ తీవ్రంగా ఖండించింది. మోదీ 3.0 ప్రభుత్వం కొలువుదీరినప్పటి నుంచీ ఎమర్జెన్సీపై తరచూ విమర్శలు చేస్తూ వస్తోంది. ప్రధాని మోదీ జూన్ 24న మాట్లాడుతూ ఎమర్జెన్సీని దేశ పార్లమెంటరీ చరిత్రలో చెరగని మచ్చగా అభివర్ణించారు. ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్ కూడా బుధవారం గాజియాబాద్‌లో ఒక కార్యక్రమంలో ఎమర్జెన్సీపై విమర్శలు గుప్పించారు. ఓం బిర్లా స్పీకర్‌గా ఎన్నికవుతూనే ఎమర్జెన్సీని నిరసిస్తూ లోక్‌సభలో ఏకంగా తీర్మానమే చేసి రాజకీయ దుమారానికి తెర తీశారు.



గురువారం పార్లమెంట్ సంయుక్త సమావేశంలో ప్రసంగిస్తున్న రాష్ట్రపతి ముర్ము. వేదికపై రాజ్యసభ చైర్మన్ ధన్‌ఖడ్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా

న్యూఢిల్లీ: ఉభయ సభలనుద్దేశించి ప్రసంగించేందుకు ముర్ము గుర్రపు బగ్గీలో సంప్రదాయ రీతిలో పార్లమెంటు ప్రాంగణానికి చేరుకున్నారు. గజ ద్వారం వద్ద ధన్‌ఖడ్, ప్రధాని మోదీ, బిర్లా, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజు ఆమెకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ముర్ము తన ప్రసంగంలో మోదీ 3.0 ప్రభుత్వ ప్రాథమ్యాలను ఒక్కొక్కటిగా వివరించారు. ''ప్రపంచంలోనే అతి పెద్ద సార్వత్రిక ఎన్నికల విజయవంతంగా ముగిసింది. ప్రభుత్వానికి స్పష్టమైన మెజారిటీ ఇవ్వడం ద్వారా దేశ ప్రజలు వరుసగా మూడోసారి సుస్థిరతకే పట్టం కట్టారు'' అన్నారు. ''లోక్‌సభ సభ్యులుగా మీరంతా ప్రజల నమ్మకం చూరగొని నెగ్గారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నా'' అన్నారు. భారత్ తీసుకోబోయే ప్రతి నిర్ణయాన్ని ప్రపంచమంతా వేయి కళ్లతో గమనిస్తోందన్న విషయాన్ని సభ్యులు గుర్తెరగాలన్నారు. పరీక్ష పేపర్ల లీకేజీపై నిష్పాక్షిక దర్యాప్తు జరిపి దోషులను కఠినంగా శిక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్రపతి పేర్కొన్నారు. దీనిపై పార్టీలకు అతీతంగా దేశవ్యాప్తంగా గట్టి చర్యలు తీసుకోవాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. ''ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, విశ్వసనీయత చాలా ముఖ్యం. ఈ దిశగా పరీక్షల విధానంలోనే సమూల సంస్కరణలకు కేంద్రం సిద్ధమవుతోంది'' అని చెప్పారు. ఐఐటీ, ఐఐఎంలను బలోపేతం చేసి వాటిల్లో సీట్లను పెంచే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఈ సందర్భంగా విపక్ష సభ్యులంతా 'నీట్, నీట్' అంటూ జోరుగా నినాదాలు చేశారు. పలు ఇతర అంశాలపై రాష్ట్రపతి వ్యాఖ్యలు ఆమె మాటల్లోనే...

పరీక్షల విధానంలో సంస్కరణలు

- దేశ ప్రజాస్వామ్య వ్యవస్థ విశ్వసనీయతను దెబ్బ తీసేందుకు జరుగుతున్న ప్రతి ప్రయత్నాన్నీ ఐక్యంగా తిప్పికొట్టాల్సిన అవసరం చాలా ఉంది. ఈవీఎంలు సుప్రీంకోర్టు నుంచి ప్రజా కోర్టు దాకా అన్ని పరీక్షల్లోనూ నెగ్గి విశ్వసనీయతను నిరూపించుకున్నాయి.
- కొన్నాళ్లుగా భారత్ అనుసరిస్తున్న సమర్థమైన విదేశీ విధానం ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తోంది. ప్రతి అంతర్జాతీయ సమస్యపైనా తక్షణం స్పందిస్తూ క్రమంగా విశ్వబంధుగా పరిణతి చెందుతోంది. భారత్–మధ్య ప్రాచ్యం –యూరప్ ఆర్థిక కారిడార్ 21వ శతాబ్దంలో అతి పెద్ద గేమ్ చేంజర్‌గా మారనుంది.
- ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించడం వేరు. పార్లమెంటు కార్యకలాపాలను ఆటంకపరచడం వేరు. ఇది పూర్తిగా తప్పుడు చర్య. పార్లమెంటు సజావుగా సాగినప్పుడే ప్రజా సమస్యలపై ఆరోగ్యకరమైన చర్చలు సాధ్యమని అన్ని పార్టీలూ గుర్తుంచుకోవాలి.
- కశ్మీర్ లోయలో ఈసారి రికార్డు స్థాయి పోలింగ్ జరిగింది. తద్వారా శత్రు దేశాలకు కశ్మీరీ ప్రజలు దిమ్మతిరిగే జవాబిచ్చారు. ఆర్టికల్ 370 రద్దుతో రాజ్యాంగం పూర్తిస్థాయిలో అమల్లోకి వచ్చిన తర్వాత కశ్మీర్లో పరిస్థితులు ఎంతగానో మెరుగుపడుతున్నాయి.
- మౌలికాభివృద్ధికి కేంద్రం పెద్దపీట వేస్తోంది. దేశ ఉత్తర, దక్షిణ, తూర్పు దిశల్లో బులెట్ ట్రైన్ కారిడార్ల సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేస్తోంది.
- తప్పుడు సమాచార వ్యాప్తి ప్రపంచం ఎదుర్కొంటున్న అతి పెద్ద సమస్య. దేశ ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచేందుకు విభజన శక్తులు దీన్ని ఆయుధంగా వాడుతున్నాయి. ఈ బెడద నివారణకు కొత్త మార్గాలు వెదకాల్సిన అవసరం చాలా ఉంది.
- దేశ విభజనతో సర్వం కోల్పోయిన వారు గౌరవప్రదమైన జీవితం గడిపేందుకు పౌరసత్వ సవరణ చట్టం దోహదపడుతుంది.
- శిక్షించడమే ప్రధానోద్దేశంగా రూపొందిన బ్రిటిష్ వలస పాలన నాటి శిక్షా స్మృతులు స్వాతంత్ర్యం వచ్చాక కూడా ఏడు దశాబ్దాల పాటు కొనసాగడం దారుణం. న్యాయం శిక్షగా మారకూడదన్నదే లక్ష్యంగా, భారతీయతే మూలమంత్రంగా నూతన నేర న్యాయ చట్టాల రూపకల్పన జరిగింది. జూలై 1 నుంచి అవి ప్రజలకు సరైన న్యాయాన్ని సత్వరంగా అందించనున్నాయి.
- అభివృద్ధితో పాటు దేశ ఘన వారసత్వానికీ మోదీ ప్రభుత్వం సమ ప్రాధాన్యం ఇవ్వనుంది. మహిళల సారథ్యంలో అభివృద్ధికి కట్టుబడి ఉంది. చట్టసభల్లో వారికి 33 శాతం రిజర్వేషన్ల వంటి నిర్ణయాలు ఈ దిశగా ముందడుగులు.
- రక్షణ రంగంలో భారీ సంస్కరణలు మరింత వేగంతో కొనసాగుతాయి. పదేళ్లలో రక్షణ ఎగుమతులు 18 రెట్లు పెరిగాయి. అదే సమయంలో గతేడాది మన రక్షణ కొనుగోళ్లలో 70 శాతం స్వదేశీ సంస్థల నుంచే జరిగింది! ఈ రంగంలో మేకిన్ ఇండియాకు ప్రాధాన్యం పెరగనుంది.
- సుపరిపాలనకు ప్రభుత్వం పెద్దపీట వేయనుంది. పలు ప్రభుత్వోద్యోగాల నియామక ప్రక్రియలో ఇంటర్వ్యూల రద్దు, స్వీయ ధ్రువీకరణ వంటి నిర్ణయాలు ఇందుకు ఉదాహరణలు.
- సంస్కరణల పథాన్ని వేగవంతం చేసే దిశగా వచ్చే బడ్జెట్‌లో చరిత్రాత్మక చర్యలుంటాయి.

ప్రభుత్వ స్క్రిప్టు.. తప్పుల తడక

రాష్ట్రపతి ప్రసంగంపై విపక్షాల ఫైర్ • నిరాకరణ ధోరణిలో మోదీ: ఖర్గే

న్యూఢిల్లీ: రాష్ట్రపతి ప్రసంగం పూర్తిగా అబద్ధాలమయమని విపక్షాలు విమర్శించాయి. ''అది పూర్తిగా ప్రభుత్వ స్క్రిప్టు. తప్పుల తడక. చివరికి ఇందులో కూడా ఎమర్జెన్సీ ప్రస్తావన తేవడం సిగ్గుచేటు! నిజానికి మోదీ హయాంలో పదేళ్లుగా దేశమంతటా అప్రకటిత ఎమర్జెన్సీ సాగుతోంది'' అంటూ దుయ్యబట్టాయి. ప్రసంగం పాత చింతకాయ పచ్చడంటూ కాంగ్రెస్ పెదవి విరిచింది. ''బీజేపీకి మెజారిటీ ఇవ్వకపోవడం ద్వారా మోదీని ప్రజలు తిరస్కరించారు. కానీ ఈ వాస్తవాన్ని అంగీకరించేందుకు ఆయన సిద్ధంగా లేరు. నిరంతర నిరాకరణ ధోరణిలో ఉన్నారు. అందుకే అంతా బాగుందని దేశాన్ని నమ్మించేందుకు ఏకంగా రాష్ట్రపతితోనే పచ్చి అబద్ధాలు చెప్పించారు'' అంటూ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఎద్దేవా చేశారు. ధరల పెరుగుదల, మణిపూర్ హింస, పెరుగుతున్న రైలు ప్రమాదాలు, దళితులపై దాడులు, ఉగ్రవాద దాడుల వంటి అతి ప్రధాన సమస్యల ప్రస్తావన కూడా ఆమె ప్రసంగంలో లేదంటూ ఆక్షేపించారు. విపక్ష నేతలు అఖిలేశ్ యాదవ్ తదితరులు పార్లమెంటు ప్రాంగణంలో మీడియాతో మాట్లాడారు. ''అభివృద్ధి గురించి ప్రసంగంలో చెప్పినవన్నీ పచ్చి అబద్ధాలే. 303 నుంచి 240 సీట్లకు దిగజారి మెజారిటీ కోల్పోయామన్న వాస్తవాన్ని మోదీ సర్కారు మర్చిపోయింది'' అంటూ ఎద్దేవా చేశారు. అరవింద్ కేజ్రీవాల్‌ను సీబీఐ అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ రాష్ట్రపతి ప్రసంగాన్ని ఆప్ బాయ్‌కాట్ చేసింది.

ఎమర్జెన్సీ ప్రస్తావన ఎందుకు?

న్యూఢిల్లీ: పార్లమెంట్ తొలి సెషన్ సందర్భంగా లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా 'ఎమర్జెన్సీ'ని ప్రస్తావిస్తూ తీర్మానం చేయడాన్ని విపక్షనేత రాహుల్ గాంధీ మరోమారు తీవ్రంగా తప్పుబట్టారు. బిర్లాను గురువారం మర్యాదపూర్వకంగా కలిసిన సందర్భంగా ఈ అంశాన్ని ప్రస్తావించారు. రాజకీయ అంశమైన 'ఎమర్జెన్సీ'ని ప్రస్తావించకుండా ఉండాల్సింది అన్నారు. ''రాహుల్, ఇండియా కూటమి నేతలు స్పీకర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. నేతలంతా పార్లమెంటరీ వ్యవహారాలు మాట్లాడుకున్నారు. అందులో భాగంగానే ఎమర్జెన్సీ అంశమూ ప్రస్తావనకు వచ్చింది. రాహుల్ ఈ అంశాన్ని ప్రధానంగా ప్రస్తావించారు. రాజకీయ అంశాన్ని సభలో లేవనెత్తకుండా నివారిస్తే బాగుండేదన్నారు'' అని

స్పీకర్‌తో భేటీ సందర్భంగా రాహుల్

ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ వెల్లడించారు. ఈ అంశంపై కేసీ వేణుగోపాల్ విడిగా స్పీకర్‌కు ఒక లేఖ రాశారు. 'పార్లమెంట్ విశ్వసనీయతను తీవ్రంగా దెబ్బతీసే అంశమిది. స్పీకర్‌గా మిమ్మల్ని ఎన్నుకున్న శుభతరుణంలో అర్ధశతాబ్దకాలంనాటి ఎమర్జెన్సీ అంశాన్ని మీరు సభ ముందుకు తేవడం విపక్షాలన్నింటినీ దిగ్భ్రాంతికి గురిచేసింది. స్పీకర్ ఎన్నిక, బాధ్యతల స్వీకరణ వేళ రాజకీయాలు మాట్లాడటం పార్లమెంట్ చరిత్రలో ఇదే తొలిసారి. నూతన స్పీకర్‌గా ఎన్నికయ్యాక చేపట్టాల్సిన తొలి విధులకు ఇలాంటి చర్యలు తీవ్ర విఘాతం కల్గిస్తాయి. పార్లమెంటరీ సంప్రదాయాలను అపహాస్యం చేస్తూ సాగిన ఈ ఉదంతంపై మేం ఆందోళన చెందాం'' అని వేణుగోపాల్ ఆ లేఖలో పేర్కొన్నారు. ''1975 జూన్ 25న అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ దేశంలో 'అత్యయిక స్థితి' అమల్లోకి తెచ్చారు. చాలా మంది ప్రతిపక్ష నేతలను ప్రభుత్వం జైళ్లలో పడేసింది. మీడియాపై ఆంక్షలు విధించింది. న్యాయ వ్యవస్థపై నియంత్రణ చట్రం బిగించింది. ఎమర్జెన్సీ విధించి 49 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ సభ అంబేడ్కర్ రాజ్యాంగాన్ని పరిరక్షించడంతోపాటు దాని విలువలకు కట్టుబడి ఉందని నేను హామీ ఇస్తున్నా'' అని నూతన స్పీకర్ బిర్లా బుధవారం పేర్కొన్నారు. స్పీకర్ ఆ తీర్మానాన్ని చదువుతున్న సందర్భంలో కాంగ్రెస్ సహా విపక్ష నేతలంతా నిలబడి తీవ్ర నిరసన వ్యక్తం చేయడం తెలిసిందే.

మంత్రులను పరిచయం చేసిన ప్రధాని

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గురువారం తన మంత్రివర్గ సభ్యులను ఎగువ సభ రాజ్యసభకు పరిచయం చేశారు. స్పీకర్ ఎన్నిక అనంతరం బుధవారం మోదీ తన మంత్రివర్గాన్ని లోక్‌సభకు పరిచయం చేసిన విషయం తెల్సిందే. రాజ్యసభ చైర్మన్ ధన్‌ఖడ్..'ఆరు దశాబ్దాల విరామం తర్వాత వరుసగా మూడోసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ప్రధాని మోదీని సభకు పరిచయం చేస్తున్నందుకు సంతోషంగా ఉంది'అని పేర్కొనడంతో సభ్యులు డెస్క్‌లపై చరుస్తూ, చప్పట్లతో హర్షం వ్యక్తం చేశారు. అనంతరం చైర్మన్ ధన్‌ఖడ్ సూచన మేరకు ప్రధాని మోదీ మంత్రివర్గ సహచరులను సభకు పరిచయం చేశారు. సభాధ్యక్షుడిగా కేంద్ర మంత్రి జేపీ నడ్డాను నియమిస్తున్నట్లు ధన్‌ఖడ్ ప్రకటించారు. అనంతరం సభ్యులనుద్దేశించి ధన్‌ఖడ్ ప్రసంగిస్తూ..ప్రజాస్వామ్యం పరిఢవిల్లేందుకు అందరం కలిసి పనిచేద్దామంటూ పిలుపునిచ్చారు. కొత్తగా ఎన్నికైన, నామినేట్ అయిన 61 మంది సభ్యులకు ఆయన అభినందనలు తెలిపారు.

జాతీయ గీతం వినిపిస్తుండగానే...

నడుస్తూ పక్కకు వెళ్లిపోయిన స్పీకర్ ఓం బిర్లా

న్యూఢిల్లీ: పార్లమెంటులో గురువారం జాతీయగీతం ఆలపిస్తుండగా లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఉన్నచోటనే నిలబడి పోకుండా.. నడుచుకుంటూ వెళ్లారు. పోడియంపై స్పీకర్ కుర్చీ వెనకనుండి ముందుకు నడుచుకుంటూ వచ్చి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సరసన నిలుచున్నారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. జాతీయ గీతాన్ని అవమానించడమేనని విపక్ష నేతలు ధ్వజమెత్తారు. కాంగ్రెస్ నాయకురాలు సుప్రియా శ్రీనేత్ ఈ వీడియోను ఎక్స్‌లో షేర్ చేస్తూ.. 'స్పీకర్ సార్ జాతీయ గీతం ఆలపిస్తుంటే మీరు ఉన్న చోటనే నిలబడిపోవాలి. మీ చర్య జాతీయ గీతాన్ని అవమానించడమే' అని పేర్కొన్నారు.

ముయిజ్జుపై చేతబడి చేశారని మంత్రుల అరెస్ట్

మాలె: మాల్దీవుల అధ్యక్షుడు మహ్మద్ ముయిజ్జుపై చేతబడి చేయించారనే ఆరోపణలపై అధికారులు ఇద్దరు మంత్రులను అరెస్ట్ చేశారు. పర్యావరణ శాఖ సహాయ మంత్రి షమ్నాజ్ సలీం, ఆమె మాజీ భర్త, అధ్యక్ష కార్యాలయంలో మంత్రిగా ఉన్న ఆదాం రమీజ్‌లతోపాటు మరో ఇద్దరు పోలీసుల అదుపులో ఉన్నట్లు స్థానిక మీడియా తెలిపింది. వీరిని కోర్టు ఏడు రోజుల రిమాండ్‌కు పంపిందని పేర్కొంది. మంత్రి పదవి నుంచి షమ్నాజ్‌ను తొలగించినట్లు వెల్లడించింది. గత ఐదు నెలలుగా రమీజ్ కనిపించడం లేదని కూడా తెలిపింది.

90 నిమిషాలు.. నో నోట్స్

బైడెన్– ట్రంప్ డిబేట్ నేడే

అట్లాంటా: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఇద్దరు ప్రధాన అభ్యర్థుల మధ్య శుక్రవారం తొలి చర్చ జరగనుంది. భారత కాలమానం ప్రకారం ఉదయం 6:30 గంటలకు సీఎన్ఎన్ ఛానల్‌లో ప్రత్యక్ష ప్రసారం ఉంటుంది. అధ్యక్షుడు, డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థి జో బైడెన్ (81), రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ (78)ల మధ్య అట్లాంటాలోని సీఎన్ఎన్ స్టూడియోలో 90 నిమిషాలు ముఖాముఖి చర్చ జరగనుంది. వారికి ఎలాంటి నోట్స్‌ను అనుమతించరు. వయసురీత్యా తనపై నెలకొన్న సందేహాలను తొలగించి, మరో నాలుగేళ్లు అధ్యక్షుడిగా సమర్థంగా వ్యవహరిస్తానని నిరూపించుకోవడానికి బైడెన్‌కు ఇదొక అవకాశం. అలాగే ఓటర్లను మెప్పించేందుకు ట్రంప్‌కు కూడా!

ఎన్‌టీఏ ఆఫీసుకు తాళం

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అనుబంధ ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలు గురువారం ఢిల్లీలోని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ కార్యాలయంలోకి దూసుకెళ్లారు. నీట్, యూజీసీ–నెట్ పరీక్షల్లో అవకతవకలకు నిరసనగా ఎన్‌టీఏ కార్యాలయానికి తాళం వేశారు. ఎన్‌టీఏను మూసివేయాలంటూ నినాదాలు చేశారు. లేదంటే దేశవ్యాప్తంగా ఎన్‌టీఏ కార్యాలయాలకు కూడా తాళాలు వేస్తామని హెచ్చరించారు. ఎన్‌టీఏ నిర్లక్ష్యం, చేతకానితనం ఫలితంగానే దేశవ్యాప్తంగా లక్షలాదిగా విద్యార్థులు నష్టపోయారని విమర్శించారు. పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

ఓఎంఆర్ షీట్ల ఫిర్యాదులపై కాలపరిమితి ఉందా: సుప్రీం

సాక్షి, న్యూఢిల్లీ: నీట్ యూజీ ఓఎంఆర్ షీట్లకు సంబంధించి విద్యార్థుల ఫిర్యాదుల పరిష్కారానికి కాలపరిమితి ఉందా అని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ)ని సుప్రీంకోర్టు గురువారం ప్రశ్నించింది. అన్ని ఓఎంఆర్ షీట్లు అప్‌లోడ్ చేసి అందుబాటులో ఉంచామని ఎన్‌టీఏ తరపు న్యాయవాది వివరించారు. కాలపరిమితి వివరాలతో కౌంటరు వేయాలని ఎన్‌టీఏను కోర్టు ఆదేశించింది.

'నీట్–యూజీ' కేసులో ఇద్దరి అరెస్ట్

నీట్–యూజీ ప్రశ్నపత్రం లీకేజీ కేసులో సీబీఐ బృందం పట్నాలో ఇద్దరిని అదుపులోకి తీసుకుంది. వీరు ప్రశ్నాపత్రంతోపాటు జవాబుల కీను కూడా అభ్యర్థులకు సరఫరా చేసినట్లు అధికారులు అంటున్నారు.

భారత్‌పై అమెరికా అక్కసు

విద్వేషాలు పెరిగాయన్న విదేశాంగ మంత్రి

వాషింగ్టన్: భారత్‌లో మత మార్పిడి చట్టాలు పెరిగాయని, మైనారిటీలే లక్ష్యంగా నేతలు విద్వేష ప్రసంగాలు చేస్తున్నారని అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ గురువారం వ్యాఖ్యానించారు. ''భారత్‌లో మైనారిటీల ఇళ్లు, ప్రార్థనా స్థలాల కూల్చివేతలు పెరిగాయి. పది రాష్ట్రాల్లో మతమార్పిడిపై ఆంక్షలున్నాయి. చట్ట వ్యతిరేకంగా మత మార్పిళ్లకు పాల్పడుతున్నారంటూ క్రైస్తవులు, ముస్లింలను అక్రమంగా అరెస్టు చేస్తున్నారు. భారత్‌ను హిందూదేశంగా మార్చే యత్నాల్లో భాగంగా ఉమ్మడి పౌరస్మృతికి తెర తీశారు'' అన్నారు.

బొలీవియాలో సైనిక తిరుగుబాటు విఫలం

లా పాజ్: దక్షిణ అమెరికా దేశం బొలీవియాలో ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని కూలదోసి, అధికారం చేజిక్కించుకునేందుకు ఆర్మీ చీఫ్ జనరల్ జువాన్ జోస్ జునిగా యత్నించారు. వందలాది సైనికులు బుధవారం రాజధానిలో లా పాజ్‌లో యుద్ధ ట్యాంకుతో అధ్యక్ష భవనాన్ని ఢీకొట్టారు. తిరుగుబాటును ప్రతిపక్ష పార్టీలన్నీ ఖండించాయి. అధ్యక్షుడు లూయిస్ ఆర్సెకు మద్దతుగా వేలాదిగా ప్రజలు వీధుల్లోకి వచ్చారు. జునిగా, అతడి మద్దతుదారులను అరెస్ట్ చేయడంతో ప్రతిష్టంభనకు తెర పడింది. అధ్యక్షుడు అతన్ని పదవి నుంచి తొలగించారు. త్రివిధ దళాలకు కొత్త అధిపతులను నియమించారు.

ఐఎస్ఎస్‌ను కూల్చేయనున్న స్పేస్‌ఎక్స్

- నాసాతో మస్క్ భారీ ఒప్పందం
- 2030 తొలినాళ్లలో పని పూర్తి



వాషింగ్టన్: ప్రతి గంటన్నరకు ఒకసారి భూమి చుట్టూ తిరిగే ఫుట్‌బాల్ స్టేడియం సైజు ఉన్న ఆకాశ ప్రయోగశాల.. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్) త్వరలో నీలిసంద్రంలో కూలిపోనుంది. 2030 సంవత్సరంకల్లా పాతబడిపోతున్న ఐఎస్ఎస్ అంతరిక్షచెత్తగా మిగిలిపోకుండా, తదుపరి ప్రయోగశాలలకు అవరోధంగా మారకుండా చూడాలని అమెరికా నాసా నిర్ణయించుకుంది. అందుకే గడువు ముగిసేనాటికి దానిని ప్రస్తుత కక్ష్య నుంచి తప్పించనుంది. ఇప్పటికే రాకెట్ల తయారీతో అంతరిక్ష అనుభవం గడించిన కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్ సంస్థకు నాసా ఈ బాధ్యతను అప్పగించింది. ఇందుకోసం దాదాపు రూ.7,036 కోట్ల విలువైన కాంట్రాక్ట్‌ను స్పేస్‌ఎక్స్‌కు ఇచ్చినట్లు నాసా బుధవారం ప్రకటించింది. కాంట్రాక్ట్‌లో భాగంగా యునైటెడ్ స్టేట్స్ డీఆర్బిట్ వెహికల్(యూఎస్‌డీవీ)ను స్పేస్‌ఎక్స్ నిర్మించనుంది. అది సముద్రంలో చిన్న పడవలను లాగే/నెట్టే టగ్ బోటులా ఉంటుందని భావిస్తున్నారు. ఐఎస్ఎస్ ప్రస్తుతం భూమికి 400 కి.మీ.ల ఎత్తులో తిరుగుతోంది. ఏకంగా 430 టన్నుల బరువైన ఐఎస్ఎస్‌ను యూఎస్‌డీవీతో నియంత్రిస్తూ దశల వారీగా దిగువ కక్ష్యలకు తీసుకొస్తూ ముందుగా నిర్దేశించిన పసిఫిక్ మహాసముద్రంలోని మారుమూల 'పాయింట్ నెమో' వద్ద కూల్చేయనున్నారు. ఈ 'పాయింట్ నెమో' సముద్రప్రాంతం నుంచి దగ్గర్లోని భూభాగానికి వెళ్లాలంటే కనీసం 2,500 కిలోమీటర్లు ప్రయాణించాలి. పౌరులకు ఎలాంటి ప్రమాదం వాటిల్లకూడదని సుదూర ప్రాంతాన్ని ఎంచుకున్నారు.

వేల ప్రయోగాలకు వేదిక

ఐఎస్ఎస్ నిర్మాణం కోసం తొలి భాగాలను 1998లో రాకెట్లలో తీసుకెళ్లారు. 2000 సంవత్సరందాకా దీని నిర్మాణం సాగింది. శూన్యంలో ఎన్నో భిన్న ప్రయోగాలకు ఐఎస్ఎస్ సాక్షిగా నిలిచింది. అమెరికా, రష్యా, కెనడా, జపాన్ తదితర దేశాలు దీని నిర్వహణ చూసుకుంటున్నాయి. 2028లో చేతులు దులిపేసుకుంటామని రష్యా చెప్పేసింది.

సిద్ధూ.. సీఎంగా దిగిపోండి

డీకేకు అవకాశమివ్వండి • సీఎం సమక్షంలోనే ఒక్కళిగ స్వామీజీ వ్యాఖ్యలు

బెంగళూరు: విశ్వ ఒక్కళిగ మహాసంస్థాన మఠాధిపతి కుమార చంద్రశేఖరనాథ స్వామీజీ గురువారం కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను ఇబ్బందికర పరిస్థితుల్లోకి నెట్టేశారు. కెంపెగౌడ జయంతి కార్యక్రమంలో స్వామీజీ, సిద్ధుతో పాటు ఒక్కళిగ నేత అయిన ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ, ''మన డీకే ఇంకా సీఎం కాలేదు. అందుకే సీఎంగా అనుభవం గడించిన సిద్ధరామయ్య దిగిపోయి డీకేకు అవకాశమివ్వాలని కోరుతున్నా. మీరనుకుంటే అయిపోతుంది'' అన్నారు. సిద్ధూ స్పందిస్తూ, ''కాంగ్రెస్ పార్టీ హైకమాండ్ ఆదేశానుసారం నడుస్తుంది. స్వామీజీ ఏదో చెప్తారు. ఆయనకు ఇవేమీ తెలీదు'' అన్నారు. స్వామీజీ తనపై ఇష్టంతో అలా అన్నారని, అవి సీరియస్‌గా తీసుకోవాల్సిన మాటలు కావని డీకే అన్నారు. ''జనం అభిమానం కొద్దీ మాట్లాడతారు. కానీ మేం పార్టీ నిర్ణయానికే కట్టుబడి ఉంటాం'' అని చెప్పుకొచ్చారు. స్వామీజీ చెప్పారని ఎవరైనా సీఎం పదవి వదులుకుంటారా అని సహకార మంత్రి కేఎన్ రాజన్న ప్రశ్నించారు. నాక్కూడా స్వామీజీ హోదా కావాలంటే ఆయన ఒప్పుకుని త్యాగం చేస్తారా?'' అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు.

యడియూరప్పపై పోక్సో కోర్టులో చార్జిషీట్

బనశంకరి: కర్ణాటక బీజేపీ అగ్రనేత, మాజీ ముఖ్యమంత్రి బీఎస్.యడియూరప్పపై నమోదైన పోక్సో కేసులో బెంగళూరు పోలీసులు ప్రత్యేక కోర్టులో గురువారం చార్జిషీట్ సమర్పించారు. ఈ కేసులో యడియూరప్పను అరెస్ట్ చేయరాదంటూ పోలీసులను హైకోర్టు ఇప్పటికే ఆదేశించింది. పోలీసుల విచారణకు హాజరు కావాలని కూడా యడియూరప్పకు కోర్టు స్పష్టం చేసింది. సమస్య చెప్పుకుందామని యడియూరప్ప ఇంటికి వెళ్లిన తన కూతురిని (17) ఆయన లైంగికంగా వేధించారని మార్చిలో ఓ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేయడం తెల్సిందే. దీనిపై నమోదైన కేసును ప్రభుత్వం సీఐడీకి బదిలీ చేసింది.

ఆస్పత్రి నుంచి అడ్వాణీ డిశ్చార్జి

న్యూఢిల్లీ: బీజేపీ దిగ్గజ నేత లాల్ కృష్ణ అడ్వాణీ(96) గురువారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు. వయో సంబంధ సమస్యలతో ఆయన బుధవారం రాత్రి ఎయిమ్స్‌లో చేరడం తెల్సిందే. యూరాలజీ, జీరియాట్రిక్ మెడిసిన్ తదితర నిపుణులతో కూడిన వైద్య బృందం అడ్వాణీ ఆరోగ్య పరిస్థితిని పూర్తి స్థాయిలో పరిశీలించింది. అనంతరం స్వల్ప చికిత్స చేపట్టినట్లు ఎయిమ్స్ అధికారి వివరించారు. ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని, పర్యవేక్షణ కొనసాగుతుందని చెప్పారు. అయితే అడ్వాణీ ఎలాంటి సమస్యతో బాధపడుతున్నారనే విషయం వెల్లడించలేదు.

సాక్షి హైదరాబాద్

శుక్రవారం ♦ 28 ♦ జూన్ ♦ 2024



మొక్కు 'బడి' బస్ తనిఖీలు!

ఫిట్‌నెస్ లేని బడి బస్సులు పిల్లల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయి. పాఠశాలలు ప్రారంభమై 20 రోజులు గడుస్తున్నా బడిబస్సుల్లో భద్రత ప్రశ్నార్థకంగానే ఉంది. -8లో



అమ్మలా లాలన

వయోవృద్ధులను అక్కున చేర్చుకుని మెరుగైన వైద్య సేవలు అందించనున్నారు. సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో జెరియాట్రిక్ వార్డు (వృద్ధుల విభాగం) త్వరలో అందుబాటులోకి రానుంది. -10లో

గరిష్ఠం/కనిష్ఠం
32.0/23.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉంది. గరిష్ఠ ఉష్ణోగ్రత 32, కనిష్ఠ ఉష్ణోగ్రత 23 డిగ్రీలు నమోదయ్యే అవకాశాలు ఉన్నాయి.



అద్దె+చదువు = సిటీజన

సాక్షి, సిటీబ్యూరో:

నగరవాసులకు ఇంటి అద్దెలు భారంగా పరిణమిస్తున్నాయి. పిల్లల చదువు ఖర్చు తడిసి మోపెడవుతోంది. తిండి ఖర్చూ తక్కువేమీ కాదు. కనీస అవసరాలు తీర్చుకునేందుకు జీతమంతా ఊడ్చిపడేస్తున్నారు. దేశంలోని మహా నగరాలన్నింటిలో హైదరాబాదీలే ఎక్కువగా ఖర్చు పెడుతున్నారు. ఇదే విషయాన్ని 'ది గ్రేట్ ఇండియన్ వాలెట్' సంస్థ నిర్వహించిన సర్వే తేల్చి చెప్పింది. తిండి, ఇంటి అద్దెకే మూడొంతుల జీతం ఖర్చయిపోతోంది. దేశంలోని 17 మహా నగరాల్లోని ప్రజల స్థితిగతులపై నిర్వహించిన సర్వేలో హైదరాబాదీలే అత్యధికంగా ఖర్చు పెడుతున్నట్లు తేలింది. సంవత్సరానికి రూ.5 లక్షల కన్నా తక్కువ జీతం ఉన్న 2,500 మంది దిగువ మధ్య తరగతి కుటుంబాలపై సర్వే నిర్వహించగా.. తమ జీతాల్లో దిగువ మధ్య తరగతి కుటుంబాలే ఎక్కువగా ఖర్చు పెడుతున్నారని వెల్లడైంది. రూ.33 వేల జీతం కన్నా ఎక్కువ ఉన్నవారు కనీసం నెలకు రూ.24 వేలు ఇంటి అద్దె, తిండికే ఖర్చు పెడుతున్నారు.

కరోనా తర్వాత పెరుగుదల..

కరోనా తర్వాత జీవన విధానంలో భారీ మార్పు వచ్చింది. ఇంటి అద్దె కూడా భారీగా పెరిగింది. దాదాపు 30 శాతం మేర పెరిగింది. అయితే జీతంలో మాత్రం పెద్దగా మార్పు లేకపోవడంతో వచ్చే ఆదాయంలో ఎక్కువ శాతం ఇంటి అద్దె కోసమే పక్కకు పెట్టాల్సి వస్తోంది. వచ్చే జీతంలో దాదాపు 40 శాతం ఇంటి అద్దె కోసమే కేటాయించాల్సి వస్తోందని నగరవాసులు చెబుతున్నారు. ప్రస్తుతం పెరుగుతున్న ద్రవ్యోల్బణం కారణంగా ఉద్యోగుల ఆదాయానికి, పెడుతున్న ఖర్చుకు పొంతన లేకుండా పోతోంది. ప్రధానంగా జీవన విధానంలో మార్పు రావడంతో మెరుగైన జీవన శైలి వైపు నగర జీవి మొగ్గు చూపుతున్నాడు. దీనివల్ల కూడా దిగువ మధ్యతరగతి కుటుంబాల్లో ఖర్చు విపరీతంగా పెరిగిపోయింది.

విద్యకూ భారీగానే..

ఆహారం, ఇల్లు, దుస్తులు ప్రజలకు చాలా ముఖ్యమైనవి. ఆ తర్వాత విద్య చాలా ఆవశ్యకమైంది. మంచి చదువులు చదివితే జీవితాలు మారుతాయనే ఉద్దేశంతో పిల్లల చదువుల కోసం భారీగానే ఖర్చు పెడుతున్నారు. ఈ రోజుల్లో విద్య చాలా ఖరీదైపోయింది. కరోనా తర్వాత చదువుల కోసం పెట్టే ఖర్చు 51 శాతం పెరిగిపోయింది. వచ్చే జీతంలో 15 శాతం మేర పిల్లల చదువుల కోసమే నగర జీవి ఖర్చు పెడుతున్నారు. ఇంతగా చదువుల కోసం ఖర్చు పెరుగుతున్నప్పటికీ తల్లిదండ్రులు మాత్రం తమ పిల్లల భవిష్యత్తు కోసం ఖర్చు పెట్టేందుకు వెనుకాడట్లేదు. దీన్నిబట్టి దిగువ మధ్య తరగతి పౌరుడు ఎన్ని ఇబ్బందులు పడుతున్నాడో అర్థం చేసుకోవచ్చు. ఒక వైపు ఆర్థిక స్థిరత్వం కోసం తాపత్రయం పడుతుంటే.. ఆహారం, ఇంటి అద్దె, విద్య కోసం పెరుగుతున్న ఖర్చులు మరోవైపు.. ఈ క్రమంలో చాలా జాగ్రత్తగా పొదుపు చేసుకోవడం చాలా ముఖ్యమని సర్వే సూచిస్తోంది.



అయినా తగ్గేదేలే..

నగరవాసులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ.. తమకు ఉన్న పరిధిలో విలాసవంతమైన జీవితం గడిపేందుకు మొగ్గు చూపుతున్నారు. ముఖ్యంగా వారాంతాల్లో కుటుంబంతో కలిసి రెస్టారెంట్లలో భోజనం చేయడం, థియేటర్లలో సినిమా చూడటం, పలు పర్యాటక ప్రాంతాలు సందర్శించడం వంటివి చేస్తున్నారు. ఇక.. ఓటీటీ ప్లాట్‌ఫామ్స్‌ను సబ్‌స్క్రైబ్ చేసుకుని ఎంజాయ్ చేసేందుకు మొగ్గు చూపుతున్నారు.

సర్వే చేసిన కుటుంబాల సంఖ్య: 2,500	
సర్వే జరిపిన కుటుంబాల వార్షిక ఆదాయం: రూ.5 లక్షలు	
జీతంలో ఇంటి అద్దె కోసం పెడుతున్న ఖర్చు: 40 శాతం	
పెరిగిన అద్దె ఖర్చు (కరోనా అనంతరం): 30 శాతం	
ఖర్చు పెరగడానికి కారణాలివీ..	• జీవన వ్యయం పెరగడం • విలాసవంతమైన జీవనం గడపడం

ఒక్కో నగరంలో నెలవారీ వ్యయం

నగరం	ఖర్చు (సగటున)
హైదరాబాద్	రూ.24,000
బెంగళూరు	రూ.22,000
పుణే	రూ.21,000
ముంబై	రూ.20,000
జైపూర్	రూ.20,000
ఢిల్లీ	రూ.19,000
కోల్‌కతా	రూ.19,000
అహ్మదాబాద్	రూ.19,000



ఇంటి అద్దెకే ఎక్కువ ఖర్చు



వచ్చే జీతంలో ఎక్కువగా ఖర్చు అవుతోంది. పిల్లల చదువుకు కూడా పెద్ద మొత్తంలోనే ఖర్చు పెడుతున్నాను. జీతంలో పెద్దగా పెరుగుదల లేకపోయినా.. పిల్లల స్కూల్ ఫీజులు చెల్లించాల్సిందే. ఈ రెండింటికే ఎక్కువ మొత్తంలో ఖర్చయిపోతోంది. – బొల్లేపల్లి నాగరాజు, ప్రైవేటు ఉద్యోగి, అంబర్‌పేట

ఇద్దరం కష్టపడితేనే..



ఈ రోజుల్లో పెరుగుతున్న ఖర్చులకు నేను, నా భార్య ఉద్యోగం చేస్తేనే సరిపోతోంది. ఇంటి అద్దె, పిల్లల స్కూల్ ఫీజు ఒకరి జీతంతో సరిపెట్టినా.. ఇంకొకరి జీతాన్ని భవిష్యత్తు కోసం పొదుపు చేసుకుంటున్నాం. ఇంట్లో మా అమ్మ పిల్లలను చూసుకుంటున్నారు. లేదంటే చాలా ఇబ్బంది పడాల్సి వచ్చేది.
– కందుకూరి సృజన్, ప్రైవేటు ఉద్యోగి, అల్వాల్

లష్కర్ బోనాలకు పకడ్బందీ ఏర్పాట్లు

మంత్రి పొన్నం ప్రభాకర్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

రాంగోపాల్‌పేట్: నగరంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే బోనాల జాతర కోసం అన్ని శాఖల అధికారులు సకాలంలో పనులు పూర్తి చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవ ఏర్పాట్లలో భాగంగా గురువారం వివిధ శాఖల అధికారులతో దేవాలయ ప్రాంగణంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. లష్కర్ బోనాల్లో అమ్మవారి దర్శనానికి ఉచిత బస్సు సౌకర్యం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా భారీగా తరలివచ్చే మహిళా భక్తులను దృష్టిలో ఉంచుకుని అన్ని ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. వచ్చే నెల 5వ తేదీలోపు వీటిని పూర్తి చేయాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. లక్షల మంది భక్తులు పాల్గొనే జాతరలో వీఐపీలతో ఇబ్బందులు లేకుండా మంత్రులమందరం ఎంజీ రోడ్డు నుంచి కారులో వస్తామని.. సీఎం, గవర్నర్, కేంద్ర మంత్రులు మాత్రమే దేవాలయం వరకు కాన్వాయ్‌తో వస్తారని మంత్రి పొన్నం స్పష్టం చేశారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, కమిషనర్ హన్మంతు, అదనపు కమిషనర్ కృష్ణవేణి, ఈట మనోహర్‌రెడ్డి, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత, డీసీపీ సాధన రష్మి పెరుమాళ్, అదనపు డీసీపీ అశోక్, జోనల్ కమిషనర్ రవికిరణ్, జలమండలి జీఎం వినోద్, కార్పొరేటర్ చీర సుచిత్ర, మాజీ కార్పొరేటర్లు కిరణ్మయి, నాయకురాలు కోట నీలిమ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవాలయ పోస్టర్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవిష్కరించారు.

5 చోట్ల సొరంగ మార్గాలు

మరోసారి ఆసక్తి వ్యక్తీకరణలకు ఆహ్వానం



సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా నగరంలోని 5 చోట్ల సొరంగ మార్గాలకు (రోడ్ టన్నెల్) ఇప్పటికే ఫీజిబిలిటీస్టడీ, సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక (డీపీఆర్)తయారీకి ఆసక్తి వ్యక్తీకరణల కోసం జీహెచ్‌ఎంసీ నోటిఫికేషన్ వెలువరించింది. కాగా.. ఒకే ఏజెన్సీ ముందుకురావడంతో పోటీ ఉంటే మంచిదనే తలంపుతో మరోసారి నోటిఫికేషన్ వెలువరించింది. ఈ మేరకు ఈ నెల 27వ తేదీ వరకు తొలిగడువును ఇవ్వగా దాన్ని మళ్లీ జులై 4కు పొడిగించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలకనుగుణంగా నగరంలో ట్రాఫిక్ రద్దీ నివారణకు, ఫ్లై ఓవర్ల కంటే సొరంగమార్గాలు నిర్మించాలని జీహెచ్‌ఎంసీ భావించింది. ఇందులో భాగంగా ఐటీసీ కోహినూర్, మాసాబ్ ట్యాంక్, చార్మినార్ ప్రాంతాలకు వెళ్లే వారి సదుపాయార్థం 5 చోట్ల సొరంగ మార్గాల కోసం ఆసక్తి కలిగిన ఏజెన్సీల కోసం నోటిఫికేషన్ వెలువరించగా.. గతంలో కేబీఆర్ పార్కు కింద నుంచి సొరంగ మార్గానికి ఫీజిబిలిటీ స్టడీ, డీపీఆర్ తయారీ పనులు పొందిన ఆర్వీ అసోసియేట్స్ ఆర్కిటెక్ట్స్ ఇంజినీర్స్ కన్సల్టెంట్స్ సంస్థ ఒక్కటి మాత్రమే ముందుకొచ్చింది. పోటీ లేకపోవడంతో మళ్లీ నోటిఫికేషన్ ఇచ్చారు. ఈ ప్రాంతాల్లో సొరంగ మార్గాలు: ఐటీసీ కోహినూర్–విప్రో సర్కిల్ (వయా ఖాజాగూడ, నానక్‌రామ్‌గూడ), ఐటీసీ కోహినూర్–జేఎన్‌టీయూ (వయా మైండ్‌స్పేస్), ఐటీసీ కోహినూర్– బంజారాహిల్స్ రోడ్‌నెంబర్10 (వయా జూబ్లీహిల్స్ రోడ్‌నెంబర్ 45), జీవీకే వన్ మాల్– నానల్‌నగర్ (వయా మాసాబ్‌ట్యాంక్), నాంపల్లి–చాంద్రాయణగుట్ట ఐఆర్‌ఆర్ (వయా చార్మినార్, ఫలక్‌నుమా).

డెడ్‌స్టోరేజీలో ఉన్నా.. నీటి లభ్యత

'సాక్షి' కథనానికి జలమండలి స్పందన




సాక్షి ఎఫెక్ట్..

సాక్షి, సిటీబ్యూరో: కృష్ణా, గోదావరి బేసిన్‌లో నాగార్జున సాగర్, శ్రీపాద ఎల్లంపల్లి జలాశయాలు డెడ్‌స్టోరేజీకి చేరినా.. నీటి లభ్యత ఉన్నంత వరకు తాగునీటి సరఫరాకు ఎలాంటి ఢోకా ఉండబోదని జలమండలి స్పష్టం చేసింది. 'అడుగంటిన ఆశలు' శీర్షికన గురువారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి జలమండలి స్పందించింది. రెండు ప్రాజెక్టుల్లో నీటి మట్టం డెడ్ స్టోరేజీకి చేరడంతో ఎమర్జెన్సీ పంపింగ్ ద్వారా నీటిని తోడి సరఫరా చేస్తున్నట్లు పేర్కొంది. రెండు రిజర్వాయర్లకు ఇన్‌ఫ్లోకు సంబంధించిన పనులను పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొంది. ఓఆర్‌ఆర్ వరకు విస్తరించిన హైదరాబాద్ మహా నగర వాసుల తాగునీటి అవసరాల నాగార్జున సాగర్ జలాశయం ద్వారా అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి కృష్ణా డ్రింకింగ్ వాటర్ సప్లై ఫేజ్ – 1, 2, 3 ల ద్వారా దినసరి 270 ఎంజీడీల నీటిని తరలిస్తున్నట్లు.. ఈ లెక్కన నెలకు 1.40 టీఎంసీల నీటిని సరఫరా చేస్తున్నట్లు వెల్లడించింది.

బాలికపై కానిస్టేబుల్ లైంగిక దాడి

నిందితుడి రిమాండ్



నిందితుడు ప్రదీప్

మైలార్‌దేవ్‌పల్లి: బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కానిస్టేబుల్‌ను రాజేంద్రనగర్ పోలీసులు గురువారం అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. ఇన్‌స్పెక్టర్ నాగబాబు తెలిపిన వివరాల ప్రకారం.. రాజేంద్రనగర్ స్టేషన్ పరిధిలోని బుద్వేల్‌కు చెందిన జి.ప్రదీప్ శంషాబాద్ ఆర్‌జీఐ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్. ప్రదీప్ నివాసానికి దగ్గరలోని మందిరానికి ఓ బాలిక ప్రార్థనల కోసం వస్తుండేది. ఆ సమయంలో బాలికతో పరిచయం పెంచుకున్న ప్రదీప్.. అనంతరం ప్రేమ పేరుతో రెండేళ్లుగా బాలికను లోబరుచుకున్నాడు. గత ఏడాది మరో యువతిని ప్రదీప్ పెళ్లి చేసుకున్నాడు. వివాహం చేసుకున్న తర్వాత కూడా బాలికతో ప్రదీప్ ప్రేమ వ్యవహారం నడిపేవాడు. ఈ క్రమంలో బాధితురాలి తల్లికి విషయం తెలియడంతో కూతురును మందలించింది. రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.



వానా.. హైరానా..

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో గురువారం ఈదురు గాలులతో కూడిన వర్షం దంచికొట్టింది. సగటున 3 నుంచి 4 సెంటీమీటర్ల వరకు వర్షపాతం నమోదైంది. మధ్యాహ్నం 3 గంటల తర్వాత ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో భారీ వర్షం పడింది. రోడ్లపై వరద నీరు చేరడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ప్రధాన రహదారుల్లో గంటల తరబడి ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఐటీ కారిడార్‌లో కిలో మీటర్ల కొద్దీ వాహనాలు నిలిచిపోయాయి. సరూర్‌నగర్, హయత్ నగర్, ఎల్బీనగర్, శేరిలింగంపల్లి, కంటోన్మెంట్, రాజేంద్ర నగర్, ఖైరతాబాద్, చార్మినార్, సికింద్రాబాద్, కూకట్‌పల్లి, హైటెక్ సిటీ, కొండాపూర్, మాదాపూర్, ముషీరాబాద్, ప్రాంతాల్లో కుండపోతగా వర్షం కురిసింది.



వరమెవరికో!

మహా నగరం నుంచి మంత్రి అయ్యేదెవరో!!

- త్వరలో రాష్ట్ర మంత్రి వర్గ విస్తరణ
- ఆశావహుల్లో మల్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, దానం నాగేందర్

సాక్షి, సిటీబ్యూరో: త్వరలో రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ జరగనున్న నేపథ్యంలో హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జంట జిల్లాల నుంచి ఎవరికి మంత్రి పదవి దక్కుతుందన్నది అటు రాజకీయ వర్గాల్లోనే కాక ఇటు సాధారణ ప్రజల్లోనూ ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలు దాదాపుగా నగరంలోనే కలగలిసి ఉండటంతో ఈ జిల్లాల నుంచి ఎవరిని మంత్రి పదవి వరించినా వారిని మహానగరానికి ప్రాతినిధ్యం వహించే వారుగానే పరిగణించనున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ రెండు జిల్లాల నుంచి ఎవరికీ మంత్రి పదవి లభించలేదు. జీహెచ్‌ఎంసీ పరిధిలోకి వచ్చే 24 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ నుంచి ఏ ఒక్కరు కూడా ఎమ్మెల్యేగా గెలవలేదు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి ముగ్గురు గెలవగా వారిలో గడ్డం ప్రసాద్‌కుమార్‌కు స్పీకర్ పదవి ఇచ్చారు. దీంతో మిగతా ఇద్దరు ఇబ్రహీం పట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, పరిగి ఎమ్మెల్యే టి. రామ్మోహన్‌రెడ్డి తమకు మంత్రి పదవి లభించనుందనే ఆశతో ఉన్నారు.


ఒకరికి ఖాయం?

రెండు జిల్లాల నుంచి ఎవరూ లేకపోవడంతో ఒకరికి ఖాయంగా లభించనుందని రాజకీయ పరిశీలకులు కూడా భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన దానం నాగేందర్ సైతం మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్నారు. బహుశా ఆ ఆశతోనే ఆయన సికింద్రాబాద్ నుంచి ఎంపీగా పోటీ చేసేందుకు తొలుత ససేమిరా అన్నప్పటికీ, పోటీ చేయక తప్పలేదు. బీఆర్‌ఎస్ డిమాండ్ చేసినా ఎమ్మెల్యే పదవికి రాజీనామా కూడా చేయలేదు. ఎంపీ ఎన్నికలో ఆయన ఓడిపోయినప్పటికీ, బీఆర్‌ఎస్ నుంచి పార్టీలో చేరిన ఆయనకు మంత్రి పదవి లభించవచ్చని భావిస్తున్న వారు ఉన్నారు.

దానం హైదరాబాద్ జిల్లాలోని ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఉన్నారు. హైదరాబాద్ జిల్లాకే మంత్రి పదవి ఇవ్వాలని భావించే పక్షంలో ఆయనకు, జంట జిల్లాలనుంచి ఎవరో ఒకరికి ఇవ్వాలని భావిస్తే మల్‌రెడ్డి రంగారెడ్డి లేదా రామ్మోహన్‌రెడ్డిలలో ఎవరో ఒకరికి మంత్రి పదవి లభించనుంది. ఎంతో కాలం జంట జిల్లాలుగా కొనసాగిన హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల్లో దాదాపు నాలుగు దశాబ్దాలుగా ప్రాతినిధ్యం లేని మంత్రివర్గమంటూ కూడా ఎప్పుడూ లేదు. అంతేకాదు.. జంట జిల్లాల నుంచి ఒకే మంత్రివర్గంలోనే ముగ్గురికి కూడా మంత్రి పదవులు లభించిన సందర్భాలు కూడా ఉన్నాయి.

రాజధానికి ప్రాతినిధ్యమేదీ?

రాజధాని నగరమైన హైదరాబాద్‌లో జరిగే పలు కార్యక్రమాల్లో నగరానికి చెందిన మంత్రి అంటూ లేకుండాపోయారు. జాతీయ, అంతర్జాతీయ సదస్సులు, పండుగలు, ఉత్సవాల వంటి కార్యక్రమాలతో పాటు వానలు, వరదలు వంటివి సంభవించినప్పుడు ప్రజల మధ్యకు వచ్చి భరోసానిచ్చేందుకు కూడా నగరం నుంచి మంత్రి అనేవారే లేకపోవడం గమనార్హం. ప్రస్తుతం హైదరాబాద్ జిల్లాకు ఇన్‌చార్జి మంత్రిగా వ్యవహరిస్తున్న పొన్నం ప్రభాకర్ వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. నగర పరిపాలనా కేంద్రమైన జీహెచ్‌ఎంసీకి సంబంధించిన వివిధ కార్యక్రమాల అమలు, వర్షాకాల కార్యాచరణ వంటి కార్యక్రమాలపై సమీక్షలు సైతం ఆయనే నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏ విధంగా చూసినా మహా నగరం నుంచి మ్రంతి పదవి ఖాయంగా కనిపిస్తుండటంతో ఆ అదృష్టం వరించేది ఎవరిని అన్నదే ఇప్పుడు ఉత్కంఠ కలిగిస్తోంది.



విద్యార్థుల భద్రత కోసం ప్రత్యేక చర్యలు

● నగర ట్రాఫిక్ అడిషనల్ సీపీ విశ్వప్రసాద్


స్కూల్ ఆటోలను తనిఖీ చేసి పరిశీలిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

హిమాయత్‌నగర్: విద్యార్థులు పాఠశాలలకు క్షేమంగా వెళ్లి, తిరిగి ఇంటికి చేరాలని, అందుకోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని నగర ట్రాఫిక్ అడిషనల్ సీపీ పి.విశ్వప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులను పాఠశాలలకు తీసుకువెళ్లే ఆటోలపై నగర ట్రాఫిక్ పోలీసులు గురువారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సామర్థ్యానికి మించి పిల్లలను తీసుకువెళుతున్న వాహనాలపై ప్రత్యేక డ్రైవ్ ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ట్రాఫిక్ పోలీసులు ఉదయం 07.30 నుంచి 09.30 గంటల వరకు, సాయంత్రం 03.00 గంటల నుండి 5 గంటల వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు లేని ఆటో రిక్షాలు, డ్రైవింగ్ లైసెన్స్ లేని, డ్రంకన్ డ్రైవ్, ఓవర్‌లోడింగ్, మైనర్ డ్రైవింగ్ మొదలైన వాటిపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థుల భద్రత అంశాలపై పాఠశాలల యాజమాన్యాలకు, తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు.

మొక్కుబడి బస్ తనిఖీలు!

సామర్థ్యం లేకుండానే రోడ్లపై రయ్ రయ్
- గ్రేటర్‌లో 256 బస్సులను జప్తు చేసిన ఆర్టీఏ
- ఇప్పటికీ 876 ఫిట్‌లెస్ బస్సుల గుర్తింపు
- నిబంధనలు ఉల్లంఘించి నడుపుతున్న యాజమాన్యాలు



సాక్షి, సిటీబ్యూరో: బడి బస్.. భద్రత లెస్.. ఫిట్ లెస్.. నిర్లక్ష్యం లెస్స్.. అన్నట్లుగా ఉంది పరిస్థితి. అధికారుల మొక్కు'బడి బస్సు'తనిఖీలు పిల్లల భద్రతను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. ఫిట్‌నెస్ లేని చాలా బస్సులు పిల్లలను తరలిస్తూ ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయి. పాఠశాలలు ప్రారంభమై 20 రోజులు దాటినప్పటికీ బడిబస్సుల్లో భద్రత కొరవడింది. ఇంత జరుగుతున్నా పాఠశాలల యాజమాన్యాలు నిర్లక్ష్యం వీడటంలేదు. అధికారులు ఉత్తిత్తి తనిఖీలతో మమ అనిపిస్తున్నారు. తల్లిదండ్రులు పెద్దగా పట్టించుకోవడంలేదు. సాధారణంగా స్కూళ్లు తెరిచే నాటికే యాజమాన్యాలు బస్సులను కండిషన్‌లో ఉంచుకోవాలి. డ్రైవర్ అనుభవం, నైపుణ్యం వంటి అంశాలను సీరియస్‌గా పరిగణించాలి. కానీ, వీటి యాజమాన్యాలు ఇవేవీ పట్టవు. మరోవైపు ఆర్టీఏ అధికారుల నామమాత్రపు తనిఖీలు నిర్లక్ష్యానికి ఆజ్యం పోస్తున్నాయి. దీంతో వందలాది బస్సులు సామర్థ్యం లేకపోయినా రోడ్లపై తిరుగుతునాయి. గ్రేటర్ పరిధిలో ఇప్పటికీ 876 బస్సులు ఫిట్‌నెస్ లేకుండానే కొనసాగుతున్నట్లు అధికారులు గుర్తించారు. హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల పరిధిలో 256 బస్సులను జప్తు చేశారు. మరో 304 బస్సులపై కేసులు నమోదు చేశారు. ఆర్టీఏ బృందాలు బడులు తెరిచిన మొదటి వారం రోజులపాటు నగరంలోని వివిధ ప్రాంతాల్లో హడావుడిగా తనిఖీలు నిర్వహించాయి. పలు చోట్ల 15 ఏళ్ల గడువు ముగిసిన బస్సులను కూడా అధికారులు జప్తు చేశారు.

ఎందుకీ నిర్లక్ష్యం....

స్కూల్ బస్సులపై రవాణా శాఖ ప్రతి సంవత్సరం మే నెలలోనే స్పెషల్ డ్రైవ్ నిర్వహించాల్సి ఉంటుంది. కానీ, కోవిడ్ కాలం నుంచి ఈ ప్రక్రియ నిలిచిపోయింది. స్కూళ్లు, కాలేజీలు, విద్యాసంస్థలు తెరుచుకున్న తరువాత హడావిడిగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వారం, పది రోజుల్లో ముగిస్తున్నారు. ఆ సమయంలో ఫిట్‌నెస్ కోసం ఆర్టీఏ కార్యాలయాలకు వచ్చే బస్సులకు మాత్రమే తనిఖీలు నిర్వహించి సామర్థ్యాన్ని ధ్రువీకరిస్తున్నారు. ఫిట్‌నెస్ తనిఖీల్లోనూ శాస్త్రీయత కొరవడిందనే ఆరోపణలు ఉన్నాయి. ఉత్తుత్తి తనిఖీలు నిర్వహించి ధ్రువపత్రాలను అందజేస్తున్నారు. పాఠశాల యాజమాన్యాలకు పిల్లలను స్కూళ్లలో చేర్పించుకోవడంపై ఉండే శ్రద్ధ వారి భద్రతపైన కనిపించడం లేదు. బస్సుల నిర్వహణను పూర్తిగా డ్రైవర్లకు, సిబ్బందికి వదిలేస్తున్నారు. దీంతో సామర్థ్యం లేని బస్సులు చిన్నారుల భద్రతకు సవాల్‌గా మారుతున్నాయి.

జిల్లాల వారీగా ఫిట్‌నెస్, ఫిట్ 'లెస్'బస్సుల వివరాలు

జిల్లా	మొత్తం బస్సులు	సామర్థ్యం ఉన్నవి	లేనివి	నమోదైన కేసులు	జప్తు చేసినవి
హైదరాబాద్	1,290	1,145	145	160	121
మేడ్చల్	5,609	5,293	316	73	67
రంగారెడ్డి	5,732	5,312	415	71	68
మొత్తం	12,631	11,750	876	304	256

తల్లిదండ్రులు పట్టించుకోవాలి...

పిల్లలను స్కూల్‌కు పంపించే సమయంలో తల్లిదండ్రులు రూ.వేల్లో ఫీజులు చెల్లిస్తున్నారు. కానీ, బస్సుల బాగు గురించి పట్టించుకోవడం లేదు. పిల్లలను ఇంటి నుంచి తీసుకెళ్లే బస్సు ఏ మాత్రం సురక్షితంగా ఉందనే విషయాన్ని తెలుసుకోపోవడం యాజమాన్యాల నిర్లక్ష్యానికి మరో కారణం అని అధికారులు చెబుతున్నారు. "బస్సుల కండిషన్, డ్రైవర్ అనుభవం, అటెండర్ ఏర్పాటు వంటి విషయాల్లో శ్రద్ధ చూపాలి. పాఠశాల యాజమాన్యాలు, రవాణా శాఖ, తల్లిదండ్రుల మధ్య సమన్వయం ఉంటేనే పిల్లలకు సురక్షితమైన రవాణా సదుపాయం లభిస్తుంది'అని ఆర్టీఏ అధికారి ఒకరు అభిప్రాయపడ్డారు.

నేడు బీజేపీ ఎంపీల ఇళ్ల ముట్టడి

విద్యార్థి, యువజన సంఘాల జేఏసీ

హిమాయత్‌నగర్: నీట్ పరీక్ష సమస్యపై ప్రధాని నరేంద్రమోదీ నిర్లక్ష్య వైఖరి, నీట్ విద్యార్థుల సమస్యలపై ఇప్పటివరకు మాట్లాడని తెలంగాణ బీజేపీ ఎంపీల తీరును నిరసిస్తూ యువజన, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం బీజేపీ ఎంపీల ఇళ్ల ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు విద్యార్థి, యువజన సంఘాల జేఏసీ ప్రకటించింది. గురువారం హిమాయత్‌నగర్‌లో ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హోర్డింగ్‌ను ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఆవిష్కరించారు. గత పది ఏళ్లుగా బీజేపీ హయాంలోనే టెస్టింగ్ ఏజెన్సీలు పరీక్ష నిర్వహణలో పూర్తిగా వైఫల్యం చెందాయని, వాటి మూలంగానే విద్యార్థుల బంగారు భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి మూర్తి, పి.డి.ఎస్.యు. రాష్ట్ర అధ్యక్షుడు డి.రామకృష్ణ, ఎ.ఐ.ఎ.ఎస్.ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్లూరు.ధర్మేంద్ర, నెర్లకంటి శ్రీకాంత్, డీవైఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎండీ.జావీద్ తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

చైతన్యపురి: రోడ్డు దాటుతున్న వ్యక్తి(54)ని గుర్తు తెలియని కారు వేగంగా వచ్చి ఢీకొట్టడంతో మృతి చెందాడు. సరూర్‌నగర్ ఎస్ఐ మాధవరావు తెలిపిన వివరాలు... బుధవారం సాయంత్రం చైతన్యపురి [illegible] సమీపంలో ఓ వ్యక్తి రోడ్డు దాటుతుండగా, ఎల్బీ నగర్ నుంచి దిల్‌సుఖ్‌నగర్ వైపు కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో అతడి తలకు తీవ్రగాయమైంది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని అతడిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎవరైనా అతడిని గుర్తుపడితే వివరాలు పోలీస్‌స్టేషన్‌లో తెలియజేయాలని ఎస్ఐ కోరారు. కేసు నమోదు చేసి సీసీ ఫుటేజీ పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

జేటీసీపై దాడికి నిరసనగా నేడు పెన్‌డౌన్

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్(జేటీసీ) రమేష్‌పై దాడికి నిరసనగా రవాణా శాఖ ఉద్యోగులు శుక్రవారం పెన్‌డౌన్ నిర్వహించనున్నారు. దాడిని తెలంగాణ గ్రూప్–1 ఆఫీసర్స్ అసోసియేషన్, రవాణా శాఖ ఉద్యోగులు తీవ్రంగా ఖండించారు. గురువారం మధ్యాహ్నం ఆటో రిక్షా యూనియన్ నాయకుడు అమానుల్లా ఖాన్ కమిషనర్ రమేష్ ఛాంబర్‌లోకి చొరబడి భౌతికంగా దాడి చేశారు. అమానుల్లాఖాన్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని తెలంగాణ గ్రూప్ 1 ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్, హన్మంతు నాయక్‌లు డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులపై దాడులకు నిరసనగా నేడు(శుక్రవారం) రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రవాణా కార్యాలయాల్లోని సిబ్బంది పెన్ డౌన్ నిర్వహిస్తామని రవాణా శాఖ ఉద్యోగ సంఘాల నేతలు రవీందర్ కుమార్, చంద్రశేఖర్ గౌడ్, శ్రీనివాస రెడ్డి తెలిపారు.



'మౌంట్ డెనాలి'పై నగర బాలుడు

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన 15 ఏళ్ల విశ్వనాథ్ కార్తికేయ అలాస్కా–ఉత్తర అమెరికాలోని ఎత్తైన శిఖరం 'మౌంట్ డెనాలి'ని అధిరోహించాడు. 11వ తరగతి చదువుతున్న విశ్వనాథ్ సముద్ర మట్టానికి 6,190 మీటర్ల ఎత్తులో ఉన్న మౌంట్ డెనాలి అధిరోహించి భారత జాతీయ జెండాను ఎగురవేశాడు. జూన్ 15న అధిరోహణను ప్రారంభించి వారం తర్వాత శిఖరాగ్రానికి చేరుకున్నాడు. ఏడు ఖండాలలో ఇప్పటి వరకు 4 పర్వతారోహణలు పూర్తి చేశాడు.

అధిక లాభాల పేరిట రూ.70 కోట్లు లూటీ

● మెటలాయిడ్స్ టెక్నాలజీస్ డైరెక్టర్ అరెస్టు



సాక్షి, సిటీబ్యూరో: తక్కువ రోజుల్లో అధిక లాభాలు అందిస్తామని ఉద్యోగుల నుంచి డిపాజిట్లు సేకరించి రూ.70 కోట్లు వసూలు చేసి మోసగించిన భార్యాభర్తలను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కోల్‌కత్తాకు చెందిన మౌసమీ బిస్వాస్, ఆమె భర్త జయంత్ బిస్వాస్ కలిసి మాదాపూర్ కేంద్రంగా మెటలాయిడ్స్ టెక్నాలజీస్ పేరుతో కంపెనీ ప్రారంభించారు. పెట్టుబడులపై అధిక లాభాలు ఇస్తామని పలువురు ఉద్యోగులను నమ్మించి డిపాజిట్లు సేకరించేవారు. తొలుత కస్టమర్లను నమ్మించేందుకు రిటర్న్‌లు ఇచ్చేవారు. రూ.70 కోట్ల డిపాజిట్లు వసూలు చేశాక లాభాలు అందించడం మానేశారు. డిపాజిట్ చేసిన సొమ్ము వెనక్కి ఇవ్వక, లాభాలు అందించక చేతులెత్తేయడంతో మోసపోయామని గ్రహించిన టి.శ్రీధర్ అనే బాధితుడు గతేడాది హైదరాబాద్‌లోని సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్)లో కేసు పెట్టారు. అనంతరం ఈ కేసు సైబరాబాద్ ఈఓడబ్ల్యూకు బదిలీ అయింది. సాంకేతిక ఆధారాలతో నిందితులు కోల్‌కత్తాలో ఉన్నట్లు గుర్తించిన పోలీసులు.. ప్రత్యేక బృందంతో అక్కడికి వెళ్లి మౌసమీ బిస్వాస్‌ను అరెస్టు చేశారు.

శాడిస్టు భర్త బారి నుంచి రక్షించండి

పోలీసులను ఆశ్రయించిన భార్య

వెంగళరావునగర్: అసహజ శృంగారం పేరిట వేధిస్తున్న శాడిస్టు భర్త బారి నుంచి తనను రక్షించాలని ఓ మహిళ మధురానగర్ పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి చెందిన ఓ మహిళకు అదే ప్రాంతంలోని ఓ వ్యక్తితో 2007లో వివాహమైంది. అయితే పెళ్లైన మరునాటి నుంచే ఆమెకు అత్తింటి వేధింపులు మొదలయ్యాయి. భర్త ఎలాంటి ఉద్యోగం చేయకుండా తల్లిదండ్రులు, అక్కాచెల్లెళ్లపై ఆధారపడి జీవిస్తున్నాడు. ఆమె ఓ ప్రైవేట్ పాఠశాలలో టీచర్‌గా పనిస్తుండగా, ఆ ఉద్యోగాన్ని మాన్పించారు. భర్తసహా కుటుంబసభ్యులందరూ ఆమెను ఓ పనిమనిషిలా చూసేవారు. భర్త అసహజ శృంగారంతోపాటు ప్రైవేట్ భాగాల్లో రక్తంకారే విధంగా హింసించేవాడు. అశ్లీల వీడియోలను బలవంతంగా చూపిస్తూ మానసికంగా హింసించేవాడు. 'ఈ విషయాలన్నీ ఎవరికైనా చెబితే చంపుతా. నేను చచ్చి పెట్టిన, నీ మాటలు ఎవరూ నమ్మరు' అని బెదిరించేవాడు. అద్దె ఇంట్లోనూ అతడి అసభ్య ప్రవర్తన కారణంగా యజమాని ఇల్లు ఖాళీ చేయించారు. ఓరోజు ఆమె ప్రైవేట్ పార్ట్‌లు మెలిపెట్టడంతో తీవ్ర రక్తస్రావమై ఆస్పత్రి పాలైంది. దారుణాలను తన సోదరులు నిలదీయగా, ఇలాంటివి పునరావృతం చేయనని చెప్పి పారిపోయాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పారిపోయిన బ్యాంక్ మేనేజర్ దొరికాడు

ఖాతాదారుల పేరిట రుణాలు.. రూ.3.28 కోట్లు కొల్లగొట్టిన వైనం

ఉప్పల్: ఖాతాదారులను మోసం చేసి రూ.3.28 కోట్లు కొల్లగొట్టి పారిపోయిన ఓ బ్యాంక్ మేనేజర్ ఎట్టకేలకు పోలీసులకు చిక్కాడు. ఈ కేసులో ఏ–1గా ఉన్న షేక్ సైదులును సీసీఎస్ పోలీసులు ఇటీవలే అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఉప్పల్ పోలీసులు తెలిపిన వివరాలు.. రామంతాపూర్ ఇందిరానగర్‌లో నివాసముంటున్న గంగ మల్లయ్య భగీరథ(41) రామంతాపూర్ ఎస్‌బీఐ బ్రాంచి మేనేజర్‌గా పనిచేసేవాడు. తన స్నేహితుడు షేక్ సైదులుతో కలిసి రామంతాపూర్ బ్రాంచిలో 22 మంది ఖాతాదారుల పేరిట వ్యక్తిగత రుణాలు తీసుకున్నాడు. ఇద్దరూ కలిసి దాదాపుగా రూ. 3.28 కోట్లు పక్కాగా తమ ఖాతాల్లోకి మళ్లించుకున్నారు. నెలవారీ ఈఎంఐలు కట్టడం లేదని ఖాతాదారులకు బ్యాంకు నుంచి నోటీసులు రావడంతో గుట్టురట్టు అయింది. దీంతో బాధితులు ఎస్‌బీఐ ప్రధాన కార్యాలయంలో ఫిర్యాదు చేయగా, తీగ లాగితే డొంక కదిలిన చందంగా ఆ ఇద్దరి మోసాలు బట్టబయలయ్యాయి. అప్పటి నుంచి పోలీసుల కళ్లు గప్పి తప్పించుకు తిరుగుతున్న అతడిని ఎట్టకేలకు పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

తమది కాని స్థలంలో వెంచర్

- శుభోదయం ఇన్‌ఫ్రా ఎండీ అరెస్టు
- బై బ్యాక్ స్కీమ్ కింద డిపాజిట్లు వసూలు
- కస్టమర్లను ఉసిగొల్పే ఏజెంట్లకు భారీగా కమీషన్లు

సాక్షి, సిటీబ్యూరో: తమది కాని స్థలంలో వెంచర్ పేరిట అమాయకుల నుంచి భారీ మొత్తంలో డిపాజిట్లు వసూలు చేసిన శుభోదయం ఇన్‌ఫ్రా ఎండీ కలపటపు శ్రీలక్ష్మీప్రసాద్‌ను సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం (ఈఓడబ్ల్యూ) పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రామచంద్రికి చెందిన కలపటపు శ్రీలక్ష్మీ ప్రసాద్ ఎండీగా, కలపటపు అనురాధ, రమణారెడ్డిలు డైరెక్టర్లుగా, విజయవాడకు చెందిన మంగలూరి వెంకట సత్యసుధీర్ అకౌంటెంట్‌గా 2017లో మాదాపూర్‌లోని అరుణోదయ కాలనీలో శుభోదయం ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను ప్రారంభించారు. జనగాం జిల్లా రఘునాథపల్లి మండలం ఖిలాషాపూర్‌లో పలు భూయజమానుల కోసం వెతికారు. కొన్నేళ్లుగా ఓ యజమాని రాకపోకలు సాగించడం లేదని తెలుసుకుని ఆ స్థలంలో శుభోదయం కాకతీయ ఇన్‌ఫ్రా పేరుతో వెంచర్‌ను ప్రారంభించారు. ఆ వెంచర్‌ను బ్రోచర్లు ముద్రించి సామాజిక మాధ్యమాల్లో తెగ ప్రచారం చేశారు. భూమిపై పెట్టుబడులు పెడితే బై బ్యాక్ స్కీమ్ కింద ప్రతినెలా అద్దె ఇవ్వడంతోపాటు అధిక లాభాలు ఇస్తామని నమ్మించారు. ఫేజ్–1లో భాగంగా స్థలం డెవలప్‌మెంట్ కోసం వంద శాతం సొమ్మును ముందస్తుగా చెల్లిస్తే ఎకరం భూమిని కొనుగోలు చేస్తే 13 నెలల్లో 50 శాతం, 18 నెలల్లో 75 శాతం, 26 నెలల్లో 100 శాతం లాభాలు అందిస్తామని నమ్మించారు. ఎక్కువ మంది కస్టమర్లను తీసుకొచ్చేందుకు మార్కెటింగ్ ఏజెంట్లను నియమించుకున్నారు. భారీ మొత్తంలో కమీషన్లు అందించారు.

రూ.3.16 కోట్ల డిపాజిట్ల సేకరణ

బై బ్యాక్ స్కీమ్ కింద బాధితుడు కల్లూరు ప్రవీణ్ కుమార్ రెడ్డితో పాటు మరో 13 మంది రూ.3.16 కోట్లు డిపాజిట్లను సేకరించారు. డబ్బులు చెల్లించిన బాధితులకు భూమిని రిజిస్ట్రేషన్ చేయకుండా అగ్రిమెంట్‌తో సరిపెట్టేసారు. పైగా ప్రతినెలా అద్దె, వడ్డీ చెల్లించకుండా కాలయాపన చేసేవారు. దీంతో తాము మోసపోయామని గ్రహించిన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని ఎండీ శ్రీలక్ష్మీ ప్రసాద్, అకౌంటెంట్ మంగలూరి వెంకట సత్య సుధీర్‌లను అరెస్టు చేశారు.

150 రోజుల్లో 3 రెట్ల లాభమంటూ...

- 53 మంది నుంచి రూ.1.66 కోట్లు వసూలు
- మ్యాక్స్ క్రిప్టో కరెన్సీ యజమాని ముజీబ్ అరెస్టు

సాక్షి, సిటీబ్యూరో: పెట్టిన పెట్టుబడికి 150 రోజుల్లో మూడు రెట్లు లాభం అందిస్తామని అమాయకులను ప్రలోభపెట్టాడు. గొలుసుకట్టు లాగా కొత్త కస్టమర్లను చేర్పిస్తే 2 శాతం, ఇద్దర్ని చేర్పిస్తే 5 శాతం కమిషన్ చెల్లిస్తానని పెట్టుబడి కోట్లు దండుకున్న ఘరానా మోసగాడు. ఎట్టకేలకు సైబరాబాద్ ఎకనామిక్ అఫెన్సెస్ వింగ్ (ఈఓడబ్ల్యూ)కి చిక్కాడు. పోలీసులు అతడిని జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్నూలుకు చెందిన [illegible] ముజీబ్ సయ్యద్, తన స్నేహితులతో కలిసి మ్యాక్స్ క్రిప్టో కరెన్సీ పేరిట ఆన్‌లైన్ ఇన్వెస్ట్‌మెంట్ స్కీమ్‌ను తెరపైకి తెచ్చాడు. ఆకట్టుకునే రీతిలో ఇన్వెస్ట్‌మెంట్ స్కీమ్ చేసి దానికి [illegible] రాబడి వస్తుందని ప్రజలను నమ్మించాడు. తొలుత కస్టమర్లను నమ్మించేందుకు లాభాలను అందించాడు.

ఆనోటా ఈ నోటా తెలిసి...

పాతబస్తీకి చెందిన 53 మంది నుంచి రూ.1.66 కోట్ల డిపాజిట్లు సేకరించి, అనంతరం కంపెనీ వెబ్‌సైట్, ఆండ్రాయిడ్ యాప్‌లను ముజీబ్ మూసేశాడు. ఫరూఖ్‌నగర్‌కు చెందిన షేక్ అఫ్జల్ అనే బాధితుడు 2022లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. సాంకేతిక ఆధారాలు సేకరించిన సైబరాబాద్ ఈఓడబ్ల్యూ పోలీసులు ముజీబ్ సయ్యద్‌ను అరెస్టు చేశారు.

కోడల్ని చంపిన అత్త

అత్తాపూర్: కుటుంబ కలహాల కారణంగా కోడల్ని హత్య చేసిన సంఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ వెంకటారెడ్డి, ఎస్ఐ నిమ్మల వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం... హసన్‌నగర్ ప్రాంతానికి చెందిన అబ్దుల్ [illegible] అల్తాఫ్‌తో సంగారెడ్డి జిల్లా జోగిపేటకు చెందిన ఆశ్మీరా బేగం(28)కు పదేళ్ల క్రితం వివాహమైంది. పెళ్లి జరిగిన నాటి నుంచి అత్త ఫర్హానా బేగం, ఆశ్మీరా మధ్య సఖ్యత లేదు. తరచూ వారు గొడవపడేవారు. ఈ క్రమంలో గురువారం [illegible] కోపోద్రిక్తురాలైన అత్త [illegible] గొంతు నులిమి చంపేసింది. అనంతరం అత్తాపూర్ పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయింది. ఈ హత్య కేసులో భర్త, మామ ప్రమేయం ఏమైనా ఉందా అని కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆశ్మీరా బేగం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

లైంగికదాడి.. నిందితుడికి 20 ఏళ్ల జైలు


నిందితుడు నర్సింహులు

మైలార్‌దేవ్‌పల్లి: ఇద్దరు బాలికలపై లైంగిక దాడికి పాల్పడ్డ నిందితుడికి గురువారం రంగారెడ్డి జిల్లా స్పెషల్ ఫాస్ట్‌ట్రాక్ పోక్సో కోర్టు 20 ఏళ్ల జైలుశిక్ష విధించింది. సంగారెడ్డి జిల్లా ఆందోల్ మండలం నాగులపల్లి ప్రాంతానికి చెందిన ఎన్. నర్సింలు (45) దినసరి కూలీ. అదే ప్రాంతానికి చెందిన ఓ మహిళ భర్త మృతి చెందడంతో ఇద్దరు కూతుళ్లు, కుమారుడితో కలిసి మైలార్‌దేవ్‌పల్లికి వలస వచ్చింది. కూలీనాలీ పనులతో పిల్లలను పోషిస్తోంది. ఈ క్రమంలో నర్సింహులుతో ఆమెకు ఏర్పడిన పరిచయం సహజీవనానికి దారితీసింది. ఆమె తన పిల్లలను ఇంటి వద్ద వదిలి స్వగ్రామానికి వెళ్లగా, అతడు వారిపై లైంగిక దాడి చేశాడు. ఇరుగుపొరుగు ఇచ్చిన సమాచారం మేరకు చందానగర్ పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. పోలీసులు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా, కేసు విచారణ అనంతరం జడ్జి తీర్పు వెల్లడించారు. బాధితులైన ఇద్దరు మైనర్ బాలికలకు ఐదేసి లక్షల రూపాయలు, బాలుడికి ఒక లక్ష రూపాయల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని తీర్పు చెప్పారు.

జాలర్లపై దాడి.. రౌడీషీటర్ రిమాండ్

మణికొండ: ఇద్దరు జాలర్లను బెదిరించి డబ్బులు లాక్కోవటంతోపాటు ఒకరిని కత్తితో పొడిచిన రౌడీషీటర్, మరో ఆరుగురిని నార్సింగి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఈ నెల 25వ తేదీ అర్ధరాత్రి పీరంచెరువులో చేపలు పడుతున్న వట్టేపల్లి సందీప్ కుమార్, జె.శ్రీరాములు వద్దకు దర్గా ఖలీజ్‌ఖాన్‌కు చెందిన రౌడీషీటర్ ఇర్ఫాన్, మరో ఏడుగురు వెళ్లారు. ఇద్దరు జాలర్లను బెదిరించి వారి వద్ద ఉన్న రూ.11 వేలు లాక్కున్నారు. ప్రతిఘటించిన సందీప్‌కుమార్‌ను కత్తితో పొడవడంతో అతడు తీవ్ర గాయాలపాలయ్యాడు. వెంటనే రౌడీషీటర్ ఇర్ఫాన్‌తోపాటు అతని అనుచరులు అక్కడి నుంచి పారిపోయారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఇర్ఫాన్‌తో పాటు అతని అనుచరులు అల్తాఫ్ హుస్సేన్, సయ్యద్ జునేద్, బొమ్మల రాజేష్, మరో ముగ్గురు మైనర్లను కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించారు.

చెరువు ఫెన్సింగ్‌ను ఎలా కూలుస్తారు?



చెరువు బఫర్‌జోన్ కబ్జా ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఈవీడీఎం డైరెక్టర్ రంగనాథ్

సాక్షి ఎఫెక్ట్..

ప్రశ్నించిన ఈవీడీఎం డైరెక్టర్ రంగనాథ్

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–12లోని ఎమ్మెల్యే కాలనీని ఆనుకుని ఉన్న లోటస్ చెరువు బఫర్‌జోన్‌లో కబ్జాదారులు పట్టపగలే బరి తెగించి కోట్లాది రూపాయల విలువ చేసే స్థలాన్ని ఆక్రమించి చేపట్టిన అక్రమ నిర్మాణాలపై అధికారులు స్పందించారు. ఈ కబ్జా వ్యవహారంపై గురువారం 'సాక్షి' దినపత్రికలో 'రూ. వంద కోట్ల స్థలం కబ్జాకు యత్నం' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి ఈవీడీఎం డైరెక్టర్ ఏవీ రంగనాథ్ స్పందించారు. ఘటనా స్థలాన్ని గురువారం ఆయన పరిశీలించారు. లోటస్ చెరువు ఫెన్సింగ్‌ను కూల్చిన విషయాన్ని తెలుసుకుని తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎలా కూలుస్తారంటూ సంబంధిత వ్యక్తిని ప్రశ్నించారు. వెంటనే ఫెన్సింగ్‌ను తిరిగి నిర్మించాలని, బఫర్ జోన్‌లో నింపిన మట్టిని తొలగించాలని ఆదేశించారు. రంగనాథ్ బఫర్ జోన్‌ను పరిశీలిస్తున్న సమయంలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కూడా అక్కడకు చేరుకున్నారు. బఫర్ జోన్‌లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్న తీరును వివరించారు. సుమారు గంటపాటు రంగనాథ్ ఆ ప్రాంతంలో పర్యటించి చుట్టూ ఫెన్సింగ్‌ను పరిశీలించి ఈవీడీఎం సెక్యూరిటీ గార్డ్‌లకు, ఇంజనీర్లకు తగిన సూచనలు జారీ చేశారు. ఆయన వెంట ఇరిగేషన్ శాఖ ఎస్‌ఈ, డీఈ, ఏఈ, షేక్‌పేట మండల రెవెన్యూ అధికారులు, జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు ఉన్నారు. ఎంతమేర బఫర్ జోన్‌లో అక్రమ నిర్మాణాలకు తెగపడ్డారో పరిశీలించి కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు.

చెరువు కబ్జాదారుడిపై కేసు నమోదు

బంజారాహిల్స్: ఫిలింనగర్ రోడ్డు నెంబర్–11 వైపు లోటస్ చెరువు బఫర్‌జోన్‌ను ఆక్రమించి ఫెన్సింగ్‌ను కూల్చివేసి చెట్లను కొట్టేసి ప్రజా ఆస్తులను ధ్వంసం చేసిన కబ్జాదారుడిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని జీహెచ్‌ఎంసీ ఈవీడీఎం ఏఈ బి.సుజిత్ ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాలివీ... లోటస్ చెరువులో పార్కు ప్రహరీని కూల్చివేసి ప్లాట్‌నెంబర్–30 యజమాని గోకుల్ నార్నే ఈ స్థలాన్ని ఆక్రమించడమే కాకుండా ఆస్తులను తెబ్బతీనేలా చేశారని ఆరోపించారు. మార్కెట్ స్పేస్ సిస్టం ప్రైవేట్ లిమిటెడ్ యజమాని గోకుల్ నార్నే ఈ కంపౌండ్ వాల్ కూల్చారని, అక్రమంగా బఫర్ జోన్‌లోకి ట్రెస్‌పాస్ చేశారని ఆరోపించారు. జీహెచ్‌ఎంసీ పార్కు కంపౌండ్‌ను కూల్చడం, అక్రమంగా పార్కు స్థలంలోకి చొచ్చుకువెళ్లడం, మట్టిని డంప్ చేయడం, చెట్లను నరికేయడం నేరమన్నారు. తాము గురువారం కబ్జా జరుగుతున్న ప్రాంతంలోకి వెళ్లి పరిశీలించగా ఇదంతా వాస్తవమని తేలిందన్నారు. 60 ఫీట్ల ఎత్తు ఉన్న ఈ కంపౌండ్‌ను ధ్వంసం చేశారన్నారు. వర్షాకాలంలో ఇలా ప్రహరీని కూల్చివేయడం వల్ల వరదలతో నష్టం వాటిల్లే ప్రమాదం కూడా ఉందన్నారు. ఈ నేపథ్యంలోనే ఫిలింనగర్ కో ఆపరేటివ్ సొసైటీ ప్లాట్ నెంబర్–30 యజమాని గోకుల్ నార్నేపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని, వాల్టా చట్టాన్ని ఉల్లంఘించిన ఆయనపై కేసు నమోదు చేయాలని కూడా కోరారు. ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బఫర్ జోన్‌లో ఆక్రమణల కూల్చివేత



అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న దృశ్యం

బంజారాహిల్స్: ఫిలింనగర్ రోడ్డు నెంబర్–11లోని లోటస్ చెరువు బఫర్ జోన్‌లో అక్రమ నిర్మాణాలను గురువారం ఈవీడీఎం అధికారులు కూల్చివేశారు. కొంతకాలంగా గోకుల్ నార్నె అనే వ్యాపారవేత్త ఈ స్థలాన్ని ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టగా ఫిర్యాదులు అందుకున్న అధికారులు వాటిని నేలమట్టం చేశారు. పెద్ద ఎత్తున బఫర్ జోన్‌లో అక్రమ నిర్మాణాలు జరిగినట్లుగా గుర్తించారు. చెరువులను ఆక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఈవీడీఎం డైరెక్టర్ రంగనాథ్ హెచ్చరించారు. కబ్జాదారులను వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. ఎంత ధైర్యం ఉంటే చెరువులోకి అక్రమంగా ప్రవేశించి నిర్మాణాలు చేపడతారని, కబ్జాదారులపై చర్యలకు ఏమాత్రం వెనుకాడేది లేదన్నారు.

కరాటేలో సత్తాచాటిన విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న సినీ హీరో సుమన్

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–12లోని ఎన్‌బీటీనగర్ ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న 30 మంది విద్యార్థులు గత కొంత కాలంగా కరాటే నేర్చుకుంటూ అందులో తర్ఫీదు పొందారు. వీరందరినీ గురువారం సినీ హీరో సుమన్ ప్రత్యేకంగా అభినందించారు. ఫునాకోషి షోటోఖాన్ కరాటే ఫెడరేషన్ ఇండియాలో శిక్షణ పొందిన విజయ్‌కుమార్ వీరందరికీ కొంతకాలంగా శిక్షణనిస్తూ కరాటేలో ప్రావీణ్యులను చేశారు. అశ్వక్ అహ్మద్ అనే విద్యార్థి ఐదు సార్లు బ్లాక్ బెల్టు సాధించారు. అలాగే నవీన్, రాహుల్, చార్లెస్, శ్రీజ తదితరులు కూడా బ్లాక్ బెల్టు సాధించారు. మిగతా వారంతా కలర్ బెల్టులో శిక్షణ పొందుతున్నారని విజయ్‌కుమార్ తెలిపారు. వీరందరినీ కలిసిన సుమన్ ఎంతో ఆనందం వ్యక్తంచేశారు. భవిష్యత్తులో మరింత ఉత్తమ ప్రతిభ కనబరిచి కరాటేలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని వారిని ఆశీర్వదించారు. ప్రత్యేకంగా ఒక్కో విద్యార్థితో మాట్లాడారు. విద్యార్థులు సుమన్‌ను కలిసిన తరువాత తమ ఆనందాన్ని పంచుకున్నారు.

కుండీలు వృథా



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఇంటికి దారి తీసే రోడ్డులో గతంలో రోడ్డు మధ్యలో సెంట్రల్ మీడియన్ లాగా ఏర్పాటు చేసి భారీ కుండీల్లో మొక్కలు నాటారు. కొన్ని రోజుల తర్వాత ఇక్కడ రోడ్డు ఇరుకుగా మారడంతో ఆ కుండీలన్నీ తీసి పక్కన వేసేశారు. రోడ్డు పక్కన వృథాగా ఈ ఉన్న ఈ భారీ కుండీల్లో మొక్కలు నాటాలని స్థానికులు కోరుతున్నారు. ఇలా వృథాగా రోడ్డు పక్కన వేయడం వల్ల ఎటువంటి ప్రయోజనం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఈ కుండీలను వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

మురికివాడల్లో పెండింగ్ పనులకు నిధులివ్వండి

రహమత్‌నగర్: రహమత్‌నగర్ డివిజన్‌లోని మురికివాడల్లో పెండింగ్ పనులకు నిధులు మంజూరు చేయాలని జలమండలి ఎండీ అశోక్‌రెడ్డికి కార్పొరేటర్ సి.ఎస్.రెడ్డి గురువారం వినతి పత్రం సమర్పించారు. ప్రధానంగా స్లమ్ ఏరియాల్లో అనేక పెండింగ్ పనులకు నిధులు మంజూరుకాక నిలిచిపోయాయని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. తాను చేసిన వినతిపై ఎండీ సానుకూలంగా స్పందించారని కార్పొరేటర్ తెలిపారు.



ఎండీకి వినతి పత్రమిస్తున్న కార్పొరేటర్

విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు



చిక్కడపల్లి: విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ అంతరాయం లేకుండా మెరుగైన సేవలు అందించే దిశగా చర్యలు తీసుకుంటామని టీజీఎస్‌పీడీసీఎల్ సెంట్రల్ ఆపరేషన్ ఎస్‌ఈ పీ.బ్రహ్మం అన్నారు. విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలను అందించడానికి కొత్తగా రూపొందించిన టీజీఏఐఎంఎస్ యాప్ తీసుకొచ్చారు. ఇందుకు సంబంధించి సర్వే చేస్తున్నారు. గురువారం అశోక్‌నగర్, గాంధీనగర్‌లో ప్రాంతాలల్లో సర్వే పనులను ఎస్‌ఈ పి.బ్రహ్మం అధికారులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీజీఏఐఎంఎస్ యాప్ ద్వారా వినియోగరారుల ఫిర్యాదు మేరకు ఖచ్చితమైన వారి నివాస ప్రాంతాలను గుర్తించి వెంటనే మరమ్మత్తులు చేయడానికి వీలుఉంటుందన్నారు. సైఫాబాద్ డివిజన్‌లో దాదాపు 138 ఫీడర్లు ఉన్నాయని, వీటిలో 11కేవీ ఫీర్లు 40 ఫీడర్ల సర్వే పూర్తి అయిందన్నారు.

ఇక్కడ కొండను తొలిచారు.. అక్కడ వంతెన నిర్మించారు..!

- ట్రాఫిక్ రద్దీ నివారణకు మరో రెండు మార్గాలు
- తుది దశకు చేరుకున్న రోడ్ల నిర్మాణాలు
- జూబ్లీహిల్స్ చౌరస్తాపై తగ్గనున్న వాహనభారం
- బంజారాహిల్స్ తెలంగాణ భవన్ వద్దా తగ్గనున్న ట్రాఫిక్ ఇక్కట్లు



బంజారాహిల్స్ రోడ్డు నెం-2 అన్నపూర్ణ స్టూడియో ముందు కొండను తొలిచి వేస్తున్న రోడ్డు

బంజారాహిల్స్: రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని దృష్టిలో పెట్టుకుని అధికారులు ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించారు. ప్రధాన చౌరస్తాల్లో ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు కొత్త రోడ్లకు శ్రీకారం చుట్టారు. ఇందుకు హైదరాబాద్ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌ఆర్‌డీసీఎల్) తగిన కార్యాచరణ ప్రణాళికతో రెండు చోట్ల రహదారుల నిర్మాణం చేపట్టి త్వరలోనే వాటిని అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కసరత్తు చేస్తోంది.

- బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–2లోని అన్నపూర్ణ స్టూడియో వద్ద రోడ్డు మార్గం కోసం కొండను తవ్వారు. ఇక్కడ అప్పటికే ఉన్న మంచినీటి పైప్‌లైన్లను, ఎలక్ట్రిసిటీ కేబుళ్లను, డ్రైనేజీ పైప్‌లైన్లను మరోచోటికి మార్చారు. సుమారు రూ. 3 కోట్లతో ఇక్కడ రోడ్డు నిర్మాణ పనులు పూర్తికావచ్చాయి.
- యూసుఫ్‌గూడ కృష్ణానగర్ వైపు నుంచి బంజారాహిల్స్ రోడ్డునెంబర్–2 వైపు వచ్చేవారికి, బంజారాహిల్స్ వైపు నుంచి కృష్ణానగర్ వైపు వెళ్లేవారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. జూబ్లీహిల్స్ చౌరస్తాపై ట్రాఫిక్ భారం తగ్గిపోనుంది. గత ఏడాది కాలంగా ఈ నిర్మాణ పనులు దాదాపు తుది దశకు చేరుకున్నాయి.

తెలంగాణ భవన్ వద్ద...

బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–10లోని తెలంగాణ భవన్ మీదుగా అగ్రసేన్ చౌరస్తా, కళింగ భవన్, జగన్నాథ టెంపుల్, ఒమేగా హాస్పటల్ ప్రాంతమంతా నిత్యం ట్రాఫిక్‌తో కిటకిటలాడుతుంది. రోడ్లు ఇరుకుగా ఉండటం, అందుకు అనుగుణంగా విస్తరణ నోచుకోకపోవడంతో ట్రాఫిక్ ఇక్కట్లు నరకాన్ని చూపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే తెలంగాణ భవన్‌ను ఆనుకుని 550 మీటర్ల మేర కొత్త రోడ్డు నిర్మాణానికి హెచ్‌ఆర్‌డీసీఎల్ శ్రీకారం చుట్టింది.

- రూ. 9 కోట్ల వ్యయంతో ఈ రోడ్డు నిర్మాణం దాదాపుగా పూర్తి కావచ్చింది. రోడ్డు మధ్యలో వంతెన నిర్మించారు. దీంతో ఇక్కడ రాకపోకలు సాఫీగా సాగనున్నాయి. మరికొద్ది రోజుల్లోనే ఈ రోడ్డు అందుబాటులోకి రానుంది.
- ఫలితంగా తెలంగాణ భవన్, అగ్రసేన్ చౌరస్తాల్లో ట్రాఫిక్ రద్దీ చాలావరకు తగ్గిపోనున్నది. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–12 కమాండ్ కంట్రోల్ వైపు వెళ్లేవారు తెలంగాణ భవన్ వెనుక నిర్మించిన కొత్త రోడ్డు నుంచి సాఫీగా వెళ్లిపోవచ్చు. ఈ నేపథ్యంలో వాహనదారుల్లో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి.



బంజారాహిల్స్ రోడ్డు నెం-10లోని తెలంగాణ భవన్ వెనుక వంతెన నిర్మించి వేస్తున్న రోడ్డు

కూరగాయల ధరలు



శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ రైతుబజార్‌లో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 43, నల్ల వంకాయ 35, పొడుగు వంకాయ 35, బెండకాయ 50, పచ్చిమిర్చి 65, బజ్జీమిర్చి 50, క్యాప్సికమ్ 65, పచ్చకాకర , పందిరి బీర 52, క్యాబేజీ 23, క్యారెట్ 40, దొండ 18, గుండు బీన్స్ 105, గింజ చిక్కుడు 65, గోకరకాయ 50, కీర 23, ఉల్లిగడ్డ 30, ఆలుగడ్డ 37, చామగడ్డ 35, మొరంగడ్డ 40, కందగడ్డ 50, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటికాయ 10, మునగకాయ 4–5, ముల్లంగి రూ. 5–6 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

విద్యతోనే ఉజ్వల భవిత



పుస్తకాలను పంపిణీ చేస్తున్న విజయారెడ్డి

హిమాయత్‌నగర్: విద్య వల్లనే చిన్నారులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.విజయారెడ్డి అన్నారు. గురువారం హిమాయత్‌నగర్ డివిజన్ స్ట్రీట్ నం.14లోని పీఆర్ విద్యాలయ ప్రభుత్వ పాఠశాలలో పీజేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటు పుస్తకాలను ఆమె పంపిణీ చేశారు. పాఠశాల హెచ్‌ఎం సుజాత, కాంగ్రెస్ పార్టీ నాయకులు ముజ్జులాల, దిలీప్, రాజ్‌రెడ్డి, జావీద్, కమల, ఫారుఖ్, శివ పాల్గొన్నారు.

స్ఫూర్తిప్రదాత బొజ్జా తారకం

లిబర్టీ: అణగారిన ప్రజలకు ఆయుధాలివ్వాలని నినదించిన గొంతుక బొజ్జా తారకం అని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ అన్నారు. ప్రముఖ న్యాయవాధి హేతువాది బొజ్జా తారకం జయంతిని మాల మహానాడు కార్యాలయంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన బొజ్జా తారకం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... దేశంలో అణచివేతకు గురైన ప్రజలకు న్యాయం జరగనప్పుడు తమను తాము రక్షించుకోవడానికి ప్రభుతద్వమే ఎస్సీలకు, ఎస్టీలకు ఆయుధాలు ఇవ్వాల్సిన బాధ్యత ప్రజాస్వామిక దేశంలో ఉందని బొజ్జా తారకం అనేక దళిత బహుజన, ఐక్యత బహిరంగ సభల్లో నినాదించారన్నారు. కారంచేడు, చుండూరు పదిరి, కుప్పం మొదలుకొని లక్ష్మింపేట మాలలపై ఆనాటి పాలకులు చేసిన మారణకాండను ప్రతిఘటించిన ప్రజల నేత బొజ్జా తారకం అని అన్నారు. అలాగే దేశంలోని ఏ మూలన ప్రజలపై దాడులు జరిగినా... ప్రజలపైన తప్పుడు కేసులు పెట్టినా వెంటనే బాధిత కుటుంబ మధ్య ఉండి వారికి న్యాయం జరిగే వరకు పోరాడిన ప్రజల గొంతుక బొజ్జతారం అన్నారు. అలాంటి గొప్ప నాయకుడి ఆశయాల కోసం నేటి యువత నడవాలన్నారు.

హక్కుల దిక్సూచి బొజ్జా తారకం



బొజ్జతారకం పుస్తకాలను ఆవిష్కరిస్తున్న జస్టిస్ చంద్రయ్య

మానవ హక్కుల కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ చంద్రయ్య

హిమాయత్‌నగర్: హక్కుల దిక్సూచి, రాజ్యాంగ సంరక్షకుడు, పీడిత ప్రజల గొంతుక బొజ్జా తారకం అని రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ జి.చంద్రయ్య కొనియాడారు. న్యాయవాదిగా, హక్కుల కార్యకర్తగా, రచయితగా ఆయన సమాజానికి చేసిన సేవలు మరువలేనివన్నారు. గురువారం బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో బొజ్జా తారకం ట్రస్ట్ ఆధ్వర్యంలో బొజ్జా తారకం జయంతి నిర్వమించారు. ఈ సందర్భంగా ఆయన తెలుగులో అనువదించిన బుద్ధుని ప్రవచకం, బొజ్జా తారకం వ్యాసాలు, ఆయన సతీమణి డాక్టర్ బి.విజయభారతి రచించిన 'స్వతంత్ర భారత దేశం స్త్రీలకు గుప్పెడు దూళినే మిగిలిందా' వ్యాస సంపుటిని ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జస్టిస్ చంద్రయ్య మాట్లాడుతూ... బొజ్జా తారకం చేసిన రచనలు నేటి సమాజానికి ఎంతో అవసరమన్నారు. సమస్యల పరిష్కారంలో, అత్యాచారాలను ఎదురించడంలో బొజ్జా తారకం నేటికీ ఆదర్శమన్నారు. కార్యక్రమానికి ప్రముఖ కవి డాక్టర్ శిఖామణి అధ్యకత వహించగా ప్రొఫెసర్ జి.సత్యనారాయణ, ప్రొఫెసర్ రాణి, మాజీ జిల్లా జడ్జి నిమ్మ నారాయణ, బొజ్జా తారకం ట్రస్ట్ ప్రతినిధి గనుమల జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బొజ్జా తారకం సతీమణి డాక్టర్ విజయభారతిని జస్టిస్ చంద్రయ్య శాలువాతో ఘనంగా సత్కరించారు.

ఖాతాదారులకు అత్యాధునిక సేవలే లక్ష్యం



ఫెడరల్ బ్యాంక్‌ను ప్రారంభిస్తున్న సుందరి

వెంగళరావునగర్: ఖాతాదారులకు అత్యాధునిక, అత్యుత్తమ సేవలను నిరంతరాయంగా అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఫెడరల్ బ్యాంక్ భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని సెయింట్ జోసఫ్స్ స్కూల్ (మలక్‌పేట) ప్రిన్సిపాల్ యు.ఎ.సుందరి ఆకాంక్షించారు. వెంగళరావునగర్ ప్రధాన రహదారిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఫెడరల్ బ్యాంక్‌ను గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సుందరి మాట్లాడుతూ... ఈ బ్రాంచ్ నిస్సందేహంగా కస్టమర్స్‌కు బ్యాంకింగ్ అనుభవాన్ని మెరుగు పరుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర పోలీస్ అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... ఏటీఎం స్థానికులకు మరిన్ని సేవలు అందించడానికి ఉపయోగపడుతుందన్నారు. ఆర్‌కే ఓవర్సీస్ ఎండీ కృష్ణమూర్తి, బ్యాంక్ డిప్యూటీ వైస్ ప్రెసిడెంట్ చార్లీ దేవాసియా, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ షాలినీ వారియర్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మనోజ్, దిలీప్, బ్రాంచ్ హెడ్ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్లు చోరీ...

వెంగళరావునగర్: రాత్రి పడుకుని నిద్రలేచేలోపు సెల్‌ఫోన్లు చోరీకి గురైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... జవహర్‌నగర్ నివాసి డి.పూర్ణచంద్రరావు కార్పెంటర్‌గా పనిచేస్తాడు. ఈ నెల 26 రాత్రి తన స్నేహితులతో కలిసి రూంలో నిద్రపోయి తెల్లవారుజామున లేచి చూసేసరికి అతనితో పాటు తన స్నేహితులు సురేష్‌దాస్, చందులకు చెందిన మూడు సెల్‌ఫోన్లు, రూ. 4 వేలు మాయమయ్యాయి. దాంతో గురువారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు.

ల్యాప్‌టాప్...

రూంలో భద్రపరిచిన ల్యాప్‌టాప్ మాయమైంది మధురానగర్ పోలీసుల సమాచారం మేరకు... జె.రవీందర్ ఎల్లారెడ్డిగూడ కమ్యూనిటీ హాల్ సమీపంలో నివసిస్తుంటాడు. ఈ నెల 26న తన రూంలో ల్యాప్‌టాప్ పెట్టి నిద్రపోయాడు. ఉదయం లేచి చూసేసరికి ల్యాప్‌టాప్ కనిపించలేదు.

డెలివరీ ఇచ్చి వచ్చేలోగా గ్యాస్ సిలిండర్ మాయం

వెంగళరావునగర్: డెలివరీ ఇచ్చి వచ్చేలోగా మరో గ్యాస్ సిలిండర్ మాయమైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... జవహర్‌నగర్‌కు చెందిన కురుమూర్తి హెచ్‌పి గ్యాస్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తాడు. ఈ నెల 26న తన సోదరుడు మహేష్‌తో కలిసి ఎల్లారెడ్డిగూడలో ఆటో నిలిపి గ్యాస్ డెలివరీ ఇచ్చి తిరిగి వచ్చారు. ఈలోగా ఆటోలో ఉండాల్సిన గ్యాస్ సిలిండర్ మాయమైంది. చుట్టుపక్కల వెదకగా దేవావత్ ధీరజ్‌కుమార్ అనే వ్యక్తి గ్యాస్ తీసుకెళుతూ కనిపించాడు. దొంగ అంటూ కేకలు వేసి వెంబడించినా ఫలితం లేకుండా పోయింది. దాంతో బాధితుడు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు.

పెండింగ్ పనులను వేగవంతం చేయండి



రోడ్డును పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్

బంజారాహిల్స్: పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగిరం చేయాలని జూబ్లీహిల్స్ డివిజన్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ అధికారులకు సూచించారు. డివిజన్ పరిధిలోని ఫిలింనగర్ గౌతమ్‌నగర్ చౌరస్తా నుంచి ఏబీఎస్ వరకు నిర్మించే రోడ్డును జీహెచ్‌ఎంసీ, వాటర్‌వర్క్స్ అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలని, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఈ సందర్భంగా కార్పొరేటర్ వారికి సూచించారు. త్వరలో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తామని జీహెచ్‌ఎంసీ ఈఈ విజయ్‌కుమార్ తెలపగా, సీవరేజ్ పనులను సైతం వెంటనే ప్రారంభిస్తామని వాటర్‌వర్క్స్ మేనేజర్ పవన్ తెలిపారు.

రోడ్ల పక్కన చెత్త వేసే వారికి జరిమానాలు విధించండి

ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి



ఎస్‌ఎఫ్‌ఏలతో మాట్లాడుతున్న జెడ్‌సీ అనురాగ్ జయంతి

బంజారాహిల్స్: వ్యాపార సంస్థలు ఇష్టానుసారంగా రోడ్ల పక్కన బహిరంగంగా చెత్త వేస్తే వారికి జరిమానాలు విధించాలని జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి ఏఎంఓహెచ్‌లు, ఎస్‌ఎఫ్‌ఏలను ఆదేశించారు. గురువారం జోనల్ పరిధిలో ఆయన అధికారులతో కలిసి క్షేత్రస్థాయి తనిఖీలు చేపట్టారు. స్వీపింగ్ విధానాన్ని, రోడ్ల పక్కన చెత్తా చెదారం వేస్తున్న పైనాన్ని పరిశీలించారు. శానిటేషన్ యాక్టివిటీస్‌పై ఆయన పలు సూచనలు చేశారు. గార్బేజ్ వల్లరబుల్ పాయింట్స్ (జీవీపీ) వద్ద చెత్తను వ్యాపారులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా వ్యాపార సంస్థలకు స్వచ్ఛ ఆటో టిప్పర్లను అనుసంధానం చేసి చెత్తను కలెక్ట్ చేసుకునేలా చూడాలన్నారు.

అక్రమ పార్కింగ్‌లతో ఇబ్బందులు



మాజీ మంత్రి నివాసానికి దారి తీసే వీధిలో అక్రమ పార్కింగ్‌లు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని ఎన్బీటీ నగర్ కమాన్‌లో స్థానికుల అక్రమ పార్కింగ్‌లతో అవస్థలు పడుతున్నారు. మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి నివాసం నుంచి చివరి వరకు రెండు వైపులా కొంత మంది వ్యక్తులు ఇష్టారాజ్యంగా పార్కింగ్‌లు చేసి వెళ్తుండటంతో ఇక్కడ రోడ్డంతా కుంచించుకుపోయి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పలుమార్లు ఈ సమస్యను ట్రాఫిక్ పోలీసులకు చెప్పినా పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

చిన్న పరిశ్రమల పెండింగ్ నిధులను విడుదల చేయాలి



మాట్లాడుతున్న సంఘం అధ్యక్షుడు దానియల్

హిమాయత్‌నగర్: పదేళ్లుగా ఎమ్‌ఎస్‌ఎంఈ, వాహనాల, చిరు వ్యాపారుల, చిన్న పరిశ్రమల యాజమానులు తీవ్ర నిరాశతో ఉన్నారని ఎమ్‌ఎస్‌ఎంఈ రైట్స్ ప్రొటెక్షన్, వెల్ఫేర్ అసోసియేషన్ ఆందోళన వ్యక్తం చేసింది. గత ప్రభుత్వం తమకు రావాల్సిన రూ. 474 కోట్ల నిధులకు సంబంధించి ఆర్డర్ రిలీజ్ చేసి, ఆ నిధులను కుట్ర పురితంగా దారి మళ్లించిందని సంఘం అధ్యక్షుడు డానియల్ మండల మండిపడ్డారు. గురువారం బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ... ప్రభుత్వం వెంటనే పెండింగ్ నిధులను విడుదల చేసి చిన్న పరిశ్రమలను, జీవనోపాధి లేక సర్వీస్ సెక్టార్ వాహనాల, ఎస్సీ, ఎస్టీ, బీసీ లబ్దిదారుల జీవితాలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎస్సీ, ఎస్టీ పారిశ్రామిక వేత్తలకు 'రోస్టర్ విధానం'పై భూములను కేటాయించాలన్నారు. గత ప్రభుత్వంలో టీఎస్ఐఐసీ చట్ట వ్యతిరేక విధానం ద్వారా తమకు కేటాయించాల్సిన భూములు వారి బినామీలకు అక్రమంగా అప్పగించి అన్యాయం చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టుబడులకు అనుకూలమైన ప్రోత్సాహకాలు ఇవ్వాలని, సబ్సిడీని రూ. 20 లక్షల నుంచి రూ. 50 లక్షలకు పెంచాలని, మహిళా పారిశ్రామిక వేత్తలకు సబ్సిడీ రూ. 70 లక్షలకు పెంచాలని కోరారు. సంఘం సలహాదారులు గొల్లపల్లి దయానంద్ రావు, ప్రధాన కార్యదర్శి ఎం.ప్రవీణ్, ప్రతినిధులు వేణుగోపాల్ నాయుడు, సురేష్, ప్రశాంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జాతీయ సదస్సు

కాచిగూడ: మార్వాడి శిక్షా సమితి, రామ్‌నాథ్ గుల్జారీలాల్ కేడియా కాలేజ్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో ఈ నెల 28, 29 తేదీల్లో కాచిగూడలోని కళాశాలలో భవిష్యత్ వ్యాపార ధోరణులు, అత్యాధునిక ఆవిష్కరణలపై జాతీయ సెమినార్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం సహకారంతో జరిగే సెమినార్‌లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సస్పెన్షన్ ఎత్తివేయాలి

సాక్షి, సిటీబ్యూరో: మారేడుపల్లి మండల తహసీల్దార్, ఆర్ఐ, రికార్డు అసిస్టెంట్లపై సస్పెన్షన్ ఎత్తివేయాలని ట్రెసా డిమాండ్‌చేసింది. ట్రెసా అధ్యక్షుడు వంగ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రతినిధుల బృందం జిల్లా కలెక్టర్‌ను గురువారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఆర్నెల్లుగా రెవెన్యూ ఉద్యోగులు ఎన్నికల విధులు నిర్వర్తించారని, విధుల్లో జాప్యం కారణంగా ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడాన్ని నివారించాలని విజ్ఞప్తి చేశారు. దీనివల్ల ఉద్యోగుల మనోస్థైర్యం దెబ్బతినే ప్రమాదం ఉందని, తక్షణమే ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. దీనికి హైదరాబాద్ జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించి ఉద్యోగులపై సస్పెన్షన్ ఎత్తివేసి వారిని విధుల్లోకి తీసుకుంటామని హామీ ఇచ్చారని ట్రెసా ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.గౌతమ్‌కుమార్, ఆర్డీవోలు కె.మహిపాల్, దశరథ్ సింగ్, ఉపాధ్యక్షులు కె.నిరంజన్ రావు, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు వకీల్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అనితారెడ్డి, సభ్యులు కె.అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూను సందర్శించిన ఇండోనేషియా కాన్సుల్ జనరల్



ఇండోనేషియా బృందంతో హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు తదితరులు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీని రిపబ్లిక్ ఆఫ్ ఇండోనేషియా కాన్సుల్ జనరల్, ఇతర అధికారులు గురువారం సందర్శించారు. ముంబై కార్యాలయం ఇండోనేషియా కాన్సుల్ జనరల్ ఎడ్డీ వార్డోయో, కాన్సుల్ (ప్రోటోకాల్ అండ్ కాన్సులర్) ఎండి.కే.ఐ.జింటింగ్, వీసా ఆఫీసర్ మహ్మద్ సైఫ్రుద్దీన్ అఖ్యార్‌తో కలిసి ఇఫ్లూ హైదరాబాద్ పీహెచ్‌డీ విద్యార్థి ఫిల్జాఫర్హానా హసిబున్, వరంగల్ నిట్ బీటెక్ విద్యార్థి ఫర్రాస్ చైదర్ రహమాన్‌తో కూడిన బృందం సందర్శించారు. ఇంటర్నేషనల్ అఫైర్స్ కార్యాలయం డైరెక్టర్ ప్రొఫెసర్ చేతన్ శ్రీవాస్తవ ఇండోనేషియా బృందానికి స్వాగతం పలికారు. అనంతరం విశ్వవిద్యాలయం పనితీరు, అంతర్జాతీయ సహకారాల గురించి సంక్షిప్తంగా అవగాహన కల్పించారు. హెచ్‌సీయూతో ఇండోనేషియాలోని వివిధ విశ్వవిద్యాలయాల మధ్య సహకారం కోసం అన్వేషించగల వివిధ అంశాలను వారి దృష్టికి తీసుకొచ్చారు. ఆ తర్వాత ఇండోనేషియా బృందం హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజే రావుతో సమావేశమయ్యారు. హెచ్‌సీయూలో అందించే కోర్సులు, పరిశోధనా విధానాలను ఆయన వివరించారు. ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఎమినెన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం ఘనశ్యామ్‌కృష్ణ, ఆర్అండ్‌డీ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్ఎల్ సబాత్, ఆఫీస్ ఆఫ్ ఇంటర్నేషనల్ అఫైర్స్ అసోసియేట్ డైరెక్టర్ ప్రొఫెసర్ అలోక్‌కుమార్‌మిశ్రా, పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ ఆశిష్‌జాకబ్ థామస్ పాల్గొన్నారు.

హెచ్ఎండీఏ భూమిలో ఆక్రమణల కూల్చివేత



ఎంఏనగర్‌లో అక్రమ నిర్మాణాలు కూల్చివేయిస్తూ..

మియాపూర్: మియాపూర్‌లోని ఎంఏనగర్ సమీపంలోని సర్వే నంబర్–100, 101 హెచ్ఎండీఏ భూమిని ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను హెచ్ఎండీఏ అధికారులు కూల్చివేశారు. హెచ్ఎండీఏ అధికారి గౌతమ్ పర్యవేక్షణలో పోలీసుల బందోబస్తు మధ్య ఎనిమిది అక్రమ నిర్మాణాలను జేసీబీ సహాయంతో కూల్చివేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు హెచ్ఎండీఏ పర్యవేక్షిస్తున్న సర్వే నంబర్–100, 101లో అక్రమ నిర్మాణాలను కూల్చివేసినట్లు హెచ్ఎండీఏ అధికారి గౌతమ్ తెలిపారు. ఇక్కడి స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టి అందులో నివాసం ఉంటున్న వారు ఖాళీ చేయాలని నోటీసులు ఇచ్చారు. కూల్చివేసిన నిర్మాణాలను మళ్లీ చేపడితే ఉపేక్షించేది లేదని, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. చుట్టూ కంచె నిర్మాణాల పనులు శరవేగంగా ప్రారంభమయ్యాయని, మరికొద్ది రోజుల్లో చుట్టూ కంచె నిర్మాణం పూర్తిచేసి భూమిని కాపాడతామని తెలిపారు.

అభివృద్ధి పేరుతో ప్రకృతి విధ్వంసం సరికాదు

పంజగుట్ట: అభివృద్ధి పేరుతో ప్రకృతి విధ్వంసం సృష్టించడం సరికాదని మహారాష్ట్ర ప్రణాళికా సంఘం మాజీ సభ్యుడు ప్రొఫెసర్ హెచ్.ఎమ్.దేశార్థ అన్నారు. హైదరాబాద్‌కు ఆక్సిజన్ హబ్‌గా ఉన్న పొలాలు, అడవుల్లో పరిశ్రమలు ఏర్పాటు చేయడం భావితరాలకు మంచిది కాదని అభిప్రాయపడ్డారు. రంగారెడ్డి జిల్లా మాచర్ల మండలంలో మెగాసిటీ కోసం ప్రభుత్వం సేకరించాలనుకుంటున్న భూముల్లో పొలాలు కోల్పోతున్న గ్రామాల్లో పర్యటించి గ్రామస్తులతో మాట్లాడిన ఆయన, తన బృందం గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తన అనుభవాలు వివరించారు. ఇదే స్థలాల్లో గత ప్రభుత్వం ఏర్పాటు చేస్తానన్న ఫార్మాసిటీని రద్దు చేయడం సంతోషకరమన్నారు. దానిస్థానంలో మెగాసిటీ పేరుతో మరో ప్రాజెక్టు తీసుకురావడం బాధాకరమన్నారు. ఇక్కడి ప్రజలు తాము ప్రస్తుతం ఆర్థికంగా, ఆరోగ్యంగా, మంచి ప్రకృతితో ఎంతో సంతోషంగా ఉన్నామని, మాకు ఇంతకన్నా అభివృద్ధి వద్దు అంటున్నారని పేర్కొన్నారు. పర్యావరణ వేత్తలు డాక్టర్ బాబురావు, కవుల సరస్వతి, పాత్రికేయుడు తంగెళ్ల శివప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

అమ్మలా లాలన

గాంధీలో వృద్ధుల కోసం జెరియాట్రిక్ విభాగం

- మహిళలు, పురుషులకు వేర్వేరుగా 40 పడకలు
- ఆహ్లాదం కలిగించే అందమైన ఆకృతులు
- మానసిక ఉల్లాసంతో త్వరితగతిన స్వస్థత
- ఆప్యాయత, ప్రేమతో మానసిక చికిత్సలు
- త్వరలోనే అందుబాటులోకి..



ఉత్సాహం నింపే బొమ్మలతో కలర్‌ఫుల్ వాల్..

గాంధీఆస్పత్రి: ముదిమి వయసులో శారీరక, మానసిక వ్యాధులు వెంటాడుతుంటాయి. వయసురీత్యా వచ్చే పలు రకాల రుగ్మతలు పట్టి పీడిస్తుంటాయి. తనకు తాను దూరమై, కుటుంబ సభ్యులకు భారమై జీవచ్ఛవాలుగా బతుకుతున్న వయోవృద్ధులు ఎందరో.. అటువంటి వారిని అక్కున చేర్చుకుని మెరుగైన వైద్యసేవలు అందించి, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించి, వారిలో మానసిక, శారీరక ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని నింపి పునర్జన్మ ప్రసాదించేందుకు సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో జెరియాట్రిక్ వార్డు (వృద్ధుల విభాగం) త్వరలో అందుబాటులోకి రానుంది. 65 నిండిన వృద్ధుల్లో మానసిక, శారీరక తత్వాలు భిన్నంగా ఉంటాయి. మానసిక అనుబంధాల కోసం వెంపర్లాడుతుంటారు. ఇమ్యూనిటీ, రోగ నిరోధకశక్తి తగ్గిపోతుంది. ప్రధాన అవయవాలు సరిగా పనిచేయకుండా నీరసించిపోతాయి. ఇన్ఫెక్షన్ల తీవ్రత ఎక్కువ ఉంటుంది. జెరియాట్రిక్ వార్డులో చేరిన వృద్ధుల ఎమోషనల్ డిస్టబెన్స్, శరీర తత్వాన్ని గుర్తించి అందుకు తగ్గ వైద్యసేవలతో పాటు ఆప్యాయత, ప్రేమతో మానసిక చికిత్సలు అందించి నూతనోత్సాహాన్ని కల్పిస్తారు.

ఎవరిని చేర్చుకుంటారు..

సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి ఇన్‌పేషెంట్ విభాగంలో ప్రతిరోజూ సగటున ఐదు నుంచి ఏడు వందల మంది వృద్ధులకు వివిధ విభాగాల్లో పలురకాల వైద్యసేవలు అందిస్తుంటారు. వీరందరూ జెరియాట్రిక్ వార్డులో చేరుతామంటే ఒప్పుకోరు. ప్రత్యేక లక్షణాలు కలిగి, తీవ్ర మానసిక, శారీరక ఒత్తిడికి గురైనవారే అర్హులు. పార్కిన్‌సోనిజమ్, న్యూరో సంబంధ సమస్యలు, మతిమరుపు, గుర్తు పట్టలేకపోవడం, పగలు, రాత్రి తేడా తెలియకపోవడం, నడుస్తూ పడిపోవడం, ఫిట్స్ తదితర రుగ్మతలు గలవారిని గుర్తించి జెరియాట్రిక్ వార్డుకు తరలించి వైద్యం అందిస్తారు.

జెరియాట్రిక్‌వార్డు ప్రత్యేకతలు ఇవీ..

గాంధీ ఆస్పత్రి ఇన్‌పేషెంట్ విభాగంలోని గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఉన్న గైనకాలజీ, పిడియాట్రిక్ ఐసీయూలు నూతనంగా ఏర్పాటు చేసిన మదర్ అండ్ చైల్డ్‌కేర్(ఎంసీహెచ్) ఆస్పత్రి భవనలోకి తరలించారు. ఖాళీగా ఉన్న ఆయా ప్రాంతాల్లో మహిళలు, పురుషులకు వేర్వేరుగా 20 చొప్పున మొత్తం 40 పడకలతో జెరియాట్రిక్ విభాగాన్ని రూపొందించారు. వృద్ధులు వరండాలో బ్యాలెన్స్ కోల్పోకుండా నడిచేందుకు రెయిలింగ్, కాలు జారకుండా యాంటి స్కిట్‌టైల్స్, వాష్‌రూంలో కూర్చుని లేచేందుకు హ్యాండిల్స్, ఎడ్జస్టబుల్ మంచాలు, బెడ్‌సోర్స్ రాకుండా ప్రత్యేక పరుపులు ఏర్పాటు చేశారు. పాజిటివ్ థాట్స్‌తో పాటు మానసిక ఉత్సాహాన్ని కల్పించేందుకు గోడలకు ప్రత్యేక పెయింటింగ్స్ వేయించి ఆహ్లాదరకమైన వాతావరణాన్ని సృష్టించారు. వృద్ధులకు మానసిక, శారీరక వ్యాయామంలో మెళకువలు నేర్పించేందుకు ఫిజియోథెరపీ వార్డును ఏర్పాటు చేశారు.

ప్రత్యేక శిక్షణ పొందిన వైద్యులు, సిబ్బంది..

జెరియాట్రిక్ వార్డు జనరల్ మెడిసిన్ వార్డుకు అనుసంధానంగా ఉంటుంది. ప్రొఫెసర్, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఇద్దరు సీనియర్ రెసిడెంట్లు, జూనియర్ డాక్టర్లు, 30 మంది నర్సింగ్ సిబ్బంది ఈ వార్డులో విధులు నిర్వహిస్తారు. వీరంతా వృద్ధులకు వైద్యసేవలు అందించడంలో ప్రత్యేక శిక్షణ పొందారు. వృద్ధులకు పలు అంశాలపై శిక్షణ ఇచ్చేందుకు ఫిజియోథెరపిస్టులు రౌండ్ ది క్లాక్ అందుబాటులో ఉంటారు.

చదువుకున్నప్పటి ఆశయం



నేను వైద్య విద్య అభ్యసిస్తున్న సమయంలో అంటే 1995లో తొలిసారిగా జెరియాట్రిక్ సేవలపై చర్చ మొదలైంది. ఎయిమ్స్ దీనిపై స్టడీ చేసింది. ప్రభుత్వ వైద్య వృత్తిలోకి వచ్చి నిరుపేద వృద్ధులకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించాలనే ఆశయం నేటికి నెరవేరడం సంతోషంగా ఉంది. జెరియాట్రిక్ వార్డును ఏర్పాటు చేయడంతో నాలుగు పీజీ సీట్లు అందుబాటులోకి వస్తాయి. వైద్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చేతులమీదుగా జెరియాట్రిక్ వార్డును త్వరలోనే ప్రారంభిస్తాం.

– ప్రొఫెసర్ రాజారావు, గాంధీ సూపరింటెండెంట్



వృద్ధుల కోసం ఏర్పాటు చేసిన హాల్



అందమైన బొమ్మలతో ఆకట్టుకునేలా గది గోడలు

నాలుగు నెలలుగా జీతాల్లేవ్..


వెంగళరావునగర్: పెండింగ్‌లో ఉన్న జీతాలను తక్షణమే విడుదల చేయాలని తెలంగాణ కాంట్రాక్ట్ డాక్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు డిమాండ్ చేశారు. వెంగళరావునగర్‌లోని పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ కార్యాలయం ఎదుట గురువారం అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నేతలు మాట్లాడుతూ... కొన్నేళ్లుగా బస్తీ దవాఖానాలో తాము విధులు నిర్వహిస్తున్నామని, అయితే ఈ ఏడాది మార్చి నుంచి తమకు జీతాలు రావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు అధిక ధరలతో కుటుంబాలు భారంగా గడుస్తున్నాయని, కనీసం పిల్లల ఫీజులు కూడా సరిగ్గా చెల్లించలేకపోతున్నామని తెలిపారు. తామంతా రాజీపడకుండా ఆయా బస్తీ దవాఖానాల్లో సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. తక్షణమే పెండింగ్‌లో ఉన్న 4 నెలల జీతాలను విడుదల చేసి తమ కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. అదే సమయంలో అక్కడే ఉన్న మంత్రి దామోదర రాజనర్సింహ వద్ద తమ గోడు వినిపించారు. స్పందించిన మంత్రి త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అసోసియేషన్ నేతలు (వైద్యులు) భరత్‌కుమార్, నగేష్, అరవింద్‌కుమార్, శివకుమార్, విధిష, శుభశ్రీ పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న కాంట్రాక్ట్ వైద్యులు

ఆరోగ్య సంరక్షణలో నర్సింగ్ పాత్ర కీలకం

నాంపల్లి: ప్రజల ఆరోగ్యకరమైన జీవన శైలిని ప్రోత్సహించడం, ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో నర్సింగ్ అధికారులు కీలక పాత్ర పోషిస్తారని, అనేక సమస్యలతో సతమతమవుతున్న నర్సింగ్ అధికారుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తానని టీజేఎస్ అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరామ్ పేర్కొన్నారు. నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో గురువారం తెలంగాణ నర్సింగ్ అధికారుల సంఘం రాష్ట్ర సదస్సు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవికిరణ్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నర్సింగ్ అధికారుల సమస్యల పట్ల ఉదాసీన వైఖరి ప్రదర్శించిందని, నర్సింగ్ ఉద్యోగుల బదిలీల్లో స్థానికత పాటించలేదని, డీఏ, పీఆర్సీ పెంపును పట్టించుకోలేదని, ఆస్పత్రుల్లో కనీసం నర్సింగ్ ఉద్యోగులకు దుస్తులు మార్చుకునే గది, తాగునీరు, వాష్ రూమ్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. నర్సింగ్ అధికారుల సమస్యలను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే ప్రయత్నం చేస్తానన్నారు. ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.నాగన్న, సంఘం ప్రధాన కార్యదర్శి వై.శివసాయి, సలహాదారు బి.వెంకటేశ్వర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ పి.కవిత, ఉపాధ్యక్షులు ఎస్.సుజీవన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరామ్

వాల్వ్ మరమ్మతులు పూర్తి

సాక్షి, సిటీబ్యూరో: కోదండాపూర్ పంప్‌హౌజ్‌లో ఎస్ఆర్‌పీ రెండో పైప్‌లైన్ వాల్వ్ మరమ్మతు పనులు పూర్తి కావడంతో గురువారం నీటి సరఫరాను పునరుద్ధరించారు. మరమ్మతు పనులు చేపట్టిన అధికారులు.. వాటిని వేగవంతంగా పూర్తి చేయడంలో సఫలీకృతమయ్యారు. దీంతో కృష్ణా డ్రింకింగ్ వాటర్ సప్లై స్కీమ్ ఫేజ్–2 పరిధిలోని అన్ని ప్రాంతాలకు అంతరాయం లేకుండా నీటి సరఫరా యథావిధిగా జరుగుతోందని జలమండలి ఒక ప్రకటనలో తెలిపింది.

ప్యాకేజీతో కెరీర్ సూపర్

- అరుదైన కోర్సు ప్యాకేజింగ్ టెక్నాలజీ
- రామంతాపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో..
- దక్షిణ భారతదేశంలోనే మొదటిది
- ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అనేకం

రామంతాపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అందిస్తున్న అరుదైన ప్యాకేజింగ్ టెక్నాలజీ కోర్సు దక్షిణ భారతదేశంలోనే ఏ ఇతర ప్రభుత్వ కళాశాలలో లేదు. ఈ డిప్లొమా పూర్తి చేసిన విద్యార్థులకు దేశవిదేశాల్లో కార్పొరేట్ బహుళ జాతి సంస్థల్లో మంచి వేతనాలతో ఉద్యోగాలు దొరికే అవకాశాలు అనేకం. పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల ప్రవేశానికి కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న తరుణంలో విద్యార్థులకు ఈ కోర్సుపై అవగాహన కల్పించడానికి రామంతాపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్యాకేజింగ్ టెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ వెంకట్‌రెడ్డి 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూ వివరాలు. – రామంతాపూర్





డాక్టర్ వెంకట్‌రెడ్డి

'సాక్షి' ఇంటర్వ్యూ

ప్యాకేజింగ్ టెక్నాలజీ కోర్సు అంటే ఏమిటి?

మార్కెట్‌లో లభించే ప్రతి వస్తువు వినియోగించే వరకు పాడవకుండా ఉండాలంటే దానికి ప్రత్యేకమైన ప్యాకింగ్ అవసరం. పరిశ్రమల్లో తయారైన ప్రతి వస్తువు వినియోగదారుడి వద్దకు చేరే వరకు పలు దశల్లో సరఫరా అవుతుంది. ఈ క్రమంలో రోజుల నుంచి కొన్ని నెలల వరకు అది రవాణా సమయంలో సురక్షితంగా ఉండే వస్తువులు పాడవకుండా ఉండటంతో పాటు ఆ వస్తువులు చాలా కాలం నిలువ ఉండే విధంగా అవసరమయ్యేది ప్యాకేజింగ్ టెక్నాలజీ.

రామంతాపూర్ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ కోర్సు ఏ సంవత్సరంలో ప్రారంభమైంది?

ఈ కోర్సు 1996లో రామంతాపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మొదలైంది. ప్రతి సంవత్సరం పాలీసెట్ ద్వారా విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తున్నారు. గతంలో కేవలం 30 సీట్లుగా ఉండే కోర్సు ఆదరణ పెరగడంతో ప్రభుత్వం 60 సీట్ల వరకు పెంచింది.

ఈ కోర్సు పూర్తి చేసిన వారికి కెరీర్ ఎలా ఉంటుంది?

టెక్నాలజీ డిప్లొమా కోర్సు పూర్తి చేసిన వారిని ప్యాకేజిస్టులంటారు. ప్రతి వస్తువును ఆకర్షణీయంగా సురక్షితంగా ఉండేలా ప్యాకింగ్ చేస్తుండటమే వీరి బాధ్యత. పెద్ద పెద్ద పరిశ్రమల్లో క్వాలిటీ కంట్రోలర్ ప్రొడక్షన్ డెవలప్‌మెంట్ ప్రొడక్షన్ ఇంజినీర్లుగా కెరీర్ ప్రారంభించవచ్చు.

ప్రస్తుతం దేశంలో ఎన్ని ప్యాకేజింగ్ పరిశ్రమలు ఉన్నాయి?

40 వేల వరకు భారీ మధ్య తరహా పరిశ్రమలు ఉన్నాయి. వీటి అవసరాలకు తగ్గట్టుగా శిక్షణ సంస్థలు తక్కువగా ఉండటంతో ఈ కోర్సు చేసిన వారికి వెంటనే ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయి.

ఈ కోర్సు పూర్తి చేసిన వారు స్వయం ఉపాధికి పరిశ్రమలు స్థాపించుకోవచ్చా?

ఎంతో డిమాండ్ ఉన్న ప్యాకేజింగ్ పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవడానికి కోర్సు పూర్తి చేసిన వారికి బ్యాంకులు ఆర్థిక సహాయం అందిస్తున్నాయి. ఈ డిప్లొమా కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు చాలా మంది సొంతంగా పరిశ్రమలు స్థాపించి మరో పది మందికి ఉపాధి కల్పిస్తున్నారు.

ఉద్యోగ అవకాశాలు ఎలా ఉన్నాయి?

కళాశాలలో చివరి సంవత్సరం ఈ కోర్సు చదువుతుండగానే వారికి క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ద్వారా బహుళ జాతి సంస్థలైన డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్, అరబిందో ఫార్మా, నాగార్జున సిక్‌నోట్, ఐటీసీ, గ్లాండ్ ఫార్మా, ఇండియన్ ఇమ్యూనోలాజికల్, హ్యూమన్, బయోలాజికల్స్ తదితరన సంస్థల్లో మంచి వార్షిక వేతనంతో ఉద్యోగాలు లభిస్తున్నాయి.

పేద మైనార్టీ పిల్లల్లో 27 శాతం డ్రాప్ అవుట్స్

- హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ సర్వేలో వెల్లడి

సాక్షి, సిటీబ్యూరో: పేద మైనార్టీ పిల్లలలో 27శాతం డ్రాప్ అవుట్స్ ఉన్నట్లు తమ సర్వేలో వెల్లడైనట్లు హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ ప్రతినిధి ముజ్తబా హసన్ అస్కారీ తెలిపారు. నాలుగు శాతం పాఠశాల విద్యకు దూరంగా ఉన్నారన్నారు. జల్‌పల్లి మున్సిపల్ పరిధిలోని ఎర్రకుంటలో వలస కార్మికుల పిల్లల కోసం ఏర్పాటు చేసిన ప్రీప్రైమరీ కమ్ బ్రిడ్జ్ స్కూల్‌ను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత విద్య అభ్యసించేందుకు పిల్లలను ప్రోత్సహించాలన్న ఉద్దేశంలో పట్టణంలోని 756 ప్రభుత్వ పాఠశాలలను మ్యాప్ చేసి సుమారు 15 మురికివాడల్లోని బలహీన వర్గాల పిల్లల విద్యా స్థితిపై సర్వే చేశామన్నారు. నాలుగు శాతం మంది పాఠశాల విద్యకు దూరంగా ఉన్నట్లు వెల్లడైందన్నారు. హకీంపేట, ఎండీ లైన్స్, రాజేంద్రనగర్, కిషన్‌బాగ్, ఖ్యామ్‌నగర్, హసానగర్, కాలాపతేర్, ఎర్రకుంట, షాహీన్‌నగర్, పహాడీ షరీఫ్, జల్‌పల్లి తదితర ప్రాంతాల్లో సర్వే చేశామన్నారు. మూడు నెలల వ్యవధిలో 2,500 కుటుంబాలను ఇంటర్వ్యూ చేశామని తెలిపారు. గత విద్యా సంవత్సరం ప్రాథమిక పాఠశాల స్థాయిలో 50 శాతం మంది బడి మానేశారన్నారు. డ్రాపౌట్ పిల్లల తల్లిదండ్రుల్లో దాదాపు 65 శాతం మంది మహారాష్ట్ర, కర్ణాటక, బీహార్, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన వారున్నారన్నారు. మురికి వాడల్లో పిల్లలు ఆర్థిక ఇబ్బందులతో 75 శాతం మంది బడి మానేస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలలు అందుబాటులో ఉన్న చోట సైతం 1,050 మంది విద్యార్థుల్లో 30 శాతం మంది మాత్రమే నమోదు చేసుకున్నారని పేర్కొన్నారు. ఇతరులు వివిధ కారణాలతో ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లేందుకు ఇష్టపడటం లేదన్నారు. ఈ పిల్లలకు అడ్మిషన్ కోసం అవసరమైన జనన ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డులు పొందడంలో సహాయ పడ్డామని తెలిపారు.

నిర్లక్ష్యంతోనే ఫెయిల్ అయ్యాం..

గాంధీలో బీఎస్సీ అలైడ్ హెల్త్‌సైన్స్ విద్యార్థుల ఆందోళన



నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

గాంధీఆస్పత్రి: సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కాలేజీలో బీఎస్సీ అలైడ్ హెల్త్ సైన్స్ కోర్సు చదువుతున్న విద్యార్థులు కాలేజీ ప్రాంగణంలో గురువారం ఆందోళన చేపట్టి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ నేతృత్వంలో 2022–23లో తొలిసారిగా రాష్ట్రంలోని తొమ్మిది ప్రభుత్వ వైద్య కళాశాలల్లో బీఎస్సీ అలైడ్ హెల్త్‌సైన్స్ కోర్సు ప్రవేశపెట్టారు. అడ్మిషన్లు, పరీక్షలు, ఫలితాలు, కోర్సు మెటీరియల్ వంటివి ఆలస్యంగా చేపట్టారని, ఇటీవల నిర్వహించిన పరీక్షల్లో రాష్ట్రవ్యాప్తంగా 745 మంది హాజరుకాగా కేవలం 25 మంది, గాంధీలో 140 మందికి ఐదుగురు మాత్రమే ఉత్తీర్ణత సాధించారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. సరైన సిలబస్ రూపొందించకపోవడం, తరగతుల నిర్వహణ, నూతన కోర్సును నిర్లక్ష్యం చేయడంతోనే తాము ఫెయిల్ అయ్యామని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రేస్ మార్కులు కలిపి పాస్ చేయాలని, స్టైఫండ్ ఇవ్వాలని, హాస్టల్ వసతి సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. గాంధీ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్స్ కృష్ణమోహన్, రవీందర్ విద్యార్థులతో మాట్లాడారు. ప్రస్తుతం కళాశాలలో పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో ధర్నాలు చేయకుండా తరగతులకు హాజరు కావాలని సూచించారు. సెప్టెంబర్ నెలలో సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు నోటిఫికేషన్ వెలువడినట్లు వివరించారు.

పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

ఉస్మానియాయూనివర్సిటీ: రాష్ట్రంలోని ఎనిమిది యూనివర్సిటీల్లో వివిధ పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు విద్యార్థులు భారీ సంఖ్యలో దరఖాస్తులు చేసుకున్నారు. ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీలతో పాటు ఇతర పీజీ, పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు 73,500 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్లు టీఎస్ సీపీజీఈటీ–2024 కన్వీనర్ ప్రొ.పాండురంగారెడ్డి గురువారం తెలిపారు. గతేడాది కంటే 3,500 మంది విద్యార్థులు ఎక్కువ మంది దరఖాస్తు చేసుకున్నట్లు వివరించారు. సీట్ల సంఖ్యకంటే తక్కువ దరఖాస్తులు వచ్చిన ఎంఏ అరబిక్, కన్నడ, మరాఠీ, పర్షియన్, థియేటర్ ఆర్ట్స్, ఎమ్మెస్సీ ఎల్రక్ట్రానిక్స్ కోర్సుల్లో ఎంట్రన్స్ టెస్ట్ లేకుండా నేరుగా ప్రవేశాలు కల్పించనున్నట్లు చెప్పారు. ఇదిలా ఉండగా 10 వేల ఎంకాం సీట్లకు కేవలం 5,500 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారని, ఎంట్రన్స్ టెస్ట్‌లో అర్హత సాధించిన ప్రతి విద్యార్థికి సీటు గ్యారంటీ అని ఆయన తెలిపారు. వచ్చేనెల 6 నుంచి ప్రారంభమయ్యే ప్రవేశ పరీక్షలకు 3 నుంచి హాల్‌టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని పేర్కొన్నారు. ఇంత వరకు దరఖాస్తు చేసుకోని అభ్యర్థులు రూ.2వేల అపరాధ రుసుంతో ఈ నెల 30 వరకు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవచ్చు.

సివిల్స్ ఉచిత కోచింగ్ కోసం దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర షెడ్యూల్డ్ ట్రైబ్స్ స్టడీ సర్కిల్ 2024– 25 విద్యా సంవత్సరానికి సివిల్ సర్వీస్ పరీక్ష ఉచిత కోచింగ్ అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు పెరిక యాదయ్య ఒక ప్రకటనలో తెలిపారు. యూపీఎస్సీ సివిల్ సర్వీస్ ఎగ్జామ్(ప్రిలిమ్స్ కం మెయిన్స్) రాసే అభ్యర్థులకు హైదరాబాద్‌లోని ట్రైబ్స్ స్టడీ సర్కిల్‌కు ఉచిత కోచింగ్ ఇస్తున్నారని తెలిపారు. మొత్తం వంద సీట్లలో ఎస్టీలకు 75 శాతం, ఎస్సీలకు 15శాతం, బీసీలకు 10 శాతం సీట్లు కేటాయిస్తారు. ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత సాధించి, కుటుంబ వార్షికాదాయం రూ.3 లక్షలకు మించనివారు ఉచిత శిక్షణకు అర్హులన్నారు. ఈనెల 30లోగా దరఖాస్తులను https://studycircle.cgg.gov.in ద్వారా ఆన్‌లైన్‌లో చేసుకోవాలని సూచించారు.

ఐనాక్స్ థియేటర్‌లో కల్కి సినిమా నిలిపివేత

సుల్తాన్‌బజార్: సినీ హీరో ప్రభాస్ నటించిన కల్కి చలన చిత్రాన్ని కాచిగూడ చౌరస్తాలోని ఐనాక్స్ థియేటర్ నిర్వాహకులు 3.50 గంటల షోను నిలిపివేయడంతో హీరో ప్రభాస్ అభిమానులకు గురువారం చేదు అనుభవం ఎదురయ్యింది. కల్కి సినిమా మొదటి రోజు చూడాలని 240 మంది ఆన్‌లైన్‌లో రూ.229 చొప్పున ఈనెల 24న సోమవారం ఆన్‌లైన్‌లో టికెట్లు బుక్ చేసుకున్నారు. తీరా థియేటర్‌కు రావడంతో టెక్నికల్ ప్రాబ్లమ్స్‌తో ఈ నిలిపివేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. దీంతో వారు తమ డబ్బులు వాపస్ ఇవ్వాలని పట్టుబట్టారు. అక్కడ గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. మధ్యాహ్నం 3.55 గంటలకు మరో షో వేసిన నిర్వాహకులు అప్పటికప్పుడు టికెట్ ధర రూ.440కి పెంచారు. దీంతో ప్రభాస్ అభిమానులు నినాదాలు చేశారు. సమాచారం అందుకున్న సుల్తాన్‌బజార్ ఎస్ఐ. కిరణ్‌కుమార్ రెడ్డి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చి వారి డబ్బులు వారికి ఇప్పించడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది.

సాక్షి సిటీ ప్లస్

11

హైదరాబాద్, శుక్రవారం, 28, జూన్, 2024

అద్భుతమైన వారసత్వ సంపద, అధునాతన ఫ్యాషన్ హంగులకు పెట్టింది పేరు హైదరాబాద్ మహానగరం. విభిన్న రంగాల్లో తనదైన ముద్రవేసుకుంటూనే యావత్ ప్రపంచం అనుసరిస్తున్న ఫ్యాషన్ పోకడలను ఎప్పటికప్పుడు అందిపుచ్చుకుంటోంది. ముఖ్యంగా ఈ ఫ్యాషన్ ప్రపంచంలో దుస్తుల డిజైనింగ్ అనేది ముఖ్యమైంది. వివిధ దేశాలకు భారత్ వస్త్ర ఉత్పత్తులను ఎగుమతి చేసే సంస్కృతిని హైదరాబాద్ డిజైనింగ్ రంగం ఇప్పటికీ కొనసాగిస్తోంది. ఈ రంగానికి భారత్‌లో దాదాపు 350 బిలియన్ డాలర్ల బిజినెస్ మార్కెట్ ఉంది.

– సాక్షి, సిటీబ్యూరో

అప్పారల్ ఫ్యాషన్ రంగంలో ప్రత్యేకత చాటుకుంటూ..

ఈ రంగంలో భారత్ 350 బిలియన్ డాలర్ల బిజినెస్

అందిపుచ్చుకోవడానికి అడుగులేస్తున్న ఔత్సాహికులు





FASHION ఫ్యూచర్

అధునాతన ఫ్యాషన్‌కు కేంద్రంగా హైదరాబాద్

అవకాశాలు పుష్కలం..

ఈ ఫ్యాషన్ డిజైనింగ్ కోర్స్‌కు గతంలో ఇంటర్ అర్హతగా ఉండేది. కానీ ప్రస్తుతం పదవ తరగతి చదివిన వాళ్లకు కూడా అవకాశం కల్పిస్తున్నారు. ఈ కోర్స్ చేసిన తర్వాత ఫ్యాషన్ రంగంలో అవకాశాలతో పాటు వ్యక్తిగతంగా బోటిక్‌లను ఏర్పాటు చేసుకోవచ్చు. కేవలం ఒక్కో డిజైనింగ్‌కు రూ.10 వేల నుంచి లక్షల్లో సంపాదించుకునే వేదికలు, అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ఎంతోకాలంగా నగరంలోని ఫ్యాషన్ డిజైనింగ్ పరిశ్రమను వివిధ రాష్ట్రాలు, దేశాల నుంచి వచ్చిన డిజైనర్లు వినియోగించుకోగా ఈ మధ్యకాలంలో స్థానికంగానే ఫ్యాషన్ డిజైనర్లు పుట్టుకొస్తున్నారు. దుబాయ్ వంటి దేశాల్లో అవకాశాలను పొందుతున్నారు.





ఫ్యాషన్‌లోని విభిన్న అంశాల్లో హైదరాబాద్ వేదికగా ఉన్నందున ఈ అవకాశాలను వినియోగించుకుంటూ ఫ్యాషన్ డిజైనింగ్ రంగంలో నగర విద్యార్థులు మంచి కెరీర్‌కు బాటలు వేసుకుంటున్నారు. ఆర్థికంగా, ఉద్యోగావకాశాల పరంగా, అంకుర సంస్థల ఏర్పాట్లలోనూ రాణిస్తున్నారు. ఈ ఫ్యాషన్ ఔత్సాహికుల కోసం ప్రత్యేకంగా ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సులు, ఇన్‌స్టిట్యూషన్లను నెలకొల్పారు. ప్రభుత్వ యూనివర్సిటీలో సైతం ఈ కోర్సులకు మంచి డిమాండ్ ఉంది. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన ఔత్సాహిక ఫ్యాషన్ డిజైనర్లు ఈ కోర్సుల్లో తమ ప్రతిభ నిరూపించుకుంటూ జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు.

ఫ్యాషన్ రంగానికి కేంద్రంగా..

నగరంలోని మాసబ్‌ట్యాంక్ వేదికగా ఉన్న జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీతో పాటు పలు ప్రైవేట్ రంగ సంస్థలు ఈ ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సులను అందిస్తున్నాయి. 9 నెలల పాటు ఉండే ఈ ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సులో రెండు సెమిస్టర్లు ఉంటాయి. ఇందులో భాగంగా ప్రిన్సిపుల్స్ ఆఫ్ ఫ్యాషన్, ఫ్యాషన్ ఆర్ట్ అండ్ ఇల్లస్ట్రేషన్, టెక్స్‌టైల్ అండ్ పాటర్న్ మేకింగ్, గార్మెంట్ కన్‌స్ట్రక్షన్, సర్ఫేస్ ఆర్నమెంటేషన్ వంటి అంశాల్లో శిక్షణ అందిస్తున్నారు. అనంతరం డిజైనింగ్ వృత్తిలో నైపుణ్యాలైన మార్కెటింగ్ మర్చెండైజింగ్, క్యాడ్ బేసిక్స్, పోర్ట్‌ఫోలియో వంటి విభిన్న అంశాల్లోనూ శిక్షణ ఉంటుంది. ఈ కోర్సులు చేస్తున్న నగర విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయి ఫ్యాషన్ షోలలో, ప్రముఖ ఫ్యాషన్ డిజైనింగ్ కంపెనీలో అవకాశాలను పొందుతూ భవిష్యత్‌లో కూడా ఫ్యాషన్ రంగానికి హైదరాబాద్ కేంద్రంగా నిలుస్తుందని నిరూపిస్తున్నారు.

వినూత్న ఆలోచనకు వారధి..

అందరిలా కాకుండా వినూత్నంగా ఆలోచించే నా విధానానికి ఫ్యాషన్ డిజైనింగ్ కోర్స్ తోడ్పాటు అందించింది. ఈ డిజైనింగ్ కోర్స్‌లో భాగంగా డిజైన్స్ ఎలా రూపొందించాలి.. వాటిని మార్కెట్లోకి ఎలా తీసుకెళ్లాలి.. మారుతున్న అధునాతన ఫ్యాషన్ జీవనానికి అనుగుణంగా మన ఆలోచనలు ఎలా మార్చుకోవాలి తదితర అంశాల్లో అవగాహన పెంచుకున్నాను. జీవితానికి భరోసా ఇచ్చే వృత్తి విద్య కోర్సుల్లో ఫ్యాషన్ డిజైనింగ్ అత్యుత్తమమైంది. మంచి ఫలితాలను అందిస్తుంది. ఈ కోర్సు చేయడమే కాకుండా 2023లో జాతీయస్థాయిలో ఉత్తమ డిజైనింగ్ బృందంలో ఒకడిగా అవార్డు అందుకున్నాను.

– దీక్షిత్, ఫ్యాషన్ డిజైనర్.

గ్లోబల్ రన్‌వేలో మనమే టాప్..

హితమ్స్ అకాడమీ(హెచ్‌ఐఐటీఎంఎస్) అప్పారల్ ఫ్యాషన్ రంగంలో ఔత్సాహిక విద్యార్థులకు శిక్షణ అందించడానికి విభిన్న ప్రాజెక్టులను రూపొందించాం. నగరంలోని జేఎన్ఏఎఫ్ఏ యూనివర్సిటీతో పాటు ఫ్యాషన్ క్యాపిటల్‌గా ప్రసిద్ధిగాంచిన ఇటలీలోని ప్రముఖ ఫ్యాషన్ డిజైనింగ్ సంస్థ ఐఎంబి మిలాన్ ఆధ్వర్యంలో సర్టిఫికేషన్ కోర్సులను అందిస్తూ.. మా విద్యార్థులకు ఏకకాలంలో రెండు యూనివర్సిటీల సర్టిఫికేట్లను అందిస్తున్నాం. ఔత్సాహిక విద్యార్థులను సైట్ విసిట్, వర్క్‌షాప్‌లో భాగంగా ఇటలీకి తీసుకెళ్లి అధునాతన ఫ్యాషన్ డిజైనింగ్‌లపై అవగాహన కల్పిస్తున్నాం. భారత్‌లోని 350 బిలియన్ డాలర్ల బిజినెస్ మార్క్‌ను రాష్ట్రానికి చెందిన విద్యార్థులు అందుకునేలా.. కోర్సులో బాడీ పోస్టర్, కలర్ కాంబినేషన్ సైకాలజీ, ఔట్ ఫిట్, ఫ్యాబ్రిక్ అనాలసిస్ వంటి అంశాల్లో ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్‌తో శిక్షణ అందిస్తున్నాం. జాతీయ అంతర్జాతీయ ఫ్యాషన్ షోలలో భాగం చేస్తూ.. ప్రాక్టికల్ అనుభవాన్ని చేరువ చేస్తున్నాం. ఈ మధ్యనే మా విద్యార్థులు ఢిల్లీ వేదికగా నిర్వహించిన 'ద గ్లోబల్ రన్‌వే' ఫ్యాషన్ ఈవెంట్లో మొదటి బహుమతి పొంది అందరి దృష్టిని నగరం వైపునకు మరల్చారు. ఈ అవార్డును ప్రముఖ అంతర్జాతీయ ఫ్యాషన్ డిజైనర్ రీనా ధాకా చేతులమీదుగా అందుకున్నారు. శిక్షణ అనంతరం బోటిక్‌లను ప్రారంభిస్తూ, ప్రముఖ సెలబ్రిటీలకు ఫ్యాషన్ డిజైనర్లుగా కొందరు సెటిల్ అయ్యారు. 10 వేల మందికి శిక్షణ అందించడమే కాకుండా ఈ రంగానికి ప్రోత్సాహం అందించడం కోసం 40 శాతం స్కాలర్‌షిప్ అందిస్తున్నాం.

– రఫీ, హితమ్స్ అకాడమీ (హెచ్‌ఐఐటీఎంఎస్) ఫౌండర్, హైదరాబాద్.





సాక్షి, సిటీ బ్యూరో:

నవ మాసాలు తన కడుపులో బిడ్డను మోసి ప్రాణం పోస్తుంది అమ్మ. ఆ బిడ్డకు తొలిగురువు అమ్మే అవుతుంది.. చిట్టి పలుకులు... బుజ్జి మాటలు నేర్పిస్తుంది.. అందుకే మనం మాట్లాడే భాషను అమ్మ భాషగా పరిగణిస్తాం... అదే ఒక భాషకు లిపి కావాలంటే వందల ఏళ్ల పడుతుంది. ఒక స్త్రీ బిడ్డకు జన్మనిచ్చినప్పుడే ఆమె జన్మ పరిపూర్ణమైనట్లు.. ఒక భాషకు లిపి రూపుదిద్దుకుంటేనే ఆ భాషకు పరిపూర్ణత వస్తుంది. అలా లిపి ఉన్న మన తెలుగు భాషకు, లిపికి వేల ఏళ్ల చరిత్ర ఉంది.. మానవుడు ఎన్నో మార్పులకు లోనైనట్టే.. మన తెలుగు లిపిలో కూడా అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. కాలక్రమంలో కొన్ని అక్షరాలు కాలగర్భంలో కలిసిపోయాయి. ఇప్పటికే కొన్ని అక్షరాలు వాడుకలో లేవు. అంతరించి పోయే ప్రమాదం ఉన్న అక్షరాల్లో తెలుగు లిపి ముందు వరుసలో ఉంది. దీనికి కారణాలు అనేకం. ఆ విశేషాలు తెలుసుకుందాం..

హల్లులతో వినూత్నంగా పాప్-అప్ పుస్తకం

కళాక్షరిక పేరుతో పుస్తకం తయారీ

అక్షరాల్లో బొమ్మలు కనిపించేలా అచ్చుల పుస్తకం రూపకల్పన



అమ్మ భాషకు పాప్ అప్..

తెలుగు లిపికి ప్రాణం పోస్తున్న ఆర్కిటెక్ట్

ప్రమాదంలో ఉన్న తెలుగు లిపిని బతికించుకునేందుకు ఇప్పటికే అనేక మంది ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నారు. వారిలో ఒకరే శశి గూడూరు. తెలుగు లిపిని పిల్లలతో పాటు భవిష్యత్తు తరాలకు గుర్తుండి పోయేలా ప్రయత్నిస్తున్నారు ఆయన. అందుకోసం వినూత్నంగా అచ్చులు, హల్లులతో కూడిన పుస్తకాలను రూపొందించారు. ముఖ్యంగా పుస్తకం తెరవగానే అక్షరాలు త్రీడీ రూపంలో పాప్-అప్ అయ్యేలా తయారు చేశారు.

చెరగని ముద్ర వేసేలా..



టైపోవనం వ్యవస్థాపకుడు శశి గూడూరుకు తెలుగు భాషపై మక్కువ ఎక్కువ. మాతృభాషపై ఆయనకున్న మమకారంతో కళాక్షరిక అనే పుస్తకాన్ని రూపొందించారు. డిజైనింగ్‌లో ఆయనకున్న నైపుణ్యం మొత్తాన్ని రంగరించి దీన్ని తీసుకొచ్చారు. 'క' అక్షరం నుంచి 'క్ష' వరకూ తెలుగు హల్లులు పుస్తకం తెరవగానే పాప్-అప్ అవుతాయి. తెలుగులో ఇలాంటి పుస్తకం రావడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.

ఆ సందేశమే ప్రేరణ...

ఆన్‌లైన్‌లో ఒక త్రీడీ కార్డు దొరికిందని, అందులో గుర్రం బొమ్మ ముందుకు దూసుకొస్తున్నట్టు ఉందని, అప్పుడే ఈ పుస్తకం తయారు చేయాలనే ఆలోచన వచ్చిందని వివరించారు. ఇంగ్లిష్‌లో ఇలాంటి ప్రయోగాలు చేశారని, అందుకే తెలుగులోనూ ఇలా ఎందుకు తయారు చేయకూడదనే సంకల్పంతో ఈ బుక్‌ను తీసుకొచ్చానని చెప్పారు. ముఖ్యంగా 'ఱ' అక్షరం వాడకం పూర్తిగా తగ్గిపోయిందని, ఆ అక్షరాన్ని చాలా జాగ్రత్తగా డిజైన్ చేశానని, పుస్తకం



తెరవగానే మళ్లీ ఉద్భవిస్తున్నట్టు రూపకల్పన చేశానని శశి చెప్పుకొచ్చారు. ఐఐటీ బాంబేలో విజువల్ కమ్యూనికేషన్స్‌లో పీజీ చేసే సమయంలో తెలుగుపై ఇష్టం పెరిగిందని చెప్పుకొచ్చారు. తెలుగు అక్షరాలు చిన్నపిల్లలతో పాటు, పెద్ద వారి మనసులోనూ చెరగని ముద్ర వేయాలన్న కోరికతోనే పాప్-అప్ పుస్తకాన్ని రూపొందించారు.


తెలుగు అక్షరాలు ఎంతో అందమైనవి...

తెలుగు అక్షరాలు ఎంతో అందమైనవని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని శశి గూడూరు చెప్పారు. తెలుగులో పలు రకాల ఫాంట్లు డిజైన్ చేశారు. అనేక డిజైన్లు రూపొందించారు. అచ్చుల్లో బొమ్మలు ప్రతిబింబించేలా శశి తయారు చేసిన పుస్తకానికి ఎంతో ప్రాచుర్యం లభించింది. యువతలో తెలుగుపై క్రేజ్ పెరిగేందుకు టీషర్టులపై తెలుగులో అక్షరాలను వినూత్నంగా డిజైన్ చేసి ప్రింట్ చేస్తున్నారు. అంతేకాకుండా బ్యాగులపై కూడా ఆలోచనాత్మకంగా డిజైన్లు రూపొందించి, అవగాహన కల్పిస్తున్నారు.



పలు లోగోల రూపకల్పన..

తెలుగు భాష పునరుజ్జీవనానికి కృషి చేస్తున్న శశి గూడూరు.. తెలంగాణ ప్రభుత్వానికి కూడా తన సేవలందించారు. టీ-శాట్, ఆమ్రాబాద్ టైగర్ రిజర్వ్, తెలంగాణ పర్యాటక శాఖ లోగోలను శశి గూడూరు రూపొందించారు. అలాగే తెలుగులో ఐదు రకాల ఫాంట్లను తయారు చేశారు. తనకు చేతనైనంతగా తెలుగుకు సేవ చేస్తున్నానని, భవిష్యత్తులో కొత్త కొత్త ప్రయత్నాలు చేస్తూనే ఉంటానని శశి గూడూరు చెబుతున్నారు.



నేటి నుంచి ఆర్ట్-ఫొటోగ్రఫీ ఎగ్జిబిషన్

గచ్చిబౌలి: మాదాపూర్‌లోని స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో మూడు రోజులపాటు ఆర్ట్-ఫొటోగ్రఫీ ఎగ్జిబిషన్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. 50 మంది ప్రముఖ ఫొటోగ్రాఫర్లు రూపొందించిన ఫొటోలను ప్రదర్శిస్తారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమై ఆదివారం వరకూ ఈ ఎగ్జిబిషన్ నిర్వహిస్తారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, కార్యదర్శి శృతిఓజా, సాంస్కృతిక, భాషాశాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ ప్రారంభిస్తారు. ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఎగ్జామినేషన్ కంట్రోలర్, ఆర్‌జేడీ బి జయప్రదబాయి, ఎస్‌ఐవీఈ ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ జ్యోష్ణారాణి పాల్గొంటారు. 10 గంటల నుంచి 6 గంటల వరకు ఈ ప్రదర్శన ఉంటుంది.

సిటీ విత్ ఎంగేజ్

ఆన్‌లైన్ గేమింగ్ బ్యాటిల్ గ్రౌండ్ ఫినాలే మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ జరుగుతుంది.

కేంద్ర సాంస్కృతిక శాఖ, శంకరనంద సంయుక్త ఆధ్వర్యంలో సాయంత్రం 6.30 గంటలకు రవీంద్ర భారతిలో మన్యం వీరుడు- అల్లూరి సీతారామరాజు ప్రదర్శన.

నేటి నుంచే 'షోకేస్ ఇన్‌సైడర్ ఎక్స్ 2024'

నగరంలోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్ వేదికగా నేటి నుంచి 30వ వరకూ ప్రతిష్టాత్మక 'ఐఐఐడీ షోకేస్ ఇన్‌సైడర్ ఎక్స్ 2024' ప్రదర్శన నిర్వహించనున్నారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ ఇంటీరియర్ డిజైనర్స్ ఆధ్వర్యంలో హైదరాబాద్ చాప్టర్‌లోని ఆర్కిటెక్టులు, ఇంటీరియర్ డిజైనర్లు ఏర్పాటు చేస్తున్న ఈ ఎక్స్‌పో ఫెలోషిప్ సమావేశంలో దక్షిణాఫ్రికా-జోహన్నెస్‌బర్గ్‌కు చెందిన ప్రముఖ ఆర్కిటెక్ట్ పీటర్ రిచ్, లోటస్ ఆర్కిటెక్ట్స్ నుంచి సిద్ధార్థ్ తల్వార్ ఔత్సాహికులకు అవగాహన కల్పించనున్నారు. డిజైన్ రంగంలోని సరికొత్త పోకడలు, వినూత్న ఆవిష్కరణలను ఔత్సాహికులకు చేరువ చేయడానికే ఈ ప్రత్యేక ప్రదర్శన అని నిర్వాహకులు అర్.పల్లవి అంచూరి పేర్కొన్నారు. ఇందులో స్మార్ట్ పరికరాల మొదలు టర్న్‌కీ సొల్యూషన్‌ల వరకూ ప్రతి అంశాన్నీ వివరించనున్నారని ఆమె తెలిపారు.

ముగిసిన టీవైఈ సదస్సు..

యువ పారిశ్రామిక వేత్తలకు సాధికారతను అందించే ఉద్దేశ్యంతో ఇండస్ ఎంటర్‌ప్రెన్యూర్స్ (టీఐఈ) ఆధ్వర్యంలో నగరంలో నిర్వహించిన విద్యార్థి వ్యవస్థాపక సదస్సు ముగిసింది. మూడు రోజుల పాటు యువ పారిశ్రామికవేత్తల (టీవైఈ) గ్లోబల్ కాన్ఫరెన్స్లో దేశవ్యాప్తంగా 300 మంది విద్యార్థులు పాల్గొన్నారని నిర్వాహకులు తెలిపారు. ఎంట్రప్రెనర్‌షిప్ అనేది అత్యంత ప్రాధాన్యంగా మారుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థుల్లో వ్యవస్థాపక స్ఫూర్తిని ప్రేరేపించడానికి సదస్సు కృషి చేసిందన్నారు. అలాగే 9 నుంచి 12వ తరగతి విద్యార్థులకు దేశంలోని నిష్ణాతులైన భారీ వ్యాపారులు, ఔత్సాహిక యువ పారిశ్రామికవేత్తలతో అనుసంధానమయ్యేందుకు దోహదపడిందన్నారు.

ఐనాక్స్‌లో 4కే లేజర్ ప్రొజెక్షన్ స్క్రీన్స్...



నగరంలోని గచ్చిబౌలి వేదికగా ప్రిజమ్ మాల్లో ఆల్ 4 కే లేజర్ ప్రొజెక్షన్‌తో నూతనంగా 4-స్క్రీన్ సినిమాను ఎండీ అజయ్ బిజిలి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజీవ్ కుమార్ బిజిలీ ప్రారంభించారు. దక్షిణాదిలో సినిమాలకున్న క్రేజ్ మరెక్కడా ఉండదని, సగటున ప్రతి నెలా 50 లక్షల మంది వీక్షకులు థియేటర్లకు వస్తున్నారని పీవీఆర్ ఐనాక్స్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ అజయ్ బిజిలి తెలిపారు. నగరం వేదికగా పీవీఆర్ ఐనాక్స్ ఆధ్వర్యంలో 17 ప్రాపర్టీస్‌లో 97 స్క్రీన్లు, దక్షిణాదిన 102 ప్రాపర్టీస్‌లో 579 స్క్రీన్‌లు ఉన్నాయని, కొత్త స్క్రీన్స్‌లో 4కె లేజర్ ప్రొజెక్షన్‌తో పాటు అడ్వాన్స్‌డ్ డాల్బీ ఏటీఎంఓఎస్ ఇమ్మర్సివ్ సౌండ్, నెక్స్ట్ జెన్ 3డీ సిస్టమ్, హైడ్రోపోనిక్స్ డిస్ ప్లే సాంకేతికతలు సినీ ప్రియులను అలరించనున్నాయన్నారు. వినూత్నంగా వెజ్ ఫుడ్ కేఫ్‌లను ఏర్పాటు చేశామన్నారు. 'కల్కి' చిత్రంతో ఈ స్క్రీన్‌లు ప్రారంభించగా..రెట్రో ఇంటీరియర్ అందాలను ఆస్వాదిస్తూ సినీ ప్రేక్షకులు సందడి చేశారు.

బిబి ఓటీటీ త్రీలో సాయికేతన్

హిందీలో ప్రసారమయ్యే బిబి(బిగ్‌బాస్) ఓటీటీ త్రీ షోకు అనిల్ కపూర్ హోస్ట్‌గా వ్యవహరిస్తున్నారు. భాషతో సంబంధం లేకుండా ఎంత మంది అభిమానులను చూరగొందో తెలిసిందే.. అయితే ఈ షోకి తెలుగు కుర్రాడు సాయి కేతన్ రావు ఎంపికయ్యాడు. వీక్షకులను ఉర్రూతలూగిస్తూ అద్భుతమైన నృత్య ప్రదర్శనతో అబ్బురపరుస్తూ గ్రాండ్ ఎంట్రీ ఇచ్చాడు. జియో సినిమాలో ప్రసారమయ్యే ఈ షోతో పాటు, గతంలో స్టార్ ప్లస్‌లో 'మెహందీ హై రచ్నే వాలీ', పాపులర్ సిరీస్ 'ఇమ్లీ' వంటి షోల్లోనూ తన నటనను ప్రదర్శించాడు. బిబి ఓటీటీ త్రీలో సహజంగా ఉంటానని, అందరి మన్ననలూ పొందుతానని, ప్రేక్షకుల అభిమానాన్ని చూరగొంటానని సాయి కేతన్ తెలిపారు.



క్లుప్తంగా...

ఏపీ సీఎస్ పదవీ కాలం ఆరునెలలు పొడిగింపు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ సర్వీసును కేంద్ర ప్రభుత్వం మరో ఆరు నెలలు పొడిగించింది. వాస్తవానికి ఈనెల 30వ తేదీతో ఆయన పదవీ కాలం పూర్తి కావాల్సింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ పదవీ కాలాన్ని పొడిగించాలని ఈనెల 16వ తేదీన కేంద్రానికి లేఖ రాసింది. దీంతో కేంద్ర ప్రభుత్వం సీఎస్ సర్వీసును మరో ఆరు నెలలు అనగా డిసెంబరు 31 వరకూ పొడిగిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసి రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం అందించింది.

ఏపీ ఇంటెలిజెన్స్ చీఫ్‌గా మహేశ్ చంద్ర లడ్హా!

సాక్షి, అమరావతి: సీఆర్‌పీఎఫ్ ఐజీగా ఉన్న ఐపీఎస్ అధికారి మహేశ్‌చంద్ర లడ్హా రాష్ట్ర సర్వీసుకు తిరిగిరానున్నారు. కొన్నేళ్లుగా కేంద్ర సర్వీసులో ఉన్న ఆయన్ని రాష్ట్ర సర్వీసుకు పంపించాలని సీఎం చంద్రబాబు ఇటీవల కేంద్రానికి లేఖ రాసిన విషయం తెలిసిందే. దీనిని ఆమోదిస్తూ మహేశ్‌చంద్ర లడ్హాను రాష్ట్ర సర్వీసుకు పంపిస్తూ కేంద్ర హోం శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే లడ్హాను రాష్ట్ర ఇంటెలిజెన్స్ విభాగం చీఫ్‌గా నియమించే అవకాశాలున్నాయని పోలీసు వర్గాలు చెబుతున్నాయి.

ఫిరాయింపుల్ని ప్రోత్సహించిందే బీఆర్‌ఎస్

టీపీసీసీ నేత గజ్జెల కాంతం



సాక్షి, హైదరాబాద్: ఫిరాయింపులను ప్రోత్సహించిందే బీఆర్‌ఎస్ పార్టీ అని, కేసీఆర్ కేబినెట్‌లోకి మొత్తం టీడీపీ ఎమ్మెల్యేలను తీసుకోలేదా? అని టీపీసీసీ నేత గజ్జెల కాంతం ప్రశ్నించారు. ఆయన గురువారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఫిరాయింపులపై మాట్లాడే నైతిక హక్కు మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావులకు లేదన్నారు. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, సుధీర్‌రెడ్డిలు కాంగ్రెస్ నుంచి వెళ్లినవారు కాదా?, కాంగ్రెస్ నుండి మొత్తం ఎమ్మెల్యేలను తీసుకునేటప్పుడు ఫిరాయింపులు గుర్తుకు రాలేదా? అని నిలదీశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి.. భట్టి విక్రమార్కను ప్రతిపక్ష హోదా నుంచి దింపేయలేదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను బతిమాలి తెచ్చుకోవడం లేదని, వారు ఇష్టపూర్వకంగానే కాంగ్రెస్‌లోకి వస్తున్నారని స్పష్టం చేశారు. విద్యుత్ కొనుగోళ్లలో వేల కోట్ల అవినీతి జరిగిందని, దీనిపై వేసిన కమిటీని ప్రశ్నించే అధికారం కేసీఆర్‌కు ఎక్కడిదన్నారు. నిజంగా కేసీఆర్ ఎలాంటి తప్పు చేయకపోతే భయం దేనికని గజ్జెల కాంతం ప్రశ్నించారు.

ఆంధ్రప్రదేశ్ సీఎం ముఖ్య కార్యదర్శిగా పీయూష్

సీనియర్ ఐఏఎస్‌లు జవహర్‌రెడ్డి, పూనం మాలకొండయ్యకు పోస్టింగ్

సాక్షి, అమరావతి: ఏపీ ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శిగా పీయూష్‌కుమార్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. ఇటీవలే పీయూష్‌కుమార్ కేంద్ర సర్వీసుల నుంచి డిప్యుటేషన్‌పై ఏపీకి వచ్చారు. సీఎం ముఖ్యకార్యదర్శి పదవితో పాటు ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. అలాగే, ఈ నెలాఖరున పదవీ విరమణ చేయనున్న సీనియర్ ఐఏఎస్ అధికారులు కేఎస్ జవహర్‌రెడ్డిని ఈడబ్ల్యూఎస్ సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా, పూనం మాలకొండయ్యను సాధారణ పరిపాలన శాఖలోని (జీపీఎం అండ్ ఏఆర్) విభాగంలో నియమించారు.

బీఆర్‌ఎస్ కార్యకర్తలు బుల్లెట్లు

కొందరు నేతలు పోయినంత మాత్రాన నష్టమేమీ లేదు

- ఎర్రవల్లిలోని నివాసంలో పార్టీ నాయకులతో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ వ్యాఖ్య
- కార్యకర్తలనే నాయకులుగా తీర్చిదిద్దుకుందాం
- కాంగ్రెస్ మోసాలను ప్రజలంతా గమనిస్తున్నారు
- తిరిగి ఆదరించి, రెట్టింపు మద్దతుతో గద్దెపై కూర్చోబెడతారు
- పార్టీ ప్రస్థానం కొనసాగుతుంది.. భవిష్యత్ బీఆర్‌ఎస్‌దేనని ధీమా



గురువారం ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలతో కేసీఆర్. చిత్రంలో కౌశిక్‌రెడ్డి తదితరులు

మర్కూక్ (గజ్వేల్)/ సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్‌కు బుల్లెట్ల వంటి కార్యకర్తలు ఉన్నారని, వారే రేపటి నాయకులని ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. కొంతమంది స్వార్థపరులు పోయినంత మాత్రాన బీఆర్‌ఎస్‌కు నష్టమేమీ లేదన్నారు. పార్టీ 25 ఏళ్ల ప్రజాప్రస్థానం కొనసాగుతుందని, భవిష్యత్ బీఆర్‌ఎస్‌దేనని ధీమా వ్యక్తం చేశారు. గురువారం సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో హుజూరాబాద్, ఆర్మూర్ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో కేసీఆర్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కేసీఆర్ చెప్పిన అంశాలు ఆయన మాటల్లోనే..

''ఆరు దశాబ్దాలపాటు దిక్కూమొక్కూ లేక కొట్టుమిట్టాడిన తెలంగాణను ఓ దరికి చేర్చేందుకు గులాబీ జెండా ఉద్యమ కేతనమై ఎగిరింది. తెలంగాణ సాధన అనే మహోన్నత లక్ష్యాన్ని సాధించేందుకు ఎన్నో పదవులను త్యాగం చేసిన చరిత్ర మనది. తెలంగాణ సాధించిన ఘనత కన్నా నాకు సీఎం పదవి పెద్ద విషయం కాదు.

ప్రజలు మోసపోయారు

ప్రత్యేక రాష్ట్రం సాధించే నాటికి సమైక్య పాలనలో తెలంగాణది దిక్కూమొక్కూ లేని పరిస్థితి. రాష్ట్ర పాలన పగ్గాలు చేపట్టి సాగునీరు, తాగునీరు, కరెంటు వంటి అనేక కీలక వసతులు కల్పించుకున్నాం. అన్ని రంగాల్లో తెలంగాణను తీర్చిదిద్దుకున్నాం. పదేళ్ల స్వల్పకాలంలోనే అద్భుత ప్రగతి సాధించుకున్నాం. ఇటువంటి సమయంలో ప్రజలు ఊహించని తీర్పునిచ్చారు. కొన్ని కొన్ని సార్లు ఇలాంటి తమాషాలు జరుగుతుంటాయని చరిత్రలోకి వెళితే అర్థమవుతుంది. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అలవిగాని హామీలను నమ్మి ప్రజలు మోసపోయారు. పాలిచ్చే బర్రెను వదిలి దున్నపోతును తెచ్చుకున్నట్లు అయిందంటూ ఇప్పుడు బాధపడుతున్నారు. బీఆర్‌ఎస్ సర్కారులో అందిన లబ్ధి ఇప్పుడు రావడం లేదని ఆందోళన చెందుతున్నారు. ఎంతో కష్టపడి దరికి తెచ్చిన తెలంగాణ కాంగ్రెస్ పాలనలో దారి తప్పింది.

పార్టీయే నాయకులను సృష్టిస్తుంది

ఎప్పుడూ పార్టీ నాయకులను సృష్టిస్తుంది. నాయకులు పార్టీలోకి వచ్చిపోతుంటారు. కొందరు నాయకులు వీడినంత మాత్రాన పార్టీకి ఎటువంటి నష్టం రాదు. బీఆర్‌ఎస్ పార్టీకి బుల్లెట్ల వంటి కార్యకర్తలున్నారు. వారినే నాయకులుగా తీర్చిదిద్దుకుందాం. పార్టీ బీఫారం ఇచ్చి అవకాశమిస్తే.. ఎవరైనా సిపాయిలుగా తయారవుతారు. ప్రజల్లో చైతన్యం వచ్చి కాంగ్రెస్ చేసిన మోసాన్ని గుర్తిస్తారు. తిరిగి బీఆర్‌ఎస్‌ను ఆదరిస్తారు. అప్పటిదాకా ఓపికతో ప్రజాసమస్యలపై దృష్టి సారించాలి..''అని కేసీఆర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ప్రశాంత్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, కందాల ఉపేందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు జహంగీర్, దుండిగల రాజేందర్, చైర్మన్లు, సర్పంచులు, ఇతర నేతలు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌ను మించి ప్రజలు మనకు మద్దతిస్తారు

తెలంగాణ కోసం సాగిన మన 25 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణం ఆగలేదు, అయిపోలేదు. ఒకసారి ఓడగొట్టిన ఎన్టీఆర్‌ను తిరిగి ఎలాగైతే ప్రజలు గద్దె మీద కూర్చోబెట్టారో అంతకన్నా గొప్పగా బీఆర్‌ఎస్ పార్టీని ప్రజలు తిరిగి ఆదరిస్తారు. అంతకంటే రెట్టింపు మద్దతుతో మనను గద్దె మీద కూర్చుండబెట్టే రోజు త్వరలోనే వస్తుంది. కాంగ్రెస్ పాలన రోజురోజుకూ దిగజారుతోంది.

స్టీరింగ్ పట్టిన కేసీఆర్

ఫామ్‌హౌజ్‌లో మినీ వ్యాన్ నడిపిన బీఆర్‌ఎస్ అధినేత

మర్కూక్ (గజ్వేల్): బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ స్టీరింగ్ పట్టారు. గురువారం సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని తన వ్యవసాయ క్షేత్రంలో కాసేపు మినీ వ్యాన్ నడిపారు. అందులో ఎమ్మెల్యేలు, నేతలను కూర్చోబెట్టుకుని ఫామ్‌హౌజ్‌లో కలియదిరిగారు. కొన్నినెలల క్రితం కేసీఆర్‌కు తుంటి ఎముక విరగడంతో, శస్త్రచికిత్స చేయించుకున్న విషయం తెలిసిందే. తర్వాత చాలా రోజులు చేతికర్ర సాయంతో నడిచిన ఆయన.. ఇటీవలే వైద్యుల సూచన మేరకు చేతికర్ర వదిలేసి నడవడం మొదలుపెట్టారు. తాజాగా తన ఫామ్‌హౌజ్‌లో ఓమ్నీ వ్యాన్ నడుపుతూ కనిపించారు. వ్యాన్‌లో కేసీఆర్‌తోపాటు ఎమ్మెల్యేలు వేముల ప్రశాంత్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి తదితరులు ఉన్నారు.

కవితా సంకలనాన్ని అందజేసిన కవయిత్రి మహెజబీన్ బేగ్

ప్రముఖ స్త్రీవాద కవయిత్రి మహెజబీన్ బేగ్ గురువారం ఎర్రవల్లిలో కేసీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా తన కవితా సంకలనం ం 'ఆకులురాలు కాలం'ంపుస్తకాన్ని కేసీఆర్‌కు అందజేశారు.

ఎమ్మెల్యేల పార్టీ మార్పు పిటిషన్.. 3 నెలల్లో నిర్ణయం తీసుకోవాలి

ఇప్పటివరకు స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు

- ఈ మేరకు గతంలో సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది
- వెంటనే నిర్ణయం తీసుకునేలా ఆదేశించాలి
- పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది వాదనలు

సాక్షి, హైదరాబాద్: సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పు ప్రకారం ఎమ్మెల్యే పార్టీ మార్పు అంశంపై స్పీకర్ 3 నెలల్లో నిర్ణయం తీసుకోవాలని.. ఆ గడువు దాటి వారమైనా ఇంకా తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని పిటిషనర్ల (బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కేపీ వివేకానంద్) తరఫున సీనియర్ న్యాయవాది ఆర్యామ సుందరం వాదనలు వినిపించారు. పార్టీ మారిన ఎమ్మెల్యేకు కనీసం ఇప్పటివరకు నోటీసులు కూడా జారీ చేయలేదన్నారు. వెంటనే నిర్ణయం తీసుకునేలా స్పీకర్‌ను ఆదేశించాలని కోరారు. ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, తెల్లం వెంకటరావులను అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 'వీరు 2023 నవంబర్‌లో జరిగిన ఎన్నికల్లో బీఆర్‌ఎస్ తరఫున విజయం సాధించి, తర్వాత కాంగ్రెస్‌లో చేరారు. ఒక పార్టీ అభ్యర్థిత్వంపై గెలిచి శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేయకుండా మరో పార్టీలో చేరిన వీరిని అనర్హులుగా ప్రకటించాలి. స్పీకర్‌ను కలవాలని ప్రయత్నించినా సమయం ఇవ్వడం లేదు. ఈ మెయిల్ ద్వారా పంపిన పిటిషన్‌పై 3 నెలల్లోగా నిర్ణయం తీసుకునేలా స్పీకర్ ఆదేశించాలి'అని కోరారు. ఇదే విధంగా ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ తరఫున పోటీ చేసి విజయం సాధించిన దానం నాగేందర్.. ఎమ్మెల్యే సభ్యత్వానికి రాజీనామా చేయకుండా కాంగ్రెస్‌లో చేరారని, ఆయనను కూడా అనర్హుడిగా ప్రకటించాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మరో పిటిషన్ వేశారు. ఈ రెండు పిటిషన్లపై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి గురువారం మరోసారి విచారణ చేపట్టారు.

రెండు తీర్పులను పరిశీలిస్తే..

సీనియర్ న్యాయవాది ఆర్యామ సుందరం వాదనలు వినిపిస్తూ.. 'ఎమ్మెల్యేగా గెలిచిన వ్యక్తి పార్టీ మారడమే కాకుండా పార్లమెంట్ ఎన్నికల్లోనూ పోటీ చేశారు. ఆయనను ప్రజలు ఓడించారు. మార్చి 18న పిటిషన్ ఇచ్చినా స్పీకర్ కార్యాలయం ఇంత వరకు ఏం చర్యలు చేపట్టిందో కూడా చెప్పలేదు. ఈ రోజు విచారణ ఉండగా, ఒక రోజు ముందు కౌంటర్ దాఖలు చేశారు. మహారాష్ట్ర, మణిపూర్ కేసులలో సుప్రీంకోర్టు వెలువరించిన రెండు తీర్పులను పరిశీలిస్తే.. తమ ముందు పెండింగ్‌లో ఉన్న అనర్హత పిటిషన్లపై నిర్ణీత గడువులోగా నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. రూల్ 6, 7 ప్రకారం స్పీకర్ నడుచుకోవడం లేదు. వెంటనే నిర్ణయం తీసుకునేలా స్పీకర్‌ను ఆదేశించాలి'అని విజ్ఞప్తి చేశారు. వాదనలు విన్న ధర్మాసనం.. ప్రతివాదుల వాదన కోసం తదుపరి విచారణను జూలై 3కు వాయిదా వేసింది. ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ ఏ.సుదర్శన్‌రెడ్డి, అనధికారిక ప్రతివాది తరఫున సీనియర్ న్యాయవాది మయూర్‌రెడ్డి హాజరయ్యారు.

ఎమ్మెల్యేల కొనుగోళ్లను నిలిపివేయాలి

- రాష్ట్రంలో కాంగ్రెస్, మహారాష్ట్రలో బీజేపీ కొనుగోళ్లను ప్రోత్సహిస్తున్నాయి
- బీఆర్‌ఎస్ ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, కేఆర్ సురేశ్‌రెడ్డి, పార్థసారథి విమర్శ



మీడియాతో మాట్లాడుతున్న వద్దిరాజు రవిచంద్ర. చిత్రంలో పార్థసారథి, సురేశ్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ, మహారాష్ట్రలో బీజేపీ ఎమ్మెల్యేల కొనుగోళ్లను ప్రోత్సహిస్తున్నాయని బీఆర్‌ఎస్ ఎంపీలు ఆరోపించారు. ఇదేనా ప్రజాస్వామ్యం అంటూ ఆ రెండు పార్టీలను నిలదీశారు. రాష్ట్రంలో తమ పార్టీకి చెందిన ఎమ్మెల్యేల కొనుగోళ్లను కాంగ్రెస్ నిలిపివేయాలని బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర డిమాండ్ చేశారు. గురువారం తెలంగాణ భవన్‌లో ఎంపీలు కె.ఆర్.సురేశ్ రెడ్డి, డాక్టర్ బండి పార్థసారథిలతో కలసి వద్దిరాజు రవిచంద్ర మీడియాతో మాట్లాడారు. తమ పార్టీ గుర్తుపై గెలిచిన వారిని కాంగ్రెస్ లాక్కోవడం అప్రజాస్వామికమని విమర్శించారు. ఇటువంటి పద్ధతులకు స్వస్తి చెప్పి ప్రభుత్వం అభివృద్ధిపై దృష్టిసారించాలని సూచించారు. రాష్ట్రానికి సింగరేణి బంగారం లాంటిదని, సింగరేణిని ప్రైవేటుపరం కానివ్వకుండా తమ పార్టీ అడ్డుకుంటుందని తెలిపారు. పాలమూరు–రంగారెడ్డి సాగునీటి పథకానికి జాతీయహోదా ఇవ్వాలని, ఖాజీపేటలో రైల్వే కోచ్‌ను ఏర్పాటు చేయాలని ఎంపీలు డిమాండ్ చేశారు. బయ్యారంలో ఉక్కు కర్మాగారాన్ని నెలకొల్పాలని, దీనికోసం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చొరవ చూపాలని సూచించారు. ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడం ద్వారా ప్రాంతీయ పార్టీలను అణగదొక్కేందుకు బీజేపీ, కాంగ్రెస్‌లు కుట్ర పన్నుతున్నాయని కె.ఆర్.సురేశ్‌రెడ్డి మండిపడ్డారు. దేశంలో తెలంగాణ రాష్ట్రం పదేళ్ల పాటు అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలిచిందని, అయితే కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సినవి మాత్రం ఇవ్వలేదని విమర్శించారు. త్వరలో ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో రైతులు, మహిళలు, నిరుద్యోగులకు అధిక ప్రాధాన్యతను ఇస్తారని ఆశిస్తున్నట్లు సురేశ్‌రెడ్డి తెలిపారు.

రైతుకు రొక్కమేది?

- తక్షణమే రూ.20 వేల పెట్టుబడి సాయం ఇవ్వాలంటూ రైతు సంఘాల ఆందోళన
- ఏపీ వ్యాప్తంగా తహసీల్దార్ కార్యాలయాల వద్ద నిరసనలు, ధర్నాలు
- కేంద్రం మాట నిలబెట్టుకున్నా ఏపీ ప్రభుత్వం స్పందించడం లేదని మండిపాటు




వైఎస్సార్ జిల్లా కడపలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడుతున్న సీపీఐ నాయకులు

సాక్షి, అమరావతి, నెట్‌వర్క్: తాము అధికారంలోకి రాగానే ప్రతీ రైతుకు రూ.20 వేలు చొప్పున సాగు సాయం అందిస్తామంటూ సూపర్ సిక్స్‌లో ఇచ్చిన హామీని టీడీపీ – జనసేన – బీజేపీ కూటమి ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, ఏపీ కౌలు రైతు సంఘాలు డిమాండ్ చేశాయి. మాట ప్రకారం కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ తొలి విడత సాయాన్ని ఇటీవలే జమ చేసిందని, అదే తరహాలో రాష్ట్ర ప్రభుత్వం సైతం అన్నదాతా సుఖీభవ ద్వారా రైతన్నలకు పెట్టుబడి సాయం అందించి ఆదుకోవాలని కోరాయి. వ్యవసాయదారులకు తొలి విడత పెట్టుబడి సాయాన్ని వెంటనే జమ చేయాలని కోరుతూ ఏపీ రైతు సంఘం, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో గురువారం రాష్ట్రవ్యాప్తంగా తహసీల్దార్ కార్యాలయాల ఎదుట పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. సామాజిక వర్గాలతో సంబంధం లేకుండా రైతులతో పాటు కౌలు రైతులు, అటవీ, దేవదాయ, అసైన్డ్ భూసాగుదారులకు పెట్టుబడి సాయం అందించాలని కోరుతూ తహసీల్దార్లకు వినతిపత్రాలు సమర్పించారు.

గత ఐదేళ్లుగా పీఎం కిసాన్ – వైఎస్సార్ రైతు భరోసా కింద ఏటా రూ.13,500 చొప్పున మూడు విడతల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెట్టుబడి సాయాన్ని అందించిందని గుర్తు చేశారు. తొలివిడత సాయాన్ని గత ప్రభుత్వం ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందుగానే జమ చేసిందని చెప్పారు. ఆ డబ్బులు దుక్కి పనులు, విత్తనాల కొనుగోలు లాంటి సాగు అవసరాలకు రైతులకు ఎంతగానో ఉపయోగపడేవన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి రైతుకు రూ.20 వేల చొప్పున సాగు సాయం అందిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో కూటమి నేతలు విస్తృతంగా ప్రచారం చేశారని, ఈ హామీని వెంటనే అమలులోకి తేవాలని సూచించారు. తొలి విడత సాయం అందకపోవడంతో పెట్టుబడి ఖర్చుల కోసం ఖరీఫ్ సీజన్‌లో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. పీఎం కిసాన్‌తో సంబంధం లేకుండా రూ.20 వేలు చొప్పున సాగు సాయాన్ని రాష్ట్ర ప్రభుత్వమే సొంతంగా జమ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎన్ని విడతల్లో ఎంత జమ చేస్తారో స్పష్టత ఇవ్వడంతో పాటు త్వరలో ప్రవేశపెట్టనున్న పూర్తి స్థాయి బడ్జెట్‌లో ఈ మేరకు కేటాయింపులు కూడా జరపాలన్నారు. పెరిగిన సాగు ఖర్చులకు అనుగుణంగా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ను పెంచి పంట రుణాలు అందించాలన్నారు. రూ.3 లక్షల వరకు వడ్డీ లేకుండా, రూ.5 లక్షల వరకు పావలా వడ్డీతో రైతు, కౌలురైతులకు రుణాలివ్వాలని కోరారు. సాగు చేస్తున్న భూమి దామాషాను పరిగణనలోకి తీసుకొని పంటరుణాలు మంజూరు చేయాలన్నారు. ప్రాజెక్టుల కింద ఉన్న ప్రధాన కాలువలు, మేజర్, మైనర్ కాలువలతోపాటు డెల్టా ప్రాంతంలోని మురుగునీటి కాలువల మరమ్మతులు వెంటనే చేపట్టాలన్నారు. వ్యవసాయ మోటార్లకు బిగించిన స్మార్ట్ మీటర్లను వెంటనే తొలగించి ఉచిత విద్యుత్ పథకాన్ని సమర్థంగా అమలు చేయాలన్నారు. గత ప్రభుత్వం 2019లో తెచ్చిన పంట సాగుదారు హక్కుల చట్టాన్ని సవరించాలని, గ్రామ సభలోనే కౌలు రైతులను గుర్తించి స్వీయ ధృవీకరణ ఆధారంగా గుర్తింపు కార్డులు జారీ చేయాలని కోరారు. గుర్తింపు కార్డులు ఇప్పటివరకు జారీ చేయనందున కౌలు రైతుల నుంచి సెల్ఫ్ డిక్లరేషన్ తీసుకుని పచ్చి రొట్ట విత్తనాలు, అన్ని రకాల పంటల విత్తనాలు, సూక్ష్మ పోషకాలు, ఎరువులు, పురుగు మందులు 90% సబ్సిడీపై అందించాలన్నారు. దేవాదాయ, ధర్మాదాయ సాగు భూముల వేలం పాటలను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. గత సీజన్‌లో వర్షాభావం, తుపాను వల్ల నష్టపోయిన కౌలురైతులకు కౌలు రేట్లు తగ్గించి నామమాత్రపు ధరతో లీజుకు ఇవ్వాలని కోరారు.

సీతారామ పంప్‌హౌస్ ట్రయల్ రన్ సక్సెస్



భద్రాద్రి జిల్లా అశ్వాపురం మండలం బీజీ కొత్తూరులోని పంప్‌హౌస్ నుంచి ఎత్తిపోస్తున్న గోదావరి నీరు

అశ్వాపురం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం బీజీ కొత్తూరు గ్రామంలో నిర్మించిన సీతారామ ప్రాజెక్ట్ ఫేస్–1 పంప్‌హౌస్ ట్రయల్‌రన్ గురువారం విజయవంతమైంది. పంప్‌హౌస్‌లోని ఒక మోటార్ ద్వారా నీటిని ఎత్తిపోయగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరిశీలించారు. ఈ పంప్‌హౌస్‌లో ఒక్కొక్కటి 25 మెగావాట్ల సామర్థ్యం గల ఆరు మోటార్లు ఏర్పాటు చేశారు. దుమ్ముగూడెం ఆనకట్ట నుంచి ఒక్కో మోటారు 1,500 క్యూసెక్కుల చొప్పున 9,000 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోయనున్నాయి. పంప్‌హౌస్ నిర్మాణం మూడేళ్ల క్రితమే పూర్తయినా.. విద్యుత్ బిల్లులు భారమవుతాయనే ఉద్దేశంతో ఇంతవరకు ట్రయల్ రన్ చేపట్టలేదు. విద్యుత్ కనెక్షన్ కూడా ఇవ్వలేదు. ఇటీవల డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు పంప్‌హౌస్‌ను సందర్శించి విద్యుత్ కనెక్షన్ ప్రారంభించారు. దీంతో పది రోజులుగా ట్రయల్ రన్ పనులు చేపట్టిన అధికారులు.. గురువారం ఆ ప్రక్రియను పూర్తి చేశారు. కార్యక్రమంలో జలవనరుల శాఖ సలహాదారు పెంటారెడ్డి, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, సీఈ శ్రీనివాసరెడ్డి, ఎస్ఈ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేకాట మొదలు

మళ్లీ తెరుచుకుంటున్న పేకాట క్లబ్‌లు, శిబిరాలు అధికార పార్టీ ప్రజాప్రతినిధుల అండాదండా

- గుంటూరు నడిబొడ్డున ఏ అనుమతులు లేకుండా పేకాట క్లబ్ ప్రారంభం
- టీడీపీ హయాంలో క్లబ్‌లది ప్రత్యేక చరిత్ర
- రిక్రియేషన్ పేరుతో పేకాట, బెట్టింగ్, అసాంఘిక కార్యకలాపాలు.. వీటి బారిన పడి ఆస్తులు కోల్పోయి అప్పుల పాలైన వారెందరో
- ఆత్మహత్యలతో రోడ్డున పడ్డ కుటుంబాలు
- 2019లో వీటిని మూసివేయించిన జగన్ ప్రభుత్వం.. మళ్లీ తెరుచుకోకుండా చర్యలు
- అసాంఘిక కార్యకలాపాలు, పేకాట, బెట్టింగ్‌లపై నిషేధం.. టీడీపీ కూటమి విజయంతో మళ్ళీ ప్రారంభమవుతున్న క్లబ్‌లు

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

రామోజీ అక్షర శిఖరం

- ఎన్టీఆర్‌తో పాటు రామోజీకీ భారతరత్న కోసం పోరాడాలి
- అమరావతిలో రామోజీ విజ్ఞాన్ కేంద్రం నిర్మిస్తాం
- రామోజీరావు సంస్మరణ సభలో ఏపీ సీఎం చంద్రబాబునాయుడు



అమరావతి రాజధాని నిర్మాణానికి రూ10 కోట్ల చెక్కును చంద్రబాబు, పవన్‌కు అందచేస్తున్న రామోజీరావు కుటుంబ సభ్యులు

సాక్షి, అమరావతి/పెనమలూరు: రామోజీ గ్రూప్స్ అధిపతి చెరుకూరి రామోజీరావు అక్షర శిఖరమని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు కొనియాడారు. తెలుగు భాషపై ఎనలేని అభిమానం, తెలుగు జాతిపై ఎంతో ఆప్యాయతతో రామోజీరావు విలువలతో కూడిన సమాజం కోసం కృషి చేశారన్నారు. విజయవాడ శివారు పెనమలూరు మండలం కానూరులో గురువారం ప్రభుత్వం నిర్వహించిన రామోజీరావు సంస్మరణ సభకు ఆయన విచ్చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ఎన్టీఆర్‌తో పాటు రామోజీరావుకు 'భారతరత్న' సాధించేందుకు అందరూ కలిసికట్టుగా పోరాడాలని కోరారు. అమరావతిలో రామోజీ స్మారకార్థం విజ్ఞాన కేంద్రాన్ని నిర్మిస్తామని.. ఒక రోడ్డుకు రామోజీరావు మార్గ్‌గా నామకరణం చేయడంతో పాటు విశాఖలో రామోజీ చిత్రనగరి పేరుతో సినిమా షూటింగ్‌లకు ప్రత్యేక వాతావరణం కల్పిస్తామన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు 1982లో ఎన్టీఆర్‌ను అధికారంలోకి తేవడంలోనూ, ఆగస్టు విపత్తు నుంచి గట్టెక్కించడంలోనూ ప్రముఖ పాత్ర పోషించారని చంద్రబాబు గుర్తు చేశారు. ఈ సందర్భంగా అమరావతి అభివృద్ధికి రామోజీరావు కుమారుడు కిరణ్ రూ.10 కోట్ల విరాళాన్ని చంద్రబాబుకు అందజేశారు.

రామోజీ ప్రజల పక్షపాతి: డిప్యూటీ సీఎం పవన్

రామోజీరావు ప్రజల పక్షపాతి అని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అన్నారు. ప్రజా క్షేమం కోసం నిత్యం పాడుపడుతూ జర్నలిజం విలువలు కాపాడటానికి కృషి చేశారన్నారు. పత్రికా రంగం, సినీ నిర్మాణం, స్టూడియోలతో ఎందరికో ఉపాధి కల్పించారని.. ఎన్ని కష్టాలు వచ్చినా ఎక్కడా రాజీ పడలేదన్నారు.

విలువలకు కట్టుబడిన రామోజీ..

హిందూ దినపత్రిక ఎండీ ఎన్.రామ్ మాట్లాడుతూ.. నమ్మిన విలువలకు కట్టుబడిన వ్యక్తి రామోజీరావు అని కొనియాడారు. రాజస్థాన్ పత్రిక ఎడిటర్ గులాబ్ కొఠారి, నిర్మాత శ్యాంప్రసాద్‌రెడ్డి, సంగీత దర్శకుడు కీరవాణి, దర్శకుడు రాజమౌళి పాల్గొన్నారు.

గడిచిన ఐదేళ్లూ ఈ పాటికే ఖాతాల్లోకి..

ప్రస్తుతం 'భరోసా' లేక భారంగా సాగు

పెట్టుబడి ఖర్చుల కోసం అన్నదాత అగచాట్లు.. ప్రతీ రైతుకు రూ.20 వేల పెట్టుబడి సాయం అంటూ సూపర్‌సిక్స్‌లో కూటమి హామీ

పగ్గాలు చేపట్టిన తర్వాత ఆ ఊసెత్తని ప్రభుత్వ పెద్దలు.. అప్పుల కోసం ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల చుట్టూ అన్నదాతల ప్రదక్షిణలు

ఐదేళ్ల పాటు పెట్టుబడి సాయం సమయానికి అందించిన వైఎస్ జగన్ ప్రభుత్వం

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

వైఎస్సార్‌సీపీ శ్రేణులకు రక్షణ కల్పించండి

వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపైన టీడీపీ కూటమి నేతల అమానుష దాడులు

సాక్షి, అమరావతి: అధికార కూటమి నేతల అమానుష దాడుల నుంచి రాష్ట్రంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు రక్షణ కల్పించాలని పార్టీ ముఖ్య నేతలు డీజీపీ ద్వారకా తిరుమలరావును కోరారు. పార్టీ శ్రేణులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, పార్టీ కార్యాలయాల్లోకి అక్రమ చొరబాట్లను, దాడులను నిలువరించాలని విజ్ఞప్తి చేశారు. ఈమేరకు మాజీ మంత్రి అంబటి రాంబాబు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, గుంటూరు మేయర్ కావటి మనోహర్ నాయుడు, మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి గురువారం డీజీపీకి ఓ లేఖ రాశారు. దానిని డీజీపీకి మెయిల్ ద్వారా పంపారు. కూటమి నేతల దౌర్జన్యాలకు సంబంధించిన పలు ఆధారాలు, వివరాలు కూడా లేఖతో పాటు జత చేశారు.

'రాష్ట్రంలో టీడీపీ కూటమి గెలుపొందినప్పటి నుంచి గత 25 రోజులుగా వైఎస్సార్‌సీపీ నాయకులకు, కార్యకర్తలకు, వారి ఆస్తులకు, పార్టీ కార్యాలయాలకు రక్షణ లేకుండా పోయింది. పార్టీ నాయకులు, కార్యకర్తలపైన అమానుషంగా దాడులు చేస్తున్నారు. వారి ఆస్తులకు తీవ్ర నష్టం కలిగిస్తున్నారు. ఈ కేసులకు సంబంధించి క్షేత్రస్థాయిలో పోలీసులు తగిన రీతిలో చర్యలు తీసుకోవడంలేదు. మా ప్రాణాలకు హాని ఉందని చెప్పినా పోలీసులు పట్టించుకోవడంలేదు. ఈ ఘటనలపై వెంటనే కేసులు నమోదు చేసి, కారకులను వెంటనే అరెస్టు చేయాలని గట్టిగా డిమాండ్ చేస్తున్నాం. అంతేకాకుండా రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాల్లోకి టీడీపీ, జనసేన మంత్రులు, నాయకులు, కార్యకర్తలు అక్రమంగా ప్రవేశించి దౌర్జన్యాలకు దిగుతున్నారు. గురువారానికి రాష్ట్రంలోని 14 చోట్ల పార్టీ కార్యాలయాల్లోకి చొరబడ్డారు. మా పార్టీ కార్యాలయాలు, ప్రాంగణాల్లోకి అక్రమంగా ప్రవేశించి దౌర్జన్యాలకు పాల్పడి చట్టాన్ని ఉల్లంఘించారు. ఘర్షణలు రేపేందుకు ప్రయత్నించారు. టీడీపీ, జనసేన నాయకులు అక్రమంగా ప్రవేశించినా, బెదిరింపులకు దిగినా పోలీసులు ఎక్కడా వారిని నియంత్రించడంలేదు సరికదా వారి అక్రమాలకు దన్నుగా నిలబడ్డారు. శాంతి భద్రతలను కాపాడి, రక్షణగా ఉండాల్సిన పోలీసులు నిర్లిప్తంగా వ్యవహరిస్తున్నారు.

రాష్ట్రంలో ఇలాంటి పరిస్థితులకు తావివ్వడం ద్వారా శాంతి భద్రతలను ప్రమాదంలో పడేశారు. వైఎస్సార్‌సీపీ కార్యాలయాలకు రక్షణ లేకుండా పోయింది. అధికార టీడీపీ కూటమి నాయకుల దాడులు, దౌర్జన్యాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని గట్టిగా డిమాండ్ చేస్తున్నాం. నిర్లిప్తంగా వ్యవహరించిన పోలీసు అధికారులపైనా శాఖాపరంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం' అని ఆ లేఖలో పేర్కొన్నారు.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
శుక్రవారం ॥ 28-6-2024

ఫ్యాషన్

ఇండియన్ కుర్తీ వెస్ట్రన్ కట్స్

అమ్మాయిలు కోరుకునే సౌకర్యవంతమైన డ్రెస్ కుర్తీ ఎప్పుడూ ఒకే స్టైల్‌లో కాకుండా భిన్నమైన వెస్ట్రన్ కట్స్‌తో లేయర్డ్ టాప్స్‌గా పేరు మార్చుకొని మరీ ట్రెండ్‌లో ఉంటున్నాయి. అసమానంగా ఉండటమే ప్రత్యేకతగా ఇండో-వెస్ట్రన్ స్టైల్‌లో ఆకట్టుకునే ఈ డ్రెస్ డిజైన్స్ యువతను మరింత మోడరన్‌గా మార్చేస్తాయి. అటు క్యాజువల్ వేర్‌గానూ, ఇటు పార్టీవేర్‌గానూ కూడా యువతను ఆకట్టుకుంటున్నాయి.





టు లేయర్స్‌గా ఉండే ఖఫ్తాన్ స్టైల్ కుర్తీ సెట్ కలర్ కాంబినేషన్‌తో సరైన ఎంపిక అవ్వాలి.

నెటెడ్, చందేరీ ఫ్యాబ్రిక్ లేయర్స్‌తో ఉండే అసిమెట్రిక్ కుర్తీ ప్రత్యేక సందర్భాలలోనూ స్టైల్‌గా కనిపిస్తుంది.




ధోతీ ప్యాంట్‌కు అసిమెట్రికల్ కట్‌తో ఉండే కుర్తీ, దానిపైకి ఎంబ్రాయిడరీ చేసిన వెస్ట్రన్ టాప్ ఇండోవెస్ట్రన్ స్టైల్‌తో ఆకట్టుకుంటుంది.





జెండర్ స్పృహ



ఈ పాఠాలు అవసరం


'అ' అంటే 'అమ్మ'.. 'ఆ' అంటే 'ఆవు' పాఠాలు కాదు కావలసినవి. అమ్మకు సాయం చేసే ఇంటి సభ్యుల పాఠాలే కావాలని కేరళ ప్రభుత్వం పాఠ్యాంశాలను ప్రవేశపెట్టింది. అమ్మ వంట చేస్తుంటే నాన్న ఆఫీసుకు వెళ్లే చిత్రాలతో ఉండే గత పాఠాలకు బదులు అమ్మకు వంటలో సాయం చేసే నాన్నలను ప్రవేశ పెట్టింది. ఆడపిల్లలను ఒక విధంగా, మగ పిల్లలను ఒక విధంగా కాకుండా అందరూ అన్ని పనుల్లో సమానమే అని చెప్పే పాఠాలు ఇప్పుడు అవసరం.

అంకుర స్థాయిలో విద్యాబోధన వేసే ప్రభావాలు చాలా గట్టివి. గతంలో ఇవి తెలియకుండా లింగ వివక్షను ప్రతిపాదించేవి. లేదా పరిమితులను నిర్ధారించేవి. లేదా ఎవరి పనులు ఏమిటో, ఎవరి స్థాయి ఏమిటో స్టీరియో టైప్ చేస్తూ ముద్ర వేసేవి. టెక్స్‌బుక్స్‌లో ఎప్పుడూ అమ్మ ఎప్పుడూ వంట చేస్తూ, అక్కకు జడ వేస్తూ, ముగ్గు వేస్తూ, పొలం గట్ల మీద నాన్నకు క్యారేజీ తీసుకువెళుతూ, రోలు దంచుతూ, వెన్న చిలుకుతూ కనిపించేది. నాన్న పడక్కుర్చీలో పేపర్ చదువుతూ ఉంటాడు. లేదా ఆఫీసుకు వెళుతూ లేదా ఆఫీస్‌లో పని చేస్తూ కనిపిస్తాడు. అంటే అబ్బాయిలు ఉద్యోగాలకి, అమ్మాయిలు ఇంటి పనికి పరిమితం కావాలని తెలియకనే మనసుల్లోకి ఎక్కేది. ఇప్పటికీ ఇలాంటి పాఠాలు దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఉన్నాయి. కాని కేరళ రాష్ట్రం ఈ పద్ధతిని వదిలి 'జెండర్ న్యూట్రల్' పాఠ్యాంశాలను ప్రవేశపెట్టింది.

ముందే నేర్పించండి

'టీచ్ దెమ్ అర్లీ' అని కేరళ ప్రభుత్వం కొత్త ధోరణిని ఎంచుకుంది. చిన్న వయసులోనే స్త్రీ, పురుష అస్తిత్వాల మధ్య వివక్షను చెరిపేసే పాఠాలు చెప్పాలని నిర్దేశించింది. మూడవ తరగతి మలయాళం, ఇంగ్లిష్ టెక్స్‌బుక్కుల్లో ఇంటి పనుల పాఠం ఉంది. మూడవ తరగతి టెక్స్‌బుక్‌లో కొబ్బరి తురుము తీస్తున్న నాన్న వంటగదిలో కనిపిస్తే ఇంగ్లిష్ టెక్స్ట్ బుక్‌లో పాపకు ఇష్టమైన చిరుతిండిని సిద్ధం చేస్తున్న తండ్రి కనిపిస్తాడు. ఈ పాఠాలను ప్రస్తుతం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు స్వాగతిస్తున్నారు. 'అయితే పాఠాల కంటే ముందు లింగ వివక్ష విషయంలో ఉపాధ్యాయులకు కూడా దృష్టి కోణంలో మార్పు తేవాలనే అవగాహనతో వేసవి సెలవుల్లో శిక్షణా తరగతులు నిర్వహించాం' అని తెలిపాడు కేరళ ఎస్‌సిఇఆర్‌టి డైరెక్టర్ జయప్రకాష్. ఇది మాత్రమే కాదు సుప్రీం కోర్టు తీర్పును అనుసరించి అన్ని రకాల జెండర్ల, వారి జీవన హక్కుల గురించి అవగాహన కలిగించే పాఠాలను కాలక్రమంలో స్కూల్ టెక్స్ట్‌బుక్కులు చేరుస్తామని కేరళ విద్యాశాఖ తెలిపింది.





ఐదవ తరగతి లోపు 200 రోజులు

ఈ విద్యా సంవత్సరం కేరళ విద్యాశాఖ తీసుకున్న మరో కీలక నిర్ణయం 1 నుంచి 5 వ తరగతి లోపు పిల్లలకు 200 పని దినాలు చాలని నిబంధన విధించడం. ప్రాథమిక విద్యాహక్కు చట్టం ప్రకారం 1 నుంచి 5వ తరగతి లోపు పిల్లలకు 200 పని దినాల్లో 800 గంటల చదువు చాలు. అంతకు మించి చదివించడం వల్ల ఏం ప్రయోజనం ఉండటం లేదని ఉపాధ్యాయ సంఘం చేసిన సూచన మేరకు అక్కడి విద్యాశాఖ కొత్త నియమాన్ని అమలులోకి తెచ్చింది. దీని వల్ల అన్ని స్కూళ్లు ఐదవ తరగతి లోపు పిల్లలకు వారానికి ఐదు రోజులే పని చేస్తాయి. ఉపాధ్యాయ సంఘం మరో సూచన కూడా చేసింది. బడి గంటలు పెంచి హైస్కూల్ తరగతులకు కూడా 200 రోజుల పని దినాలు చేయాలని. హైస్కూల్ సిలబస్‌లు పూర్తి కావాలంటే సంవత్సరంలో 1000 గంటలు పాఠాలు సాగాలని అందుకు వారానికి ఐదు రోజులు ఎక్కువ పీరియడ్లు చెప్పి శని, ఆదివారాలు సెలవు ఇవ్వొచ్చని సంఘం సూచించింది. దీనికి విద్యాశాఖ అనుమతించలేదు గాని పరిశీలనకు తీసుకుంది.

వంటిల్లు

గ్రీన్ కర్రీస్

వాతావరణం మారింది... వర్షాలు మొదలయ్యాయి. సీజనల్ కోల్డ్... ఇంకా అనుబంధ సమస్యలు కూడా. ఇమ్యూనిటీ పుష్కలంగా ఉండడమే అన్నింటికీ పరిష్కారం. ఆహారంలో రుచికి తోడుగా ఆరోగ్యాన్ని జోడించాలి. రోజూ ఏదో ఒక ఆకు కూర తింటే ఆరోగ్యం పరిపూర్ణం. రోజూ ఆకు కూరలేనా... అని పిల్లలు ముఖం చిట్లిస్తే... పిల్లలు ఇష్టపడే కాంబినేషన్‌లతో వండి పెట్టండి.

ఆలూ మేథీ



కావలసినవి: బంగాళదుంప – 200 గ్రా; మెంతి ఆకు – మీడియం సైజు కట్ట ఒకటి; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి; నూనె – 2 టేబుల్ స్పూన్‌లు; జీలకర్ర – టీ స్పూన్; ఇంగువ – పావు టీ స్పూన్; వెల్లుల్లి తరుగు – టీ స్పూన్; అల్లం తరుగు – టీ స్పూన్; పచ్చిమిర్చి తరుగు – టీ స్పూన్; ఎండు మిర్చి – 2; పసుపు – అర టీ స్పూన్; ధనియాల పొడి – 2 టేబుల్ స్పూన్‌లు

తయారీ: • బంగాళదుంప ఉడికించి తొక్క తీసి ముక్కలు చేయాలి. • మెంతి ఆకులు వలిచి శుభ్రంగా కడిగి, నీరంతా పోయిన తర్వాత తరిగి పక్కన పెట్టుకోవాలి. • బాణలిలో నూనె వేడి చేసి ఎండుమిర్చి, జీలకర్ర వేయాలి. ఆ తర్వాత అల్లం, వెల్లుల్లి, పచ్చిమిర్చి, ఇంగువ వేసి సన్నమంట మీద వేయించాలి. • పసుపు, బంగాళాదుంప ముక్కలు వేయాలి. మసాలా దినుసులు ముక్కలకు పట్టేటట్లు మధ్య మధ్య కలియబెడుతూ ఐదు నిమిషాల పాటు వేగనివ్వాలి. ఇప్పుడు ధనియాల పొడి, మెంతి ఆకు, ఉప్పు వేసి కలిపి మూత పెట్టి సన్నమంట మీద మగ్గనిచ్చి దించేయాలి. పిల్లల లంచ్ బాక్సుకు ఇది మంచి పోషకాహారం.

క్యారట్ మొరింగా కర్రీ



కావలసినవి: క్యారట్ – పావు కేజీ; మునగ ఆకు – వంద గ్రాములు; జీలకర్ర – అర టీ స్పూన్; ఉల్లిపాయ ముక్కలు – అర కప్పు; పచ్చిమిర్చి – 4 (తరగాలి); వెల్లుల్లి రేకలు – 3 (తరగాలి); అల్లం తరుగు – టీ స్పూన్; పసుపు – పావు టీ స్పూన్; ధనియాల పొడి – 2 టీ స్పూన్‌లు; నూనె – 2 టీ స్పూన్‌లు.

తయారీ: • క్యారట్‌ని శుభ్రం చేసి తరగాలి. మునగ ఆకును కడిగి నీరు పోయేటట్లు చిల్లుల గిన్నెలో వేసి పక్కన పెట్టాలి. • బాణలిలో నూనె వేడి చేసి ఆవాలు, జీలకర్ర వేసి, వేగిన తర్వాత ఉల్లిపాయ, పచ్చిమిర్చి, అల్లం, వెల్లుల్లి వేసి మీడియం మంట మీద రెండు నిమిషాల సేపు మగ్గనివ్వాలి. మునగాకు కలిపి రెండు నిమిషాలు (పచ్చివాసన పోయే వరకు) వేగిన తర్వాత క్యారట్ ముక్కలు, ఉప్పు, పసుపు, ధనియాల పొడి వేసి కలపాలి. అరకప్పు నీరు పోసి కలిపి మూత పెట్టాలి. రెండు నిమిషాల్లో క్యారట్ ముక్కలు ఉడుకుతాయి. మూత తీసి నీరు ఆవిరయ్యే వరకు కలిపి దించేయాలి. ఇష్టమైతే కూరలో చివరగా కొబ్బరి పొడి చల్లుకోవచ్చు.

గమనిక: మునగ ఆకు లేకపోతే మెంతి ఆకుతో చేసుకోవచ్చు.

యువర్స్

• మ్యూజిక్ వరల్డ్

హ్యాపీ హ్యాపీగా హాయి హాయిగా



• అనుష్క జగ్

'రీబర్త్' 'టాబూ' 'హరికేన్'లాంటి పాటలతో ఆకట్టుకున్న ఇంటర్నేషనల్ మ్యూజిక్ ఆర్టిస్ట్ అనుష్క జగ్ లేటెస్ట్ సింగిల్ 'ఖుషీ ఖుషీ' వైబ్రెంట్ యానిమేటెడ్ వీడియోతో విడుదల అయింది. తన యూనిక్ వాయిస్‌తో శ్రోతలను ఆకట్టుకుంటున్న అనుష్క తాజాగా 'ఖుషీ ఖుషీ'తో స్వరసందడి చేస్తోంది. 'ఖుషీ ఖుషీ అనేది స్పిరిచ్యువల్ పాప్' అంటుంది అనుష్క.

కాలేజీ రోజుల నుంచి అనుష్కకు ఫిలాసఫీ అంటే ఇష్టం. తాజా పాటలో ఫిలాసఫీ కనిపిస్తుంది. అయితే భారంగా, సంక్లిష్టంగా కాకుండా యూత్‌ఫుల్ స్టైల్‌లో లిరిక్స్ ఉంటాయి. టైటిల్ హిందీలో ఉన్నప్పటికీ లిరిక్స్ మాత్రం ఇంగ్లీష్‌లో ఉంటాయి.

'హ్యాపీ ఈజ్ ఏ ఫీలింగ్ ఐ హ్యావ్ గాట్ హ్యాపీ ఈజ్ ఏ స్విచ్ ఇన్ మై హార్ట్'లాంటి లిరిక్స్‌తో 'ఖుషీ ఖుషీ' దూసుకుపోతోంది. తనను తాను 'మ్యూజికల్ టూరిస్ట్'గా చెప్పుకునే అనుష్క ప్రపంచవ్యాప్తంగా ఎన్నో ప్రాంతాలలో కచేరీలు ఇచ్చింది. జెన్నిఫర్ ఓనీల్, జాన్ జోన్స్, డడ్డీ బ్రౌన్, దానీ పాపిట్, కైల్ కెల్సో లాంటి సంగీతకారులతో కలిసి పనిచేసింది. ప్రతి కొత్త ప్రాజెక్ట్‌లో తనదైన ప్రతిభ చూపుతుంది అనుష్క. ఇండియన్ మెలోడీలు, రిథమ్‌లతో ప్రవాసభారతీయులనే కాదు ప్రపంచవ్యాప్తంగా ఎంతోమందిని ఆకట్టుకుంది అనుష్క జగ్.

• సక్సెస్ స్టోరీ

కుకింగ్



ఆకాష్ మురళీధరన్‌కు చిన్న వయసులోనే వంటలపై ఆసక్తి మొదలైంది. ఆ ఆసక్తి అంతకంతకూ పెరుగుతూ పోయి ప్రపంచ వంటకాల గురించి కూడా తెలుసుకునేలా చేసింది. ప్రపంచ వంటకాల గురించి కాచి వడబోసిన చెన్నైకి చెందిన ఆకాష్ దక్షిణ భారతీయ వంటకాలను ప్రపంచానికి పరిచయం చేయడానికి నడుం కట్టాడు. 'మాస్టర్ చెఫ్ ఇండియా' టైటిల్ గెలుచుకున్నాడు. 'కుకింగ్ ఈజ్ థెరపిటిక్' అంటున్న ఆకాష్‌కు వంటలు చేయడం పాషన్ మాత్రమే కాదు. ప్రాణవాయువు కూడా...

వంటగదిలో బామ్మ స్వీట్ తయారుచేస్తుంటే చిన్నప్పుడెప్పుడో చూశాడు ఆకాష్. 'ఇక్కడ నీకు ఏం పని?' అని గద్దించలేదు బామ్మ. 'ఈ స్వీటును ఇలా తయారు చేయాలి నాయనా' అంటూ వివరించింది. ఇక అప్పటి నుంచి రకరకాల వంటలు. స్వీట్‌ల తయారీపై ఆకాష్‌కు ఆసక్తి పెరిగింది.

ఆ ఆసక్తి, నేర్చుకున్న విద్య ఊరకే పోలేదు. బెంగళూరులో ఇంటర్న్‌షిప్ చేస్తున్న సమయంలో బాగా ఉపయోగపడింది. తనకు ఇష్టమైన వంటలు చేసి ఆ రుచులను ఆస్వాదించడంతో పాటు వంటల్లో రకరకాల ప్రయోగాలు చేసేవాడు. రుచుల ఆస్వాదనలో ఆనందమే కాదు వంట చేస్తున్న సమయంలో ఏకాగ్రత పెరగడం, మనసు ప్రశాంతంగా, ఉత్సాహంగా ఉండడం గమనించాడు ఆకాష్. ఆర్కిటెక్చర్‌లో డిగ్రీ చేసిన ఆకాష్ ఒక ఆర్కిటెక్చర్ ఫర్మ్‌లో టీచింగ్ అసిస్టెంట్‌గా పనిచేశాడు. యానిమేషన్‌లో డిప్లొమా కూడా చేసిన ఆకాష్ ఆ తరువాత వంటలపై తన పాషన్‌ను సీరియస్‌గా తీసుకున్నాడు. కొత్త కొత్త వంటకాల గురించి మరింత ఆసక్తిగా తెలుసుకోవడం మొదలుపెట్టాడు.



• వంటల్లోనే ఆనందం...

ఇటలీలోని మిలాన్‌లో ఫుడ్ డిజైన్‌లో మాస్టర్స్ చేశాడు. పాత వంటకాలకు కొత్త ఫ్లేవర్ జోడించడాన్ని తన ప్రత్యేకతగా చేసుకున్నాడు.

యూరప్‌లోని వివిధ ప్రాంతాలకు వెళ్లడం వల్ల ఎన్నో వంటకాల గురించి తెలుసుకునే అవకాశం వచ్చింది. ఇది తన భవిష్యత్ బాటకు బాగా ఉపయోగపడింది. 'ఇండియాకు అవల ఫుడ్‌ను ఎలా చూస్తారు?' అనే విషయాన్ని లోతుగా తెలుసుకోవడానికి కూడా తన ప్రయాణాలు ఉపయోగపడ్డాయి.

నెదర్‌లాండ్స్‌లో ఒక ఫుడ్ డిజైనర్‌తో కలిసి పనిచేశాడు. 'ప్రపంచంలోని ఎన్నో వంటకాల గురించి తెలుసుకున్న నాకు దక్షిణ భారత వంటకాల రుచులను ప్రపంచానికి పరిచయం చేయాలని గట్టిగా అనిపించింది' అంటాడు ఆకాష్. మనం ఆస్వాదించే వంటకాలకు సంబంధించిన ఆసక్తికరమైన కథలను ఆధునిక పద్ధతులలో చెప్పడానికి 'విజా మెడై' పేరుతో మల్టీడిసిప్లినరి స్టూడియోను మొదలు పెట్టాడు. ఈవెంట్ డిజైన్, డెకర్, మెనూ క్యురేషన్, ఔట్‌ఫిట్ డిజైన్, స్టైలింగ్, క్రియేటివ్ డైరక్షన్‌లు ఈ స్టూడియో ప్రత్యేకత. తన '100–డే కుకింగ్ ప్రాజెక్ట్'లో భాగంగా మనం మరచిపోయిన ఎన్నో కూరగాయలను వెలుగులోకి తెచ్చాడు. సౌత్ ఇండియన్ ఫుడ్ రుచుల గురించి వివరంగా చెప్పడానికి 'మాస్టర్‌చెఫ్ ఇండియా–తమిళ్' షోలో పాల్గొన్నాడు. ఆకాష్ వంటనైపుణ్యానికి ఫిదా అయిన జడ్జీలు స్టాండింగ్ ఓవేషన్ ఇచ్చారు. 'మాస్టర్‌చెఫ్ ఇండియా–తమిళ్' టైటిల్ గెలుచుకున్నాడు ఆకాష్.

చిన్నప్పుడు అటెన్షన్ డెఫిసిట్ హైపర్‌యాక్టివిటీ డిజార్డర్(ఏడీహెచ్‌డీ)తో బాధ పడిన ఆకాష్‌కు వంట చేయడం అనేది చికిత్సలా ఉపయోగపడింది. కొత్త ఉత్సాహాన్ని ఇచ్చింది.

• టెక్.. టాక్

లెనోవా ట్యాబ్ ప్లస్



సైజ్:	11.5 అంగుళాలు
రిఫ్రెష్ రేట్:	90 హెచ్‌జడ్
రిజల్యూషన్:	2000×1200 పిక్సెల్స్
వోఎస్:	ఆండ్రాయిడ్: 14
మెమొరీ:	8+128జీబి 8+256జీబి
బ్యాటరీ:	8,600 ఎంఏహెచ్
బరువు:	650 గ్రా.

షావోమీ రెడ్‌మీ 13



డిస్‌ప్లే:	6.79 అంగుళాలు
బ్యాటరీ:	5030 ఎంఏహెచ్
మెమొరీ:	128జీబి/6జీబి ర్యామ్ 128జీబి/8జీబి ర్యామ్ 256జీబి/ 8జీబి ర్యామ్
రిజల్యూషన్:	1080×2460 పిక్సెల్స్
వోఎస్:	ఆండ్రాయిడ్ 14
ఫ్రంట్ కెమెరా:	13 ఎంపీ

మోటోరొలా రేజర్ 50 ఆల్ట్రా



డిస్‌ప్లే: 6.9 అంగుళాలు
రిఫ్రెష్‌రేట్: 165 హెచ్‌జడ్
రిజల్యూషన్: 1080×2640 పిక్సెల్స్
వోఎస్: ఆండ్రాయిడ్ 14
మెమొరీ: 256జీబి 8జీబి ర్యామ్/ 256జీబి 12జీబి ర్యామ్/ 512జీబి 12జీబి
బ్యాటరీ: 4000 ఎంఏహెచ్
ఫ్రంట్ కెమెరా: 32 ఎంపీ

స్పేస్‌టాప్ జీ1



ఇజ్రాయెలీ కంపెనీ సైట్‌ఫుల్ 'స్పేస్‌టాప్ జీ1' ల్యాప్ టాప్ ఆగ్యుమెంటేడ్ రియాలిటీ (ఏఆర్) గ్లాస్‌తో ముందుకు వచ్చింది. స్క్రీన్‌కు బదులుగా ఏఆర్ గ్లాస్‌తో వచ్చిన ఈ ల్యాప్‌టాప్‌ను 'ఏఆర్ ల్యాప్‌టాప్ ఫర్ వర్క్'గా పిలుస్తారు. 'స్పేస్‌టాప్ జీ1' కనెక్టెడ్ గ్లాసెస్‌తో పనిచేస్తుంది. ఈ గ్లాసెస్ 100 అంగుళాల స్క్రీన్‌ను ప్రాజెక్ట్ చేస్తాయి. మానిటర్‌లాంటి బాహ్య పరికరాలను కనెక్ట్ చేయడానికి లాప్‌టాప్‌లో యుఎస్‌బీ-సి పోర్టులు కూడా ఉన్నాయి. ఏఆర్ గ్లాసెస్ రెండు ఓఎల్‌ఈడీ స్క్రీన్‌లను కలిగి ఉంటాయి. వీటి **రిజల్యూషన్:** 1080 పిక్సెల్స్ **రిఫ్రెష్ రేట్:** 90 హెచ్‌జడ్ **ఇంటర్నల్ స్టోరేజ్:** 16జీబి ర్యామ్/128 జీ

గూగుల్ వి2ఏ



గూగుల్ ఏఐ రిసెర్చ్ ల్యాబ్ డీప్‌మైండ్ కొత్త ఏఐ మోడల్‌పై పని చేస్తోంది. వి2ఏ (వీడియో-టు-ఆడియో) అనే ఈ మోడల్ వీడియోలకు సంబంధించి సౌండ్ ట్రాక్స్, డైలాగులను జనరేట్ చేస్తుంది. టెక్స్ట్ ప్రాంప్ట్స్‌తో వీడియోలను జనరేట్ చేయవచ్చు. దృశ్య, శబ్దపరంగా వీడియోలను మెరుగు పరుచుకోవడానికి ఇది ఉపయోగపడుతుంది. సైలెంట్ ఫిల్మ్స్, ఆర్కైవ్ మెటీరియల్‌కు కూడా వి2ఏ ఉపయోగపడుతుంది.

• అవును... ఇది నిజమే!



- 'మెటాసీజియోఫొబియా' అంటే మార్పు, కొత్త పరిస్థితుల గురించి భయపడడం.
- 'కాఫీ' అనేది యూరప్‌కు పరిచయం అయిన కొత్తలో 'అరేబియన్ వైన్' అని పిలిచేవారు.
- వినడం, నిశ్శబ్దం రెండూ ఒకటే. ఎలా అంటారా? listen లోని లెటర్‌లు silent లోనివి ఒక్కటే!
- డిప్రెషన్‌లో ఉన్న వాళ్లకు లేని వాళ్లతో పోల్చితే మూడు రెట్లు ఎక్కువగా కలలు వస్తుంటాయట!
- was it a car or a cat i saw ఈ వాక్యాన్ని తిరిగేసి చదివినా ఒకేలా ఉంటుంది.



మంకీ సీ మంకీ డూ

ఏమాత్రం ఆలోచించకుండా ఇతరులను గుడ్డిగా అనుసరించే సందర్భంలో వాడే మాట... మంకీ సీ మంకీ డూ. ఉదా: ది కిడ్స్ కాపీడ్ ది టీచర్స్ మూవ్స్, లైక్ మంకీ సీ మంకీ డూ డూరింగ్ ది డ్యాన్స్.

ఈ ఇడియమ్‌కు సంబంధించి రకరకాల కథలు ప్రచారంలో ఉన్నాయి. వాటిలో ఒకటి భారత్, ఈజిప్ట్, సుడాన్, ఇంగ్లాండ్‌లలో ప్రాచుర్యంలో ఉన్న జానపద కథల్లోని టోపీ వర్తకుడి కథ. చెట్టు కింద నిద్రపోతున్న వర్తకుడి టోపీలను కోతులు ఎత్తుకెళ్లే కథ మనకు తెలిసిందే.

మల్ వోవర్

బాగా ఆలోచించి, ఎక్కువ సమయం వెచ్చించి ఒక నిర్ణయం తీసుకునే సందర్భంలో వాడే మాట....మల్ వోవర్. ఉదా: మై ఫ్రెండ్ ఈజ్ మల్లింగ్ వోవర్ ది ఐడియా ఆఫ్ అడాప్టింగ్ ఏ బేబీ.

"సెమీఫైనల్లో ఏదీ మాకు కలిసి రాలేదు. జట్టుగా మేం కలిసి కట్టుగా రాణించాల్సింది. కానీ ఏం చేస్తాం ఇక్కడి పరిస్థితులు ఏమాత్రం మాకు అనుకూలించలేదు. ఏదేమైనా ఇలాంటి కఠిన పరిస్థితులు ఎదురైనపుడు మానసికంగానూ సిద్ధమై ఉండాలి. మేం బ్యాటింగ్‌లో ఘోరంగా విఫలమయ్యాం. ఈ టోర్నీలో పటిష్ట ప్రత్యర్థులపై బాగా ఆడాం. అది ఇకపై ఏ జట్టునైనా ఓడించగల మనే ధీమా ఇచ్చింది. ఇకపై పెద్ద పెద్ద టోర్నీల్లో ఆడేటపుడు ఒత్తిడిని అధిగమించడంపై దృష్టిపెడతాం. బాగా ఆడతాం.

-అఫ్గానిస్తాన్ కెప్టెన్ రషీద్ ఖాన్

1 మూడు ఫార్మాట్‌లలో (వన్డే, టి20, టెస్టు) కలిపి దక్షిణాఫ్రికా జట్టు తొలిసారి ఓ ప్రపంచకప్ టోర్నీలో టైటిల్ పోరుకు అర్హత సాధించింది. 1998లో ఐసీసీ ఆధ్వర్యంలో జరిగిన నాకౌట్ ట్రోఫీ టోర్నీలో దక్షిణాఫ్రికా విజేతగా నిలిచింది.

8 టి20 ప్రపంచకప్‌లో దక్షిణాఫ్రికా వరుసగా సాధించిన విజయాలు. ఈ ఫార్మాట్‌లో తొలిసారి దక్షిణాఫ్రికా వరుసగా ఎనిమిది మ్యాచ్‌ల్లో గెలిచింది.

56 అంతర్జాతీయ టి20ల్లో అఫ్గానిస్తాన్ జట్టుకిదే అత్యల్ప స్కోరు. 2014 టి20 ప్రపంచకప్‌లో భాగంగా బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో అఫ్గానిస్తాన్ 72 పరుగు లకు ఆలౌటైంది.

56 టి20 ప్రపంచకప్ చరిత్రలోని నాకౌట్ మ్యాచ్‌ల్లో అత్యల్ప స్కోరు చేసిన జట్టుగా అఫ్గానిస్తాన్ నిలిచింది. 2009 ప్రపంచకప్ సెమీఫైనల్లో శ్రీలంకపై వెస్టిండీస్ 101 పరుగు లకు... 2012 ప్రపంచకప్ ఫైనల్లో వెస్టిండీస్‌పై శ్రీలంక 101 పరుగులకు ఆలౌటైంది.

67 మిగిలిన బంతుల పరంగా అంతర్జాతీయ టి20ల్లో దక్షిణాఫ్రికా కిదే అతిపెద్ద విజయం.

2 టి20 ప్రపంచకప్‌లో ముగిసిన ఇన్నింగ్స్‌లో ఎక్స్‌ట్రాలు టాప్ స్కోర్‌గా ఉండటం ఇది రెండోసారి మాత్రమే. 2010 ప్రపంచకప్‌లో వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో ఐర్లాండ్ 69 పరుగులకు ఆలౌటైంది. ఐర్లాండ్ ఇన్నింగ్స్‌లో 19 ఎక్స్‌ట్రాలవే టాప్ స్కోర్.

అజేయంగా ఫైనల్లోకి భారత్

- సెమీస్‌లో ఇంగ్లండ్‌పై ఘన విజయం
- రాణించిన రోహిత్, అక్షర్, కుల్దీప్
- రేపు దక్షిణాఫ్రికాతో తుది పోరు


సూర్య


రోహిత్

ప్రావిడెన్స్ (గయానా): టి20 వరల్డ్ కప్‌లో జైత్ర యాత్ర కొనసాగిస్తూ భారత్ ఫైనల్లోకి అడుగు పెట్టింది. అందులోనూ రెండేళ్ల క్రితం ఇదే టి20 వరల్డ్ కప్‌లో ఇదే సెమీఫైనల్లో తమను చిత్తు చేసిన ఇంగ్లండ్‌నే ఓడించి మరీ తుది పోరుకు అర్హత సాధించింది. గురువారం జరిగిన రెండో సెమీఫై నల్లో భారత్ 68 పరుగుల తేడాతో ఇంగ్లండ్‌పై ఘన విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా 20 ఓవర్లలో 7 వికె ట్ల నష్టానికి 171 పరుగులు చేసింది. కెప్టెన్ రోహిత్ శర్మ (39 బంతుల్లో 57; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీ సాధించగా... సూర్యకుమార్ యాదవ్ (36 బంతుల్లో 47; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించాడు. అనంతరం ఇంగ్లండ్ 16.4 ఓవర్లలో 103 పరుగు లకు ఆలౌటై ఓడిపోయింది. రేపు జరిగే ఫైనల్లో దక్షిణాఫ్రికాతో భారత్ తలపడుతుంది.

విరాట్ కోహ్లి (9) ఈ వరల్డ్ కప్‌లో తన వైఫ ల్యాన్ని కొనసాగించగా... గత మ్యాచ్ తరహాలోనే రోహిత్ తన దూకుడైన ఆటతో భారత్ ఇన్నింగ్స్‌ను నడిపించాడు. పంత్ (4) వెనుదిరిగిన తర్వాత రోహిత్‌తో సూర్య జత కలిశాడు. వీరిద్దరు చక్కటి సమన్వయంతో పరుగులు రాబట్టారు. ఈ క్రమం లో 36 బంతుల్లో రోహిత్ అర్ధసెంచరీ పూర్తి చేసు కున్నాడు. జోస్ బట్లర్ (15 బంతుల్లో 23; 4 ఫోర్లు) శుభారంభం చేసిన తీరు చూస్తే గెలిచేందుకు ఇంగ్లండ్‌కు మెరుగైన అవకాశం ఉన్నట్లు అనిపించిం ది. తొలి 3 ఓవర్లలో 26 పరుగులు వచ్చాయి. అయితే అక్షర్ తన తొలి బంతికే బట్లర్‌ను అవుట్ చేయడంతో ఇంగ్లండ్ పతనం మొదలైంది.


జోర్డాన్

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (బి) రషీద్ 57; కోహ్లి (బి) టాప్లీ 9; పంత్ (సి) బెయిర్‌స్టో (బి) స్యామ్ కరన్ 4; సూర్యకుమార్ (సి) జోర్డాన్ (బి) ఆర్చర్ 47; పాండ్యా (సి) స్యామ్ కరన్ (బి) జోర్డాన్ 23; జడేజా (నాటౌట్) 17; దూబే (సి) బట్లర్ (బి) జోర్డాన్ 0; అక్షర్ (సి) సాల్ట్ (బి) జోర్డాన్ 10; అర్ష్‌దీప్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 171. వికెట్ల పతనం:** 1-19, 2-40, 3-113, 4-124, 5-146, 6-146, 7-170. **బౌలింగ్:** టాప్లీ 3-0-25-1, ఆర్చర్ 4-0-33-1, కరన్ 2-0-25-1, రషీద్ 4-0-25-1, జోర్డాన్ 3-0-37-3, లివింగ్‌స్టోన్ 4-0-24-0. **ఇంగ్లండ్ ఇన్నింగ్స్:** సాల్ట్ (బి) బుమ్రా 5; బట్లర్ (సి) పంత్ (బి) అక్షర్ 23; అలీ (స్టంప్డ్) పంత్ (బి) అక్షర్ 8; బెయిర్‌స్టో (బి) అక్షర్ 0; బ్రూక్ (బి) కుల్దీప్ 25; కరన్ (ఎల్బీ) (బి) కుల్దీప్ 2; లివింగ్‌స్టోన్ (రనౌట్) 11; జోర్డాన్ (ఎల్బీ) (బి) కుల్దీప్ 1; ఆర్చర్ (ఎల్బీ) (బి) బుమ్రా 21; రషీద్ (రనౌట్) 2; టాప్లీ (నాటౌట్) 3; ఎక్స్‌ట్రాలు 2; **మొత్తం (16.4 ఓవర్లలో ఆలౌట్) 103. వికెట్ల పతనం:** 1-26, 2-34, 3-35, 4-46, 5-49, 6-68, 7-72, 8-86, 9-88, 10-103. **బౌలింగ్:** అర్ష్‌దీప్ 2-0-17-0, బుమ్రా 2.4-0-12-2, అక్షర్ 4-0-23-3, కుల్దీప్ 4-0-19-3, జడేజా 3-0-16-0, పాండ్యా 1-0-14-0.



దక్షిణాఫ్రికా ధమాకా

తొలిసారిగా వరల్డ్‌కప్ ఫైనల్లోకి

సెమీస్‌లో అఫ్గానిస్తాన్‌పై 9 వికెట్లతో ఘనవిజయం

56 పరుగులకే అఫ్గాన్ ఆలౌట్ • హడలెత్తించిన జాన్సెన్, రబడ • 8.5 ఓవర్లలోనే దక్షిణాఫ్రికా లక్ష్యఛేదన

తొలి సెమీఫైనల్... దక్షిణాఫ్రికా బరిలో నిలిచిన ఈ పోరులో అందరి కళ్లు సఫారీ కంటే అఫ్గానిస్తాన్ జట్టుపైనే ఉన్నాయి. ఈ మెగా టోర్నీలోనే సంచలన కెరటంలా, గట్టి జట్లకు కంటగింపుగా రషీద్ బృందం మారిం ది. సెమీఫైనల్ దాకా చేరింది. మరోవైపు దక్షిణాఫ్రికా లీగ్, సూపర్-8లో టాపర్‌గా నిలిచినప్పటికీ ఏ ఒక్క మ్యాచ్ కూడా సాధికారికంగా, కనీసం చెప్పుకోదగ్గ స్థాయిలో కూడా ఆడలేదు. పైగా చెరగని 'చోకర్స్' ముద్ర! ఏ ఫార్మాట్ ప్రపంచకప్‌లోనూ ఫైనల్ చేరని వైనం. దీంతో క్రికెట్ ప్రేక్షకులు అఫ్గాన్ తమ సంచలన ప్రదర్శనకు 'సీక్వెల్' చూపిస్తుందనుకు న్నారు. కానీ అనూహ్యం... అఫ్గాన్ అతలాకుతలం... అసలు ఈ టోర్నీ లోనే ఆడని విధంగా దక్షిణాఫ్రికా దుమ్మురేపింది. 20-20 ఓవర్ల మ్యాచ్‌ను కాస్తా రెండు ఇన్నింగ్స్‌లు కలిపి 20 ఓవర్లకే పరిమితం చేసి తొలిసారి ప్రపంచకప్ టోర్నీలో టైటిల్ పోరుకు అర్హత సాధించింది.



తరూబా (ట్రినిడాడ్): అయ్యారే దక్షిణాఫ్రికా... ప్రపంచకప్ గెలవలేదు. కానీ గెలిచినంత సంబరం లో మునిగితేలుతోంది. అదేంటి అనే ఆశ్చర్యం అక్క ర్లేదు! ఎందుకంటే ఒకటా... రెండా... ఎన్నని సెమీ ఫైనల్స్ వారి కథను... ప్రపంచకప్ కలను... ముగిం చాయో తెలుసా? ఏకంగా 11 సెమీఫైనల్స్‌లలో (వన్డే, టి20 ప్రపంచకప్, చాంపియన్స్ ట్రోఫీ) ఓటమి సఫారీని చోకర్స్ అనే ముద్ర వేసింది. కానీ ఇప్పుడు పడుతూ... లేస్తూ... అగచాట్లెన్నో పడినా... చిన్న జట్లతోనే కష్టంగా గట్టెక్కిన దక్షిణాఫ్రికాకు మరో సెమీస్ గండం తప్పదని వారి ప్రదర్శన చూసిన విశ్లేషకులు భావించారు. కానీ అసలైన నాకౌట్ పోరులో సఫారీలు సిసలైన ఆట చూపె ట్టారు. అంతే సంచలనాల అఫ్గానిస్తాన్‌కు సెమీస్ చాలన్నట్లుగా చెడుగుడు ఆడేశారు. దీంతో గురు వారం హోరాహోరీ తప్పదనుకున్న తొలి సెమీ ఫైనల్లో దక్షిణాఫ్రికా బౌలింగ్ దళం దెబ్బకు వార్ వన్‌సైడ్ అయ్యింది. సూపర్-8 దశదాకా ఔరా అఫ్గాన్ అనిపించిన జట్టు చివరకు చిత్తుగా ఓడింది. 11.1 ఓవర్లు మిగిలుండగానే సఫారీ 9 వికెట్ల తేడాతో అఫ్గానిస్తాన్‌పై ఘనవిజయం సాధించింది. కీలకమైన వికెట్లు తీసిన జాన్సెన్ (3-0-16-3)కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది.

ఎక్స్‌ట్రాలే టాప్ స్కోర్!

టాస్ నెగ్గిన అఫ్గాన్ ముందుగా బ్యాటింగ్‌కు దిగి కేవలం 11.5 ఓవర్లలో 56 పరుగులకే కుప్పకూలిం ది. చిత్రంగా ఇన్నింగ్స్‌లో టాప్ స్కోరర్ ఎవరంటే బ్యాటర్ కాదు! ఎక్స్‌ట్రాలే 13. ఇదే అఫ్గాన్ ఇన్నిం గ్స్‌లో పెద్ద స్కోరు. ఒక్కడు... ఒకే ఒక్కడు అజ్మ తుల్లా ఒమర్జాయ్ (12 బంతుల్లో 10; 2 ఫోర్లు) పది పరుగులు చేసిన బ్యాటర్. గుర్బాజ్ (0), ఇబ్రహీమ్ (2), గుల్బదిన్ (9) టాపార్డర్ తీరిది. అలాగని మిడిలార్డర్ తక్కువేం తినలేదు. 'టాప్'నే అనుసరిం చింది. నబీ (0), నంగేయలియా (2), కరీమ్ (8), కెప్టెన్ రషీద్ ఖాన్ (8) మూకుమ్మడిగా బ్యాట్‌లు ఎత్తేశారు. 23 పరుగులకే సగం (5) వికెట్లు కోల్పో యిన అఫ్గాన్ 50 మైలురాయిని కష్టంగా దాటింది. కానీ అదే స్కోరుపై 3 వికెట్లను కోల్పోయింది. ఇంకో 6 పరుగులు జతయ్యాక ఆలౌటైంది. మార్కో జాన్సెన్ (3/16), రబడ (2/14), నోర్జే (2/7) టాప్, మిడి లార్డర్లను దెబ్బకొడితే... ఎడంచేతి వాటం స్పిన్నర్ షమ్సీ (1.5-0-6-3) టెయిలెండర్ల పని పట్టాడు. అనంతరం సులువైన లక్ష్యాన్ని లీగ్, సూపర్-8 దశలా కష్టపడకుండా దక్షిణాఫ్రికా 8. 5 ఓవర్లలో వికెట్ మాత్రమే నష్టపోయి 60 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్ డికాక్ (5) అవుటయ్యాక, హెండ్రిక్స్ (25 బంతుల్లో 29 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్), కెప్టెన్ మార్క్‌రమ్ (21 బంతుల్లో 23 నాటౌట్; 4 ఫోర్లు) చకచకా ముగించారు. అబేధ్య మైన రెండో వికెట్‌కు 55 పరుగులు జోడించారు.

స్కోరు వివరాలు

అఫ్గానిస్తాన్ ఇన్నింగ్స్: గుర్బాజ్ (సి) హెండ్రిక్స్ (బి) జాన్సెన్ 0; ఇబ్రహీమ్ (బి) రబడ 2; గుల్బదిన్ (బి) జాన్సెన్ 9; అజ్మతుల్లా (సి) స్టబ్స్ (బి) నోర్జే 10; నబీ (బి) రబడ 0; నంగేయలియా (సి) డికాక్ (బి) జాన్సెన్ 2; కరీమ్ (ఎల్బీడబ్ల్యూ) (బి) షమ్సీ 8; రషీద్ ఖాన్ (బి) నోర్జే 8; నూర్ అహ్మద్ (ఎల్బీడబ్ల్యూ) (బి) షమ్సీ 0; నవీనుల్ (ఎల్బీడబ్ల్యూ) (బి) షమ్సీ 2, ఫజల్‌హక్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (11.5 ఓవర్లలో ఆలౌట్) 56. వికెట్ల పతనం:** 1-4, 2-16, 3-20, 4-20, 5-23, 6-28, 7-50, 8-50, 9-50, 10-56. **బౌలింగ్:** జాన్సెన్ 3-0-16-3, కేశవ్ మహరాజ్ 1-0-6-0, రబడ 3-1-14-2, నోర్జే 3-0-7-2, షమ్సీ 1.5-0-6-3.

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: డికాక్ (బి) ఫజల్‌హక్ 5; హెండ్రిక్స్ (నాటౌట్) 29; మార్క్‌రమ్ (నాటౌట్) 23; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (8.5 ఓవర్లలో 1 వికెట్ నష్టానికి) 60. వికెట్ల పతనం:** 1-5. **బౌలింగ్:** నవీనుల్ 3-0-15-0, ఫజల్‌హక్ 2-0-11-1, రషీద్‌ఖాన్ 1-0-8-0, అజ్మతుల్లా 1.5-0-18-0, గుల్బదిన్ 1-0-8-0.


ఆసియా అండర్-17 రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత రెజ్లర్లు అదరగొట్టారు. జోర్డాన్ రాజధాని అమ్మాన్‌లో జరిగిన ఈ టోర్నీలో భారత రెజ్లర్లు ఎనిమిది స్వర్ణ పతకాలు, ఒక రజత పతకం సొంతం చేసుకున్నారు. 220 పాయింట్లతో ఓవరాల్ టీమ్ టైటిల్‌ను కూడా దక్కించుకున్నారు.

ప్రియాన్షు శుభారంభం



టెక్సాస్: యూఎస్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత ప్లేయర్ ప్రియాన్షు రజావత్ శుభారంభం చేశాడు. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రియాన్షు 21-16, 21-18తో జాన్ లూడా (చెక్ రిపబ్లిక్)పై గెలుపొంది ప్రిక్వార్టర్ ఫైనల్ చేరు కున్నాడు. మహిళల సింగిల్స్‌లో మాళవిక బన్సోద్ కూడా ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టింది. తొలి రౌండ్‌లో మాళవిక 21-14, 21-15తో క్రిస్టిన్ కుబా (ఎస్తోనియా)పై నెగ్గింది. మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్‌లో గద్దె రుత్విక శివాని-రోహన్ కపూర్ (భారత్) జోడీ 15-21, 21-18, 13-21తో అలెగ్జాండర్ డన్-జూలీ మాక్‌ఫెర్సన్ (స్కాట్లాండ్) ద్వయం చేతిలో ఓడిపోయింది.

క్వార్టర్ ఫైనల్లో యూకీ జోడీ ఓటమి



న్యూఢిల్లీ: మలోర్కా చాంపియన్‌షిప్ ఏటీపీ-250 టెన్నిస్ టోర్నీ పురుషుల డబుల్స్ విభా గంలో యూకీ బాంబ్రీ (భారత్) -అల్బానో ఒలి వెట్టి (ఫ్రాన్స్) జోడీ పోరా టం ముగిసింది. స్పెయిన్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో క్వార్టర్ ఫైనల్లో యూకీ-ఒలివెట్టి ద్వయం 6-7 (21/23), 4-6తో టాప్ సీడ్ లామోన్స్-జాక్సన్ విత్రో (అమెరికా) జోడీ చేతిలో పోరాడి ఓడిపోయింది. గంటా 42 నిమి షాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో యూకీ-ఒలివెట్టి 11 ఏస్‌లు సంధించి, మూడు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. యూకీ-ఒలివెట్టిలకు 8,630 యూరోల (రూ. 7 లక్షల 71 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 45 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

ఎనిమిదేళ్ల తర్వాత...



లాస్ వేగస్: కోపా అమెరికా కప్ ఫుట్‌బాల్ టోర్నీలో ఈక్వెడార్ జట్టు ఎనిమిదేళ్ల తర్వాత తొలి విజయాన్ని అందుకుంది. గ్రూప్ 'బి'లో భాగంగా జమైకాతో జరిగిన మ్యాచ్‌లో ఈక్వెడార్ 3-1తో నెగ్గింది. 13వ నిమిషంలో జమైకా ప్లేయర్ కేసీ పాల్మెర్ సెల్ఫ్ గోల్‌తో ఈక్వెడార్ ఖాతా తెరిచింది. కెంద్రీ పెజ్ (45+4వ ని.లో) గోల్‌తో ఈక్వెడార్ ఆధిక్యం 2-0కు పెరిగింది. 54వ నిమిషంలో ఆంటోనియో జమైకాకు తొలి గోల్ అందించాడు. అలాన్ మిండా (90+1వ ని.లో) గోల్‌తో ఈక్వెడార్ విజయాన్ని ఖాయం చేసుకుంది. మరో మ్యాచ్‌లో వెనిజులా 1-0తో మెక్సికోను ఓడించి క్వార్టర్ ఫైనల్‌కు చేరింది.

అక్టోబర్‌లో గ్లోబల్ చెస్ లీగ్

లండన్: అంతర్జాతీయ చెస్ సమాఖ్య, టెక్ మహీంద్రా సంయుక్త ఆధ్వర్యంలో రెండో ఎడిషన్ గ్లోబల్ చెస్ లీగ్‌కు లండన్ ఆతిథ్యమివ్వనుంది. ఈ ఏడాది అక్టోబర్ 3 నుంచి 12 వరకు ఈ లీగ్‌ను నిర్వహి స్తారు. పది రోజులపాటు ఆరు జట్ల మధ్య జరిగే ఈ లీగ్‌లో మేటి గ్రాండ్‌మాస్టర్లు పోటీపడతారు. గత ఏడాది దుబాయ్‌లో జరిగిన తొలి ఎడిషన్‌లో త్రివేణి కాంటినెంటల్ కింగ్స్ జట్టు విజేతగా నిలిచింది.

జయహో జార్జియా

పోర్చుగల్‌పై సంచలన విజయం



గెల్‌సెన్‌కిర్చెన్ (జర్మనీ): యూరో కప్ ఫుట్‌బాల్ టోర్నీలో పాల్గొంటున్న తొలిసారే జార్జియా జట్టు నాకౌట్ దశకు అర్హత సాధించింది. గ్రూప్ 'ఎఫ్'లో భాగంగా జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో జార్జియా 2-0 గోల్స్ తేడాతో 2016 చాంపియన్ పోర్చుగల్ జట్టుపై సంచలన విజయం నమోదు చేసింది. రెం డో నిమిషంలోనే క్వరాత్‌స్కెలియా గోల్‌తో జార్జియా 1-0తో ఆధిక్యాన్ని సంపాదించింది. ఆ తర్వాత 57వ నిమిషంలో లభించిన పెనాల్టీ కిక్‌ను మికాట్జె లక్ష్యాన్ని చేర్చడంతో జార్జియా ఆధిక్యం 2-0కు పెరిగింది. ఆ తర్వాత ఈ ఆధిక్యాన్ని కాపా డుకున్న జార్జియా విజయాన్ని ఖాయం చేసుకుంది. పోర్చుగల్ దిగ్గజ ప్లేయర్, కెప్టెన్ క్రిస్టియానో రొనాల్డో 66 నిమిషాలపాటు ఆడి ఆ తర్వాత మైదానం వీడాడు. రొనాల్డోను పక్కా ప్రణాళికతో కట్టడి చేయడంలో జార్జియా డిఫెండర్లు సఫలమ య్యారు. జార్జియా చేతిలో ఓడినప్పటికీ ఇదే గ్రూప్‌లో ఆడిన తొలి రెండు మ్యాచ్‌ల్లో నెగ్గిన పోర్చుగల్ కూడా ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లిం ది. గ్రూప్ 'ఎఫ్'లోని మరో మ్యాచ్‌లో టర్కీ 2-1తో చెక్ రిపబ్లిక్‌ను ఓడించి నాకౌట్ బెర్త్‌ను ఖరారు చేసు కుంది. గురువారంతో యూరో టోర్నీ లీగ్ దశ మ్యాచ్‌లన్నీ పూర్తయ్యాయి. ఈనెల 29 నుంచి ప్రిక్వార్టర్ ఫైనల్స్ జరుగుతాయి. ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో స్విట్జర్లాండ్‌తో ఇటలీ; ఇంగ్లండ్‌తో స్లొవే కియా; డెన్మార్క్‌తో జర్మనీ; స్పెయిన్‌తో జార్జియా; బెల్జియంతో ఫ్రాన్స్; స్లొవేనియాతో పోర్చుగల్; రొమేనియాతో నెదర్లాండ్స్; ఆస్ట్రియాతో టర్కీ తల పడతాయి.

'పారిస్ నుంచి పతకాలతో తిరిగి రండి'

భారత రాష్ట్రపతి ఆకాంక్ష



న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొనబోతున్న భారత క్రీడాకారులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 'బెస్ట్ విషెస్' చెప్పారు. పార్లమెంట్‌లో చేసిన ప్రసం గంలో ఆమె మన ఆటగాళ్లు ఎక్కువ పతకాలతో తిరిగి రావాలని ఆకాంక్షించారు. 'ప్రభుత్వం అం దిస్తున్న సహకారంతో భారత యువ ఆటగాళ్లకు ప్రపంచవ్యాప్తంగా వేర్వేరు పోటీల్లో రికార్డు సం ఖ్యలో పతకాలు గెలుస్తున్నారు. కొద్ది రోజుల్లో పారి స్‌లో ఒలింపిక్స్‌లో ప్రారంభం కానున్నాయి. అం దులో పాల్గొనే ప్రతీ భారత అథ్లెట్‌లను చూసి మేం గర్విస్తున్నాం. వారికి నా అభినందనలు' అని రాష్ట్రపతి వ్యాఖ్యానిం చారు. మరోవైపు 2036 ఒలింపిక్స్ కోసం భారత్ బిడ్ వేసే అంశాన్ని కూడా ఆమె ప్రస్తావిం చారు. మన ఘనతలను మరింత ముందుకు తీసుకెళ్లే ఆలోచనతో భారత ఒలింపిక్ సంఘం 2036 ఒలింపిక్స్ కోసం బిడ్ వేసేందుకు సిద్ధమవు తోందని ముర్ము అన్నారు. ఒలింపిక్స్ నిర్వహణ కోసం జరిగే బిడ్‌లో ఖతర్, సౌదీ అరేబియా, ఇండో నేసియా లాంటి దేశాలతో భారత్ పోటీ పడే అవకాశం ఉంది.

అథ్లెటిక్స్‌లో భారత్‌కు మరో ఒలింపిక్ బెర్త్



పంచ్‌కులా: జాతీయ సీనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో తొలి రోజు భారత్‌కు మరో ఒలింపిక్ బెర్త్ దక్కింది. మహిళల 400 మీటర్ల విభాగంలో హరియా ణాకు చెందిన 23 ఏళ్ల కిరణ్ పహల్ పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించింది. 400 మీటర్ల సెమీఫైనల్ రేసును కిరణ్ 50.92 సెకన్లలో ముగించి ఒలింపిక్ అర్హత ప్రమాణ సమయాన్ని (50.95 సెకన్లు) అధిగమిం చింది. ఇప్పటి వరకు అథ్లెటిక్స్‌లో భారత్ నుంచి 14 ఈవెంట్స్‌లో ఒలింపిక్ బెర్త్‌లు లభించాయి.

పదేళ్ల తర్వాత టెస్టు సమరం

నేటి నుంచి దక్షిణాఫ్రికాతో భారత మహిళల ఏకైక టెస్టు

- ఉదయం గం. 9:30 నుంచి స్పోర్ట్స్ 18, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం


దక్షిణాఫ్రికా కెప్టెన్ లారా వాల్‌వార్ట్


టీమిండియా వైస్ కెప్టెన్ స్మృతి, కెప్టెన్ హర్మన్‌ప్రీత్

చెన్నై: దశాబ్ద కాలం తర్వాత భారత్, దక్షిణాఫ్రికా మహిళా క్రికెట్ జట్లు టెస్టు మ్యాచ్‌లో తలపడనున్నాయి. నేటి నుంచి జరిగే ఏకై క టెస్టులో సఫారీ టీమ్‌ను సొంతగడ్డపై భారత్ ఎదు ర్కోనుంది. దక్షిణాఫ్రి కాపై 3-0తో వన్డే సిరీస్ గెలిచిన భారత్ జోరు మీదుంది. ఈ మ్యాచ్ ద్వారా భారత్ నుంచి కనీసం ఐదుగురు కొత్త ప్లేయర్లు టెస్టుల్లో అరంగేట్రం చేసే అవ కాశం ఉంది. ఉమా చెత్రి, ప్రియా పూనియా, సైకా ఇషాక్, అరుంధతి రెడ్డి, షబ్నమ్ షకీల్ తమ తొలి టెస్టు బరిలోకి దిగవచ్చని అంచనా. వన్డేలు, టి20లతో పోలిస్తే భారత మహిళల జట్టు చాలా తక్కువ సంఖ్యలో టెస్టులు ఆడుతోంది. రెండేళ్ల విరామం తర్వాత గత ఏడాది డిసెంబర్‌లో భారత్ టెస్టు ఆడింది. వరుసగా ఇంగ్లండ్, ఆస్ట్రేలియాలతో పోటీ పడిన మన టీమ్ రెండు మ్యాచ్‌లలోనూ విజయం సాధించింది. అయితే ఆ తర్వాత జట్టు మళ్లీ బరిలోకి దిగలేదు. దక్షిణాఫ్రికాతో ఆఖరిసా రిగా 2014లో మైసూరు టెస్టులో తలపడిన జట్టు 34 పరుగులతో గెలుపొందింది. కెప్టెన్ హర్మన్ ప్రీత్‌తో పాటు స్మృతి మంధాన, జెమీమా రోడ్రిగ్స్, షఫాలీ వర్మ, దీప్తి శర్మ బ్యాటింగ్‌లో కీలకం కానున్నారు. బౌలింగ్‌కు సంబంధించి పూజ వస్త్రకర్, దీప్తి శర్మ, స్నేహ్ రాణా ప్రభావం చూపిం చగలరు. చెపాక్ మైదానంలో సాధారణంగా స్పిన్‌ను బాగా అనుకూలిస్తుంది కాబట్టి భారత్ కోణంలో ఇది సానుకూలాంశం. మరోవైపు గత రెం డేళ్లలో దక్షిణాఫ్రికా కూడా ఒకే ఒక టెస్టు మ్యాచ్ ఆడింది. కెప్టెన్ లారా వాల్‌వార్ట్, స్యూన్ లూస్, డెల్మీ టకర్, తజ్‌మీన్ బ్రిట్స్, అనెక్ బాష్‌లపై జట్టు ఆధారపడుతోంది. పిచ్ అనుకూలిస్తే స్పిన్నర్ ఎంలాబా భారత బ్యాటర్లను ఇబ్బంది పెట్టగలదు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	569	79,243
నిఫ్టీ ▲	176	24,044

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (రాత్రి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	17,873	▲	63
డోజోన్స్	39,235	▲	102
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,180	▼	46
డాక్స్	18,211	▲	55
షాంఘై	2,946	▼	27
నికాయ్	39,342	▲	326

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)	71,391	▲ 124
బంగారం (99.5 స్వచ్ఛత)	71,105	▲ 123
వెండి (కిలో)	87,043	▲ 99

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.09	84.01
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.84	107.40
€	యూరో	ఎస్‌బీఐ	88.58	90.54
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	51.88	53.01
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.71	56.65
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.25	63.94
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.35	22.91
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.83	23.61
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.37	12.44

ఇండియా సిమెంట్స్‌లో అల్ట్రాటెక్ పాగా!

దమానీల నుంచి 23 శాతం వాటా కొనుగోలు • డీల్ విలువ రూ. 1,889 కోట్లు • ప్రస్తుతం ప్రమోటర్ల వాటా 28.42 శాతం

న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగ దిగ్గజం అల్ట్రాటెక్ సిమెంట్ తాజాగా చెన్నైకు చెందిన ఇండియా సిమెంట్స్‌లో భారీ వాటాను దక్కించుకుంది. ఇండియా సిమెంట్స్‌లో దమానీలకు ఉన్న 23 శాతం వాటాను సొంతం చేసుకుంది. బీఎస్‌ఈ గణాంకాల ప్రకారం ఇందుకు రూ. 1,889 కోట్లు వెచ్చించింది. తద్వారా ఇండియా సిమెంట్స్‌లో ప్రమోటర్ల తదుపరి రెండో పెద్ద వాటాదారుగా అవతరించింది. రెండు బ్లాక్ డీల్స్ ద్వారా షేరుకి రూ. 265–283 ధరల శ్రేణిలో మొత్తం 7,05,64,656 షేర్లను కొనుగోలు చేసింది. ఇది 22.77 శాతం వాటాకు సమానం కాగా.. ప్రస్తుతం ఇండియా సిమెంట్స్‌లో ప్రమోటర్లు 28.42 శాతం వాటాను కలిగి ఉన్నారు. వాటాను విక్రయించిన వారిలో దమానీలు.. గోపీకిషన్ శివకిషన్, కిరణ్ దేవి, రాధాకిషన్ శివకిషన్, శ్రీకాంత దేవి ఉన్నారు. ఆర్‌కే దమానీకి చెందిన డిరైవ్ ఇన్వెస్ట్‌మెంట్స్, డిరైవ్ ట్రేడింగ్ అండ్ రిసార్ట్స్ సైతం షేర్లను విక్రయించాయి. గురువారం సమావేశమైన బోర్డు ఇండియా సిమెంట్స్‌లో దాదాపు 7.06 కోట్ల షేర్ల కొనుగోలుకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు అల్ట్రాటెక్ స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలియజేసింది. ఇండియా సిమెంట్స్‌లో 23% నియంత్రేతర వాటా కొనుగోలుని ఫైనాన్షియల్ పెట్టుబడిగా అల్ట్రాటెక్ పేర్కొంది.



ఇండియా సిమెంట్స్ తీరిదీ...

2024 మార్చి31 కల్లా ఇండియా సిమెంట్స్‌లో ప్రమోటర్ల వాటా 28.42 శాతంగా నమోదైంది. కంపెనీ వైస్‌చైర్మన్, ఎండీ ఎన్. శ్రీనివాసన్ 0.36 శాతం వాటాను కలిగి ఉన్నారు. ప్రమోటర్ గ్రూప్ సంస్థ ఈడబ్ల్యూఎస్ ఫైనాన్స్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్స్‌కు 21.56 శాతం వాటా ఉంది. కంపెనీ మొత్తం 16 ఎంటీపీఏ సిమెంట్ సామర్థ్యాన్ని కలిగి ఉంది. దీనిలో అనుబంధ కంపెనీ త్రినేత్ర సిమెంట్‌కుగల 1.5 ఎంటీపీఏ సామర్థ్యం కలసి ఉంది. గతేడాది (2023–24) ఇండియా సిమెంట్స్ రూ. 5,112 కోట్ల ఆదాయం, రూ. 227 కోట్ల నికర నష్టం ప్రకటించింది. అంతక్రితం ఏడాది (2022–23)లో నమోదైన రూ. 127 కోట్లతో పోలిస్తే నష్టం పెరిగింది. 2023 సెప్టెంబర్‌లో ఆంధ్రప్రదేశ్, విజయనగరం జిల్లాలోని కంటకాపల్లె, చిన్నిపాలెంలోగల 73.75 ఎకరాల భూమిని విక్రయించింది. వీటిని రూ. 70 కోట్లకు అల్ట్రాటెక్ సొంతం చేసుకుంది. 2022 అక్టోబర్‌లో స్ప్రింగ్‌వే మైనింగ్ ప్రైవేట్ లిమిటెడ్‌ను జేఎస్‌డబ్ల్యూ సిమెంట్‌కు రూ. 477 కోట్లకు విక్రయించింది.

అల్ట్రాటెక్ స్పీడ్..

అల్ట్రాటెక్ సిమెంట్ స్థాపిత సామర్థ్యం వార్షికంగా 152.7 మిలియన్ టన్నులు (ఎంటీపీఏ)కాగా.. విస్తరణ బాటలో సాగుతోంది. మహారాష్ట్రలోని ఇండియా సిమెంట్స్ గ్రైండింగ్ యూనిట్‌ను రూ. 315 కోట్లకు కొనుగోలు చేస్తున్నట్లు ఏప్రిల్ 20న ప్రకటించింది. వైట్ సిమెంట్, కన్‌స్ట్రక్షన్ మెటీరియల్స్ తయారీ కోసం యూఏఈ సంస్థ రాక్ సిమెంట్‌లో 25 శాతం వాటాను సొంతం చేసుకునేందుకు ఈ వారం మొదట్లో ఆఫర్ ధరను సవరించింది. విస్తరణ నేపథ్యంలో గ్రే సిమెంట్ సామర్థ్యం 198.2 ఎంటీపీఏను తాకనుంది.

ఈ వార్తలతో అల్ట్రాటెక్ షేరు 5 శాతం జంప్‌చేసి రూ. 11,715కు చేరగా.. ఇండియా సిమెంట్స్ 11%పైగా దూసుకెళ్లి రూ. 293 వద్ద స్థిరపడింది.

'టాటా' బ్రాండ్ టాప్

తర్వాతి స్థానాల్లో ఇన్ఫీ, హెచ్‌డీఎఫ్‌సీ

న్యూఢిల్లీ: భారత్‌లో అత్యంత విలువైన బ్రాండ్‌గా మళ్లీ 'టాటా' గ్రూప్ నిలిచింది. బ్రాండ్ ఫైనాన్స్ సంస్థ తాజా నివేదికలో టాటాలకు మొదటిస్థానం దక్కింది. ఐటీ రంగ కంపెనీ ఇన్ఫోసిస్, హెచ్‌డీఎఫ్‌సీ గ్రూప్ తర్వాతి రెండు స్థానాల్లో ఉన్నాయి. టాటా గ్రూప్ విలువ 9 శాతం పెరిగి 28.6 బిలియన్ డాలర్లకు చేరినట్లు బ్రాండ్ ఫైనాన్స్ తెలిపింది. 'తొలిసారి ఒక భారత బ్రాండ్ 30 బిలియన్ డాలర్లకు చేరువ అవుతున్నట్లు టాటా గ్రూప్ బ్రాండ్ విలువ తెలియజేస్తోంది. భారత ఆర్థిక వ్యవస్థలోని ఆశాభావాన్ని ఇది ప్రతిఫలిస్తోంది' అని బ్రాండ్ ఫైనాన్స్ నివేదిక పేర్కొంది.




జియో చార్జీలు పెరుగుతున్నాయ్

- జూలై 3 నుంచి కొత్త రేట్లు
- అపరిమిత 5జీ డేటాకు పరిమితి

న్యూఢిల్లీ: టెలికం కంపెనీ రిలయన్స్ జియో చార్జీలను 12–27 శాతం పెంచుతోంది. జూలై 3 నుంచి కొత్త రేట్లు అమలులోకి రానున్నాయని కంపెనీ వెల్లడించింది. రెండేళ్ల తర్వాత టారిఫ్‌లను సవరించింది. ప్రస్తుతం ఆఫర్ చేస్తున్న అపరిమిత 5జీ డేటా సేవలకు పరిమితులు విధించనుంది. రోజుకు 2 జీబీ, అంతకంటే ఎక్కువ డేటా ఆఫర్ చేసే ప్లాన్స్‌కు మాత్రమే అపరిమిత 5జీ డేటా లభిస్తుంది. కంపెనీ తాజా నిర్ణయం 47 కోట్లపైచిలుకు రిలయన్స్ జియో మొబైల్ కస్టమర్లపై ప్రభావం పడనుంది. రూ.15 విలువగల 1 జీబీ డేటా యాడ్ ఆన్ ప్యాక్ రూ.19 కానుంది. రూ.399 ఖరీదు చేసే 75 జీబీ పోస్ట్‌పెయిడ్ డేటా ప్లాన్ కోసం రూ.449 చెల్లించాల్సి ఉంటుంది. 84 రోజుల వ్యాలిడిటీగల రూ.666 అన్‌లిమిటెడ్ ప్లాన్ ఇక నుంచి రూ.799కి లభిస్తుంది. కొత్తగా కమ్యూనికేషన్, ఫైల్స్ ట్రాన్స్‌ఫర్ కోసం జియో సేఫ్, అలాగే వాయిస్ కాల్స్, మెసేజెస్, టెక్ట్స్ ట్రాన్స్‌లేషన్ కోసం జియో ట్రాన్స్‌లేట్ యాప్స్‌ను పరిచయం చేసింది.





ర్యాలీకి అధిక వెయిటేజీ షేర్ల దన్ను

- ఐటీ, ఇంధన షేర్లకు భారీ డిమాండ్

ముంబై: ఐటీ, ఇంధన షేర్లు రాణించడంతో స్టాక్ సూచీలు వరుసగా మూడో రోజూ జీవితకాల గరిష్టాలను నమోదు చేశాయి. తొలిసారి సెన్సెక్స్ 79 వేలు, నిఫ్టీ 24 వేల పాయింట్ల మార్కును దాటాయి. అధిక వెయిటేజీ షేర్లు రిలయన్స్ ఇండస్ట్రీస్ 1%, టీసీఎస్, ఇన్ఫోసిస్ 2%, అల్ట్రాటెక్ సిమెంట్ 5%, ఎన్‌టీపీసీ 3% పెరిగి సూచీల రికార్డుల ర్యాలీకి దన్నుగా నిలిచాయి. ఉదయం స్వల్ప నష్టాలతో ప్రారంభమైన సూచీలు, కాసేపటికే పుంజుకొని తాజా రికార్డులు నమోదు చేశాయి. మిడ్‌సెషన్ నుంచి కొనుగోళ్లు మరింత ఊపందుకోవడంతో ఇరు సూచీలు సరికొత్త రికార్డుల ఎగువనే ముగిశాయి. ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 721 పాయింట్లు ఎగసి 79,396 వద్ద ఆల్‌టైం హైని అందుకుంది. చివరికి 569 పాయింట్ల లాభంతో 79,243 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 219 పాయింట్లు బలపడి 24,087 వద్ద తాజా గరిష్టాన్ని నెలకొల్పింది. ఆఖరికి 176 పాయింట్లు బలపడి 24,044 వద్ద నిలిచింది. రికార్డుల ర్యాలీలోనూ ఫైనాన్స్, పారిశ్రామిక, రియల్టీ, క్యాపిటల్ గూడ్స్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బీఎస్‌ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.17 % లాభపడగా, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ అరశాతానికి పైగా నష్టపోయింది. డాలర్ మారకంలో రూపాయి విలువ 12 పైసలు బలపడి 83.45 వద్ద స్థిరపడింది. ఆసియా మార్కెట్లు మిశ్రమంగా ముగిశాయి. యూరప్ సూచీలు బలహీనంగా ముగిశాయి. అమెరికా మార్కెట్లు స్వల్ప నష్టాలతో ట్రేడవుతున్నాయి.

''జూన్ డెరివేటివ్ కాంట్రాక్టుల గడువు ముగింపు నేపథ్యంలో షార్ట్ కవరింగ్ జరగడంతో సెన్సెక్స్ 79 వేలు, నిఫ్టీ 24 వేల స్థాయిలను అధిగమించాయి. అధిక వెయిటేజీ షేర్లు రాణించడం, రాజకీయ స్థిరత్వం, విదేశీ ఇన్వెస్టర్ల పునరాగమన అంశాలు సూచీలను సరికొత్త శిఖరాలపైకి చేర్చాయి. అధిక వాల్యుయేషన్ల ఆందోళనలతో మిడ్, స్మాల్ క్యాప్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనవుతున్నాయి'' రెలిగేర్ బ్రోకింగ్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ అజిత్ మిశ్రా తెలిపారు.

ర్యాలీ ఇలా

నిఫ్టీ	చేరేందుకు పట్టిన కాలం
20,000	51 రోజులు
21,000	60 రోజులు
22,000	25 రోజులు
23,000	88 రోజులు
24,000	25 రోజులు



జీవితకాల గరిష్టానికి ఇన్వెస్టర్ల సంపద

స్టాక్ మార్కెట్ రికార్డు ర్యాలీతో ఇన్వెస్టర్ల సంపద జీవితకాల గరిష్టానికి చేరింది. సెన్సెక్స్ 4 రోజుల్లో 2,033 పాయింట్లు(2.63%) పెరగడంతో రూ.3.93 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలోని కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ ఆల్‌టైం రికార్డు రూ.438.41 లక్షల కోట్లకు చేరింది.



ఫార్మా ఎగుమతులు 29 బిలియన్ డాలర్లు!



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఔషధాల ఎగుమతులు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 29 బిలియన్ డాలర్లను మించనున్నాయని ఫార్మాస్యూటికల్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఫార్మెక్సిల్) అంచనా వేస్తోంది. 2023–24లో ఫార్మా ఎగుమతులు 27.85 బిలియన్ డాలర్లు నమోదయ్యాయని ఫార్మెక్సిల్ డైరెక్టర్ జనరల్ రవి ఉదయ భాస్కర్ తెలిపారు. సీనియర్ డైరెక్టర్ సీహెచ్.లక్ష్మీ ప్రసన్నతో కలిసి గురువారమిక్కడ ఆయన మీడియాతో మాట్లాడారు. '2024 ఏప్రిల్–మే నెలలో భారత్ నుంచి విదేశాలకు చేరిన ఔషధాల విలువ 8.85 శాతం వృద్ధితో 4.73 బిలియన్ డాలర్లు ఉంది. ఎగుమతుల్లో 31.35 శాతం వాటా కైవసం చేసుకున్న యూఎస్ మార్కెట్ గత ఆర్థిక సంవత్సరంలో 15.66 శాతం దూసుకెళ్లడం భారతీయ కంపెనీలకు కలిసి వచ్చే అంశం. యూఎస్‌ఎఫ్‌డీఏ ఆమోదం పొందిన ప్లాంట్లు దేశవ్యాప్తంగా 748 ఉన్నాయి. యూఎస్ వెలుపల ఇలాంటి తయారీ కేంద్రాలు అత్యధికంగా ఉన్నది భారత్‌లోనే. 2030 నాటికి దేశం నుంచి ఫార్మా ఎక్స్‌పోర్ట్స్ 55 బిలియన్ డాలర్లకు చేరుకుంటాయని అంచనా. 2023–29 మధ్య 112 బిలియన్ డాలర్ల విలువైన 15 ఉత్పత్తులకు పేటెంట్ ముగియనుంది. వీటి ద్వారా భారత్‌కు అదనంగా 10 బిలియన్ డాలర్ల ఆదాయం సమకూరనుంది. అరబిందో ఫార్మా కొత్త ప్లాంటుతో పెన్సిలిన్–జి కోసం చైనాపై ఆధారపడడం తగ్గుతుంది' అని వివరించారు.

జీఆర్‌టీ 'డైమండ్ ఫెస్టివల్'



హైదరాబాద్: జీఆర్‌టీ జువెలర్స్ 'డైమండ్ ఫెస్టివల్' పేరుతో గొప్ప ఆఫర్‌ను ప్రకటించింది. ప్రత్యేకంగా చేతితో తీర్చిదిద్దిన అద్భుతమైన వజ్రాలు, అన్‌కట్ డైమండ్ ఆభరణాలపై 25% తగ్గింపు అందిస్తుంది. ప్లాటినం ఆభరణాల తయారీ చార్జీలపై 30% డిస్కౌంట్ పొందవచ్చు. ఈ ప్రత్యేక ఆఫర్లు ఒరియానా లైట్ వెయిట్ డైమండ్ ఆభరణాలకూ వర్తిస్తాయి. 'కస్టమర్ల వజ్రాభరణాల కలలను సాకారం చేసుకునేందుకు అవకాశం కల్పించడమే ఈ డైమండ్ ఫెస్టివల్ ముఖ్య ఉద్దేశం. కావున ఈ ఆఫర్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాము' అని జీఆర్‌టీ జ్యువెలర్ ఎండీ ఆనంద్ అనంత పద్మనాభన్ తెలిపారు.

తనిష్క్ నుంచి 'ఎన్‌చాన్టెడ్ ట్రైల్స్' కలెక్షన్



హైదరాబాద్: టాటా గ్రూప్ జ్యువెలరీ బ్రాండ్ తనిష్క్ తన 'ఎన్‌చాన్టెడ్ ట్రైల్స్' కలెక్షన్‌ను పారిస్ హాట్ కోచర్ వీక్ – 2024లో విడుదల చేసింది. ప్రఖ్యాత మహిళా డిజైనర్ వైశాలి షడంగులే భాగస్వామ్యంలో ఈ సరికొత్త కలెక్షన్ రూపొందించారు. ''అసాధారణ కళాత్మకత, మెరుగైన అభిరుచుల మేళి కలయిక ఈ 'ఎన్‌చాన్టెడ్ ట్రైల్స్' కలెక్షన్. ప్రకృతిలోని సామరస్యం, సమతుల్యతను ప్రతిబింబించే డిజైన్లు ఇందులో ఉన్నాయి'' అని కంపెనీ చీఫ్ డిజైనర్ రేవతి కాంత్ తెలిపారు. ప్రకృతి, లగ్జరీ అనే భావనలను 'ఎన్‌చాన్టెడ్ ట్రైల్స్' కలెక్షన్ మరింత శక్తివంతం చేస్తుందని షడంగులే అన్నారు.

సినిమా


• వెంకటేశ్

ముహూర్తం కుదిరింది


'ఎఫ్ 2, ఎఫ్ 3' చిత్రాల తర్వాత హీరో వెంకటేశ్, దర్శకుడు అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. 'దిల్' రాజు, శిరీష్ ఈ సినిమాను నిర్మించనున్నారు. మాజీ పోలీసాఫీసర్, అతని భార్య, ఆ పోలీసాఫీసర్ మాజీ ప్రేయసి... ఈ మూడు ప్రధాన పాత్రల నేపథ్యంలో సాగే క్రైమ్ ఎంటర్‌టైనర్ మూవీ ఇది. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఈ సినిమాను అధికారికంగా వెల్లడించి, వచ్చే సంక్రాంతికి విడుదల చేయనున్నట్లుగా మేకర్స్ ప్రకటించారు. కానీ ఈ సినిమా చిత్రీకరణ ఇంకా ప్రారంభం కాలేదు. అయితే తాజాగా ఈ సినిమా స్క్రిప్ట్, ప్రీ ప్రొడక్షన్ వర్క్స్‌ను పూర్తి చేశారట దర్శకుడు అనిల్ రావిపూడి. మరోవైపు 'రానా నాయుడు' వెబ్ సిరీస్‌లో తన వంతు షూటింగ్‌ను పూర్తి చేశారట వెంకటేశ్. దీంతో వెంకటేశ్–అనిల్‌ల కాంబినేషన్‌లోని సినిమా ప్రారంభోత్సవానికి జూలై మొదటివారంలో ముహూర్తం కుదిరిందని తెలిసింది. అదే నెలలోనే రెగ్యులర్ షూటింగ్ ప్లాన్ చేశారని టాక్. అలాగే ఈ చిత్రంలో మీనాక్షీ చౌదరి ఓ హీరోయిన్‌గా నటించనున్నారని సమాచారం. ఈ సినిమాకు భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు.


• రామ్‌చరణ్

పది రోజులతో ఆట పూర్తి

'ఆర్ఆర్ఆర్' వంటి బ్లాక్‌బస్టర్ మూవీ తర్వాత రామ్‌చరణ్ హీరోగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'గేమ్ చేంజర్'. ఈ చిత్రానికి శంకర్ దర్శకత్వం వహిస్తున్నారు. 'వినయ విధేయ రామ' మూవీ తర్వాత రామ్‌చరణ్, కియారా అద్వానీ మరోసారి 'గేమ్ చేంజర్'లో జోడీగా నటిస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్‌పై 'దిల్' రాజు, శిరీష్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ చివరి దశకు చేరుకుంది. ఈ చిత్రం గురించి దర్శకుడు శంకర్ ఓ అప్‌డేట్ ఇచ్చారు. 'భారతీయుడు 2' మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో శంకర్ మాట్లాడుతూ– ''గేమ్ చేంజర్' చిత్రీకరణ క్లైమాక్స్‌కు చేరుకుంది. కేవలం పది రోజుల షూటింగ్ మాత్రమే బ్యాలెన్స్ ఉంది. ప్రస్తుతం 'భారతీయుడు 2' (కమల్‌హాసన్ హీరోగా నటించిన ఈ చిత్రం జూలై 12న రిలీజ్ కానుంది) సినిమా ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్నాను. ఆ సినిమా విడుదలయిన తర్వాత 'గేమ్ చేంజర్' షూటింగ్ పూర్తి చేస్తాను. ఆ తర్వాత ఫైనల్ ఫుటేజ్ చూసి పోస్ట్ ప్రొడక్షన్ పనులు మొదలుపెడతాం. వీలైనంత త్వరగా ఈ చిత్రాన్ని రిలీజ్ చేయడానికి ప్రయత్నిస్తా'' అన్నారు. శ్రీకాంత్, సునీల్, నవీన్ చంద్ర, అంజలి, ఎస్‌జె సూర్య, సముద్రఖని ముఖ్య పాత్రల్లో నటిస్తున్న 'గేమ్ చేంజర్' రాజకీయ నేపథ్యంలో రూపొందుతోంది. ఈ చిత్రంలో రామ్‌చరణ్ ద్విపాత్రాభినయం చేస్తున్నారని టాక్.

దసరాకి కంగువ


• సూర్య

దసరా పండక్కి థియేటర్స్‌కు వస్తున్నాడు 'కంగువ'. సూర్య హీరోగా శివ దర్శకత్వంలో రూపొందుతున్న సైంటిఫిక్ అండ్ టైమ్ ట్రావెల్ మూవీ 'కంగువ'. ఈ చిత్రంలో దిశా పటానీ హీరోయిన్‌గా నటించగా, బాబీ డియోల్, యోగిబాబు ఇతర కీలక పాత్రల్లో నటించారు. కేఈ జ్ఞానవేల్ రాజా, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్న సినిమా ఇది. తాజాగా 'కంగువ' సినిమాను ఈ ఏడాది అక్టోబరు 10న విడుదల చేస్తున్నట్లుగా 'ఎక్స్' వేదికగా వెల్లడించారు సూర్య. రిలీజ్ డేట్‌ని బట్టి 'కంగువ' దసరా పండగ సందర్భంగా విడుదల అవుతుందని తెలుస్తోంది. ఇక 'కంగువ' సినిమా డిఫరెంట్ టైమ్‌లైన్స్‌లో ఉంటుందని, సూర్య ఐదారు గెటప్స్‌లో కనిపిస్తారని, ఈ చిత్రం రెండు భాగాలుగా విడుదల కానుందనే టాక్ కోలీవుడ్‌లో వినిపిస్తోంది. ఈ సినిమాకు దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు.

గ్యాంగ్‌స్టర్ రెడీ

చంద్రశేఖర్ రాథోడ్ హీరోగా నటించి, స్వీయ దర్శకత్వం వహించిన చిత్రం 'గ్యాంగ్‌స్టర్'. కాశ్వీ కాంచన్ హీరోయిన్‌గా నటించారు. రవి, నరసింహ సమర్పణలో వైల్డ్ వారియర్ ప్రొడక్షన్స్‌పై రూపొందిన 'గ్యాంగ్‌స్టర్' ఆగస్టులో విడుదల కానుంది. ఈ చిత్రం టీజర్ విడుదల కార్యక్రమానికి నిర్మాతలు మిర్యాల రవీందర్ రెడ్డి, సెవెన్ హిల్స్ సతీష్ కుమార్, 'రజాకార్' మూవీ డైరెక్టర్ యాట సత్యనారాయణ అతిథులుగా హాజరై, 'గ్యాంగ్‌స్టర్' విజయం సాధించాలని ఆకాంక్షించారు. చంద్రశేఖర్ రాథోడ్ మాట్లాడుతూ– ''కొన్ని షార్ట్ ఫిలింస్ చేసిన తర్వాత నాలుగేళ్ల కిందట 'గ్యాంగ్‌స్టర్' కథ రాశాను. సినిమా టైటిల్స్‌లో నాలుగైదు పేర్లు నావే ఉండాలని నేను అనుకోలేదు. డబ్బులు లేక ఫైట్స్, ఎడిటింగ్, కొరియోగ్రఫీ కూడా నేనే చేసుకున్నా. మా సినిమా టీజర్ విజయేంద్రప్రసాద్‌గారికి నచ్చడంతో 'దిల్' రాజుగారికి ఫోన్ చేసి చెప్పారు. రాజుగారికి కూడా మా టీజర్ నచ్చింది. వారి సంస్థలో మా సినిమా రిలీజ్ కావాల్సి ఉంది'' అన్నారు.


• కాశ్వీ, చంద్రశేఖర్ రాథోడ్



• అజిత్

అజిత్ హీరోగా నటిస్తున్న ద్విభాషా (తెలుగు, తమిళం) చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. అధిక్ రవిచంద్రన్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. 'గుడ్ బ్యాడ్ అగ్లీ' సినిమా సెకండ్ లుక్‌ను గురువారం విడుదల చేశారు మేకర్స్. ఫుల్ మాస్ లుక్‌లో కనిపించారు అజిత్. 2025 సంక్రాంతికి విడుదల కానున్న 'గుడ్ బ్యాడ్ అగ్లీ' సినిమాకు దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు.


• మాళవికా మీనన్

కథ డిమాండ్ చేస్తే...

''నేను మలయాళం, తెలుగు, తమిళ చిత్రాల్లో నటించాను. అయితే ఇప్పటివరకు ముద్దు సన్నివేశాలు చేయలేదు. కథ డిమాండ్ చేస్తే గ్లామర్ పాత్రలు, ముద్దు సన్నివేశాలు చేసేందుకు నాకు ఎలాంటి అభ్యంతరం లేదు'' అంటున్నారు హీరోయిన్ మాళవికా మీనన్. అందం, అభినయంతో దక్షిణాదిలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు ఈ మలయాళ బ్యూటీ. తెలుగులో మాళవికా మీనన్ 'లవ్ కే రన్' (2016), 'అమ్మాయిలు అంతే అదో టైపు' (2018) వంటి చిత్రాల్లో నటించారు. అయితే పలు కారణాల వల్ల ఆ సినిమాలు ఇప్పటికీ విడుదలకు నోచుకోలేదు. తాజాగా ఆమె నటించిన మలయాళ సినిమాలు 'తంగమణి, వన్స్ అపాన్ ఏ టైమ్ ఇన్ కొచ్చి' ఇటీవల విడుదలై ప్రేక్షకాదరణ పొందాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ– ''నేను మొదటిసారి నటించిన మలయాళ చిత్రం 'నిద్ర' (2011). అందులో హీరో చెల్లెలి పాత్ర చేశాను. అప్పుడు నా వయసు 14 ఏళ్లు. '916' (2012) అనే మలయాళ మూవీ ద్వారా కథానాయికగా పరిచయమయ్యాను. మలయాళ సినిమాల్లో గ్లామర్ పాత్రలకు అవకాశం ఉండదు. అయితే తెలుగు, తమిళ భాషల్లో ఆ అవకాశాలు బాగుంటాయి... ఈ రెండు భాషల్లోనూ గ్లామరస్ హీరోయిన్‌గా నటించడానికి స్కోప్ ఉంటుంది'' అన్నారు.


• రష్మికా మందన్నా

ఈసారి సెట్?

తమిళ హీరో శివ కార్తికేయన్, హీరోయిన్ రష్మికా మందన్నా జంటగా నటించనున్నారా? అంటే అవుననే అంటున్నాయి కోలీవుడ్ వర్గాలు. హీరో శివ కార్తికేయన్, దర్శకుడు సిబీ చక్రవర్తి కాంబినేషన్‌లో వచ్చిన కాలేజ్ క్యాంపస్ డ్రామా 'డాన్' (2022) హిట్ మూవీగా నిలిచింది. ఈ ఇద్దరి కాంబినేషన్‌లో తాజాగా మరో సినిమా రానుందనే టాక్ తెరపైకి వచ్చింది. అంతేకాదు... ఈ సినిమాలో హీరోయిన్‌గా రష్మికా మందన్నా నటించనున్నారనే ప్రచారం కూడా కోలీవుడ్‌లో జరుగుతోంది. ప్రస్తుతం ఏఆర్ మురుగదాస్ దర్శకత్వంలో శివ కార్తికేయన్ ఓ సినిమా చేస్తున్నారు. ఈ సినిమాలో హీరోయిన్‌గా తొలుత రష్మికా మందన్నా పేరు వినిపించింది. ఆ తర్వాత కియారా అద్వానీ పేరు కూడా తెరపైకి రాగా.. ఫైనల్‌గా కన్నడ బ్యూటీ రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా చాన్స్ దక్కించుకున్నారు. మరి... ప్రచారంలో ఉన్నట్లుగా ఈసారైనా శివ కార్తికేయన్, రష్మికల జోడీ సెట్ అవుతుందా? వేచి చూడాల్సిందే.

దుర్గమ్మకు ఘనంగా బోనాలు



జగిత్యాల జిల్లా భీమారం మండలం వెంకట్రావుపేట గ్రామస్తులు దుర్గమ్మకు మారుపట్నాల వేడుకను గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. పదేళ్ల అనంతరం వేడుక నిర్వహించడంతో.. గ్రామస్తులందరూ ఇంటింటికీ బోనం చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. డప్పుచప్పుళ్లు, డీజే పాటలకు నృత్యాలతో హోరెత్తించారు. సుమారు కిలో మీటర్ మేర బోనాలతో మహిళలు ప్రదర్శన నిర్వహించారు.

– మేడిపల్లి(జగిత్యాల)

గిన్నిస్ రికార్డుల్లోకి.. 4వ తరగతి విద్యార్థి



మియాపూర్: పిట్ట కొంచెం కూత ఘనమని నాల్గో తరగతి విద్యార్థి నిరూపించాడు. మియాపూర్ మదీనాగూడలోని కెనరీ పాఠశాలలో నాల్గో తరగతి చదువుతున్న తమ్మన సాయి విహాన్ గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటుసంపాదించాడు. విమానాలపై తోకభాగంలో ఉండే లోగోల ద్వారా విమానాల పేర్లను అనర్గళంగా చెప్పడంలో విజయం సాధించాడు. ఒక్క నిమిషంలో 79 విమానాల లోగోలను గుర్తించి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించాడు. రికార్డు సాధించడం పట్ల తల్లిదండ్రులు తమ్మన వెంకట నాగ సత్య శివ శ్రీచరణ్, ప్రియాంకతో పాటు తరగతి ఉపాధ్యాయురాలు రుచి సత్యవాది ప్రోత్సాహం అందించారని విహాన్ చెప్పారు. ఇటీవల గిన్నిస్ రికార్డు సర్టిఫికెట్ అందుకున్న విహాన్‌ను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు. విహాన్ రికార్డు సాధించడం పట్ల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.



6 కిలోమీటర్లు | గంటన్నరపాటు ప్రయాణం

ఎడ్లబండిలో గర్భిణి తరలింపు

ఇచ్చోడ: పురిటినొప్పులతో గర్భిణి నరకయాతన పడుతుంటే.. రహదారి లేక ఎడ్లబండిలో ఆరు కిలోమీటర్ల దూరం తీసుకువెళ్లారు. ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం మారుమూల గిరిజన గ్రామమైన బావోజీపేట్‌లో గురువారం మధ్యాహ్నం ఆదివాసీ మహిళ వనితకు పురిటినొప్పులు వచ్చాయి. రవాణా సౌకర్యం ఉన్న సిరిచెల్మ గ్రామం వరకు ఆరు కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి ఉంటుంది. వర్షాకాలంలో నీటితో రోడ్డు కోతకు గురై.. చిన్న చిన్న వాగులుండటం వల్ల వాహనాలు వెళ్లలేని పరిస్థితి. దీంతో కుటుంబ సభ్యులు ఆశవర్కర్ కళాబాయిని వెంట తీసుకుని గర్భిణి వనితను ఎడ్లబండిలో ఆరు కిలోమీటర్ల దూరంలోని సిరిచెల్మ గ్రామానికి తీసుకొచ్చారు. గతుకుల రోడ్డుపై గంటన్నరపాటు ప్రయాణించాల్సి రావడంతో గర్భిణి నరకయాతన పడింది. సిరిచెల్మ నుంచి ప్రైవేటు జీపులో ఆమెను ఇచ్చోడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు ఆదిలాబాద్‌లోని రిమ్స్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

క్లుప్తంగా...

నేడు టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు

సాక్షి, హైదరాబాద్: పదవ తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు శుక్రవారం విడుదవుతాయి. మధ్యాహ్నం 3 గంటలకు ఫలితాలను ఆన్‌లైన్ ద్వారా వెల్లడి చేయనున్నట్టు పరీక్షల విభాగం అధికారి కృష్ణారావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 3 నుంచి 13వ తేదీ వరకూ టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జరిగిన సంగతి తెలిసిందే.

గెస్ట్ లెక్చరర్ల రెన్యువల్‌కు వినతి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఇంటర్, డిగ్రీ కళాశాలలు జూన్ 1 నుంచి ప్రారంభమైనప్పటికీ, 35శాతం గెస్ట్ లెక్చరర్లను రెన్యువల్ చేయలేదని మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. దీంతో ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు ప్రైవేట్ కళాశాలలకు వెళ్తున్నారని, వెంటనే సమస్యను పరిష్కరించి పేద విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. ఆయన తెలంగాణ భవన్‌లో గురువారం విలేకరులతో మాట్లాడుతూ పర్మినెంట్ లెక్చరర్లు లేని కళాశాలలు రాష్ట్రంలో 25 ఉన్నాయన్నారు. మూడు వేలమంది గెస్ట్ లెక్చరర్ లకు ఉద్యోగ భద్రత లేకపోవడంతో రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఫోన్ ట్యాపింగ్ నిందితులకు ఎదురుదెబ్బ

బెయిల్ పిటిషన్లను తిరస్కరించిన నాంపల్లి కోర్టు

సిటీ కోర్టులు: ఫోన్ ట్యాపింగ్ కేసు నిందితులకు ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసులో నిందితులు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లను నాంపల్లి కోర్టు గురువారం తిరస్కరించింది. ట్యాపింగ్ కేసులో నిందితులుగా ఉన్న భుజంగరావు, ప్రణీత్‌రావు, తిరుపతన్నలు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లపై బుధవారం జరిగిన ఇరుపక్షాల వాదనలు విన్న కోర్టు తీర్పును రిజర్వ్ చేసిన విషయం తెలిసిందే. తీర్పు కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూసిన నిందితులకు ఊహించని షాక్ తగిలింది. కేసు పూర్వపరాలను పరిశీలించిన జడ్జి బెయిల్ పిటిషన్లను కొట్టివేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఫైర్ ఇంజనీరింగ్‌తో ఉద్యోగావకాశాలు

- ఎన్ఎఫ్ఎస్‌సీలో జేఈఈ మెయిన్ ర్యాంకర్లకు బీటెక్ అవకాశం
- దరఖాస్తులకు గడువు జూలై 2

సాక్షి, హైదరాబాద్: బీటెక్ ఫైర్ ఇంజనీరింగ్ అభ్యసించే వారికి అద్భుత ఉపాధి అవకాశాలున్నాయని ఫైర్ సర్వీసెస్ ఉన్నతాధికారులు తెలిపారు. నాగ్‌పూర్‌లోని నేషనల్ ఫైర్ సర్వీసెస్ కాలేజీ (ఎన్ఎఫ్ఎస్‌సీ)లో ఈ బీటెక్ కోర్సుకు సంబంధించి 60 సీట్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. జేఈఈ మెయిన్స్‌లో ఆలిండియా ర్యాంకుల ఆధారంగా మెరిట్ విద్యార్థులకు ఇందులో ప్రవేశాలు కల్పిస్తున్నారు. ఎన్ఎఫ్ఎస్‌సీలో ఫైర్ ఇంజనీరింగ్ చేసిన విద్యార్థులు ఓఎన్‌జీసీ, గెయిల్, సెయిల్, ఐఓసీఎల్, హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్, రిలయన్స్, టాటాపవర్, వేదాంత, డీఎల్ఎఫ్ వంటి కంపెనీల్లో ప్లేస్‌మెంట్లు పొందారు. వీరిలో ఏటా రూ.22 లక్షల వేతనంతో ప్యాకేజీ వచ్చిన వారున్నట్టు అధికారులు తెలిపారు. క్యాంపస్ నియామకాలతో పాటు డీఆర్‌డీవో, బీఏఆర్‌సీ వంటి సంస్థల్లో ఫైర్ సేఫ్టీ విభాగంలో పలు అవకాశాలున్నట్టు పేర్కొన్నారు. ఎన్ఎఫ్ఎస్‌సీ బీటెక్ ఫైర్ ఇంజనీరింగ్‌కు ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ జూలై 2 అని తెలిపారు. వివరాలకు ఎన్ఎఫ్ఎస్‌సీ వెబ్‌సైట్‌తోపాటు 8983300060, 0712–2982225 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

సివిల్స్ ఆప్షన్స్ ఎంపికపై అవగాహన తరగతులు

సాక్షి, హైదరాబాద్: యూపీఎస్‌సీ 2025లో నిర్వహించే సివిల్స్ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు కీలకమైన ఆప్షన్ల ఎంపిక విధానంపై ఈ నెల 30 నుంచి జూలై 6 వరకూ ఉచిత అవగాహన తరగతులు నిర్వహించనున్నట్టు కృష్ణ ప్రదీప్ 21వ సెంచరీ ఐఏఎస్ అకాడమి చైర్మన్ పి.కృష్ణ ప్రదీప్ ఒక ప్రకటనలో తెలిపారు. రోజూ ఒక ఆప్షనల్ సబ్జెక్టుపై నిపుణులతో అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు 9133517733 నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను హైదరాబాద్ మెట్రో ఎండీ ఎన్‌వీఎస్ రెడ్డి గురువారం విడుదల చేశారు.


‘ఇంటర్’ క్లాసులు చెప్పేదెవరు?

గెస్ట్ లెక్చరర్లపై స్పష్టత ఇవ్వని అధికారులు

ప్రతీ కాలేజీలోనూ ఫ్యాకల్టీ కొరత...ఐదేళ్లుగా సైన్స్ సబ్జెక్టుల్లో సమస్యలే

డైరెక్ట్ నియామకాలపైనే నమ్మకం..ఇంకా గెస్ట్ లెక్చరర్ల అవసరం ఉందా?

ఇంటర్ బోర్డు ప్రతిపాదనలపై ప్రభుత్వం ప్రశ్న



సాక్షి, హైదరాబాద్ : విద్యాసంవత్సరం మొదలైనా.. ప్రభుత్వ ఇంటర్ కాలేజీల్లో బోధన సాగడం లేదు. అన్నిచోట్ల అధ్యాపకుల కొరత వేధిస్తోంది. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది. ఏటా గెస్ట్ ఫ్యాకల్టీని తీసుకునేవారు. ఫలితంగా బోధన అనుకున్న మేర జరిగేది.ఈ సంవత్సరం గెస్ట్ ఫ్యాకల్టీపై ప్రభుత్వం నుంచి ఇంకా స్పష్టత రాలేదు. అసలు తీసుకుంటారా? లేదా? అనేది కూడా అధికారులు చెప్పలేకపోతున్నారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు త్వరగా సిలబస్ పూర్తి చేయాలి. అప్పుడే వారు జేఈఈ, రాష్ట్ర ఈఏపీసెట్ వంటి పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే వెసులు బాటు ఉంటుంది.

త్వరలో 1372 మంది కొత్త లెక్చరర్లు వస్తారని...

పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా 1372 పోస్టుల భర్తీకి ఇటీవల పరీక్ష నిర్వహించారు. త్వరలో ఫలితాలు వెల్లడించే అవకాశముంది. ఇంటర్వ్యూ లేకపోవడంతో మెరిట్ ప్రకారమే నియామకాలుంటాయి. దీంతో గెస్ట్ లెక్చరర్ల అవసరం లేదని ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఈ కారణంగానే గెస్ట్ లెక్చరర్ల విషయంలో పెద్దగా పట్టించుకోవడం లేదంటున్నారు. అయితే వీరి అవసరాన్ని తెలియజేస్తూ ఇంటర్ బోర్డు ప్రభుత్వానికి ప్రతిపాదన పంపింది. దీనిపై సర్కార్ నుంచి స్పష్టత రాలేదు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ నియామకాలు చేపట్టి, ఆర్డర్లు ఇచ్చే వరకూ ఎంతకాలం పడుతుందో చెప్పలేని పరిస్థితి. కొత్తగా వచ్చినవారు కాలేజీల్లో బోధన చేపట్టే వరకూ కొంత సమయం పడుతుందని అధ్యాపక సంఘాలు అంటున్నాయి. అప్పటి వరకూ కాలం వృథా అవుతుందని, ప్రభుత్వ కాలేజీల్లో చదివే పేద విద్యార్థులకు అన్యాయం జరుగుతుందంటున్నారు.

బోధన సాగేదెలా..?

నియామకాలు ఎప్పుడు జరుగుతాయో తెలియదు. గెస్ట్ ఫ్యాకల్టీని తీసుకుంటారా? లేదా? స్పష్టత లేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ కాలేజీల్లో బోధన కుంటుపడుతోంది. ఈ పరిస్థితి ఎప్పుడు మెరుగవుతుందని అధ్యాపక సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. రాష్ట్రంలో 418 ప్రభుత్వ జూనియర్ కాలేజీలున్నాయి. గత ఏడాది కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులర్ చేశారు. వీరితో కలుపుకుంటే 3900 మంది శాశ్వత అధ్యాపకులున్నారు. మరో 72 మంది మినిమమ్ టైం స్కేల్‌తో పనిచేసే అధ్యాపకులున్నారు. ఇంకా 413 మందిని రెగ్యులర్ చేయాల్సి ఉంది. కొంతమంది రిటైర్ అయ్యారు. సర్వీస్ కమిషన్ ద్వారా 1372 పోస్టుల నియామకం జరిగినా కనీసం 2 వేల మంది అధ్యాపకుల కొరత ఉంటుంది. ఏటా రాష్ట్రంలో 1654 మంది గెస్ట్ లెక్చరర్లను తీసుకుంటున్నారు. వీరి సర్వీస్‌ను ప్రతీ ఏటా సంవత్సరం పాటు పొడిగిస్తూ వస్తున్నారు. వీరికి నెలకు రూ. 27 వేలు ఇస్తున్నారు. రెగ్యులర్ అధ్యాపకుల కన్నా ఎక్కువ క్లాసులే చెబుతున్నామనేది వారి వాదన. నిజానికి గడచిన ఐదేళ్లుగా ఒక్క సైన్స్ అధ్యాపకుడిని కూడా నియమించలేదు. మేథ్స్ లెక్చరర్ల కొరత ప్రతీ కాలేజీలోనూ ఉంది. రాష్ట్రంలో 12 కొత్త కాలేజీలు ఏర్పాటు చేశారు. వీటిల్లో కనీస వసతులు కూడా లేవు. గదులు, బల్లాలు సమకూర్చలేదు. ఫ్యాకల్టీ అరకొరగా ఉంది. బదిలీలు చేపట్టకపోవడంతో కొత్తవారు వచ్చే అవకాశమే లేదు. ఇన్ని సమస్యల మధ్య గెస్ట్ లెక్చరర్లను తీసుకోకపోతే విద్యార్థులు నష్టపోతారని పలువురు అంటున్నారు.

అవసరం ఉంటే తీసుకుంటాం

అవసరం ఉంటే గెస్ట్ లెక్చరర్లను తీసుకుంటాం. ఎంతమేర అవసరం అనేది పరిశీలించాల్సి ఉంది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనపై ప్రభుత్వం నుంచి అనుమతి రావాలి. వీలైనంత త్వరగా ఇంటర్ కాలేజీల్లో పూర్తిస్థాయిలో బోధన చేపట్టేందుకు ప్రయత్నిస్తాం. *-శ్రుతిఓజా, ఇంటర్ బోర్డ్ కార్యదర్శి*

గెస్ట్ లెక్చరర్లు లేకుంటే కష్టమే

ప్రభుత్వ కాలేజీల్లో పేద విద్యార్థులు చదువుతారు. అవసరమైన బోధకులు ఉంటే తప్ప వారికి నాణ్యమైన విద్య అందించలేం. కొత్త కాలేజీల్లో వసతులు లేవు. ప్రభుత్వ కాలేజీల్లో లెక్చరర్ల కొరత ఉంది. తక్షణమే గెస్ట్ ఫ్యాకల్టీని నియమించి, సకాలంలో సిలబస్ పూర్తయ్యేలా చూడాలి. *-మాచర్ల రామకృష్ణగౌడ్ ప్రభుత్వ ఇంటర్ లెక్చరర్ల సంఘం ప్రధాన కార్యదర్శి*

నల్లగొండ కలెక్టర్‌పై డాక్టర్ల ఆగ్రహం

- జిల్లా ఆసుపత్రి తనిఖీ చేయాలన్న నిర్ణయంపై రాష్ట్రవ్యాప్త నిరసన
- కలెక్టర్ తీరును ఖండించిన వైద్య ఆరోగ్యశాఖలోని పలు డాక్టర్ల సంఘాలు

సాక్షి, హైదరాబాద్: జిల్లాలోని అన్ని శాఖల అధికారులు రోజుకొక్కరు చొప్పున జిల్లా ప్రధాన ఆసుపత్రిని తనిఖీ చేయాలని నల్లగొండ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేయడంపై రాష్ట్రవ్యాప్తంగా డాక్టర్లు మండిపడుతున్నారు. నల్లగొండ జిల్లా ప్రధాన ఆస్పత్రిని తనిఖీ చేసేందుకు జిల్లా అధికారులకు అధికారం లేదని, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ లేదా జాయింట్ కలెక్టర్ స్థాయి అధికారి మాత్రమే తనిఖీ చేయాలని, తక్షణమే ఆ ఉత్తర్వులు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఆసుపత్రిలో ఇతర శాఖల అధికారుల జోక్యం తమపై వద్దని డాక్టర్లు, అన్ని విభాగాల అధిపతులు, సిబ్బంది నర్సులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానాస్పత్రిలో శానిటేషన్, టాయిలెట్స్, డ్రింకింగ్ వాటర్ వంటి మౌలిక సదుపాయాల కల్పన సేవలపై మాత్రమే జిల్లా అధికారులు పరిశీలన చేసి సమాచారం ఇచ్చేందుకు జిల్లా యంత్రాంగం ఉత్తర్వులు జారీ చేసినట్లు చెబుతున్నారు. అంతేగానీ డాక్టర్లు, ప్రొఫెసర్ల పనితీరు వారి వృత్తిపై కాదని జిల్లా యంత్రాంగం స్పష్టం చేస్తున్నా, డాక్టర్లు ఏమాత్రం ఆ ఉత్తర్వులను అంగీకరించడానికి ఇష్టపడడంలేదు. నల్లగొండ జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో రోజూ ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు జిల్లాకు చెందిన వివిధ శాఖల అధికారులు తనిఖీ చేయాలని కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. గురువారం నుంచే ఈ ప్రక్రియ ప్రారంభమైంది. కాగా, నల్లగొండ ప్రభుత్వ వైద్య కళాశాలలో బోధన వైద్యులపై ప్రభుత్వం చేపట్టిన చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ టీచింగ్ ప్రభుత్వ డాక్టర్ల సంఘం కోశాధికారి డాక్టర్ కిరణ్ మాదల చెప్పారు.

వైద్యుల నైతికతను ప్రశ్నిస్తారా?

నల్గొండ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో పర్యవేక్షణ కోసం రోజుకు ఒక ఇతర శాఖల అధికారులను రోస్టర్ పద్ధతిలో వేసి, రిపోర్ట్ ఇవ్వాల్సిందిగా కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వులు అసమంజసం. వెంటనే ఈ ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలి. ఇలాంటివి మళ్లీ జరగకుండా చూడాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు విన్నవిస్తున్నాం. – తెలంగాణ ప్రభుత్వ డాక్టర్ల సంఘం

నిబంధనలు పాటించకపోతే ప్రైవేట్ ఆసుపత్రుల లైసెన్స్ రద్దు

- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హెచ్చరిక
- డాక్టర్లు విధిగా సమయపాలన పాటించాలని విజ్ఞప్తి– జిల్లా వైద్యాధికారులతో సమీక్ష... అధికారులకు దిశానిర్దేశం



సాక్షి, హైదరాబాద్: వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఇటీవల ప్రైవేట్ ఆసుపత్రులపై దృష్టిసారించారు. ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేటు ఆసుపత్రుల లైసెన్స్ రద్దు చేస్తామని ఆయన తాజాగా స్పష్టం చేశారు. ఈ మేరకు గురువారం ఆయన అన్ని జిల్లాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారుల (డీఎంహెచ్‌వో)తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, డీఎంహెచ్‌వోలు ప్రైవేటు ఆసుపత్రులలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రజలకు జవాబుదారీతనంగా ఉంటూ ప్రజారోగ్యాన్ని బలోపేతం చేస్తున్నామన్నారు. పేదలకు మెరుగైన వైద్యం అందించడమే తమ ప్రాధాన్యమని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న వైద్య ఆరోగ్య సేవా కార్యక్రమాలను ఎలా కోఆర్డినేట్ చేయాలనే దానిపై మంత్రి దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం అందిస్తున్న వైద్య ఆరోగ్య సేవలను ప్రజలకు అందించడంలో డీఎంహెచ్‌వోలది గురుతరమైన బాధ్యత న్నారు. జిల్లా, ఏరియా, పీహెచ్‌సీల మధ్య భౌగోళికంగా కనెక్టివిటీపై దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రతి 30 కిలోమీటర్ల దూరంలో ఒక ప్రభుత్వ హెల్త్ సెంటర్ ఉండాలన్నారు. ఆసుపత్రుల్లో ప్రభుత్వ వైద్యుల అటెండెన్స్ తప్పనిసరిగా మెయింటైన్ చేయాలని పేర్కొన్నారు. జిల్లాల వారిగా క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ అమలు చేయాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ అండ్ పీసీ అండ్ పీఎన్‌డీటీ యాక్ట్ అమలు, అవగాహనపై రూపొందించిన వాల్ పోస్టర్లను ఆ శాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా చోంగ్తూ, కుటుంబ సంక్షేమ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్‌లతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్, వైద్య విద్యా సంచాలకులు డాక్టర్ వాణి పాల్గొన్నారు.

‘శ్రీశైలం విద్యుత్’కు త్వరలో మరమ్మతులు

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో జెన్‌కో చర్యలు

- టెండర్ల నిర్వహణకు కసరత్తు
- 2020లో పూర్తిగా కాలిపోయిన 4వ యూనిట్
- మరమ్మతుల తర్వాత మళ్లీ కాలిపోయిన వైనం
- మళ్లీ మరమ్మతులకు నిరాకరించిన కాంట్రాక్టర్ బ్లాక్ లిస్టులోకి..



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోనే అతి పెద్దదైన శ్రీశైలం ఎడమగట్టు జలవిద్యుత్ కేంద్రానికి మరమ్మతులు నిర్వహించేందుకు తెలంగాణ విద్యుదుత్పత్తి సంస్థ (జెన్‌కో) చర్యలు చేపట్టింది. విద్యుదుత్పత్తి సంస్థ స్థాపిత సామర్థ్యం 900 (6 x150) మెగావాట్లు కాగా, అందులో 150 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 4వ యూనిట్‌లోని జనరేటర్ స్టేటర్, రోటర్‌లు గత జూలైలో రెండోసారి కాలిపోయాయి. 2020 ఆగస్టు 20న శ్రీశైలం ఎడమగట్టు జలవిద్యుత్ కేంద్రంలోని కంట్రోల్ ప్యానెల్స్‌కి డీసీ విద్యుత్‌ను సరఫరా చేసే బ్యాటరీలను మార్చే సమయంలో మంటలు చెలరేగి భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో జెన్‌కో ఇంజనీర్లతోపాటు మొత్తం 9 మంది మృత్యువాతపడగా, విద్యుత్ కేంద్రంలోని కొన్ని యూనిట్లు పూర్తిగా, మరికొన్ని యూనిట్లు పాక్షికంగా కాలిపోయాయి. అప్పట్లో 4వ యూనిట్‌కే అత్యధిక నష్టం జరిగింది. జర్మనీకి చెందిన ప్రముఖ కంపెనీ వైత్ ఆధ్వర్యంలో జెన్‌కో మరమ్మతులు నిర్వహించి పునరుద్ధరించింది. గతేడాది దాదాపుగా 80 గంటలపాటు విద్యుదుత్పత్తి చేసిన తర్వాత మళ్లీ 4వ యూనిట్‌లో వాల్ట్ వచ్చి కాలిపోయింది. ఒప్పందం ప్రకారం డిఫెక్ట్ లయబిలిటీ పీరియడ్‌లోనే 4వ యూనిట్ కాలిపోవడంతో సొంత ఖర్చుతో మరమ్మతులు నిర్వహించాలని ‘వైత్’గ్రూపును జెన్‌కో కోరగా, ఆ సంస్థ నిరాకరించింది. 4వ యూనిట్‌కు ఇతర మరమ్మతులు నిర్వహించడంతోనే ఫాల్ట్ ఏర్పడిందని, దీనితో తమకు సంబంధం లేదని వైత్ గ్రూపు స్పష్టం చేసింది. మరమ్మతులకు మళ్లీ డబ్బులు చెల్లించాలని కోరింది. ఏడాది కాలంగా ఆ కంపెనీతో వివాదం నడవడంతో మరమ్మతుల నిర్వహణ మరుగున పడిపోయింది. కొత్తగా మరోసారి టెండర్లు నిర్వహించి మరమ్మతులు నిర్వహించడానికి జెన్‌కో యత్నించగా, ఉన్నతాధికారుల నుంచి అనుమతి లభించక ప్రక్రియ ముందుకు సాగలేదు. మరమ్మతులకు రూ.3 కోట్ల దాకా ఖర్చు కానుండగా, అంతకు ఎన్నో రెట్లు విలువ చేసే జల విద్యుత్ ఉత్పత్తి చేసుకోవడానికి అవకాశం లభించనుంది.

ఉత్పత్తి వచ్చే ఏడాదే..

రాష్ట్రంలోని కీలకమైన జలవిద్యుత్ కేంద్రాలకు సకాలంలో మరమ్మతులు నిర్వహించకపోవడంతో వాటి ఉత్పత్తి సామర్థ్యం గణనీయంగా పడిపోయిన అంశంపై ఈ నెల 21న ‘హైడల్ పవర్ డౌన్!’ శీర్షికతో ‘సాక్షి’లో ప్రచురితమైన వార్తకు ప్రభుత్వం స్పందించి తక్షణమే మరమ్మతులు నిర్వహించాలని ఆదేశించింది. దీంతో మరమ్మతులు నిర్వహించిన ‘వైత్’సంస్థకు ఇటీవల జెన్‌కో తుది నోటీసులు జారీ చేసి ఆ సంస్థను బ్లాక్ లిస్టులో పెట్టింది. మళ్లీ కొత్తగా టెండర్లు నిర్వహించడానికి జెన్‌కో యాజమాన్యం సన్నాహాలు చేస్తోంది. మరమ్మతులు పూర్తై 4వ యూనిట్‌లో ఉత్పత్తి ప్రారంభం కావడానికి కనీసం మూడు నెలల సమయం పట్టొచ్చని, ఆలోగా కృష్ణా నదిలో వరదలు ముగిసిపోతాయని అధికారవర్గాలు పేర్కొంటున్నాయి.

విద్యార్థులు రాక పాఠశాలలో ఖాళీగా కూర్చున్న ఉపాధ్యాయుడు



పిల్లలు కనబడితే ఒట్టు

మోపాల్: ఆ బడిలో ఇద్దరు విద్యార్థులు.. వారికి ఇద్దరు ఉపాధ్యాయులున్నారు. అంటే విద్యార్థికో ఉపాధ్యాయుడన్న మాట. నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలం బైరాపూర్ శివారు మోతీరాంనాయక్ తండా పాఠశాల పరిస్థితి ఇది. గురువారం ఇద్దరు విద్యార్థులూ గైర్హాజరయ్యారు. ఒక ఉపాధ్యాయుడు (హెచ్‌ఎం) సెలవులో వెళ్లారు. మరో ఉపాధ్యాయుడు లక్ష్మీనారాయణ మాత్రం విధులకు హాజరయ్యారు. విద్యార్థులు లేక తరగతి గది ఖాళీగా దర్శనమిచ్చింది. కాగా ప్రస్తుతం పదోన్నతులు, బదిలీలు చేపడుతుండగా, ఆ ప్రక్రియ పూర్తయిన తర్వాత ఒకరిని సర్దుబాటులో డిప్యుటేషన్‌పై పంపించనున్నట్లు తెలిసింది.

రాంలింగంపల్లి ప్రభుత్వ పాఠశాల వరండాలో కూర్చున్న ఉపాధ్యాయుడు



నేనురాను బిడ్డో సర్కారు బడికి..

భూదాన్‌పోచంపల్లి: యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం రాంలింగంపల్లి గ్రామంలో శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పిల్లల రాక కోసం గురువారం ఉపాధ్యాయుడు నిరీక్షించారు. వివరాలివి. విద్యార్థుల్లేక ఈ పాఠశాల 8 ఏళ్లుగా మూతపడింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మూతపడిన ప్రభుత్వ బడులను తెరవాలని ఆదేశించడంతో.. ఈ నెల 12న పాఠశాలను పునఃప్రారంభించి ఉపాధ్యాయుడిని కూడా నియమించారు. ఆ ఉపాధ్యాయుడు గ్రామంలో ఇంటింటి సర్వే చేసి 5 నుంచి 10 ఏళ్ల వయసున్న 34 మంది బడికి వెళ్లే విద్యార్థులను గుర్తించారు. వారి తల్లిదండ్రులను కలిసి పిల్లలను ప్రభుత్వ బడికి పంపించాలని కోరారు. కానీ తల్లిదండ్రులు శిథిల పాఠశాల భవనం ఎపుడు కూలుతుందోనన్న భయంతో పిల్లల్ని పంపేందుకు నిరాకరిస్తూ పోచంపల్లి, ఇంద్రియాలలోని ప్రైవేట్ పాఠశాలలకు పంపిస్తున్నారు. దాంతో ఆ ఉపాధ్యాయుడు 15 రోజులుగా ఒక్కరిద్దరు పిల్లలైనా రాకపోతారా? అని రోజూ పాఠశాలకు వచ్చి పోతున్నారు.



మమ్మల్ని విడిచి వెళ్లొద్దు సారూ..

ప్రధానోపాధ్యాయుడు బదిలీపై వెళ్తుండటంతో విద్యార్థులు, గ్రామస్తుల భావోద్వేగం.. గ్రామం చివరి వరకు వీడ్కోలు పలికిన విద్యార్థులు

తిరుమలగిరి(నాగార్జునసాగర్): విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పడంతో పాటు పాఠశాల అభ్యున్నతికి కృషిచేసిన ప్రధానోపాధ్యాయుడు బదిలీపై వెళ్తుండటంతో విద్యార్థులు, గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు. మమ్మల్ని విడిచి వెళ్లొద్దు సార్..అంటూ విద్యార్థులు ప్రధానోపాధ్యాయుడి చుట్టూ చేరి భావోద్వేగానికి గురయ్యారు. నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలం చిల్కాపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా కట్టెబోయిన సైదులు ఎనిమిదేళ్లుగా పనిచేస్తున్నారు. ప్రభుత్వం ఆంగ్ల మాధ్యమం ప్రవేశపెట్టకముందే ఆయన సొంత ఖర్చులతో పాటు సహచర ఉపాధ్యాయుల సహకారంతో ఆంగ్ల పుస్తకాలు కొనుగోలు చేసి ఆ పాఠశాలలో ఇంగ్లిషు మీడియం బోధించడం మొదలుపెట్టాడు. దీంతో అప్పటివరకు ప్రైవేట్ పాఠశాలలకు వెళ్తున్న ఆ ఊరి విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలకు రావడం ప్రారంభించారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఆ గ్రామం నుంచి ఒక్క విద్యార్థి కూడా ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లిన దాఖలాలు లేవు. కరోనా సమయంలోనూ ఆయన తన సహచర ఉపాధ్యాయులతో కలిసి గ్రామంలో వీధి వీధికి బ్లాక్ బోర్డులు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి పాఠాలు చెప్పారు. ఆయన సేవలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తు చేయకుండానే 2021 సంవత్సరంలో ప్రత్యేక కేటగిరీలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక చేసింది. గురుకుల పరీక్షకు సన్నద్ధమయ్యే విద్యార్థులకు సెలవు రోజుల్లోనూ ప్రత్యేక తరగతులు నిర్వహించడంతో చుట్టుపక్క నాలుగు గ్రామాల విద్యార్థులు చిల్కాపురం పాఠశాలకు వచ్చి చదువుకునేవారు. పాఠశాల కోసం, విద్యార్థుల అభ్యున్నతి కోసం ఇంతలా కృషిచేసిన ప్రధానోపాధ్యాయుడు బదిలీపై వెళ్తుండటంతో విద్యార్థులతో పాటు గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు. వారిని ఊరడించిన మాస్టారు ఆయన కూడా కన్నీటి పర్యంతమయ్యారు. బాగా చదువుకోవాలని సైదులు విద్యార్థులకు సూచించారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.